భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

నవంబరు 1966

★

సంపుటము 43 : : సంచిక 11 :

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

నవంబరు 1966

మధురపంప	శ్రీ టి. వి. యం. అయ్యావారు	1
"చివరకు మిగిలేది"	శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం	3
సీతోడు	శ్రీ పణతుల రామచంద్రయ్య	11
కావ్యము - రసము	శ్రీ శిష్ట్లా లక్ష్మీనారాయణ	13
చీకటి వెలుగులు	'అరవింద'	17
Super Mind లేక పురుషోత్తమతత్త్వం	శ్రీ వేలూరి శివరామ శాస్త్రి	35
బెర్ట్రండ్ రసెల్ భావప్రపంచం-2	శ్రీ బుచ్చిబాబు	41
కవిత్వంలో అనిర్వచనీయత	శ్రీ చిరుమామిళ్ల సుబ్బారావు	67
పాశ్చాత్య ప్రపంచంలో మార్క్సిస్ దర్శనం - 3	శ్రీ సిడ్నీ హుక్	71
ఇష్టదేవత	"తల్లావజ్ఝల"	78
కిలగూరగంప		81
లేఖలు		87
గ్రంథవిమర్శలు		89
ఒక మాట		97

ఎల్ ఐసి పనిచేయు ప్రతిరోజు రూ.2,000,000 క్లెయిమ్సుకు చెల్లిస్తోంది!

ఉన్నతమైన సంఖ్య:కాని, ఈ డబ్బుతీర్చేకోరికలు, తద్వారా కలిగేసౌఖ్యము ఈసంఖ్యకన్నా ఎంతోముఖ్యమైన విషయాలు.

ఉదాహరణకు, దానివలన మీనన్. తాను రిటైర్ అయిన తర్వాత సుఖంగా జీవిస్తాడు.

రీగేకు, దానివలన, తాను కలలు కంటూన్న ఇల్లు నిజముగా కట్టుకోవడమవుతుంది.

విధవ స్త్రీ అయి. ఒంటరిగా నున్న ఫరీదాకు దానివలన జీవితకాల మంతా ఆదాయమువస్తుంది.



శ్రద్ధగా మెట్రిక్ పరీక్షకు చదువుతున్న డెరెక్‌కు తను ఆటోమోబైల్ ఇంజనీర్ కావాలన్న కోరిక నెరవేర్చుకొనుటకు అవకాశం లభిస్తుంది.

అపర్ణాకు ఇది ఒక ఆనందకరమైన అందుబాటు. ఎందుకంటే ఆమె వివాహము త్వరలో జరగబోతున్నదని ఆమెముఖవికాసముతెలియజేస్తోంది.

రోజుకు 20 లక్షలరూపాయలు-ప్రతి సంవత్సరము రూ 58.57 కోట్లకు పైగా క్లెయిమ్‌లు చెల్లించబడతాయి: ఇంకా ఎక్కువగా భీమాచేస్తే ఇంకా ఎక్కువగా చెల్లించబడతాయి: కాని అది డబ్బుమాత్రమేకాదు-భవిష్యత్తుకు అది ఆధారము. అది నిరూపించే సత్యం ఇది-

జీవిత భీమాకు సాటియైనది మరొకటి లేదు

ASP/LIC-Z 44

మధురపంప

శ్రీ టి. బి. యం. అయ్యవారు

మంద మందానిల విధూయమానములయి
అందముల చిందు పసిపాపలట్లు దరుల
కొత్తుకొని ప్రాకులాడు నీ యుజ్జ్వలాంబు
భంగ సంతతికిదె నమోవాకశతము!

మా దక్షిణ భరతోర్వీ
స్వాదు స్వచ్ఛమ్మొడంద—సరసిజమాలా
మోద రమణీయ భవదీ
యోదారాకృతి వహించెనోహో పంపా!

*చేతఁ గనుపింప కెదయందు చిందులాడు
నలువ సౌజన్య మారంద మొలికి పృథ్వి
నీవుగా ని మ్మహాటవి నిలిచె నటవె?
కృపణ జనతా శివంకరక్రీడ నెనసి.

ఎడదన్ అంపపు గోత గోసినను గా
నీ! నెమ్మొగంబందు నె
ప్పుడు చిందింతువు తల్లి! లేనగవుసొం
పుల్ దొడ్డ యుల్లాలివై—
కడలేనట్టి కృపాతిరేకమున ది
క్కై—ఆదుకోఁ జూతు వె
వ్వడు నీ ముంధటఁ నిల్చినన్ నవసుధాం
భస్తర్పణావ్యాపృతిన్.

---

* పంప బ్రహ్మ మానస సృష్టియని యొక జనశ్రుతి.

వసుధా రాజ్యముఁ గోలుపోకయు వనా
వాసశ్రమంబున్ దివా
నిశమంగార హసంతికాభమయి గుం
డెల్ బిట్టుమండించు—దు
ష్ప్రసహంబైన వధూ వియోగమును మా
రామయ్య సర్వంబు తా
పసి కౌసల్యగ నీవు నిల్వ నిట సం
బాళించుకో జాలెబో!

శిశిర శిశిర త్వదీయవీచీమృదూత్త
రీయజాతగంధానిలశ్రేణి కాస
పడి మరల నుర్వికిని డిగి వచ్చునేమొ?
ఆ వికుంఠాసుతుండు మాయామావినోది!

స్నిగ్ధవాత్సల్య మూర్తివి నీవు కడఁగి
సర్వ సంసార భరమును నిర్వహింప—
ఆ ప్రథమ భిక్షకుడు విరూపాక్షగృహము
హేమకూటమై పోవగ నేమి వింత-

అడిదంబుల్ జళిపించుకొంచును భుజా
హంకార కండూతి మ్రు
క్కుడి మన్నీలు—భవత్తటావని రుషా
కల్మాషితస్వాంతు లా
రడి పోరాడి కవోష్ణ రక్త నదముల్
పారింపగా నెంత మ్రా
న్పడినావో! అతివేల దుఃఖమునఁ బం
పా! యెట్లు లూహించెదన్.

నీ ప్రతి పయః కణమ్మున నిజము వామ
లూరుభవు పద్య మాధుర్య రుచులు తోఁచ-
నీ ప్రతి పయోరుహమ్మున నిభృతభక్తి
నిధి శబరి దివ్య హృదయంపు నిగ్గు లేచు.

మనోవైజ్ఞానిక నవల:

"చివరకు మిగిలేది"

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

సమకాలీన సాహిత్యం (Contemporary Literature) అంతా ఆధునిక సాహిత్యం (Modern Literature) అనిపించుకోదు. 1940 కి పూర్వం వచ్చిన తెలుగు సాహిత్యంలో 'కాల్పనికత' (Romanticism) ఆధునికతకు (Modernity) ప్రధాన లక్షణం. వర్డ్స్‌వర్త్, కీట్స్, షెల్లీ కవుల ప్రభావం తెలుగు కవిత్వం మీదా, స్కాట్, డికెన్స్, థాకరే నవలా రచయితల ప్రభావం తెలుగు నవల మీదా విస్తృతంగా వ్యక్తమైంది. 'రొమాంటిసిజమ్' పరిధుల్ని దాటేందుకు ప్రయత్నించి భిన్న మార్గాలను అన్వేషించిన రచయితలు, ప్రక్రియల్లో స్వతంత్రమైన పోకడలు పోయిన వారూ ఉన్నారు. కాని వారి దృక్పథం మాత్రం మౌలికంగా (Basically) 'రొమాంటిక్' దృక్పథమే అని చెప్పాలి. 'ప్రేమ'కు బదులు 'ఆకలి'ని వస్తువుగా చేసుకొని ఛందస్సునీ సంప్రదాయాన్నీ విడిచిపెట్టిన అభ్యుదయకవి గూడా దృక్పథంలో (Attitude) ఆవేశమూ భావనా ప్రధానంగా ఒక ఊహా ప్రపంచాన్నే (అది మార్క్సుయొక్క ఆదర్శలోకమే (Marxist Utopia) కావచ్చు) సృష్టించుకున్నాడు! అలాగే ఆంగ్ల సాహిత్యంలోని వైయక్తికమైన ఆదర్శాలకు బదులు భారతీయతను, ఆధ్యాత్మికతను అన్వేషించిన విశ్వనాథ సత్యనారాయణవంటి నవలా రచయిత 'రొమాంటిసిజమ్'యొక్క ముఖ్య లక్షణమైన విషయునిష్ఠతను (Subjectivism) అధిగమించలేక 'తాను వలచింది రంభ' అనే ధోరణిలో తా నెరిగిన భారతీయతనూ, జమీందారీ వ్యవస్థనూ, నాటి జీవన ధోరణినీ ఆధ్యాత్మికతకు పరాకాష్ఠగా భ్రమించాడు! చలంవంటి కథా రచయిత స్త్రీకి కేవలమైన స్వేచ్ఛ (Absolute Freedom), స్త్రీ పురుషులకు 'సెక్స్'లో కేవలమైన స్వేచ్ఛ, అంటూ ఆచరణలో సాధ్యాసాధ్యాలను లెక్కించకుండా 'రొమాంటిక్'గా వివాహ వ్యవస్థ మీద దాడి చేశాడు. 'రొమాంటిసిజమ్' మానవనైజంలో రమణీయమైన ఎన్నదగిన విశేష ప్రవృత్తియే కావచ్చు; కాని అది సమగ్రమైన దృక్పథానికీ, జీవిత సత్యానికీ, ప్రత్యామ్నాయం (Alternative) మాత్రం కాలేదు! అందువల్లే ఆంగ్ల సాహిత్యంలో మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 'రొమాంటిసిజమ్'పై వచ్చిన తిరుగుబాటూ, భావ విప్లవమూ, తెలుగులో 1940 నాటికి రాక తప్పలేదు!

1940 కి పూర్వం ప్రక్రియగా తెలుగు నవలలో వచ్చిన 'ఆధునికత' ఎటువంటిదంటే కవిత్వ లక్షణాలు నవలకు ఆపాదించబడి 'కవితా నవల' అవతరించడం. వర్ణనలలో కవిత్వశైలి ఉండటం దీని ప్రధాన లక్షణం కాదు. నవలకు ప్రధానాంగములైన పాత్ర పోషణము (Characterization), కథాసంవిధానము (Plot), సందేశము (Significance) అనే వాటిలోనే సాంకేతిక పద్ధతి (symbolism), ధ్వని (Poetic suggestion) రూపొందినవి. విశ్వనాథ సత్యనారాయణగారి 'వేయి పడగలు', గుడిపాటి వెంకటచలంగారి 'అమీనా', 'అరుణ' యిటువంటి నవలలు. ఆంగ్లంలో డి. హెచ్. లారెన్స్ (D. H. Lawrence), ఇ. యం.

ఫార్‌స్టర్ (E. M. Forster)రూపొందించిన 'కవితా నవల' వంటి ప్రక్రియ యిది.

1940 తర్వాత 'రొమాంటిసిజమ్' తగ్గుముఖం పట్టింది. అందుకు కారణాలు అన్వేషించటం యిక్కడ ప్రస్తుతం కాదు. 1940 తర్వాత తెలుగు నవలలో రూపొందిన క్రొత్తదనాన్ని నిరూపించే రచన, గోపీచంద్‌గారి 'అసమర్థుని జీవియాత్ర'.

హేతువాదాన్నీ (Rationalism), సామాజిక పరిణామ వాదాన్నీ (Theory of Social Evolution) మానవత్వం దృష్ట్యా (From the View-Point of Humanism) నిశితంగా పరిశీలించి విమర్శించిన ఈ నవలలో విశేషం మనోవిశ్లేషణాత్మక పద్ధతి. ఇది మేధాగతమైన ఆధునిక నవల (Modern Intellectual Novel). పోలిక చెప్పాలి అంటే ఆల్డస్ హక్స్‌లీ (Aldous Huxley) నవలల్ని చెప్పుకోవాలి.

ఈ 1940—50 దశాబ్దిలోనే తెలుగు నవల 'ఆధునికత' మరో రేకు విప్పడం జరిగింది. రాచకొండ విశ్వనాథశాస్త్రి 'అల్పజీవి' నవలలో ప్రాధాన్యం ఆత్మీయమైన 'స్వగతా'నికి (Interior Monologue). నవల ఎత్తుగడ అంతా (The Orientation of the Novel) జీవితాన్ని కొత్తగా దర్శించడంకోసం — 'రొమాంటిక్'గా ఉదాత్తంగా (Heroic) కాదు; తద్భిన్నంగా; మానవత్వాన్ని అంగీకరించే ధోరణిలో. ఈ నవలలో ప్రాతిపదిక ఆడ్లర్ (Adler) అనే మనోవైజ్ఞానికశాస్త్రవేత్త (Psychologist) ముఖ్యసిద్ధాంతాల్లో ఒకటైన 'ఆత్మన్యూనతా భ్రాంతి' (Inferiority Complex). అయితే నవల ధ్యేయంకాని సందేశం కాని ఆ సిద్ధాంతాన్ని నిరూపించడం కాదు. నవల ధ్వన్యాత్మకం; సందేశం రచయిత వైయక్తిక దృష్టికి సంబంధించింది; తాత్త్వికమైనదీ. 'అల్పజీవి' నవలతో తెలుగు నవలా ప్రపంచంలో మనో వైజ్ఞానిక నవల (Psychological Novel) పుట్టింది.

బుచ్చిబాబు రచన "చివరకు మిగిలేది" మనో వైజ్ఞానిక నవల. దీనికి ప్రాతిపదిక ప్రఖ్యాత శాస్త్రవేత్త ఫ్రాయిడ్ (Freud) ముఖ్య సిద్ధాంతాలలో ఒకటైన 'ఈడిపస్ భ్రాంతి' (Oedipus complex). ఇందులోనూ సిద్ధాంత నిరూపణము ప్రధానం కాదు. జీవితాన్ని గాఢంగా, లోతుగా పరామర్శించడం, మానవత్వాన్ని తరచి చూచి దాన్ని అంగీకరించడం ప్రధానం. "ఆర్థిక, సాంఘిక, చారిత్రక వ్యత్యాసాల కతీతమై మనిషినీ మనిషినీ స్నేహ పాశంలో బంధించి వేసే మానవత్వం యొక్క శక్తుల్ని తరచి చూచినప్పుడు, ఆ దృశ్యాన్ని తన్మయతతో అనుభవించగలం. కాని ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం.... ఈ నవలకి అదే పునాది." (రచయిత వ్రాసిన ఆముఖం — Preface). నవలలో మనోవైజ్ఞానిక సిద్ధాంతం అంతర్గతంగా మాత్రమే ఉంటుంది. పాఠకులకు ఆ సిద్ధాంతం ఫలానా అని తెలియవలసిన అవసరం లేదు. విమర్శకుడు విశ్లేషించి గుర్తు పట్టితే తప్ప కనిపించని విధంగా ఉంటుంది. దానికి రచయిత వ్యక్తంచేసే జీవిత దృక్పథానికీ తాత్త్వికంగా ఏవీ సంబంధం ఉండదు. నవలలో లభించే జీవిత దర్శనం (The vision of life), అది రచయిత ప్రతిభకూ, వైయక్తికమైన అతని అనుభూతి వైశిష్ట్యానికీ, దాన్ని కళాత్మకంగా రూపొందించిన అతని రచనా శిల్పానికీ తార్కాణం. మనో వైజ్ఞానిక నవల అంటే ఏదో మనస్తత్త్వ శాస్త్రం పఠించడం ద్వారా దానికి అనుగుణంగా ఊహించుకొని కథనీ, పాత్రలనీ కల్పించడం కాదు!

2

తెలుగు సాహిత్యంలో మనో వైజ్ఞానిక నవల అవతరించడంతో 'కాల్పనికత' (Romanticism) బద్ధలైంది. ఈ విధంగా చూస్తే 'చివరకు మిగిలేది' తెలుగు సాహితీ పురోగతిలో ఒక మైలు రాయి. భావనాత్మక ప్రేమా, ఆదర్శాలూ, జీవిత సత్యం ముందు, దివ్వటీలు సూర్యుడి ముందు కాంతి విహీనమైనట్లు, నిరుపయోగం కావటాన్ని చిత్రిస్తుందీ నవల. కథా నాయకుడు దయానిధి భావనాశీలి, సౌందర్య పిపాసి. కాని ఏ స్త్రీనీ ప్రేమించ లేదు. స్త్రీ అంటే చెప్పరాని కుతూహలం. వివాహ యోగ్యతగల ఏ అమ్మాయిని చూచినా అపేక్ష. కాని ఆమెను భార్యగా వూహించుకోడానికి మాత్రం మనస్సులో ఏదో పెద అవరోధం. చివరకు అతని

మనసును ఆకట్టుకొన్న యువతి కోమలి ఒక చరిత్ర హీన. ఆమె తల్లిది పడుపు వృత్తి. కోమలికి చదువూ సంస్కారం లేవు. ప్రయత్నించి దయానిధిని ఆకర్షించే చమత్కారమూ అనుభవమూ కూడా లేవు. అయినప్పటికి దయానిధి ఆమె చుట్టూ తిరుగుతాడు. అవకాశం వచ్చినా ఆమెను అనుభవించలేడు. కారణం — అన్వేషించ వలసిందే! తనకు కావలసింది ఏమిటో తనకు తెలీక పోవడమే అతని సమస్య! కోమలి జీవిత ప్రవాహంలో కొట్టుకు పోయి దయానిధికి దూర మవుతుంది. అతనూ ఆమెను గూర్చి ఆలోచించడం మానుకుంటాడు. ఇలా మరచి పోవడం 'రొమాంటిక్ హీరో' చెయ్య వలసిన పనికాదు! దయానిధికి అందుబాటులో ఉన్న స్త్రీలలో మేనమామ కూతురు 'సుశీల' ఒకర్తె. చదువు కున్నది. అతణ్ణి చేసుకోవాలని యిష్టమే, కాని కొంత స్వాభిమానమూ కొంత అసూయా వ్యక్తం చేస్తుంది. "సుశీల అసలు ఏ పురుషుణ్ణీ ప్రేమించలేదు. సుశీల ప్రేమించేదల్లా, ఎవరో తన్ను ప్రేమిస్తున్నారు అన్న—అనుభవాన్ని" అంటూ సూత్రీకరించేసి, ఆమె అక్కర్లేదంటాడు. నిజమైన కారణం అతనికి సుశీల అంటే భయం. ఆమెకు తనమీదా, తన తల్లితండ్రుల మీదా, గౌరవంలేదని అతని జంకు. దయానిధి తండ్రి ఏర్పాటు చేసిన పెళ్లి సంబంధానికి ఒప్పుకుంటాడు. ఇందిర అతని భార్య అవుతుంది. కాని ఇందిర మీద అతనికి పెద్ద అపేక్ష లేదు. మామగారితో వైమనస్యం తెచ్చుకుంటాడు. ఒంటరి వాడవుతాడు. అతనికి సంఘంతో సరిపడదు. అమృతం వివాహిత. అతని బంధువు. ఆమె అభిమానం ఒక్కటే లోకంలో అతనికి స్వీకారయోగ్యంగా కనిపిస్తుంది. ఒంటరి తనంతో నిరీహుడైన దయానిధి దగ్గరకు ఆమె చుట్టపు చూపుగా వస్తుంది. ఆమె సానుభూతీ, ఆప్యాయతా అతణ్ణి కరిగిస్తాయి. మొదటిసారిగా దయానిధి స్త్రీని స్పృశింపగలుగుతాడు. మానసికమైన అవరోధాన్ని అధిగమించడం జరుగుతుంది. ఈ విధంగా అమృతం దయానిధి జీవితంలో ప్రధాన భూమిక వహిస్తుంది. కాని అమృతాన్ని రొమాంటిక్ కథానాయికగా అనుకోవడానికి ఆమె మరొకని భార్య అవడమే కాదు, ఆమెకు దయానిధితో లేచి పోవాలనే వ్యామోహమూ లేదు. ఆమె దయానిధి పట్ల చూపే భావం ఇదమిత్థమని స్పష్టీకరించడానికి వీల్లేని ఆప్యాయత, అభిమానం, స్నేహం, పరస్పరత.

అందులో సంఘం ఆమోదించని స్త్రీ పురుష సహజమైన వాంఛకూడా సమ్మిళితమే! అమృతం దయానిధి జీవితంలో పాలు పంచుకోవాలనీ, అతను తనవాడు కావాలనీ కోరదు! ఆమె లౌకికమైన వ్యవస్థలకూ, కట్టుబాట్లకూ, నీతికీ విధేయురాలు; సామాన్య సంసారిణి; కాని ఆమెలోని మానవత్వం స్త్రీత్వం, అన్నింటికీ అతీతమైంది. దాన్ని ఏ ఆదర్శాలు ఏ 'రొమాంటిసిజమ్' యిదమిత్థమని నిర్వచించలేవు, శాసించలేవు! అమృతం ప్రకృతి (Nature) వంటిది.

అమృతం పంజరం తలుపు తీస్తుంది. దయానిధి లోకంలోకి రివ్వున పారిపోతాడు. క్రొత్త చోట, క్రొత్త మనుష్యుల మధ్య, జీవితాన్ని క్రొత్తగా ప్రారంభించి తన ఆదర్శాల మేరకు మసలుకుందామనుకుంటాడు. అతణ్ణి అదృష్టం వరిస్తుంది. రాయల సీమలో అనంతాచార్యుల ఆశ్రయమేకాదు, 'కాత్యాయని' వజ్రం కూడా దొరుకుతుంది. గనులు త్రవ్వించటానికి పూనుకుంటాడు. డాక్టరుగా ప్రజాసేవకు నడుం కడతాడు. కాని అతని గత జీవితం అతణ్ణి వెన్నాడుతుంది. కోమలి, ధనికుల చేతుల్లో మారుతూ బ్రతికిన కోమలి, చివరకు దయానిధి దగ్గరకు వచ్చి చేరుతుంది. దయానిధి ధనికుడయ్యాడని కాదు, అతన్నే తను మొదటి నుంచీ 'ప్రేమించి' ఉండటంవల్ల! "ప్రేమ" అంటే ఏమిటి? అనే జిజ్ఞాస యిక్కడ పరాకాష్ఠ నందుకున్నది. కోమలి అవసరంకొద్దీ ఏదో అబద్ధం చెబుతున్నదనికాదు. కోమలి నిజమే చెబుతున్నది. ఆమె జీవితంలో అన్నీ చవిచూచి విసుగెత్తి, చివరకు తనకు దయానిధే కావాలని అంటున్నది. ఈ కోమలి ఎటువంటి కథానాయిక? శారీరకంగా దయానిధి ఆమెను ఏవగించుకుంటాడు, దూరంగా ఉంటాడు. కాని మానసికంగా ఆమెను కాదనలేడు, పొమ్మన లేడు! ఆమెలో ఏ ఆకర్షణా లేకపోయినా, ఆమెను నిర్దాక్షిణ్యంగా, నిర్లక్ష్యంగా చూడలేడు! ఆమెపట్ల అతని భావం — దయ, జాలి, కరుణ, ఏదీ కాదు —

ఆమె తను వదల్చుకోలేని గత జీవితానుభూతి వంటిది. తను వద్దన్నా కావలన్నా తనతో ఉండే సత్యం; ఆమెతో సంభాషణ తనని తను విమర్శించుకున్నట్లు ఉంటుంది. ఒకవిధంగా ఆమె శరీరం, తను ఆత్మ. "చూడు కోమలీ— నాకు ప్రేమంటే ఏమిటో యింతవరకు తెలిసింది కాదు, అందరిలాగా, శరీర వాంఛనే ప్రేమనుకుని, నన్ను నేను దగా చేసుకోలేను. ఇతరులు ఎవ్వరితోనూ, ఏ ఒక్కరితోనూ పంచుకోలేనిది నా ప్రేమ. అదొక దృష్టి — జీవితం అంతటినీ, తుదీ మొదలూ, ముందూ వెనుకా, అన్నింటినీ దూరంగా చూచి అర్థం చేసుకునే ప్రపంచంపై ఒక చూపు...నీతో స్నేహంవల్ల ఆ దృష్టి పోతుంది." అంటాడు. దీనికి కోమలి జవాబు: "....మనం ఒకళ్ళకి ఒకళ్ళు తన్మయత కలిగించుకుంటాం. అప్పుడో ధైర్యంగా, బలంగా, సరదాగా వుంటుంది. ఆ స్పిరిట్‌లో ఎన్నో మంచి పన్లు చేస్తాం..." ఈ ద్వైధీభావం, (ఆత్మ వేరు, శరీరం వేరు అని) దానికి సవాలు (ఆ రెండూ ఒకదానికొకటి అవసరం అనీ, ఒక్కటే అనీ) చివరిదాకా, అంటే నవల ముగింపు దాకా ఉంటుంది. కోమలి రాకతో పునరావృత్తమైన దయానిధి పూర్వ చరిత్ర ఎన్నో అపోహలకు అవకాశం కల్పిస్తుంది. ద్వేషంగా ప్రజ్వలిస్తుంది. కార్మికులు తిరుగుబాటు చేసి దయానిధి గనుల్నీ యింటినీ ధ్వంసం చేస్తారు. దయానిధి నిర్మించి పెట్టుకున్న 'తల్లి శిలాప్రతిమ ముక్కలైపోతుంది. కోమలీ గాయ పడుతుంది. నిరాశ్రయుడైన దయానిధి కోమలితో మరొక క్రొత్తచోటు, క్రొత్త జీవితం వెదుక్కుంటూ బయల్దేరుతాడు. బయల్దేరుతూ ప్రశ్నించుకుంటాడు: "చివరకు మిగిలిందేమిటి?" అని. "తనతో తాను సమాధానపడటం — అది మిగిలింది" అని జవాబు. నవల ముగుస్తుంది.

దయానిధి, అమృతం, కోమలి 'రొమాంటిసిజమ్'తో తయారైన ప్రతిమలు కారు. వీరి కథలో 'ప్రేమ' కూడ యిదివరకు రొమాంటిక్ సాహిత్యంలో స్థిరపడి, సినిమాల కెగబడి, నేడు యువతీ యువకుల నోట నిత్యమూ వినబడే పదం కాదు. ఈ నవలలో దయానిధి దేశ సేవాసక్తి, సంఘోద్ధరణా, సంక్షేమ కార్యకలాపమూ— అన్నీ అతను ఆత్మ సంక్షోభం నుంచీ, తన ఆంతర్యంలోని సమస్య నుంచీ పలాయనం కావడానికి వెదుక్కున్న మార్గాలుగా మాత్రమే కనిపిస్తాయి! తనతో తాను సమాధాన పడలేని వ్యక్తి లోకంలో ఎక్కడా ఎప్పుడూ సమాధానపడలేడని ధ్వని.

3

దయానిధి ఎదుర్కొన్న సమస్య ఏమిటి? నవలలో దయానిధి తల్లిపాత్ర చిత్రించబడలేదు. "కాని ఆమె చేసిన అపచారాల ఫలితం, నీడలా అతన్ని వెంటాడి, సంఘ విమర్శ ద్వారా, జీవితాన్ని కలుషితం చేస్తుంది" అంటూ 'ఆముఖంలో' (Preface) రచయిత వ్రాశాడు. తల్లి మరణం, ఆ సమయంలో దయానిధి కోమలి యింటి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ వుండటం— యిదీ నవల కథా ప్రారంభం. నవలకు ప్రధానమైన పై రెండు విషయాలతో మొదటి అధ్యాయం సూటిగా ప్రారంభం అవుతుంది. తల్లి ప్రవర్తన మంచిది కాదన్న మాటలు సూచనగా ఎవరైనా అనడం, దానితో దయానిధిలో కలిగే మార్పు, ఆ వ్యక్తిమీద అతను చూపే ద్వేషం— (వాచ్యంగా కాదు, క్రియారూపేణా) — ఆధారాలుగా దయానిధికి తల్లి ఎంతటి ఆరాధ్య దేవతో పాఠకులు గ్రహించవలసి వుంటుంది. తల్లి ఆరాధ్య దేవత, కాని ఆమె శీలవతి కాదన్న సంగతి అతను మనస్సులో ఎప్పుడూ విమర్శించలేదు, తర్కించలేదు. ఇతర కన్యల మీద లేని ఆకాంక్ష తనకు కోమలి మీద ఎందుకో అతనికి తర్కించుకున్నా అర్థం కాదు. ఆమె చరిత్రహీన కావడం కారణం కావచ్చు, కాని దయానిధి మాత్రం అలా అనుకోలేడు. దయానిధి సమస్య మానసిక మైంది. అతని సమస్యకూ హేమ్‌లెట్ (Hamlet) ఎదుర్కొన్న సమస్యకూ పోలిక వుంది. ఈ విషయం రచయిత గుర్తించి 'ఆముఖం' (Preface) లో పేర్కొనడమే కాదు. నవల మొదటి కూర్పులో దయానిధి 'హేమ్లెట్'ను గూర్చి పెద్ద వ్యాసం వ్రాసి, తద్వారా తన సమస్యని కొంత అర్థం చేసుకున్నట్లు కూడా చిత్రించాడు. (రెండవ కూర్పులో ఈ భాగాలు కత్తిరింప బడినవి). దయానిధి 'చేతన' (Psyche) లో సుప్రతిష్ఠితమైన తల్లి మూర్తి అతని సమస్యకు కారణం. ఒక వైపు ప్రేమకు ఆమె ప్రతీక; మరొక వైపు సంఘం ఆమో

దించలేని స్వేచ్ఛా ప్రవర్తనకు, నైతిక వ్యతిక్రమానికీ ఆమెయే ప్రతీక. తల్లిని ఆరాధ్య దైవంగా భావించే వ్యక్తి లోకంలో స్త్రీ లందరిలోనూ ఆమె మూర్తినే అన్వేషిస్తాడనేది ఒక సత్యం— ఇది అజ్ఞాతమైన ప్రేరణ. అందువల్లే దయానిధి కోమలి చుట్టూ తిరుగుతాడు, ఆమె స్వేచ్ఛాప్రవర్తన అతణ్ణి ఆకర్షిస్తుంది, కాని ఆమె నుంచీ ఆప్యాయత, ఆదరణా లభించవు! (అందుకు తగిన వ్యక్తిత్వం ఆమెకు లేదు). ఆదరణకూ ఆప్యాయతకూ దూరమైన దయానిధి క్రమంగా సంఘం మీద పగ సాధిస్తాడు. అతను చేసుకున్న వివాహం, భార్యపట్ల చూపిన నిర్లక్ష్యం అందుకు తార్కాణం. దయానిధిని హేమ్లెట్‌తో పోలిస్తే ఒక ముఖ్యమైన భేదం తెలుస్తుంది. తల్లి శీలమూ ప్రవర్తనా కారణంగా హేమ్లెట్ యావత్ స్త్రీ ప్రపంచాన్నీ, సచ్ఛీలయైన ఒఫీలియానీ, "Frailty, thy name is woman" అని త్రోసిపుచ్చుతాడు. ఆప్యాయతకూ, ఆదరణకూ ప్రాధాన్యం యివ్వని, ఆదర్శాలకు ప్రాధాన్యం యిచ్చే రొమాంటిక్ హీరో ప్రవర్తన అది! (హేమ్లెట్‌కు గాని దయానిధికిగాని రెండే మార్గాలు: తల్లిని పూర్తిగా అంగీకరించడం, లేక పూర్తిగా అంగీకరించక పోవడం. దయానిధి అంగీకరిస్తాడు; సంఘాన్ని ఎదిరించవలసి వస్తుంది. హేమ్లెట్ అంగీకరించడు, సంఘంలో ఆదర్శపురుషుడు కావలసిన బాధ్యత అతని మీద పడుతుంది. ఇద్దరికీ ఓటమి తప్పదు). దయానిధి రొమాంటిక్ హీరో కాడు. అతను ఆప్యాయత, ఆదరణ ప్రధానమైన విలువలుగా ఆశించి వాటి మీద ఆధారపడే సామాన్యుడు. అందువల్ల అతను మానసికంగా సంఘంతో, సంఘం కట్టుబాట్లతో, అభిప్రాయాలతో ఘర్షణ పడతాడు. సంఘం ఆదరణనీ, అభిమానాన్నీ కోరకుండా ఉండలేడు. అవి లభించవు. "జీవితంలో నిజమైన విషాదం ద్వేషించడం కూడా కాదు. నిజమైన విషాదం ప్రేమించ లేకపోవడం... 'నాకొరకు చెమ్మగిలు నయనమ్ము లేదు'— కంటె విషాదకరమైన గీతం ఏది వుంది? ఈ సమస్య నన్ను బాధించింది.. వ్యక్తిగతమైన విముక్తి ఈ నవలకి ప్రేరణ" అని చెప్పు కొన్నాడు రచయిత. ఇక్కడ ప్రేమించ లేక పోవడం అనే లోపం ఏ ఒక్కరిదీ కాదు అని గుర్తించాలి. తన తల్లి చరిత్ర ద్వారా, తన 'చేతన'లో ఆమె తాదాత్మ్యం ద్వారా దయానిధి సంఘాన్ని ఆమోదించలేడు; అదే కారణంగా అతణ్ణి అనుమానంతో చూచే సంఘమూ అతణ్ణి గౌరవించలేదు! అయితే ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? "మనిషిని మనిషినీ స్నేహపాశంతో బంధించివేసే మానవత్వం శక్తుల్ని అన్వేషించడం...." ...... 'ఆత్మ వత్ సర్వ భూతాని.' 'ఆత్మ' స్వరూపం ఆదర్శాలకూ అభిప్రాయాలకూ, నామ రూపాలకూ అతీతమైనదనే 'ఆత్మజ్ఞాన' లబ్ధికోసం అన్వేషించినప్పుడే వ్యక్తి తనతో తను సమాధానపడటం, తద్వారా సర్వ భూతాలతో సమాధానపడటం జరుగుతుంది. అంటే 'చేతన'లో తిష్ఠ వేసుకున్న మాతృ దేవత విగ్రహం ముక్కలై, అందులోని దైవత్వం నామరూపరహితమైన చిచ్ఛక్తిగా దర్శనమివ్వటం జరగాలి. నవల చివర అదే జరిగింది!

దయానిధి 'చేతన'లోని తల్లి మూర్తి వంటి స్త్రీ లోకంలో అతనికి అమృతంలో కనిపించింది. అమృతంలో తల్లి — భార్య అనే రెండు భావనలూ సమన్వయం చెందాయి. ఆమెలో ఆప్యాయతా, నైతిక వ్యతిక్రమణము (దయానిధి కోసం) రెండూ కలిసి వచ్చాయి. లోకంతో సమాధానపడి, లోకంలో వుంటూ, దయానిధికి ప్రేమామృతాన్ని అందించ గలిగిన ఆమెకు ఏ మానసిక సంఘర్షణలూ లేవు. ఆమెకు 'తప్పు' చెయ్యడం అంటే ఏమిటో తెలీదు. ప్రేమించడం ఒక్కటే తెలుసు! ఆమె ప్రకృతి స్వరూపిణి అని గ్రహిస్తాడు దయానిధి. మాతృత్వమే ఆమె ధ్యేయం. దయానిధికి ఆమె ప్రసాదించిన వరం పునర్జన్మ. ఆమె ద్వారానే అతనికి లోకంతో మళ్లీ నిజమైన సంబంధం, జీవితం మీద ఆసక్తి ఏర్పడ్డాయి.

మానవ సంఘం మానవ నిర్మితం. కావాలనుకున్నా సంఘ జీవియైన మానవుడు ప్రకృతివైపు వెనక్కి ప్రయాణం చెయ్యలేడు. అతను గతచరిత్ర భారాన్ని భుజాల మీద మోస్తూ ముందుకు నడవవలసిందే! కోమలి ఆ చరిత్రకు ప్రతీక. "ఎన్నో ముళ్లు, ఎన్నో కీటకాలు, ఆ శరీరాన్ని మేల పరిచాయి — ఏమీ తెలీనట్లు యిక్కడ ఆత్మ నిద్ర

పోతోంది. అతని కోర్కెలు, తీరని వాంఛలు, యదార్థం కాని కలలు, అనుసరించలేని ఆదర్శాలూ, ఆంత రంగికమూ— అన్నీ కోమలై నిద్రిస్తున్నాయి. ఆమెని చంపితే, హత్యకాదు; ఆత్మహత్య....'' అందుకే నవల ముగింపులో ''గనులు పూడ్చ బడ్డాయి. వజ్రం మీద వచ్చిన సిరి, సంపద, (ప్రకృతి యిచ్చిన వర ప్రసాదం) అంతా ఆహుతి అయింది. తనకున్న బంధనాలు తెగిపోయాయి... తల్లి రాతివిగ్రహం— విరిగి పడిపోయింది — పాదాలు మాత్రం మిగిలాయి. 'అమ్మయ్య' అనుకున్నాడు. ఇప్పుడతనికి పరిపూర్ణ స్వతంత్రం....'' కాని కోమలి చేతిని బుజం మీద వేసుకుని...... నడవడం సాగించాడు.....

''అంతా చీకటి.... పైనా, కిందా, —అన్నీ నక్షత్రాలే. తన సిరి, సంపదా, 'కాత్యాయని'— అన్నీ కోటి వజ్రాలై, ఆకాశాన అలంకరించాయి.....' చీకటి నక్షత్రాలు విశ్వమంతా. వాటిలో ఒక చిన్న నక్షత్రం సృష్టిలా వికసించి విశ్వమంతటా వ్యాపించింది. అంతా తమదే— కాని చెయ్యి చాస్తే ఏదీ అందదు; అన్నీ తమరివే కాని నోరిప్పి పిలిస్తే, ఏదీ పలకదు.''— ఇది మనిషి ఒంటరి తనాన్ని గురించి. ''రెండు కొండల మధ్య నుంచి నడిచి అవతలికి చేరుకున్నారు'' — ఇది ద్వంద్వాలను అధిగమించటం. ''కోమలి గడ్డిలో వాలి పోయింది. 'ఇక నేను నడవలేను బాబు — యిక్కడ పడుకుందాం' అన్నది'' — ఇది జీవితంలో అన్వేషణ ముగియటం. ''చివరికి మిగిలిందేది?.... ప్రేమా? ధనమా? కీర్తా? ఏదీకాదు.... చివరికి మిగిలింది తను!.... తన్ను తాను పరిపూర్ణంగా చూశాడు... తనతో తాను సమాధానపడి, తన్ను తాను స్వీకరించి, కౌగలించుకుని ఏకమయ్యాడు...!ఈ జీవితాని కర్థం ఎందుకుండాలో! అర్థం లేదనే తలంపులో నిరుత్సాహం, బాధ లేవు! కొత్తబలం, వికాసం, ఆత్మ విశ్వాసం, దృఢనిశ్చయం ఉంటాయి... మానవుడికి కావల్సింది మతాలు, దేవుళ్లు, మొక్కుబళ్లు, రాచకీయాలు కావు; మానవుడికి కావల్సింది, దయ— కొంచెం, కాస్త ఐనా చాలు...'' —ఇది ఆత్మజ్ఞానం. ''రెప్ప పైకి లేచిన తెల్ల వెలుగు ఆకాశంలో నాలుక చాచి పాకుతోంది. నక్షత్రాలని దగ్గరకు తీసుకొని తనలో కలుపుగుంటోంది, వెలుగు.'' — ఇది ఆత్మవత్ సర్వ భూతాని! ''కోమలితో, ఎక్కడో, మరో క్రొత్త జీవితం ప్రారంభించాలి... ప్రపంచం లోని ప్రేమంతా తనే దాచేసుకుని, అమాయకంగా పడుకున్న కోమలి.'' — ప్రేమతో దీప్తమై, లోకంతో క్రొత్తగా సంబంధాన్ని ఆకాంక్షిస్తున్న దయానిధి ఆత్మే, కోమలి! ''శరీరం అనుభవంతో ఆత్మైపోయింది!''

4

కోమలిలో మానవాత్మ, వ్యక్తి జీవితం, మానవ చరిత్ర ధ్వనిస్తాయి. మానవుడు తన సహజ ప్రకృతిని—'ఆత్మని' — ఏవగించుకుని, ఆదర్శాలను అన్వేషిస్తాడు. సంఘ జీవనంలో ఆదర్శాల చక్రంలో అతని సహజ ప్రకృతి నలిగిపోతుంది. కలుషిత మౌతుంది. రూపం మారినా అదే వివరకు తిరిగి వస్తుంది. ఆ ప్రకృతికి నశింపులేదు. ఇది వ్యక్తి జీవితం. చరిత్రలోనూ మానవుని నాగరకత, సంస్కారం యావత్తూ మానవత్వాన్ని అంగీకరించేందుకే అని పిస్తుంది! అమృతం దగ్గర అప్పుతీసుకుని యాభై రూపాయల్ని కోమలి తలగడ క్రింద పెట్టడంతో దయానిధి ఆమెకు దూర మౌతాడు. ఇది ఎంతటి భావగర్భితమైన సంఘటనమో ఆలోచిస్తే తెలుస్తుంది: సంఘ వ్యవస్థ, నాగరకత, డబ్బుమీద ఆధారపడినవి — ఆ 'డబ్బు' ప్రకృతి (Nature) నుంచి మానవుడు అప్పుగా తీసుకున్నదే! ఆ డబ్బు ప్రభావానికి లోబడి కోమలి కొన్నాళ్ళు దాస్యం చేస్తుంది, నలుగుతుంది, కలుషితమై పోతుంది దయానిధి అమృతాన్ని పొందిన రాత్రి, ఆమె పెట్టె లోని డబ్బుని గ్రహించి, క్రొత్త జీవితాన్ని అన్వేషిస్తూ వెళ్ళడం మరొక అర్థస్ఫూర్తిగల సంఘటన ప్రకృతి స్వరూపాన్ని సాక్షాత్కరింప జేసుకున్న మానవుడు లోకంలో చేసే ఆత్మజ్ఞాన ప్రయత్నం అది. తర్వాత దయానిధి అమృతం డబ్బుని తిరిగి పంపించేస్తాడు: ఇది మరొక మలుపు. అంతలో అతని భార్య మరణిస్తుంది — వ్యవస్థ నిర్మించిన బంధం నుంచీ విముక్తి; అమృతం కన్న సంతానాన్ని దర్శిస్తాడు — ప్రకృతి ధ్యేయం నెరవేరింది; కోమలి తిరిగి వస్తుంది — మానవునిలో ఆత్మచింతనం ప్రారంభ మౌతుంది. దీని పర్యవసానం: లౌకికం,

లౌకిక జీవనం సర్వం దగ్ధం కావడం— మానవుని ఆత్మ సాక్షాత్కారం. ఈ విధంగా వ్యాఖ్యానిస్తే నవలలో దయానిధి, అమృతం, కోమలి మధ్య జరిగిన గాథలో ప్రత్యంశమూ అర్థస్ఫూర్తితో నవల సమగ్రస్వరూపానికి దోహదం చేసేదిగా కనిపిస్తుంది. ఇది పాఠకుని, విమర్శకుని వూహాశాలిత్వం మీదా, చిత్త సంస్కారం మీదా ఆధారపడిన విషయం.

5

ఫ్రాయిడ్ సిద్ధాంతం దృష్ట్యా చూస్తే దయానిధి 'న్యూరాసిస్' (Neurosis) నవలలో చక్కగా పోషింపబడింది. తల్లిమూర్తితో దయానిధి లైంగిక ప్రవృత్తి ముడిపడి ఉండటం మూలాన (Mother-fixation) అతను శారీరకంగా స్త్రీని పొందటానికి అశక్తుడు. ఈ అశక్తతని కప్పి పుచ్చుకోవడానికి అతను చేసే చేష్టల ఫలితమే కనుపించిన అమ్మాయిలతో చనువుగా, స్నేహంగాఉంటూ యితరుల మనస్సుల్లో అపోహల్ని కల్పించటం. సంఘం అతన్ని దుయ్యబట్టి దుమారం రేపింది అంటే అది ఒక విధంగా దయానిధి స్వయంకృతాపరాధమే. భార్యను వదలిపెట్టి ఒంటరిగా ఉంటూ మిత్రుని చెల్లెల్ని — శ్యామలను — తన యింట్లో ఆమె మానసిక వ్యాధి చికిత్సకోసం ఉంచుకోవడం, 'న్యూరాసిస్' లేని వ్యక్తి, యింగిత జ్ఞానం ఉండే వ్యక్తి చేసే పనికాదు! 'అతని జీవితమే సరిగాలేదు... ఇతరులని బాగుచేసే అధికారం, డిగ్రీ ద్వారా అతనికి ఉంది. కాని నైతికంగా అట్లాంటి అర్హతలేదేమో!'' అనే స్పృహ అతనికే కలుగుతుంది. అందువల్లే అతనికి 'న్యూరాసిస్' నుంచీ విముక్తి క్రమంగా సాధ్యమైంది. పునస్సంధానానికి ముహూర్తంపెట్టితే, సరిగా ఆ సాయంత్రం రాజకీయసభలో ఉపన్యసించి అరెస్టు కావడం— అంతకు పూర్వం రాచకీయాలతో ఏ సంబంధం లేనివాడు అలా ప్రవర్తించడం— అది 'న్యూరాటిక్' ప్రవర్తనకు చక్కని ఉదాహరణ. స్త్రీతో శారీరక సంబంధం ఏర్పడే అవకాశం వచ్చినప్పుడల్లా దయానిధిలో కలిగే ఉద్విగ్నత, భయం, గందరగోళం అతని 'న్యూరాసిస్'ను బుజువుచేస్తుంది. నిద్రిస్తున్న కోమలి ఎదుట నిల్చుంటే, ''ఏదో శక్తి అతనిలో ప్రవేశించి అతన్ని కార్యశూన్యుణ్ణిచేసింది... శరీరం 'ఇది అన్యాయం, నేనీపని చెయ్యలేను, నేనే సౌందర్యం! నన్ను నేను ధ్వంసం చేసుకోలేను, ఇతరులనీ ధ్వంసం చెయ్యలేను! నన్ను వదిలెయ్యి'' అన్నదట! శారీరకమైన సంపర్కం సౌందర్యాన్ని ధ్వంసం చేస్తుందని భయమట! భార్యతో పునస్సంధానం జరగకుండా రాచకీయ సభలో అరెస్టు కావడానికి యిచ్చిన ఉపన్యాసం 'స్వేచ్ఛ, స్వాతంత్ర్యా'లను గూర్చి! వివాహం దాస్యమట! శ్యామల యొక్క 'న్యూరాసిస్' అర్థం చేసుకునేందుకు చేసిన ప్రయత్నం ద్వారా, హేమ్లెట్ నాటకాన్ని చదివి వ్యాఖ్యానించే ప్రయత్నం ద్వారా, తన సమస్యని తనే పరిశీలించుకొని క్రమంగా మానసికమైన ఆరోగ్యాన్ని సాధిస్తున్న దయానిధికి, అమృతంతో సంభవించిన ఏకాంతం చివరకు పరిపూర్ణమైన విముక్తిని ప్రసాదిస్తుంది. అటుపైన దయానిధి ఎదుర్కొన్నది తాత్త్వికమైన సమస్య. 'న్యూరాసిస్' నయమవడంతో జీవిత సమస్యలన్నీ పరిష్కారం అయినట్లు భావించగూడదనే విషయాన్ని మనస్తత్వ వేత్తలందరూ నొక్కి చెబుతారు. దయానిధి ఆత్మ పరిశీలన ద్వారా తన 'న్యూరాసిస్' తనే నయం చేసుకున్న ప్రజ్ఞాశాలి, అదృష్టవంతుడు! అందువల్లే అతని అన్వేషణము ఆత్మజ్ఞానంతో, ఆత్మ సాక్షాత్కారంతోగాని పర్యవసించలేదు.

6

ఈ దేశంలో ఆదర్శానికీ ఆచరణకూ గల దూరం చాల పెద్దది. శుష్కవేదాంతాన్ని వల్లించడం, గీతాపారాయణం చెయ్యడం, కాషాయ వస్త్రాలు ధరించి 'స్వామిజీ' అనే నామధేయంతో సంఘంలో ఆధ్యాత్మికతకు ప్రతినిధులుగా వ్యవహరించడం వగైరా విషయాలమీద విమర్శఉంది ఈ గ్రంథంలో. కాని నిజమైన ఆధ్యాత్మిక విలువల్ని తరచి నిరూపించే నవల కూడా దీన్ని మించినది మరొకటి ఉండదు. ''తన ప్రవర్తనని, సరియైనదని బుజువు చేసుకుని సమాధానపడటంకోసం, మానవుడు చేసే యత్నమే, తన నిజ స్వరూపం'' అంటాడు దయానిధి. ''శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్, స్వభావ నియతమ్ కర్మ కుర్వన్ నాఒప్నోతి కిల్బిషమ్'' అన్న గీతా శ్లోకం జ్ఞాపకం వస్తుంది.

వ్యక్తికీ సంఘానికీ ఏర్పడే సంఘర్షణని చిత్రించడంలో పై శ్లోకార్థమే ఈ నవలలో ధ్వనిం

చింది. ''నేడు మన సంఘం ఆమోదిస్తున్న నీతిని ప్రతిపాదించినవారు విచిత్రమైన, గతించి పోయిన వాతావరణంలో ఉన్నారు. ఈ నీతి మత సిద్ధాంతాల పైనా, సంఘంతో నిమిత్తం వదలుకున్న కొద్ది మంది ఋషుల వేదాంత ఘోషపైనా ఆధారపడి ఉంది. ఇది తప్పు అనే సాహసం నాకు లేదు. ఇది మనకు సరిపడదూ అనగలను. దానికి కారణం యీ నీతి, మనం ఆచరణతో పెట్టలేక పోవడమే..... మన సంఘంలో మనుష్యులు బద్ధకించి ఉన్న వాటితోనే తృప్తిపడి, మోక్షం పేరు చెప్పుకొని యీ ప్రపంచాన్నీ, జీవితాన్నీ, ఒక జాడ్యంగా, ఒక పీడ కలలాగ భావించి ఎల్లాగో రోజులు గడుపుతున్నారు.... మనం ఆధ్యాత్మిక విలువల పేరూ, వేదాంతం పేరూ చెప్పుకుంటూ మనుష్యుల మాట మరచిపోతున్నాం —'' ''మంచితనం అంటే పట్టుబడని చెడ్డతనమేనా?'' ''తాను చేసిన పని తనకి నచ్చాలి; మంచిదని స్థిరపరచుకోవాలి. అది ముఖ్యం గాని, యితరుల కళ్ళద్వారా చూచి విలువ కట్టి, ఒక కార్యాన్ని ఖండించడం, నైతికంగా పిరికితనం.'' ''తన జీవితం పాడుచేసుకున్న వ్యక్తి ఇతరులనైనా బాగు చేద్దామని సంకల్పిస్తే, అన్నీ పేచీలే. తన జీవితం బాగు చేసుకున్న వ్యక్తికి, యితరుల జోలి అక్కర్లేదు.'' ''సంఘాన్ని మార్చలేడు, మనుష్యుల్ని మార్చలేడు. మారిస్తే బాధ, పగ, యుద్ధం. తనతో తను సమాధానం పడాలి. అది యీనాటికి సాధించాడు. ఒక ప్రశాంతత, పవిత్రమైన మహత్తర ఆనందం... అది బాహ్య ప్రపంచంలో లేదు....పిచ్చి ప్రపంచాన్ని దయతో దూరంగా ఉంచే ఔదార్యం, మతాన్ని, దైవాన్ని, మనుష్యుల్ని తోసేసి సంతృప్తి చెందే ఆధ్యాత్మిక దృష్టి, తనలో కడసారి యథార్థం.''

ఫ్రాయిడ్, రస్సెల్, మార్క్స్, కర్కిగార్డ్— పాశ్చాత్య సంస్కృతి స్రవంతి ఎంతగా ప్రవహించినా భారతదేశంలో దాని గమ్యస్థానం వేదాంతసాగరం అనే సామాన్య విషయాన్ని ఋజువు చేస్తున్నది యీ నవల. కాని అది ఎవరికి వారు వ్యక్తిగతంగా ఋజువు చేసుకోవాలనీ సాధించాలనీ నొక్కి చెప్పడమే విశేషం. ''ఏ ఒక్కరి పరిస్థితులూ, బుద్ధి వికాసాలూ మరొకరికి రావు. ఐనా వాళ్ళందర్నీ ఒక ఫక్కీలో — ఒకడు శాసించిన ఫక్కీలో— నడుచుకోమనడమే, మన దౌర్భాగ్యం. ఎవరి జీవితాన్ని వారు చక్కబెట్టుకుంటే ప్రపంచం బాగుపడుతుంది.'' వైయక్తిక దృక్పథం (Personalism and Individualism), మానవతా వాదం (Humanism), అస్తిత్వవాదం (Existentialism) — ఏ పేరుతో వ్యవహరించినా, ''మనం ముక్కలై 'నువ్వూ' 'నేనూ' అయి ఉత్తర దక్షిణాలకు ప్రయాణం చేసింది...'అందరూ' మాత్రంలేరు'' అనే సత్యాన్ని గుర్తించిన దృక్పథం, దానికి అనుబంధమై సహనము, క్షమ, దయ ప్రధానమైన విలువలుగా నడిచే జీవితమూ, ఆధునిక మానవునికి అవసరం అంటున్నదీ నవల. 'జీవితంపై ఒక దృక్పథం కలగ చెయ్యాలన్న'రచయిత ఉద్దేశం నెరవేరినట్లే.



నీ తోడు

శ్రీ పణతుల రామచంద్రయ్య

నిజంగా చెబుతున్నాను నీతోడు
నిన్న నీకు శుభ్రకాంతి శిఖరాగ్రంపై కనిపించినవాడు
వీడు
చిరస్వప్నాలు పగిలి చిందించే భాష్ప సందోహాన్ని తుడిచి
నిరుటి గాంభీర్యాల గచ్చురాలిపడే నీ దేహాన్ని విడిచి
ఇలావచ్చి చూడు
వాడే వీడు
ఆ క్షణం
నక్షత్ర భారంతో వంగిన ఆదర్శ గగనం
అలవోకగా ముగ్ధవలె హేలగా నిలిచి నవ్విన వేళ
అరవిచ్చిన శాంతి పద్మాలతో రచించి నీవు రువ్విన మాల
వీని కంఠాన మెరిసింది—విశ్వధాత్రి మురిసింది ఆనాడు
కాని గతానికీ భవితవ్యానికి కల్యాణబంధం వేయలేదు వీడు.
ఇలా వీధి చివర జ్ఞాపకాల మరకలు చెరిగి పోతోంటే ఎన్నాళ్ళుగా ఎదురు చూశావు!
ఎన్నాళ్ళ్ని తీవ్ర నైరాశ్య సంసిక్త క్షణాల భారాన్ని నయనాంచలాలపై మోశావు!
బుద్ధిని వియద్గంగలో అద్ది
భ్రూమధ్య సీమలో దశదిశా విజయ తిలకం దిద్ది
భూమధ్యరేఖపై నడచి వెళ్లిన వాణ్ణి చూడు—
అగాధమైన గుండెలోతులమీద ఆనందసేతువు కట్టలేదు వీడు
అక్షయ స్వర్ణ కలశంలో అందించిన అరుణానురాగవారుణి
అన్యాయంగా చేజార్చుకున్నాడు
పాలవెన్నెల దుస్తులమాపుకుంటూ మాంత్రికుని గుహలోకి వెళ్ళి
మాయా మర్మం నేర్చుకున్నాడు
నిరంతర వసంతస్ఫోరకంగా గులాబీలు పూయించమన్న చోట
వరుసగా ఇరుకు గదులు కట్టుకున్నాడు.

కొరియాలో హిరోషిమాలో స్పైయిన్‌లో సౌత్‌ఆఫ్రికాలో
తన రికార్డు పాడు చేసుకున్నాడు
నిజంగా చెబుతున్నాను నీ తోడు
నిన్న నీకు శుభ్రకాంతి శిఖరాగ్రంపై కనిపించినప్పుడు
క్రింది లోయలో మసక వెలుతురులో
వెలువడే నిశ్వాసాలవేడి
విరిగి పడిన బ్రదుకుల సవ్వడి
విననివాడు, మరి బాగుపడనివాడు
వీడు.



కావ్యము - రసము

శ్రీ శిష్ట్లా లక్ష్మీనారాయణ

కళలన్నిటిలోనూ సాహిత్యము ఉత్తమమైనదిగా ఎంచబడినది. చరిత్ర గమనంలో మానవుని మనస్సు పరిపక్వం చెంది, భాషకూడా పటిష్ఠమైనపుడే ఒక సాహిత్యం తలయెత్తుతుంది. భాష మనోగత భావములను వ్యక్తపరచుటకు వలయు ఒక సాధనము. భాష కూడా మానవుని హృదయాంతరాళాలలోనున్న భావములను స్పష్టంగా వ్యక్తపరచగల శక్తి కలిగివుండాలి. లేనిచో సాహిత్య సృష్టి జరగనే జరగదు. ఉత్తమమైన, గొప్పదియైన ఒక సాహిత్యము ఒక జాతియొక్క అంతర్భులాన్ని వ్యక్తపరుస్తుంది.

ఎన్నోవేల ఏండ్లుగా సాహిత్య రచన జరుగుతూ వస్తోంది. ఎంతో మంది గొప్ప సాహితీ వేత్తలు గొప్ప రచనలు చేశారు. ప్రతిజాతి, దేశములోను ఉత్తమమైన సాహిత్య రచనల్ని సృష్టించారు. పద్యం గద్యం ప్రతి సాహిత్యంలోనూ వృద్ధి పొందినాయి. ప్రాచ్య పాశ్చాత్య లాక్షణికులు కవిత్వానికి, కావ్యానికి చాలా నిర్వచనాలు యిచ్చారు. కాని సాహిత్య రంగంలో ప్రాచ్య లాక్షణికులు కృషి చేసినట్లు, పాశ్చాత్య విమర్శకులు, రచయితలు చేసినట్లు కనబడదు. ప్రాచ్య లాక్షణికులు కొందరు కవనీయం కావ్యం (వర్ణింపతగినది) అని, మరికొందరు 'వర్ణించువాడు కవి, అతని కర్మ కావ్య'మని పలువిధములుగా నిర్వచనాలు చేశారు. అట్లాగే పాశ్చాత్య సాహితీ విమర్శకులుకూడా కవిని, కవిత్వమును నిర్వచించుటకు ప్రయత్నం చేశారు. ఉదాహరణకు సామ్యూల్ జాన్సన్ "యుక్తితో భావనను జతపరచి, సత్యమును ఆనందముతో సమ్మేళనము చేయుటయే కవిత్వము" అని, వర్డ్స్‌వర్త్ (wordsworth) 'శక్తిమంతములైన భావములు అప్రయత్నముగా పెల్లుబుకుటయే కవిత్వము' అని నిర్వచనాలు చేశారు. ఈ విధంగా ఎంతోమంది కవిని గురించి, కవిత్వాన్ని గురించి, కావ్య స్వరూపాన్ని గూర్చి, కావ్యాత్మను గూర్చి ఎన్నో చర్చలు చేశారు, ఎన్నో పుస్తకాలు వ్రాశారు.

కావ్య స్వరూపాన్ని, కావ్యాత్మను గురించి భారతీయులు చర్చించినంతగా, పశ్చిమ దేశీయులు ఎక్కువ మంది చర్చించలేదేమో ననిపిస్తుంది. పశ్చిమ దేశాల్లో కావ్యాన్ని గురించి కూలంకషంగా చర్చించిన ప్రాచీనులలో ప్రముఖుడు అరిస్టాటిల్ (Aristotle). అరిస్టాటిల్‌లాంటివారు పశ్చిమ దేశాల్లో బహు అరుదు. కావ్యాత్మను గురించి, కావ్య లక్ష్యం, లక్షణాలను గురించి ఎవరి కే అభిప్రాయమున్నా, అందరూ 'విశ్వశ్రేయః కావ్యం' అన్న విషయాన్ని అంగీకరిస్తారు. ఒక వ్యక్తిని సంస్కరించి ఉత్తమమైన మానవునిగా, సంఘజీవిగా చేయటమే ఒక ఉత్తమమైన కావ్యంయొక్క లక్ష్యం. ఇక్కడ కావ్యంలో ఏ విషయాన్ని అత్మగా పరిగణించారో, కొందరు ప్రాచ్య, పశ్చిమ లాక్షణికుల సిద్ధాంతాల్ని పరిశీలిద్దాం.

భారతదేశంలో భరతాచార్యుణ్ణి ప్రాచ్య లాక్షణికులకు పితామహుడుగా చెపుతారు. ఈయన 'నాట్యశాస్త్రము' యొక్క గ్రంథకర్త. భరతాచార్యుడు కావ్యమునకు శరీరము యితివృత్తము, రసము ఆత్మ అని చెప్పారు. తరువాత ఈ రసవాదమును అనేకమంది సమర్థించారు. భరతాచార్యుల తరువాత భామహుడు అలంకారములే కావ్యమునకు ప్రధానమని ఎంచాడు. క్రీ. శ. 6 వ శతాబ్దంలో దండి, కావ్యమునకు వన్నె తెచ్చునవి, విశ్వజనీనతను సంపాదించి పెట్టునవి గుణములేనని సిద్ధాంతం

చేశాడు. అటు తరువాత 9 శతాబ్దంలో వామనుడు, దండి భామహుల వాదాల్ని తన వాదంతో సమన్వయ పరచి రీతియే కావ్యమునకు ఆత్మ అని తెలిపినాడు. తరువాత ఆనందవర్ధనుడు, ధ్వనియే కావ్యమునకు ఆత్మ అని, తరువాత వచ్చిన అభినవగుప్తుడు, రస ధ్వని సిద్ధాంతములను సమన్వయపరచి భరతాచార్యుని రససిద్ధాంతమునకు, ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతమునకు గల ప్రతిష్ఠను యినుమడింప చేశాడు. వీరేకాక పాశ్చాత్య దేశములలో కూడా ఎందరో లాక్షణికులు కావ్యాత్మను గురించి తమ అభిప్రాయములను వ్యక్తపరచినారు. ఈ విషయంలో శ్రీ డి.టి. తాతాచార్యులుగారు యిట్లు చెప్పారు: ''స్టూవర్ట్‌మిల్, వర్డ్స్‌వర్త్, కేబెల్ మున్నగువారి నిర్వచనములలో రసమార్గము అస్పష్టముగా వెల్లడింపబడినది. అవి 'క్రౌంచద్వంద వియోగోత్థమైన శోకమే శ్లోకత్వమును పొందిన'దను ఆనందవర్ధనుని శ్లోకమును, దానిపై ఆనందవర్ధనుడు కావించిన వ్యాఖ్యానమును తలపించుచున్నవి. అయ్యును వారు రససిద్ధాంతమును గూర్చిగాని, దానికి కవిత్వముతో గల సంబంధమును గూర్చిగాని, ఊహించిరని భావించుట యుక్తముకాదు. గోల్డ్ స్మిత్, లైహన్ట్ మున్నగువారు అలంకారమార్గమునకును, వర్డ్స్‌వర్త్, కేబెల్ మున్నగువారు రస మార్గమునకు చెందినవారని మాత్రము చెప్పవచ్చును.'' డంటన్, కోర్ట్‌హోప్ (Courthope), పోప్ (Alexander Pope), డా.జాన్సన్ (Samuel Johnon), లైహన్ట్ (Leigh Hunt), ఎడ్గార్‌ఎల్లెన్ పో (Edgar Allen poe), జాన్ రస్కిన్ (John Ruskin) మున్నగువారు కావ్యముయొక్క బహిరంతర్గత స్వరూపాల్నిగురించి విపులంగా చర్చిస్తూ ఎన్నో గ్రంథాలను రచించారు. ఏది ఏమైనా ప్రాచ్య, పాశ్చాత్య లాక్షణికులు రసమును ధ్వనిని కావ్యానికి ఆత్మగా అంగీకరించారు. అభినవగుప్తుడు ధ్వని కూడా రస పర్యవసాయమే అని చెప్పాడు. కాబట్టి రస సిద్ధాంతాన్ని అర్థం చేసుకుంటేనే గానీ ఒక కావ్యాన్ని అర్థంచేసికోలేము.

విభావైరనుభావైశ్చ సాత్త్వికైర్వ్యభిచారిభిః
అనీయమానః స్వాదుత్వం స్థాయీ భావో
రసఃస్మృతః

(విభావానుభావములచేతను, సాత్త్విక వ్యభిచారీ భావములచేతను స్వాదుత్వమును పొందింపబడు స్థాయీ (స్థిరమైన) భావమే రసము). భరతుడు తన ''నాట్య శాస్త్రము''న రసము లెనిమిదని తెల్పెను. అవి శృంగారము, హాస్యము, కరుణ, క్రోధము, భయానకము, బీభత్సము, అద్భుతము, వీరము. కానీ తరువాత భట్టోద్భటుడు ఆ ఎనిమిది రసములకు శాంత రసమును కూడా చేర్చి నవరసములు చేసెను. కొందరు శాంతము రసము కాదని అభిప్రాయపడతారు. కానీ ప్రముఖ లాక్షణికులైన ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు శాంతరసమునుకూడా అంగిరసముగా భావించారని తెలుస్తుంది.

ఈ నవరసములలో కూడా పలువురు లాక్షణికులు, ఒక్కొక్క రసాన్ని ప్రధానరసముగా తెల్పారు. హిందీ సాహిత్యములో ఎక్కువ మంది లాక్షణికులు శృంగారాన్ని 'రసరాజ్' అన్నారు. మహామతి ధర్మదత్తజీ లాంటివారు అద్భుతరసాన్ని ప్రధాన రసముగా ఎంచారు. అట్లాగే భోజుడు ''శృంగార ఏవ ఏకో రసః'' అని చెప్పాడు. నారాయణుడు అద్భుతరసాన్నే ప్రధాన రసముగా ఎంచాడు. వీరు ''ఒక కథయొక్క పరమార్థం ఆనందాన్ని యివ్వటమే. ఆనందమే బ్రహ్మ. సహృదయుడైన ఒక పాఠకుని హృదయంలో ఈ రకమైన అలౌకిక ఆనందం కలగటమే'' అద్భుతము'' అని తమ అద్భుత రసవాదాన్ని సమర్థించారు. వీరే కాక ఒకే రసవాదాన్ని లేవతీసిన వారిలో భవభూతి ఒకరు. 'ఏకోరసః కరుణ ఏవ....' అని చెప్పారు.

'కావ్యంలో ప్రతిరసము కరుణరసానికి ఉన్ముఖంగా ఉండి ఈ రసాన్నే పటిష్ఠం చేస్తాయి' అని భవభూతి అన్నారు.

సంస్కృత కావ్యాలలోనేకాక, గ్రీక్, ఆంగ్లము, వీనిలో కావ్యాలలో ప్రాచీనులు, వారి అనుయాయులు ఈ రసాన్నే ఎక్కువగా పోషించినట్లు తెలియ వస్తుంది. రస సిద్ధాంతాన్ని గురించి, గ్రీక్, ఆంగ్ల లాక్షణికులు ఎక్కువగా చర్చించకపోయినా వారు చేసిన ఎక్కువ విషాదాంత రచనలనుబట్టి మనం, వారు ఈ రసానికే ఎక్కువ ప్రాధాన్యం యిచ్చినట్లు భావించవచ్చు. అరిస్టాటిల్ ''కాథార్‌సిస్ (Catharsis) అంటే ఆవేశాల్ని అన్నిటిని చల్లబరచి

మనస్సుని నిర్మలమైనదిగా (Purgation of emotions) చేయుటయే ఒక దుఃఖాంత కావ్యాన్ని పఠించటంలోని పరమార్థం" అని తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. గొప్ప నాటక కర్తలైన యీస్కిలెస్ (Aeschylus), సోఫోక్లెస్ (Sophocles), యురిపిడెస్ (Euripides) కూడా ఎన్నో దుఃఖాంత నాటకాల్ని వ్రాశారు. అట్లాగే ప్రముఖ ఆంగ్లనాటక కర్త అయిన షేక్స్పియర్ కూడా తన దుఃఖాంత నాటక రచనవలననే అఖండ కీర్తి నార్జించాడు. మిల్టన్ చెప్పినట్లు సహృదయుడైన పాఠకుడు దుఃఖాంత కావ్యాన్ని పఠించినప్పుడు జరిగేది

Calm of mind
And all passion is spent.

అరిస్టాటిల్ కథార్సిస్ అన్నప్పుడు తాత్పర్యం యిదే. షేక్స్పియర్ దుఃఖాంత నాటకాల్లో ప్రసిద్ధములైనవి "హామ్లెట్" (Hamlet), "కింగ్ లియర్" (King Lear), 'ఒథెల్లో' (Othello), 'మాక్బెత్' (Macbeth), 'జూలియస్ సీజర్' (Julius ceasar). ప్రతి నాటకంలోనూ నాయకుడు విషమ పరిస్థితుల మధ్య నలుగుతూ చివరకు ఏవిధంగా హృదయవేదనలతో మరణిస్తాడో షేక్స్పియర్ తన నాటకాల్లో చక్కగా చిత్రించాడు. 'కింగ్ లియర్'లో లియర్ ముసలితనం వల్ల కొన్ని పొరపాట్లు చేసి వాటికి తగిన ఫలితాల్ని అనుభవిస్తూ ఉండగా తనకు అత్యంత ప్రియమైన కూతురు కార్డీలియా (Cordelia) ఉరితీయబడిన తరువాత హృదయం వెయ్యి ముక్కలుకాగా కార్డీలియా శవాన్ని చేతుల్లో పెట్టుకొని

Why should a dog, a horse, a rat have life,
And thou no breath at all ? Thou'lt come no more,
Never, never, never, never, never,

అంటాడు. ఈ విధంగా షేక్స్పియర్ నాటకాలన్నీ కరుణ రసంతో నిండి ఉన్నాయి. మిల్టన్ రచనలలో కరుణరసం లేకపోలేదు. షెల్లీ (shelly) కూడా 'Our sweetest songs are those that tell of the saddest thoughts' అన్నాడు. దీనిని బట్టి ఆంగ్ల సాహితీకారులు కూడా కరుణరసాన్ని తమ రచనల్లో ఎంత అద్భుతంగా పోషించారో తెలుస్తుంది.

భరతుడు కరుణరసాన్ని గురించి తన 'నాట్య శాస్త్రము'లో విపులంగా వ్రాశారు. దానిలో ఈ విధంగా వ్రాశారు:

ఇష్టజనస్య వినాశాత్ శాపా
త్క్లేశాచ్చ బంధనా ద్వ్యసనాత్
ఏతైరర్థ విశేషైః
కరుణ రసముద్భవతి

ఇష్టజన వినాశము, శాపము, క్లేశము, బంధనము, వ్యసనము మొదలైనవానివలన కరుణ రసముద్భవించునని దీని తాత్పర్యము. వాల్మీకిని కావ్యరచనకు ప్రేరేపించినది కూడా కరుణ రసమే. క్రౌంచపక్షుల వియోగము చేత వాల్మీకిలో కరుణరసము వెల్లువలై పారింది.

శ్లో. మానిషాద ప్రతిష్ఠాంత్వం
అగమ శాశ్వతీః సమాః
యత్క్రౌంచ మిధునాదేకం
అవధీః కామమోహితం

ఈ విధమైన కరుణ వలన వాల్మీకి కావ్యరచనకు పూనుకోబట్టే 'రామాయణము' కరుణ రస ప్రధానమైన మహాకావ్యంగా వెలసింది. మహాకవులైన కాళిదాసు, భవభూతి కూడా ఈ రసాన్నే బాగా పోషించారు. కాళిదాసు శృంగార రస ప్రధానములైన కావ్యాల్ని రచించినప్పటికీ, వానిలో శృంగార రసంతో పాటు కరుణ రసాన్ని కూడా పోషించాడు. కాళిదాసు 'మేఘ సందేశం' చదువుతున్నప్పుడు, శాపగ్రస్తుడైన యక్షుడు విరహాన్ని అనుభవిస్తున్నప్పుడు సహృదయులైన పాఠకుల మనసులన్నీ కరుణతో నిండిపోతాయి. అట్లాగే దుర్వాసముని శాపమునకు గురి అయిన శకుంతల స్థితిని గాంచినప్పుడు ఉత్పన్నమయ్యేది కరుణయే. అట్లాగే 'రామాయణం'తో సీత జాడ తెలియక అడవులలో తిరుగుచు విరహ వ్యథ ననుభవించే శ్రీరాముని స్థితికి మనలో కరుణ రసమే ఉప్పొంగుతుంది. 'మహాభారతం'లో కురు

క్షేత్ర సంగ్రామం ముందు అర్జునుడు తన అన్న తమ్ములైన కౌరవసైన్యంచూచి, యుద్ధం వలన తన స్వజనుల నష్టము దానివలని దుష్ఫలితములచే వ్యథనొంది

న కాంక్షే విజయం కృష్ణ!
న చ రాజ్యం సుఖాని చ
కింనో రాజ్యేన గోవింద!
కింభోగైర్జీవితేన వా.

విధి శాపంచే మహావీరుడైన కర్ణుడు యుద్ధ రంగంలో మరణించినప్పుడు మన హృదయాలు ఒక్కసారి దుఃఖంతో నిండిపోతాయి.

ఇదేవిధంగా హిందీ సాహిత్యంలో కూడా కరుణ రసం బాగా పోషింప బడింది. మహా కవులైన తులసీదాస్,సూరదాస్ ఈ రసాన్ని తమ కావ్యాల్లో అద్భుతంగా పోషించియున్నారు. సూరదాస్ గోపికలయొక్క విరహాన్ని వర్ణిస్తూ 'నిసిదిన బరసతనైన హమారే'అన్న పదాల్లో గోపికల యొక్క విరహవేదన పరాకాష్ఠ నొందింది. గోపికలు విరహంచేత బాధ నొందుతున్నప్పుడు పాఠకుల హృదయాలు సానుభూతితో, జాలితో నిండి పోతాయి. వీరేకాక ఆధునిక కవులు కూడా ఈ కరుణ రసానికి తగిన స్థానాన్ని యిచ్చారు. జయశంకర్ ప్రసాద్, మైథిలీశరణ్ గుప్త, శ్రీమతి మహాదేవి వర్మ కరుణ రసాన్ని అత్యద్భుతంగా పోషించారు. ఇతరుల దుఃఖం చూచి మన హృదయాంతరాళాల్లో అంకురించే భావమే కరుణ. ఇంకొకరి దుఃఖాన్ని చూచి మనం జాలిపడటం మన యొక్క హృదయ వైశాల్యాన్ని తెలుపుతుంది. తోటి వారి యొక్క కష్టాల్ని, సుఖాల్ని మనం పంచుకున్నప్పుడు మనం ఒక విధమైన ఆనందాన్ని అనుభవిస్తాం. ఈ రకమైన ఆనందం, సంతోషం వల్లనే సాంఘిక జీవనం చాలా విజయవంతం అవుతోంది. ఈ కరుణ రసం వల్లనే మానవుడు కొన్ని సమయాల్లో దేముడౌతాడు. ఈ కరుణ లోపించటంతోనే మరికొన్ని సమయాల్లో మానవుడు దానవుడౌతాడు.

మానవ జీవితం చీకటి వెలుగులు, కష్ట సుఖాలు మొదలైన ద్వంద్వ నిరుద్ధములైన భావముల యొక్క సమగ్ర స్వరూపము. మానవ జీవిత లక్ష్యం నిరంతరం బాధలతో కుమిలి కృశించటమే కాదు. ఒక వ్యక్తి జీవితంలో ఆ వ్యక్తిపై సుఖ దుఃఖాల ప్రభావం అమితంగా ఉంటుంది. ఎంతో మంది మహాకవులు, మానవులు జీవితంలో వివిధ పరిస్థితుల మధ్య ఏవిధంగా నలిగిపోతూ ఉంటారో, ఎన్ని బాధలకు లోనౌతూ ఉంటారో చక్కగా చిత్రించారు. వీరి లక్ష్యం వీటినన్నిటిని చక్కగా చెప్పి కేవలం పాఠకులు అశ్రువులు కార్చేటట్లు చూడడమే కాదు. ఎవరు ఏ రచన చేసినా విశ్వశ్రేయస్సును దృష్టిలో పెట్టుకునే చేస్తారు కాబట్టి కరుణ రసప్రధానములైన రచనలకు కూడా మిగతా అత్యుత్తమ గ్రంథములకువలె ఒక ఉన్నత స్థానం ఉన్నది.

చీకటి వెలుగులు

'అరవింద'

అసలు నేను జీవితంలో నీతిని గురించి ఇంత ఆలోచిస్తానని, ఇంత ఆలోచించవలసిన అవసరం నా జీవితంలోనే ఏర్పడుతుందని ఎప్పుడూ అనుకోలేదు నేను. నా పెళ్ళి అయ్యేవరకేకాదు, అయిన రెండేళ్ళదాకాకూడా అదే అభిప్రాయం. ఆ అభిప్రాయానికి అంతరాయం కలగలేదు.

నాకు బాగా గుర్తుంది ఆ రోజు. దానికిముందటి రోజే అన్నయ్య నాతో "పెళ్ళిచూపులకి వెళ్ళాలి" అన్నాడు.

అన్నయ్య అని ఊరుకున్నాడు. కానీ నాలో ఎన్ని ఆలోచనలు! ఇదే మొదటిసారి పెళ్ళి చూపులకు వెళ్ళటం. ఆ అమ్మాయి చాలా బాగుంటుందని విన్నాను.

"పెళ్ళిచూపులకు వెళ్ళాలి—"

వెడతాను. చూస్తాను. ఆ అమ్మాయి నచ్చుతుంది. మరి ఇద్దరికీ పెళ్ళయిపోతుందా? ఇంతవరకూ పరిచయమైనాలేని ఆ అమ్మాయి నాదైపోతుంది. నాకూ ఒక స్నేహం, తోడునీడా లభిస్తాయి. నా కలలకి అర్థం దొరుకుతుంది. నా కోరికలు నెరవేరుతాయి. నా జీవితంలోకి మాధుర్యం వస్తుంది. నా బ్రతుకు పరిమళం అద్దుకుంటుంది. ఆమె నాకు భార్య అవుతుంది.

భార్య!

ఆ మాటలో ఎంత నిండుతనం ఉంది!

ఎంతటి సుఖం అవనీ ఆపిడలేకుండా అనుభవించలేను.

ఎంత దుస్థితి రానీ ఆమె భుజం మీద చేయిచేసి అవలీలగా అధిగమిస్తాను.

సర్వకాలసర్వావస్థలలో ఆమె నా పక్కనే ఉండాలి. నేను ఉంటే ఆమెకు ఇంకేమీ అవసరం లేదు. నా సహచర్యంలో ఆమె తన జీవితార్థం పొందాలి. ఆమెకి నేను ఇవ్వనిది ఏమి ఉంటుంది! ఆమెకోసం, ఆమె తృప్తికోసం నేను చెయ్యనిది ఉండదు.

ఆమె పుట్టి ఇరవై సంవత్సరాలు, ఎక్కడో విడిగా పెరిగింది. నేను రేపు చూస్తాను ఆమెని. అప్పుడే ఆమె నాకు పరిచయమై పోతుంది. నాకు తెలుసు— ఆమె నాకు చిరపరిచితురాలై పోతుంది. ఆమె గురించి నాకు అంతా తెలుసు. ఇన్నినాళ్ళుగా ఆమె నా రాక కోసమే ఎదురు చూస్తోంది. రేపు! ఆమెని నేను చూస్తాను. ఆమె నన్ను గుర్తిస్తుంది. ఆ గుర్తించటం— కుర్చీలో కూర్చుని, ఓరగా తల ఒంచి, అవనత వదనయై ఉండగా పెదవులనుంచి జారివచ్చే చిరునవ్వులో నేను చూడగలను. ఆమె నన్ను గుర్తిస్తుంది.

ఆలోచనలతో నిద్ర పట్టలేదు ఆ రాత్రి.

నచ్చినవన్నీ మధుర భావనలే. నిద్ర వచ్చేవరకూ ఆలోచనలే.

మరునాడు ఉదయం బయలుదేరి నేను అన్నయ్యా వెళ్ళాం ఆ ఊరికి. ఆ రోజు మధ్యాహ్నం స్నేహితుల ఇంట్లో ఉండి, సాయంత్రం చూడటానికి వెళ్ళాం. ఆ పెద్ద హాలులో —అందరి మాటలు కానీ, గది అలంకరణ కానీ, అగరువత్తుల వాసనలు కానీ నన్ను ఈ లోకంలోకి తీసుకురావటంలేదు. నేను అనంతమైన నిరీక్షణని అనుభవిస్తున్నాను. అప్పుడు ఆమె వచ్చింది. కుర్చీలో కూర్చుంది. కూర్చుని నన్ను చూసింది. చూసి చూపులు మరల్చుకుంది. ఆమె అధరం కంపించింది —చిరునవ్వు ఒకటి పెదవుల కొసల మెరిసి మాయమైంది. ఆమె నుదుట చిరుచెమట పట్టింది.

వర్ణం తెలుపు—తెల్లని వదనం; కురులు, కనుబొమలు, కనీనికలు, బుగ్గ మీద పుట్టుమచ్చ దిద్దినట్లున్న నలుపు. ఆ అందం నన్ను విభ్రాంతుణ్ణి చేసింది. రాత్రి, పగలు కలిసి తమ అందాలు ఒలకబోస్తున్నాయామె వదనంలో. ముఖము అందానికి చంద్రబింబంలా మనోజ్ఞమే కాదు, ఆమెది సౌష్టవ

వంతమైన మూర్తి. నేను చూపులు మరల్చుకోలేక పోయాను. మరల్చుకుని నాలో నేను నిట్టూర్పు విడిచాను.

ఈమె నాది. ఈమెని నేను వహించాలి. ఆమె సౌందర్యం నా ఆరాధనలో, ఆమె కోరికలు నా లాలనలో—ఆమె జీవితాశయాలు నా ప్రోత్సాహంలో సార్థకం కావాలి. ఆమె తృప్తికి బాధ్యుడిని నేను!

ఈ బాధ్యత స్వీకరించటానికి నా మనసు సంతోషపడుతోంది. నా సర్వస్వం కుతూహలంతో ఆయత్తమవుతోంది. అవును, ఆ నయనాలలో ఎన్నడూ దుఃఖాశ్రువులు జేరరాదు. ఆమె మనసులో నా యెడల అనురాగదూరమైన భావం ఒకటీ కలుగరాదు. నాకు తెలుసు—నేను అందుకు సమర్థుడనని. ఇన్ని గుణాలు, అందం, అనురాగం సంతరించుకుని ఎదురుచూస్తున్న పురుషుడి నీడలో ఏ యువతి సుఖపడదు!

సంతోషంతో, తృప్తితో నా అంగీకారం తెలిపాను అన్నయ్యకి, ఇంటికి రాగానే. వదిన నవ్వింది. ఆ నవ్వులోని అనురాగం మనసుని తాకింది. తాకగా నాలో నిండి తొణికిన అనురాగం ఆమె దగ్గరకు ప్రవహించటానికి పరుగుపెట్టింది. ఆమె పేరు సుధ— నా జీవన సుధ.

2

అట్లాగ పరుగులు పెట్టింది నా హృదయం ఆ రోజులలో. అది ఆలపించింది సంగీతమో, మధుర మంజుల మురళీగానమో. ఏమి హృదయం! తాను కన్న కలలు రూపొందుతాయని భ్రమిస్తుంది. తాను ఊహించుకున్నదే నిజమౌతుందని నమ్ముతుంది. కానీ, ఆ విధంగా జరగని నాడు ఆ విఫల పరిణామం తట్టుకోలేక సంక్షోభం చెంది చెంది చితికి కన్నీరౌతుంది. కన్నీరు అంతమయ్యాక నిర్వేదం వహిస్తుంది. వైరాగ్యం సంతరించుకుంటుంది. అప్పటికే ద్వంద్వాలకు అతీతమైందని చెప్పలేము. అది దాని గుణంకాదనిపిస్తుంది. ద్వంద్వాలకు చలించటమే దాని స్వభావం. వీటికి అతీతమైంది మేధ ఒకటే. హృదయంచే పాలింపబడేవాడు కన్నీటి కాలువకు పన్నీటి నవ్వులకూ మధ్య ఊగుతూ తనకు తానే హాస్యాస్పదుడవుతూ వుంటాడు.

ఔను—నాకు నేనే హాస్యాస్పదుణ్ణిగా కనబడుతున్నాను.

ఈనాడు నాకు ఇల్లు లేదు, గమ్యం లేదు. శాంతిని వెతుక్కుంటూ అశాంతిలోకి— వయసుని మించిన వార్థక్యం వహించిన మనసుతో—ఆ రాత్రి పాడిన అనిర్వచనీయమూ, భావాతీతమూ అయిన రాగానికి దూరంగా ఎక్కడికో బయలుదేరాను నేను. అవిరామమైన సృష్టి సారథ్యం నుంచి ఒక క్షణం తొంగి చూసి దేవుడు నన్ను చూసి నవ్వుకుంటాడు.

నాకు నేనే హాస్యాస్పదుడినైన మానవుడిని నేను.

3

సుధతో పెళ్లి అయింది. అది మొదటి రాత్రి.

ఆ రాత్రి —

నేను ఆమె భుజం మీద చేయి వేశాను. సుధ కిటికీలో నుంచి, మబ్బుల మధ్య దాగుడుమూతలాడుతూ పరిగెత్తే పూర్ణచంద్రుణ్ణి చూస్తోంది. "సుధా" అన్నాను. ఆమె తన చూపులు మరల్చకుండానే "ఆ" అంది. ఆమె ముఖాన్ని నా వైపుకు తిప్పుకున్నాను.ఆ వదనంలో ఏమి సౌందర్యం నిక్షిప్తమై ఉంది! ఆమె వాల్చుకునిఉన్న కనురెప్పల మధ్య నీటిబిందువు ఒకటి మెరుస్తోంది.ఆ నాడు నీటి బిందువుకు కారణం గురించి నేను అనుమానించలేదు. నాకు ఆ నాడు ఆ సందేహం కలగలేదు. నీటిబిందువు! ఆ సుందర నయనాల మధ్య అందాన్ని అంది పుచ్చుకుంటోంది. నాటి అందాన్నే చూస్తున్నాను.

"ఔను, తనను అర్పించుకునే ఘడియ నిలువునా కదలిస్తుంది. అది సంతోషం, గాంభీర్యం, పారవశ్యం మిశ్రితమైన అనుభూతి. తన వాడికి తనను అర్పించుకునే తమకం—ఒక కన్నీటి బిందువు కదలదా— నా కీ అనురాగంతో, అనుభూతులతో కన్నులు ఆర్ద్రం అవుతుంటే..."

"సుధ నాది; ఈమె నాది. పుట్టుక వహించినది మొదలుగా నిరీక్షించి పరితపిస్తున్న రెండు ఆత్మలు ఈ వేళ సంయోగం చెందుతాయి."

సుధని గాఢంగా హత్తుకున్నాను. సుధ నా కౌగిలిలో ఒదిగిపోయింది.

ఆ కౌగిలిలో ఒక నిట్టూర్పు నలిగిపోయింది.

ఆ రాత్రి నాకు ఒకే ప్రశ్న రాలేదు—సుధకు నే నేమౌతాను! ఆమెకి నా యెడల ప్రేమ వున్నదా? నన్ను వాంఛిస్తున్నదా?—అని.

ఆమె నా కౌగిలిలో ఒదిగిపోయింది. పెళ్ళి అయిన పడతి. తెలిసి వివాహం చేసుకున్న యువతి. భర్తకు తనను అర్పించుకోక ఏం చేస్తుంది! నేనే ఆమె మనసును తెలుసుకోలేకపోయాను. అనుమానరహితమయింది నా మనసు. ఆనందపారవశ్యం ఆవహించింది నా హృదయం. నాకు తెలిసి ఉంటే! సుధ నన్ను ప్రేమించలేదని తెలిసి ఉంటే! నన్ను ప్రేమించకపోవటమే కాదు, ఇంకొకరిని ఇదివరకే, వివాహానికి పూర్వమే ప్రేమించిందని నాకు తెలిసి ఉంటే! నేను సుధని తాకేవాడినా! నా తనివి తీరని ముద్దులతో విసిగించే వాడినా? లాలసతో కూడిన చూపులతో వెంటాడే వాడినా? ఆమె మనసులోని సంఘర్షణని తలుచుకుంటే, ఆమె పరిస్థితిని ఊహిస్తే—

ఆమెపై జాలి కలుగుతోంది—నాపై నాకే అసహ్యం కలుగుతోంది. నాపై మనసు లేని ఆమెపై నా హద్దులేని ప్రేమ తలుచుకుంటే సిగ్గు వేస్తోంది.

మనసు లేని ఆమెను నా ప్రేమతో ఎంతగా బాధించానో! ఎట్లా సహించింది సుధ? స్త్రీకి అంత ఓర్పు ఎట్లాగ వచ్చింది?

అందం—స్త్రీ అందం విభ్రాంతిని కలిగిస్తుంది, సమ్మోహపరుస్తుంది. సుధకి సిగ్గు ఎక్కువ అనుకున్నాను. ఎదలో మేల్కొనే మధుర భావాలు ఆమెను మాటాడనీయకుండా చేస్తున్నాయనుకున్నాను. కనుఎత్తి నా కనులతో చూపు కలపటానికి మధుర లజ్జ, వలపుతలపు అడ్డుపడుతున్నాయనుకున్నాను.

అట్లాగే అనుకున్నాను రెండేళ్ళు. అట్లాగే అనుకోకపోతే, ఆమె అందమే, నాలోని అనురాగమే నన్ను గుడ్డివాడినిగా చేయకపోతే విముఖతని నేను రెండేళ్ళలో ఒకనాడైనా చూసి ఉండేవాడిని,

రెండేళ్ళ తరవాత! ఏమైంది ఆరోజు?

క్లబ్‌లో కలుసుకున్నాను రాజుని. అతను అక్కడికి ట్రాన్స్ఫర్ అయివచ్చి నెల అయిందిట. ఎసిస్టెంట్ఇంజనీర్ అతడు. చాలారోజుల తర్వాత కలుసుకున్నాం. సంతోషంగా టెన్నిస్ ఆడాం—తరవాత అలసట తీర్చుకుంటూ రాకెట్‌లు పడేసి లాన్‌లో కూర్చున్నాం.

“ఎక్కడ ఉంటున్నావ్?”

నా ప్రశ్నకి జవాబుచెప్పాడతడు.

“పిల్లలా? ఎంతమంది? శ్రీమతి క్వాలిఫికేషన్స్ ఏమిటి?” అడిగాను.

“ఆగాగు. అసలు శ్రీమతే లేనిదే మిగతావాటికి జవాబు ఎక్కడనుంచి తీసుకురాను!”

“ముఫ్ఫై ఏళ్ళు మీద పడుతున్నాయి. ఇంకా బ్రహ్మచర్యమేనా?”

“అదృష్టం కలిసి రావద్దూ.”

“కలిసివచ్చేది ఆ రాబోయే అమ్మాయికి. నీకేం తక్కువ?”

నిట్టూర్పు విడిచాడు రాజు. చెప్పటం ప్రారంభించాడు.

4

“ఏం తక్కువ! మనిషికి ఏమిటి తక్కువ? తను కోరినది మాత్రం దొరకక పోవటం ఒకటే తక్కువ. తనకు దొరకనిదే కోరిక.” రాజు ఒక అమ్మాయిని ప్రేమించాడుట. అతడి చెల్లెలి స్నేహితురాలు.

“తను మాచెల్లెలు ఉష కోసం వచ్చేది. ఎదగని మనసులు ఆకర్షణలో పడిపోయాయి. కలిసి సినిమాలకి వెళ్ళటం, గంటల తరబడి కబుర్లు చెప్పుకోవటం సన్నిహితంగా తెచ్చింది మా ఇద్దరినీ.”

“వాళ్ళ తల్లిదండ్రులు తను కేవలం ఉష కోసమే వస్తోందనుకునేవారు. ఒకరోజు అమ్మ, ఉష పేరంటానికి వెళ్ళారు. ఇంట్లో నేను ఒక్కడినేఉన్నాను. మబ్బులు వర్షించటం మొదలు పెట్టాయి. తడుస్తూ లోపలికి వచ్చింది సుధ.”

“సుధా?!” అన్నాను ఉలికిపడి.

రాజు చెప్పుకు పోతున్నాడు—

“ఆ. తనపేరు సుధ. నిజంగా ఆ అందానికి హృదయానికి తగిన పేరు. తను లోపలికి రావటం నేను కిటికీలోనుంచే చూశాను. ఎదురుగా వెళ్ళాను. నన్ను చూసి నవ్వింది. టవల్ అందించాను. తల, తుడుచుకుంటూ.—

“ఉష ఏదీ?”అడిగింది. చెప్పాను. కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడింది. చాలా ముభావంగా ఉంది.

“ఏం, అట్లా ఉన్నావ్? నన్ను చూస్తుంటే భయం వేస్తోందా?” అన్నాను. నావైపు చూసింది. నీకు తెలియదు ఆ కళ్ళలోని అందం, ఆకర్షణాను.

సన్నగా నవ్వి "ఔను. నా గుండెలు ఎంత వేగంగా కొట్టుకుంటున్నాయో చూడు" అంది.

ఆ క్షణంలో నేను పరవశించాను.

"నిజంగా చూడమంటావా?" అన్నాను సమీపించి.

కదలకుండా అట్లాగే నిలబడింది సుధ. తప్పించుకోవాలనే ప్రయత్నంకాని, భయంకానీ కనిపించలేదామెలో నాకు.

ఆమెను కౌగిలించుకుని గాఢంగా ముద్దు పెట్టుకున్నాను. ఆమె తడిసిన జుట్టు, మెరుస్తున్న కళ్ళు నాలో మత్తును నింపించాయి. నా చేతులలో ఇమిడి పోతూనే కనులుఅరమూస్తూ అంది

"ఏమిటిది రాజా —"

అప్పుడు నాకు అర్ధమయింది. సుధకి నన్ను ప్రతిఘటించాలని కూడా తెలియదు. తనకి కేవలం ఆకర్షణ తెలుసు అంతే. ఆమె వయసుకి తగిన ఆలోచనకానీ, స్త్రీపురుషులు, వివాహానికి సంబంధించిన జ్ఞానంకానీ లే దామెలో. తనను ఆకర్షించిన వాడికి తన సర్వస్వం అనాలోచితంగా అర్పించటమే తెలుసు. పదహారేళ్ల యువతి. తెలిసి ఉంటే, తన కులంకాని వాడిని, నా కౌగిలిలో ఇమిడి ఉండేదికాదు.ఏ మాత్రం భవిష్యత్తును గురించి ఆలోచించగల మనిషైనా, పెళ్లి అనేది మా ఇద్దరికీ జరగటం సంభవమా అనే సంశయం వచ్చినా నన్ను తప్పించుకుని ఉండేది. నన్ను నివారించి ఉండేది. సుధకి తెలిసింది ఒకటే — ప్రేమ. అది మోహమనటానికి అప్పుడు ఒప్పుకోరు యౌవనులు. ప్రేమ అనేది వరద వెల్లువలా ఉబికితే, ఆ ప్రవాహంలో తనే కొట్టుకుపోతోంది సుధ.

నాకు అన్నీ తెలుసు. నాకూ సుధకి వివాహం జరగదని తెలుసు. అయినా ఆ ఆకర్షణ నన్ను బంధించి వేసింది. ప్రేమానుభవంలోని లాలసను అణుచుకునే శక్తి నాకు లేకపోయింది. ప్రేమ భగ్నమయినా సరే, వివాహం కాకపోయినా, సరే — ఆ ప్రేమానుభవం నేను వదులుకోలేను. తనంతట తానుగా ప్రేమను అందించటానికి సిద్ధంగా ఉంది సుధ. ఆమె భవిష్యత్తుయొక్క శ్రేయస్సును ఆశించి నిగ్రహించుకోగల త్యాగం నాకు లేకపోయింది. లోబడిపోయాను ఆమె ఆకర్షణకి, నా బలహీనతకి.

సుధకి లేకపోయినా, నేను తప్పు చేశాను అని నాకు అనిపిస్తూ ఉండేది.

"మనం పెళ్లి చేసుకుందామా? మనవాళ్లు ఒప్పుకోవటం అసంభవమనుకో" అన్నాను ఒకసారి.

"పెళ్లి కాకపోతే ఏం? నేను ఇట్లాగే ఉండిపోతాను. నాకు పెళ్లి వద్దు" అంది.

ఈ నిర్ణయాలు గడ్డిపోచ మీద నీటిబిందువుల వంటివి. మనసులో ఉన్నంత వరకే అందంగా మెరుస్తుంటాయి. ఆచరణలో పెట్టవలసిన సమయం ఆసన్నమయేసరికి చిరుగాలికే రాలిపోతాయి.

సుధకి సంబంధాలు చూస్తున్నారని తెలిసింది. నన్ను తప్పించుకుని తిరగటం మొదలుపెట్టింది. తన బలహీనత తెలిసివచ్చిందేమో!

ఒకరోజు ఒంటరిగా చూసి

"ఏంచేద్దాం" అనడిగాను.

మాట్లాడలేదు.

"పోనీ ఎక్కడికైనా వెళ్లిపోదామా?"అన్నాను.

సుధ మొహం పాలిపోయింది. కళ్లలో నీళ్లు తిరిగాయి!

"నేను రాలేను. రాను. రాజా, నన్ను మరచిపో." అంది.

తరవాత నేను మెడ్రాస్ వెళ్లిపోయాను. తిరిగి సెలవల్లో వచ్చేటప్పటికి సుధ నాన్నగారికి ఆ ఊరు నుంచి ట్రాన్స్ఫర్ అయిందని తెలిసింది. ఉత్తరాలు రాసినా సుధ దగ్గర నుంచి జవాబులు రాలేదు. తరవాత సుధకి పెళ్లి అయిందని కూడా విన్నాను. ఏదో తెలియని వయసులో జరిగిపోయింది. మరిచిపోవాలనే నా ప్రయత్నం. అయినా తనని పొందలేకపోయినా, కనీసం ఆమెను గుర్తు తెచ్చేలాగ నా భార్య ఉండాలనే కోరిక నాలో అజ్ఞాతంగా ఉండి కాబోలు ఎంతమందిని చూసినా నా కంగీకారం కావటంలేదు. ఏం చెయ్యమంటావ్ చెప్పు.." అన్నాడు—చిన్ననవ్వు నవ్వుతూ.

5

"ఏం చెయ్యమంటావ్ చెప్పూ"అని రాజు నన్నే ప్రశ్నించాడు.

ఎన్నడూ లేనంత నిశితమయ్యాయి నా చెవులు. రాజు కంఠం ఆగిపోగానే నా చెవులలో నిండిపోయింది ఒకటే మాట.

సుధ! సుధ! సుధ! సుధ.

ఎవరీ సుధ! లోకంలో సుధలు ఎంతమంది లేరు? ఆ సుధే ఈ సుధ కావాలా? నా మనసు ఊరికే తొందరపడుతోంది. కానీ సుధా, వాళ్ళు ఆ ఊళ్ళో, రాజు స్వంత ఊళ్ళో ఇదివరకు ఉండేవారు. ఈ సంగతి తెలుసుకోవటం ఎట్లాగ? సుధ పెళ్ళి కాకముందు ప్రేమించిందా?

అసంభవం! లోకంలో అటువంటివి ఎక్కడో జరగవచ్చు. కానీ నా భార్య నన్ను కాక ఇంకొకరిని ప్రేమించిందా?

చాకులాగ కోస్తున్న ఆ ప్రశ్న నాలో తేరుకోలేని నీరసాన్ని కలిగిస్తోంది. వెంటనే తేల్చుకోవాలి. లేచి నుంచున్నాను.

''పద రాజా. మా ఇంటికి వెడదాం.''

''ఇంకొక రోజు వస్తాలే. ఇవేళ ఆలస్యం అవలేదూ'' అన్నాడు.

''అవలేదు.పద. మా ఇంట్లో కాఫీ త్రాగుదాం'' అన్నాను.

ఇల్లు చేరుకునేటప్పటికి హాలులో ట్యూబ్ లైటు వెలుగుతోంది. రేడియోలో నుంచి సన్నగా ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ వస్తోంది. సుధ లోపల ఉంది. మే మిద్దరం సోఫాల్లో కూర్చున్నాం. నా రాక గమనించి సుధ వస్తోంది.

''సుధా, ఇటురా. ఇతడు నా స్నేహితుడు—''

సుధ కర్టెన్ తొలగించి ఒక అడుగుముందుకు వేసింది. ఆమె ముఖంలోకే చూస్తూ అన్నాను నేను.

''రాజు. ఎసిస్టెంట్ ఇంజనీర్‌గా ఈ ఊరికి వచ్చాడు. ఇవేళే క్లబ్‌లో కలుసుకున్నాం. మేము చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం.''

సుధ కదలకుండా నిలబడిపోయింది. నేను ఇద్దరినీ గమనిస్తున్నాను. రాజు పెదవులు కదలతున్నాయి. నిశ్శబ్దంగా ఏమి ఉచ్చరిస్తున్నాయో!!

నాకు తెలిసింది.

''సుధ!'' అంటున్నాయి.

నాకు తెలిసిపోయింది.

ఆ సుధ, ఆ రాజు ఇప్పుడు ఇక్కడ కలుసుకున్నారు.

ఎందుకు వాళ్ళని కష్టపెట్టడం! అనవసరం.

''కూర్చో సుధా. పోనీ కాఫీ తీసుకురా.'' అన్నాను సుధ లోపలికి వెళ్ళటానికి అవకాశం ఇస్తూ.

''కూర్చో సుధా, పోనీ కాఫీ తీసుకురా''అన్నాను, వద్దనుకున్నా ఎన్నడూ లేని కటుత్వం నా కంఠంలో ప్రవేశించింది.

మాటలు లేకుండానే, తెలియకుండానే కాఫీ త్రాగటం పూర్తయింది.

రాజు వెళ్ళడానికి లేచాడు. గేటు దాకా వెళ్ళాను.

''నా భార్య పేరు కూడా సుధ'' అన్నాను, నవ్వుతూ.

నా నవ్వు నాకే వికృతం అనిపించింది. ఏదో ప్రతీకారం వాంఛించటం మొదలుపెట్టింది మనసు.

6

''ప్రేమించింది!''

''ఎవరినో ప్రేమించింది.''

''పెళ్ళికి ముందరే ఇంకొకరిని ప్రేమించింది.'

సూర్యుడు అస్తమిస్తున్నాడు. కాలవ గట్టున కూర్చున్నాను నేను.

నా ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ నేను ఒంటరిగా ఉన్నానని కూడా మరిచిపోతున్నాను నేను.

పెళ్ళికి ముందరే ఇంకొకరిని ప్రేమించింది. అయితే ఏం, కొంప మునిగిందా అని అడగవచ్చు. ఇంకెవరినైనా ఒదార్చటానికి నేనూ అంటాను.

లోకంలో ఆ విధంగా జరుగుతూనే ఉంటుంది. మానవ బలహీనత! సంకుచితత్వాన్ని వదిలి దాన్ని అర్థం చేసుకోవాలి అని నేనూ అంటాను.

కానీ అది నాభార్యే అయినప్పుడు నా మనసు సమాధానపడటంలేదు.

అట్లాగ ప్రేమించే హక్కు సుధకి లేదని నా మనసులో ఒక కంఠం కఠినంగా శాసిస్తోంది.

భారతీయ వివాహ వ్యవస్థ అత్యుత్తమమైనదని నమ్మినవాడిని నేను. వివాహం అనేది జీవిత సౌలభ్యం కోసం, అవసరాలు తీరటానికి ఏర్పడిన ముసుగుగా నేను ఎప్పుడూ ఊహించలేదు.

వివాహం జీవితాన్ని వ్యక్తిత్వాన్ని కూడా పునీతం చేస్తుంది. దేవత్వపు టంచులకి నడిపిస్తుంది మానవుణ్ణి. దేహాన్ని ఆశ్రయించుకుని ఉన్న హృదయం ఆత్మ పరిణతి చెందడానికి తగిన సాధనం వివాహం.

నిరీక్షించటం!—సమాగమం చెందటం —కలసి పయనించటం—

అనంత వియోగం పొందటం—తిరిగి కలయిక కకు తపస్సు చేయుటం

ఈ జీవితకావ్యంతో ఏ సుఖాలు సాటి రాగలవు!

తెలియదు కాబోలు.

ఇంతటి రసవిహీనమని ఊహించలేకపోయాను.

ఇంకొకరిని ప్రేమించిన యువతి— నన్ను ఎందుకు పెళ్లిచేసుకోవాలి!

ఆ అర్హత ఆమెకి లేదు. నన్ను బాధించగల హక్కు ఆమెకి లేదు.

అతడినే ఎందుకు పెళ్లి చేసుకోలేదు!

మనసు తనువు అర్పించడానికి గల స్వతంత్రం సాహసం పెళ్లికి లేకపోయాయా? అవును. ప్రేమ ఇద్దరికి సంబంధించినది. దానికి ఇద్దరి అంగీకారం చాలు. పెళ్లి సంఘానికి సంబంధించినది, కుటుంబానికి సంబంధించినది. అందరి అంగీకారం, ఆమోదం కావాలి. ఔను, ఆమె సంఘానికి వెరచి కులాంతర వివాహం చేసుకోలేక ఈ వివాహానికి అంగీకరించింది. నాభార్య అయింది. కాదు. ఈమె నాకేమీ కాదు.

నాకు భార్య లేదు.

పెళ్లి వరకూ మనసూ తనువూ నిలుపుకోలేని వారికి పెళ్లి ఎందుకు?

ఈ వివాహ వ్యవస్థలో నమ్మకంలేని వాళ్లు పెళ్లి ఎందుకు చేసుకోవటం!

ఆచరణయోగ్యంకానిదా ఈ సంప్రదాయం! ఆచరణయోగ్యంకానిధర్మాలు నిలబడలేవే. అందుకే బాల్యవివాహాలు చెప్పారా మనపూర్వులు.హిందూ వివాహ వ్యవస్థ ఇంత అస్థిరంగా సాగివస్తోందా?

నేను నమ్మను.

ఒక అల్పురాలు కారణంగా నేను ఈ వ్యవస్థలోని ఉదాత్తతని శంకించను. అందుకు నా మనసే సాక్షి.

ఆమె వ్యతిరేకురాలు అవటం, వాలాగ పెళ్లి విషయంలో పవిత్రభావం నిలుపుకోలేకపోవటం నా దురదృష్టం. పెళ్లికి ముందర ఇంకొకరిని ప్రేమించి తిరిగి హిందూధర్మానుసారం అగ్నిసాక్షిగా పెళ్లికి సిద్ధమవటం ఎంత హాస్యాస్పదం! ఆత్మ వంచన! ప్రేమించటం తప్పని ఎవరూ అనరు. ప్రేమించి పెళ్లి చేసుకోకపోవటం, ఇంకొకరిని పెళ్లి చేసుకోవటం తప్పు. సమర్థనీయంకాదు ఏ దృష్టితో చూసినా.

నేను పెళ్లి చేసుకున్నాను. ఈ వివాహ వ్యవస్థని నమ్మాను. త్రికరణశుద్ధిగా వివాహం కాబోయే వధువు కోసమే నాలోని సర్వాన్నీ నిరీక్షణలో ఉంచాను. అన్యధాచరించాలనే కోరిక ఏ నాడూ కలుగలేదు నాలో. మొదటినుంచి బలపడిన ఉద్దేశం అది నాలో.

నేను కోరిన ఆమెని నేను పెళ్లి చేసుకోవాలి. నా సర్వస్వం ఆమె కావాలి. ఆమెకి నేను కావాలి. ఈ విధంగానే ఆ వధువు ఉండాలని నేను కోరుకోవటంలో ఆశ్చర్యం ఏముంది!

7

వారంరోజులు సెలవు పెట్టాను కాలేజీకి. ఎవరికీ తెలియదు. నేను లేని వేళలో రాజు వస్తాడేమోనని. వాళ్లిద్దరూ తిరిగి కలుసుకోవటం నాకు తెలియాలి. తెలిస్తే ఏంచేస్తాను! సుధని చంపుతాను. రాజుని కూడా. మరి నేను! నేను కూడా. లేదా సన్యాసులలో కలిసిపోతాను. సుధ నాభార్య. పెళ్లికాక ముందరే తనను ఇంకొకరికి అర్పించుకున్నదా! నేను ఊహించలేను. నేను సహించలేను. ఇట్లా జరిగిందా? జరగకూడదు. అదే కనుక నిజమైతే—సుధ ఇంక ఉండకూడదు. నేను కూడా ఉండకూడదు.

వారం గడిచిపోయింది. రాజు రాలేదు. ఏమూలో చస్తున్నాడు!

ఆ ఆదివారం రాజు చెప్పిన గుర్తు ప్రకారం అతడి ఇంటికి వెళ్లాను.

చిన్న ఇల్లు.అందంగా బాగుంది. వంట, పని— చేసే నౌకరున్నాడు.

"ఈవారం నేను సెలవు పెట్టాను. రేపు జాయిన్ అవుతున్నా"నని చెప్పాను. కాఫీ త్రాగి, కబుర్లాడి వచ్చేశాను. ఇంకొక నాలుగురోజులు సెలవు పొడిగించాను.

ఇక తప్పదు రేపు వస్తాడు.

నేను ఉండని వేళలో.

స్నేహితుడి భార్యగా తన ప్రేయసిని ఇక్కడ చూడటం—

మాట్లాడకుండా, మనసు తెలుపుకోకుండా ఉండగలడా రాజు!

అసంభవం.

మా రోడ్ చివర దుకాణం ఉంది. కాచుకుని చూశాను. పొద్దున్న రాలేదు. మధ్యాహ్నం భోజనం చేసి మళ్ళీ అక్కడికి చేరాను. ఏమిటీ కావలా! ఎందుకీ హీనస్థితి. కాలేజీకి వెళ్ళిపోతే!

రెండవ చివరనుంచి రిక్షాలో ప్రవేసించి దూరంగానే దిగి, నడిచి ఇంట్లోకి వెళ్ళాడు రాజు.

నా గుండె ఆగిపోయింది.

కానీ నేను నడిచి ఇల్లు చేరుకున్నాను. హాలులో ఎవరూ లేరు. బెడ్ రూమ్‌లోంచి మాటలు వినిపిస్తున్నాయి.

"నిన్ను మరచి పోలేక పోయానుసుధా......"

సుధ అతడి చేతుల్లోంచి విడిపించుకుంటోంది.

"మీరు వెళ్ళిపొండి—వెళ్ళిపొండి. జరిగింది జరిగిపోయింది. ఇంకెప్పుడవు రావద్దు— రావద్దు— నాకు పెళ్ళయిపోయింది. నేను ఆ సుధనికాదు.'

ఎన్నాళ్ళబాధ!

సుధ గతాన్ని తలుచుకుని పశ్చాత్తాప పడుతోందా? ఇప్పటి స్థితికి బాధపడు—తోందా?

"నాతో మాట్లాడవా?"

"ఏముంది మాట్లాడటానికి. అసలు నువ్వెందుకు వచ్చావ్? అతడు లేకుండా! నేను బ్రతకాలని లేదా?"

"నిన్ను మరచిపోలేకపోయాను సుధా! రాకుండా ఎట్లా ఉండగలననుకున్నావ్. ఒక్కసారిమాట్లాడు చాలు........."

8

నిశ్శబ్దంలో సుధ కన్నీటి చప్పుడు వినిపించింది. నేను వచ్చేశాను.

నడచినడచి కాలవగట్టుకు చేరాను. అక్కడ బేస్తలపిల్లలు వలలు వేసి చేపలు పడుతున్నారు. సూర్యుడి కిరణాలుపడి ప్రవహించేనీరు తళతళా మెరిసిపోతోంది. ఇదంతా సృష్టి. ఎవరికీ కనిపించని, అర్థంకాని వాడిసృష్టి. నేనూ ఈ సృష్టిలో ఒక ప్రాణిని.



ఇట్లాజరుగుతుందా! జరగ కూడదు.కాని జరిగింది. కానీ నేను నమ్మలేను. నా కనుల యెదుట జరిగినదానినే నమ్మలేకుండా ఉన్నాను. నాకు మతి భ్రమించి ఉండవచ్చు. కాదు కాదు. ఏ విషయం గురించైనా అంతటి గాఢమైన అభిప్రాయం, నమ్మకం ఉంచుకోవటం తప్పు.

అది బాధకి దారితీస్తుంది.

అందుకే అది తప్పు.

ఈ ప్రపంచంలో ఎన్ని రకాల వ్యక్తులు! అందరూ మనలాగే ఉండాలని అనుకోవటం, ఉంటారని అనుకోవటం హాస్యాస్పదం. అజ్ఞానం. బాధాకరం. సరే.

ఇది నా ఆశలకీ ఆశయాలకీ గొడ్డలిపెట్టు. పవిత్రతకి నేను అంత విలువ ఇచ్చాను. దానికి నా జీవితంలోనే అర్థం లేకుండా పోయింది.

నేను వివాహం చేసుకున్న యువతి నన్ను ప్రేమించటంలేదు.

ఇంకొకడికి తనను అర్పించుకుంది.

ఇది నాజీవితాన్నే అపహసిస్తోంది.

ఏంప్రపంచం! నీవు నిలుపుకున్న విలువలు ప్రపంచంలో లోపించి నీవు అందుకోలేక పోతే ఈ ప్రపంచమే అర్థవిహీనమై పోతుంది. నీ ప్రపంచం పునాదులతో సహా కూలిపోతుంది. నీవు ఇంత ప్రపంచంలోనూ ఒంటరివాడవవుతావు. శోకమొక్కటే నీకు తోడవుతుంది.

ఇప్పుడు నా పరిస్థితి అదే.

అతిగా నా భార్యను గురించి ఊహించు కున్నందుకు, ఆమె పవిత్రతమీద అంత నమ్మకం ఉంచుకున్నందుకు, నన్నే సర్వస్వంగా భావిస్తుందని మురిసిపడినందుకు ఈ బాధ నేను అనుభవించకతప్పదు.

కానీ!

ఇట్లాఎందుకు జరగాలి! ప్రేమించటం తప్పుకాదు.

కానీ!

ప్రేమించిన వాడిని ఎందుకు పెళ్లిచేసుకో లేదు! — నన్ను, వివాహంలోపవిత్రతనినమ్మినవాడిని

భార్య తొలివలపు నాదే కావాలని

శాశ్వతంగా మేము ప్రేయసీ ప్రియులం కావాలని

కావ్యగానం జీవితంలో ఆలపించుకునే నన్ను ఎందుకు పెళ్లి చేసుకోవాలి?

విధా?

మనచేతకాని తనానికి, బలహీనతకి విధి అని పేరుపెట్టడం అన్యాయం. తన విధిని తెలుసుకోలేని బలహీనురాలు సుధ. మానవస్వభావం, బలహీనతల్ని అర్థంచేసుకోలేని మూఢనమ్మకాలతో, నిశ్చయాలతో— బలహీనుడిని నేను. బలహీనులు బాధపడక తప్పదు.

బలహీనత!

ఆమె బలహీనత కారణంగా నా జీవితం అర్థహీన మయింది.

మధువు నింపుతుందనుకున్న పాత్ర ఉప్పు నీటితో నిండింది.

నా కన్నీటితోనే నిండుతోంది.

బలహీనులైతే శిక్ష పొందవలసిందే.

ఇక సుధని నే నెట్లాగ ప్రేమించ గలను!లేదు. ఆమెను నేను ప్రేమించ లేను. ఎప్పటికీ ప్రేమించ లేను. ఒకనాడు జీవితాశయ మనుకున్నది నేడు హాస్యాస్పదంగా మారింది—నా ప్రేమ.

ఎప్పుడో ఈ సత్యం బయటపడుతుంది.

నా కన్నులయెదుటే ఈ అపరాధం బయట పెట్టాలి.

అప్పుడు సుధ ఏ మనగలదు. తల వంచు కుంటుంది సిగ్గుతో. కన్నీటితో కాళ్లమీద పడి ప్రార్థిస్తుంది.

నేను ఏమీ అనను. ఏమనటానికీ నాకు అర్హతలేదు.

అర్హత ఉన్నవాడు భగవంతుడు ఒక్కడే.

కానీ నేను క్షమించలేను. ఆరనిమంట నా యెదలో రగులు తుండగా నేను సుధను క్షమించ లేను. ఆమెని నా భార్యగా చూసుకోలేను.

ఆనాడు—

ఆమె తప్పిదం దానంతటది బయిట పడిన నాడు, ఆమె సిగ్గుతో తల ఒంచుకునే ఆ కన్నీటితో క్షమార్పణ వేడినప్పుడు—

బహుశః అదే ఆమెకు తగిన శిక్ష—

నేను మౌనంగా బయటకు నడుస్తాను.

ఆ ఇంటి బయిటకు నడుస్తాను.

ఆ ఇంటితో,ఆవ్యక్తితో సంబంధంలేని బయిటి ప్రపంచంలోకి నడుస్తాను.

శాంతిలేని అశాంతిలోకి నడుస్తాను.

9

''నువ్వువచ్చినప్పుడంతా నామనస్సులో తుఫాను రేగుతుంది. వద్దురాజా— నువ్వు రావద్దు. నన్ను చూడటానికైనా రావద్దు. నాలో సంఘర్షణ నీకు తెలియదు. నువ్వు ఊహించలేవు. వెళ్ళిపో—ఈ ఊరువిడిచి వెళ్ళిపో......''

సుధ మాటలు కరుకుగా, నిరసనగా ఉన్నాయి కానీ—ఆ మాటలు సుధ అతడి భుజం మీద తల ఆన్చి చెబుతోంది.

''వెళ్ళిపోతాను సుధా—ఈ లోపుగా ఇంకొక నాలుగు సార్లు నిన్ను చూడనీ. అంతకంటే ఎక్కువ అడిగేస్థితిలో లేను నేను. ఇచ్చేస్థితిలో లేవు నువ్వు.''

సుధ నవ్వింది.

''మరి ఈ రావటం—ఈ ఆవేదనని రేపటం ఎందుకు చెప్పు?

''ఈవూళ్ళో ఉండి నిన్ను చూడకుండా వుండ లేను సుధా. నీకు నేను తెలుసని అతడికి చెప్తే ఏం?''

సుధ అతడిని విడిచి దూరంగా వెళ్ళింది.

''వద్దు. నీకుతెలియదు అతడి సంగతి. అతను సహించలేడు. సహించలేడు.''

''అదికాదు. కేవలం స్నేహితుడుగా తెలిస్తే ఏం?''

''నేను అబద్ధం ఆడలేను రాజా.''

నేను వచ్చేశాను.

''అతడు సహించలేడు—సహించలేడు.''

10

నేను వచ్చేశాను.

నేను సహించలేను.

కాలేజీ పుస్తకాలు బల్లమీద పడేశాను కోటువిప్పి పారేశాను. బూట్స్‌వదిలి చెప్పులు తొడుక్కున్నాను. రాకెట్ తీసుకున్నాను. వచ్చేశాను. నేను వచ్చినట్లు వాళ్ళనిచూసినట్లు చెప్పటానికి చాలిన సాక్ష్యం వదిలి వచ్చేశాను.

సుధకి నేను వచ్చానని తెలుస్తుంది.

నేను వచ్చేశాను.

పిల్లలు వలలు వేసి కాలువలో చేపలు పడుతున్నారు. సూర్యుడి ఎండకి నీరు తళతళా మెరుస్తోంది.

ప్రేమ!

నాహృదయాన్ని, నన్ను నిలువునా ఆనహించి నన్ను ఆనందంలో ముంచెత్తిన ప్రేమ ఏమయి పోయింది.! సుధ రాజును ప్రేమించిందని తెలియగానే ఏమైపోయింది. అంతా భ్రమ. ఈ ద్వేషం అసహ్యం నాలో ఎక్కడ నుంచి వచ్చాయి! అసలు నాలో వాటి ఉనికిని, నీడని కూడా ఎప్పుడూ, చూడలేదే. ఏ మూల అణిగిఉన్నాయి? నాకు తెలియకుండానే ఇప్పుడు కొంచెం సందుగుండా ప్రవేశించి గది అంతా ఆక్రమించేపొగలాగ నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రేమకూడా ఏ మూలనో అణిగిఉందా? మాయమైందా? సుధని మాత్రం నేను తిరిగి ప్రేమించ గలగటం అసంభవం. సుధని నేను చంపలేను. నేను క్షమించలేను కూడా. సుధ ఏడుస్తుంది. క్షమించ మంటుంది. ఏమిటి చెయ్యడం! పెళ్ళిచేసుకున్నంత మాత్రాన భార్యకాదు నాదృష్టిలో. మనసిచ్చినవాడికే భార్య.

కానీ—

''రాజా, సుధ నీభార్య. నువ్వుతీసుకో''అంటే—

ఎంత హాస్యాస్పదం—ప్రపంచం దృష్టిలో.

అది సుధ నిర్ణయించుకోవాలి. నేనే వెళ్ళిపోతాను. ఎక్కడికో—శాంతిలేని అశాంతిలోకి.

నేను ఇంటికి వెళ్ళేటప్పటికిని సుధ ఏం చేస్తుంటుంది.!

ఏడుస్తూ ఉంటుంది. కన్నీళ్లతో నన్ను ప్రార్థిస్తుంది. క్షమించ మంటుంది. ఏడుస్తున్న సుధని నేను తిరస్కరించగలనా?

ఏమైనా నానిశ్చయం మారకూడదు. నేను సుధని క్షమించకూడదు.

అందమైన కళ్లలో నీళ్ళకి నా మమకారానికి పాత్రమయిన వ్యక్తియొక్కపాశ్చాత్తాపానికి, నానిశ్చయం సడలి నేను ఆమెని క్షమించితే—ఆ క్షణికోద్రేకంలో క్షమిస్తే—ఆమెని ఊరడిస్తే—

నన్ను నేను క్షమించుకోలేను. ఆమెకాదు అపవిత్రురాలు, నేను. బలహీనుడిని నేను!

బలహీనతని నే నేనాడూ హర్షించలేదు.

హర్షించలేను!

11

నేను ఇల్లుజేరి లోపల ప్రవేశించినప్పుడు సుధ నాకు కనిపించలేదు.

డ్రెస్సింగ్ టేబుల్‌మీద కనిపించింది సుధ వ్రాసిన లేఖ.

"మీకు తెలిసింది. ఏనాడో ఒకనాడు మీకు తెలుస్తుంది. అది నాకు తెలుసు. తెలిసిపోయింది—

తెలుస్తుంది అని ఇన్నాళ్ళూ బాధతో గడిపాను!

బాధ ఎందుకని ప్రశ్నించవచ్చు.

తప్పుచేశానని. తప్పని తెలిసి ఎందుకు చెయ్యటం? అని మీరు తీవ్రంగా ప్రశ్నిస్తారు.

ఒకనాటి మనఃస్థితిలో తప్పుగా కాక, జీవితానికే అర్థంగా ఊహించుకున్న, అజ్ఞానం,అమాయకత్వం, అపరిపక్వతతో ఏకమైన పరిస్థితి అది.

అది దురదృష్టవంతులకు, బలహీనులకు కాలం గడవటంలో అనుకూలంగా కాక ప్రతికూలమౌతుంది.

అప్పుడు జరిగినది తప్పని తెలుస్తుంది.

కొంతమందికి ముందర త్రోవకూడా మూసుకుపోతుంది.

ఇన్నాళ్ళూ బాధతో గడిపాను. సమస్యతో వేగి పోయింది నా మనస్సు. దీనికి కారణం నా బలహీనతే కావచ్చు. దృఢమైన అభిప్రాయానికి రాలేక పోవటం నా బలహీనతే. ఆ కారణంగా ఇద్దరి మధ్య నిలబడటం నన్ను దహించింది.

ఇన్నాళ్ళసహచర్యంలో మీ భావాలను, మిమ్మల్ని నేనూ కొంత గ్రహించగలిగాను. ఆ తీవ్రతకి నేను తట్టుకోలేను. మీకు అంతకంటె దగ్గర కాలేక పోయాను—

కానీ

మీకు నాపరిస్థితి తెలిసిన నాడు ఒక మలుపు వస్తుందను కున్నాను.

మలుపు వచ్చింది.

కానీ

నేను అనుకున్న విధంగాకాదు.

మీరు వచ్చారు.

చూశారు.

మీకు తెలిసింది.

ఇదివరకే తెలుసునేమోకూడా.

ఔను, మీకు ఇంతకు ముందరే తెలుసు.

కానీ—

మీకు నామీద కోపం రాలేదు. నన్నేమీ అడగలేదు. అంత నిశ్చలంగా ప్రవరర్తించటం ఎట్లాగ సాధ్యం! నా కర్థమైంది. నేను మీకు ఏమీ కాలేక పోయాను. మీ భార్యని కాలేక పోయాను.

భర్త— భార్య తప్పుచేస్తుంటే చూసి, తెలిసి ఊరుకోగలడా! అడిగే హక్కు, ఆ మార్గం నుంచి మళ్ళించే హక్కు అతడికి ఉంది.

అది అతడి విధి!

మీకు తెలిసి వూరుకున్నారు. మీ ప్రేమ— మీ ఆశయం—వాటి లోతులు ఏమిటి?

మీకు నామీద ఏం మిగిలిందో కూడా నాకు తెలియదు. అసలు మిగలవలసింది ఏమీలేదు. మిగలనందుకే నేను సంతోషించాలి. కారణం నేనే. నాకు ఈ ఇంట్లో స్థానం లేదు. ఎప్పటికైనా గతాన్ని కడుగుకో గలిగితే—భర్తగా మిమ్మల్ని నిలుపుకో గలిగితే— నేను వస్తాను, మీదగ్గరికే

—సుధ.

12

ఏమైంది! ఏమి జరిగింది! సుధ ఇల్లు వదలి నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయింది. తనే వెళ్ళిపోయింది. నేను మాత్రం ఇక్కడే ఉన్నాను. మనిషిని విధి పరిహసించటం అంటే ఇదేనా!

చూసి చూడనట్లు, తెలిసి కోపపడనట్లు క్షమాశీలిగా, శాంతస్వభావుడిగా ఉంటే సుధ నా ఔదార్యానికి కరిగి, తన తప్పుకు పశ్చాత్తాపపడి, నాకాళ్ళమీద పడి కన్నీటితో ప్రార్థిస్తుందను కున్నాను. క్షమను అర్థిస్తుందనుకున్నాను.

క్షమించకూడదని, క్షమిస్తానేమోనని భయ పడ్డాను.

కాని

సుధ— తెలిసి నేను సహించటం, ఆమె తప్పును క్షమించటం తను సహించలేకపోయింది.

ఆమె నాకు భార్య కాలేకపోయింది.

నేను ఆమెకు భర్తను కాలేకపోయాను.

ఇంతమంది—సముద్రతీరంలో ఇసుకరేణువుల్లా అనంతాకాశంలో లెక్కకు మించిన చుక్కల్లా తారసపడే ఈ లోకంలో, ఈ ఇద్దరికీ ముడి వేసి ఒకచిత్రమైన జంటను చేశాడు విధాత!

క్షమించలేనివారికి శాంతి లేదు ఈలోకంలో.

స్థిరత్వానికి చోటులేదు ఈలోకంలో.

నాకు శాంతి లేదు.

నా నమ్మకాలకు చోటులేదు.

13

సుధ ఒక శాంతి ఆశ్రమంలో జేరినట్లు తెలిసింది. రాజు ఆ వూరునుంచి వెళ్ళిపోయాడు. సుధ వెళ్లి పోయిన సంగతి అతడికి తెలుసునో తెలియదో కూడా నాకు తెలియదు.

సుధ వెళ్లిపోయింది. ఆమెకు నాహృదయంలో స్థానం లేకపోవచ్చు. కానీ ఆమె బాధ్యత నాది. ఆమె మెడలో తాళి గట్టిన భర్తని నేను. మనిషి రెండుగా బ్రతుకుతున్నాడు ఈ ప్రపంచంలో. సంఘంలో మనిషి—తనలో మనిషి. తనలో మనిషే సంఘంలో మనిషిగా ఏనాడైనా ఈ భూమిమీద మనగలుగుతాడా మానవుడు!

పెళ్లి చేసుకున్ననాడే సుధ బాధ్యతనాది అయింది.

సుధ వెళ్ళిన పదిహేను రోజులకు సుధ అన్న వచ్చాడు.

"సుధ శాంతి ఆశ్రమంలో జేరింది, కారణం చెప్పండి బావగారూ? మేము ఎంత అడిగినా చెప్పలేదు. తెలుసుకోవలసిన బాధ్యత మాకు ఉంది కదా" అన్నాడు.

"రెండేళ్లు అయినా మాకు పిల్లలు లేరని సుధకి అశాంతిగాఉంది ప్రసాద్' అన్నాను శూన్యమైన నవ్వుతో.

నిజమా! కావచ్చు. సుధ ఆశ్రమంలో చిన్న పిల్లల సంరక్షణ చూస్తోంది.

"కానీ రెండేళ్లకే అంతనిరాశా. నిరీక్షించనక్కర లేదా" అన్నాడు.

ఒక్కొక్క వేళలో వూరికే అన్నమాటలు అట్లాఅతికిపోతాయి.

నిరీక్షణ ఎట్లా ఉన్నా, ఇదమిద్ధమని తేలకనో, ఇటూ—అటూ నిర్ణయించేసుకోలేక కొంతమంది జీవితాలు కూడా ముగిసిపోతాయి.

నాజీవితంలో శాంతి లేదు. బాధ్యత లేదు.

సుధని ఒకసారి చూసివద్దామనే నిర్ణయానికి రావడానికి ఏడాది పట్టింది.

14

ఆశ్రమానికి వెళ్లాను. సుధ మారలేదు. ఆమె అందం తరగ లేదు.

దూరాలకిచూసేచూపులు, ఏదో వెతుక్కునే కళ్ళు—

ఆశ్రమ ప్రశాంతతలో అందపుచాయలు సుధని అలముకునే ఉన్నాయి. నన్ను చూసి సుధ కళ్లు వాల్చుకోలేదు. మొహం తిప్పుకోలేదు.

"నిన్ను చూద్దామని వచ్చాను" అంటే—

"బాగానే ఉన్నాను" అంది.

"కానీ నీబాధ్యత నాది. అక్కడికిరా. ఇంటికిరా, సుధా. అక్కడే ఉందువుగాని. నిన్ను నేను బాధించను. నీకు స్వతంత్రం ఉంటుంది."

"కానీ ఇక్కడ అనాధలాగ ఉండటానికి నేను ఒప్పుకో లేను."

"నేను ఉన్నాను కదా. నీబాధ్యతనాది."

సుధ నవ్వింది.

"వస్తాను. ఇప్పుడు కాదు. ఇంకా కొన్నాళ్ళు ఇక్కడే ఉంటాను" అంది.

15

నాప్రేమ, నాద్వేషం, ప్రతీకారం ఏమైపోయాయి.? ఇప్పుడు బాధ్యత ఒకటే మిగిలింది. సుధ నా బాధ్యత. అందుకే రమ్మని కోరాను. సుధ నిరాకరించింది. అయినా జీవితాంతం ఆమె బాధ్యత నాది. ఆమెని రమ్మని అడుగుతూనే ఉన్నాను. సుధ అంగీకరించి వచ్చేటప్పటికి నాలుగేళ్లు గడిచాయి.

సుధ రూపంతో మారలేదు. ఆమె మనస్సు లోని మథనం, ఆలోచనలలో నిగ్రహం ఆమె మూర్తికి ఒక విశిష్టత నాపాదించాయి.

నిర్మలంగా, నిరాడంబరంగా ఉండే సుధలో యోగిని వర్చస్సు ఉంది.

పాతికేళ్ళకే సుధ ప్రేమకీ, సుఖాలకూ విరక్తురాలయింది.

వయస్సులో అనుభవాలు పొందకుండానే ఆలోచనలతో విరక్తి పొందిన ఆమె ఆత్మ ఏ తపన చెందుతోందో! ఈ ఘర్షణాత్మకమైన ఆమె స్థితికి కారణం నేనా! నావలన సుధ జీవిత సౌఖ్యం, మాధుర్యం కోల్పోయిందా? నేను క్షమించి ఉంటే సుధ సుఖపడేదా?

సుఖాపేక్ష ఉన్న వ్యక్తి ఆశ్రమంలోనూ నిరాడంబరంగానూ ఉండలేదు. సుధ సామాన్యాతీత వ్యక్తి. ఆ వ్యక్తిని నాదిగా నేను పొందలేకపోవటం, నా దురదృష్టం. శాపం. మనిషి వస్తువు కాదు. నీవు కోరినంత మాత్రాన నీది కాదు. ఆమెకూడా నిన్ను కోరినప్పుడే నీది అవుతుంది.

సుధ విషాద లాలసతో ఈ విధంగా ఆలోచిస్తున్నానా?

సుధమీద వ్యామోహం సుధలో దోషాన్ని కప్పిపుచ్చుతోందా?

ఏది నిజం! నిజం ఏదైనా, కర్తవ్యం ఎంత కఠినమైనదైనా కర్తవ్యాన్నే నిర్వర్తించటానికి సిద్ధంగా ఉన్నాను.

కానీ,

ఏదికర్తవ్యం!

మాయు, మంచి తెలియని మూఢుడినేనా నేను?

సుధ అంగీకరించింది. మంచిదే. సుధబాధ్యతే నాకర్తవ్యం. ఇప్పటికైనా నా కర్తవ్యాన్ని నిర్ణయించుకోగలగటం సంతోషకరమే.

సుధ నా కనులయెదుట తిరుగుతుంటే, నవ్వుతుంటే, నేనామెని తిరిగి వాంఛిస్తానా? అసంభవం. నా మనసులో వాంఛలేదు. ప్రేమలేదు. అంత అదృష్టానికి, అనురాగానుభవానికి నేను నోచుకోలేదు. నాకు తెలుసు— నేను సుధని వాంఛించి అక్రమంగా ప్రవర్తిస్తే— సుధ నా భార్య అయినా— నా పరితాపానికి, ఆవేదనకి అంతు ఉండదు. సుధని నేను కోరను. కోరలేను. సుధని చూడవలసిన బాధ్యత నాది. సంఘంలో వ్యక్తిగా అమెని భరించవలసిన వాడిని నేను. సుధని జీవితాంతం నేను పోషిస్తాను. రక్షణ ఇస్తాను.

సుధ ఇంటికి వచ్చింది. కాని మా మధ్య అనుబంధంలేదు.

అసలు ఈ ప్రపంచం—

రాత్రి నుంచి పగలులోకి, పగటినుంచి రాత్రిలోకి,

చెడునుంచి మంచికి, మంచి నుంచి చెడుకి,

నియమంలోంచి విశృంఖలత్వంలోకి, విశృంఖలత్వంలోంచి నియమంలోకి,

ప్రేమనుంచి ద్వేషానికి, ద్వేషంనుంచి ప్రేమకి,

రాగం నుంచి వైరాగ్యంలోకి, వైరాగ్యంనుండి రాగంలోకి,

జ్ఞానంలోనుంచి అజ్ఞానంలోకి, అజ్ఞానంలో నుండి జ్ఞానంలోకి,

అవిరామంగా ప్రవహించే నిరంతర స్రవంతి.

ఒక జీవితానికి, మనిషికి నిర్ణయించగల హద్దులు ఏవి? ఎక్కడ?

సుధని నా బాధ్యతా నిర్వహణ కోసం రమ్మన్నాను.

ఆ నాడు సుధని గురించి అంతకంటె ఆలోచన లేదు నాకు.

లోకంతో సంబంధంలేకుండా ఎట్లా జీవిస్తోంది సుధ!

ఆమెకు నా పరిచర్యలలో పరిపూర్ణానందం లభిస్తోందా?

ఆమె మనసు కోరికల నుంచి విముక్తి పొందిందా?

ఆమె హృదయం అంత పరిపక్వత చెందిందా?

పనిలేని వేళ చల్లగాలిలో ఆకాశంలోకి చూస్తూ కూర్చునే సుధ నాలో జాలి కలిగించింది. చాంచల్యం లేని ఆమె కనులలో వెలుగు నాలో వెరగు కొల్పింది. మౌనంలోనే రోజంతా గడిపి, ఏకాంతంగా దుఃఖం లేకుండా మసలే ఆమె యోగినిలాగ కని

పించింది. సుధ మామూలు స్త్రీ కాదు; యోగిని. ఆ యోగిని నన్ను తన అసమానమైన ఆకర్షణా సౌందర్యంతో తనవైపు లాక్కుంటోంది. ఔను, నాకు తెలిసింది. నేను ఆకృష్టుడ నయ్యాను. చలించింది నేను కాదు. నన్ను ఆవరించుకుని ఉన్న సర్వప్రకృతి చైతన్యం—అదే కాబోలు ఆత్మ.

16

ఎవరీ సుధ! ఎక్కడనుండి వచ్చింది!

ఆ రోజు నేను వరండాలో కూర్చున్నాను. సుధ పక్కనేఉన్న గదిలో తన పక్కమీద కూర్చుని ఉంది. కిటికీలోనుంచి వెలుతురు ఆ గదిలోని చీకటిలోకి ప్రసరిస్తోంది. ఆ చీకటి వెలుగుల్లో సుధ ఉంది. ఆమె నల్లని కనులలో వెలుగు ఉంది. మళ్ళీ మళ్ళీ నాలో ఆ ప్రశ్న కలుగుతోంది—

ఎవరీ సుధ! ఎక్కడనుంచి వచ్చింది!

వరండాలో పూర్తిగా వెన్నెల ఉంది. ఆ వెన్నెలలో కూర్చుని ఉన్నాను, నేను.

ఇన్నాళ్ళూ, ఇంతవరకూ నిర్వికార చిత్తుడిని నేను.

సుధ దృష్టిలో కూడా నిర్వికారచిత్తుడిని నేను.

నాలోని ఈ సంచలనాన్ని సుధ తెలుసుకో గలదా? ఊహించగలదా?

నన్ను నిలువునా కదలిస్తున్న తన ఆకర్షణ సుధకు తెలుసా?

చీకటిలో కూర్చుని వెలుగు నింపుకుంటున్న ఆమె మూర్తి వెలుగులో కూర్చున్న నన్ను తనవైపు బలంగా లాక్కుంటోంది.

అది ఒక రాత్రి.

ఆ రాత్రి!

సర్వగుణాలకూ అతీతమైన రాత్రి, చేతనా ప్రపంచాన్ని నిర్వికారమైన నిద్రతో తనలో లీనం చేసుకునే రాత్రి. జీవుడు—ప్రపంచాన్ని అధిగమించి తన తత్త్వంతో కొంత సేపటి కోసం కలిసిపోయే రాత్రి.

ఆ రాత్రిలో నన్నుబలంగాఆకర్షిస్తోంది సుధ. అన్నిటినీ త్యజించి సర్వగుణాలకు అతీతంగా—

ఐక్యమైపోవాలనే గాఢమైన తమి ఇదివరకు ఎప్పుడూ, నాకు తెలియదు.

ఇది నా జీవితంలో అపూర్వమయిన క్షణం.

లోకాతీతమైన ఆనందం నా కందుబాటులో నిలిచిందన్న తలంపు,

సమయం దాటిపోతే అవకాశం చేయి జారి పోతుందన్న తత్తర,

నేను శాంతిని పొందగల సంఘటన ఇదేనన్న భావనా,

నన్ను ఆవహించాయి.

ఈ రాత్రిలో ఇతర ప్రపంచం లేదు. మంచి—చెడు లేవు. పవిత్రత—అపవిత్రత లేవు. అన్నింటిని రాత్రి నిద్రతో ఆక్రమించింది.

మిగిలింది నేనూ—సుధా.

ఈలోకమంతా నా మనసులో మాయంకాగా

మిగిలింది నేనూ—సుధా.

సుధని నేను క్షమించాను.

నేను సమీపించేటప్పటికి కూడా సుధ అట్లాగే కూర్చుని ఉంది. వెలుగు ఆమె మీద పడుతోంది. గదిలో అడుగుపెట్టిన నావైపు చూసింది సుధ.

ఆమె కనులలో నిశ్చలమైన వెలుగు—

ఆ వెలుగులో కలిసిపోటానికి నా సర్వస్వం తపిస్తోంది. ఆమెకి నాకూ మధ్య మౌనం తెరలాగున వుంది. తెరల చాటున సుధని సమీపించలేను నేను. మౌనం వదిలి, చివరికి—

''నేను నిన్ను చాలా క్షోభ పెట్టాను. భర్త ఉండికూడా ఆశ్రమంలో గడిపావు'' అన్నాను.

సుధ నవ్వింది.

''దానికి కారణం మీరు కాదు. నేనే'' అంది.

''నన్ను నిందిస్తున్నావా?'' అన్నాను.

సుధ నిట్టూర్చింది.

''ఎందుకు? లేదు. సాంఘిక నిబంధనల్ని వ్యక్తి పాటించాలి. లేదా ఇతరులతో సంబంధం తెంచు కోవాలి. వ్యక్తిగత ఆశయాల్ని సంఘంద్వారా సాధించ టానికి పూనుకోకుండా తన జీవితంలోనే పొందాలని తొందరపడే హక్కు వ్యక్తికి లేదు. తెలియక చేసినా పెళ్ళి చేసుకుని మీ జీవితాన్ని అర్థవిహీనం చేశాను. కానీ ఇప్పుడు—నాకు కోరికలు లేవు. సమస్యలు లేవు.

గతము లేదు. నాకు మిగిలింది మీరే. మీ సంతోషమే నాకు సంతోషం. మీ శాంతి—నాకు శాంతి''

''కానీ నీకు నాలోని సంచలనం తెలియదు. విరక్తి, శాంతి, నిండిన నువ్వు నన్ను నీవైపు లాక్కున్నావు. నీ చూపులలో వెలుగులు నన్ను బంధిస్తున్నాయి. నవ్వుతావా సుధా! నాలో అశాంతి నిండిపోయింది. నా శాంతి నీలోనే ఉంది. ఆ శాంతిని నేను పొందాలి. నీతో ఐక్యం అయిపోవాలనే కోరిక నాలో వివశంగా ఉంది. నా మనసు నన్ను పరిహసిస్తోంది. నీవు కూడా నవ్వుతావా?''

సుధ నవ్వింది. తల వొంచి—

''నేను నవ్వను. మీరు కోరితే నేను మీదాన్ని, మీ భార్యను'' అంది.

ఆమె భుజాల మీద వ్రాలిన నా చేతులు ఆమెను నాలో ఐక్యం చేశాయి. ఆ రాత్రి! తమకం తప్ప నేను ఇంకేమీ ఎరగను. ఈ మనసుకు, దేహానికూ అతీతమైన ఆనందం ఒకటి అనుభవనీయమైంది నాకు. అది నేను ఇదివరకు అనుభవించి ఉండలేదు. ఆ అద్వైతంలో నా ఆత్మ నన్ను విడిచి ఏమైందో నాకు తెలియదు. నా జీవితం అంతటితో, ఆ రాత్రితో ముగిసి ఉంటే....

17

ఆ రాత్రితో,నా జీవితం ముగియలేదు.నా జీవిత పరిభ్రమణం ఇంకా పూర్తికాలేదు.ఆ తర్వాత—తెలతెల వారుతుంటే నా కనులు విచ్చుకున్నాయి. ముడివీడిన కురుల మధ్య ప్రశాంతంగా నిద్రపోతోంది సుధ. సుధ! నా జీవన సుధ—కాదు, సుధ నాది కాదు. సుధ ఎవరిదీ కాదు.

తనను తాను జయించిన వ్యక్తి.

నేను ఏంచేశాను? రాత్రి, ఆ మత్తు నిండిన వేళలో ఏం చేశాను? రాత్రి గడిచింది.పగలు వస్తోంది. నా కనులు తెరుస్తున్న పగలు నా పై నాకే అసహ్యాన్ని కలిగిస్తోంది.

రాత్రి ఏం చేశాను!

ఒకనాడు నిరసించి, అవమానించి పగతీర్చుకో గోరిన స్త్రీనే కాంక్షించాను. స్వాధీనమయ్యాను. ఆమెని క్షమించాను. నన్ను నేను క్షమించుకోలేను. ఆమె బాధ్యత నాదే. ఆశ్రయమిచ్చాను.

కానీ—

ఆమె ఆకర్షణకు తట్టుకోలేకపోయాను. నిగ్రహించుకోలేకపోయాను. భార్య కాదనుకున్న స్త్రీని కోరాను. నన్ను నేను క్షమించుకోలేను. ఈ పగలుతో రాత్రి జరిగినది నిజమేనా అనిపిస్తోంది. జరిగినది నా ఊహకు అతీతంగా కనిపిస్తోంది.

మానవుడు! తన కతీతమైన నిర్ణయాలు చేసుకుని ఎక్కడో స్వర్గానికి ప్రాకాలనుకుంటాడు.

కానీ—

దాని కతడు ఎంత దూరంలో ఉన్నాడో అతడి కెప్పుడూ తెలియదు.

ఈనాడు —

నన్ను నేను క్షమించుకోలేను. నా మీద నాకే జుగుప్స కలిగింది. నాకు గతం ఉంది. వర్తమానాన్ని సృష్టించుకున్నాను.

సుధకి గతంలేదు. ఆమె నాకు భార్య కాగలిగింది.

నాకూ గతం ఉండకూడదు. గతం నన్ను బాధిస్తూ ఉంటే సుధకి నా ముఖం చూపించలేను. నన్ను నేను క్షమించుకోలేను.

సూర్యుడు ఆకాశంలో పైపైకి వస్తుంటే-
నేను ఆ ఇల్లు విడిచి,
ఆ ఇంటికి దూర దూరంగా వెళ్ళాను.

18

అది అంతా గతం.

మనసులో అశాంతి నింపుకుని, శాంతికోసం పరిభ్రమిస్తున్నాను ఈనాడు.

నీతి!

నేను ఇల్లు వదలి వచ్చాను. ఆ రావటంలో నా నీతి ఏమైంది!

ఏదైనా జరిగిపోయాక కానీ మనం మంచి చెడ్డలు నిర్ణయించలేము!

జరుగనున్నదాని ఫలితం వర్తమానంలో నిర్ణయించలేము.

వర్తమానంలో అదే కర్తవ్యం అనుకున్న దానిని గురించి భవిష్యత్తులో పశ్చాత్తాప పడతామని ఊహించలేము.

విధి అనేది కాలగర్భంలో దాగిన రహస్యం. అది సమయ మాసన్నమయితే కానీ తెలియదు. అసలు కాలగర్భంలో దాగిన విధి అని ఒకటి ఉండకనూ పోవచ్చు. విధి తన త్రోవ తానే ఏర్పరచుకుంటూ కాలంతో సాగనూ వచ్చు.

కానీ—

విధి అనేది లేదని నవ్వనీయడు భగవంతుడు! అసలు నేను సుధని చూడటం జరగకపోతే నా జీవితం ఏమై యుండేది!

గొప్ప పనులు చేయకపోవచ్చు— ప్రపంచనాగరికతకి ఉపయోగపడకపోవచ్చు— కానీ ఈనాడు అర్థ రహితమై పోయింది నా జీవితం, నీతి కారణంగా. నీతికి ఎందుకు అంత విలువ? జీవితాన్ని నిరుపయోగం చేసేటంత విలువ నీతికి ఎవరు ఇచ్చారు? సంఘం ఇచ్చిందా? నేనే ఇచ్చుకున్నానా?

19

అశాంతి మనసు నిండా నింపుకుని సుధను విడిచి ఇల్లు వదలి బయలుదేరాను నేను! ఇంకా నా హృదయం కన్నీటి కాలువకు—పన్నీటి నవ్వులకు మధ్య ఊగటం మానలేదు. శాంతి మనసులోనే ఉంటుంది అని తెలుసుకోటానికి రెండేళ్లు గడిచి, సగం దేశం తిరిగాను. మనిషి ఎంత వెర్రివాడు! తన దాపులో ఉన్న తనలో ఉన్న నిధుల్ని—ఆనందమిచ్చే గుణాలను సాధనలను తెలుసుకోలేక ఎండమావులలో పరిభ్రమిస్తాడు. జీవితమంతా వృధా చేసుకుంటాడు. భగవంతుడి నిర్దేశమదేనేమో! జ్ఞాని ఐనవాడికి ప్రపంచంతో సంబంధంలేదు.అవసరంలేదు. బ్రతకటానికి కొంత అజ్ఞానం, అన్వేషణా కావాలి. గమ్యంలేని అన్వేషణ, అజ్ఞానం—అతడిని ఈ జీవిత చక్రంలోనే తిప్పుతూ ఉంటాయి. ఈ చక్రంలోనుంచి బయిట పడిన నాడు మానవుడు కాడు అతడు.

20

ఒకనాడు నీతిని గురించి అతిగా ఆలోచించాను. ఆలోచన కంటె అధికంగా బాధపడ్డాను. అసలు నీతికి అర్థం ఉందా?

ఈ ప్రపంచంలో జాతికొక నీతి ఉంది. ఒక జాతి స్వభావ పరిస్థితుల కనుకూలంగా ఆ జాతి నీతి ఏర్పడింది. కాలక్రమాన ఒక జాతి నీతి మారినా ఆశ్చర్యపడ నవసరంలేదు. మారుతూనే ఉంది కూడాను.

సంతానంలేని స్త్రీ దేవర న్యాయం పాటించ వచ్చు.

వితంతువైన స్త్రీ పునర్వివాహం చేసుకుంటోంది.

మగడితో మనసు కలవని స్త్రీ విడిపోయి మారుమను వాడవచ్చు.

స్త్రీ జనాభా తక్కువగా ఉన్న ప్రాంతంలో ఒక స్త్రీ నలుగురు భర్తల్ని భరిస్తుంది.

నీతి ఎక్కడ ఉంది! నీతికి అర్థం ఏమిటి?

ఆ జాతి నీతిని అధిగమించక పోవటమే నీతి. మనిషి అలవాటుకి బానిస. సంప్రదాయకమైన నీతికి విరుద్ధం సహించలేడు మనిషి.

నీతికి అర్థంలేదు కానీ నీతికి అవసరం ఉంది.

బాధ, ద్వేషం, దుఃఖాల నుంచి మనిషిని రక్షిస్తుంది.

నీతి దుఃఖాన్ని కలిగించవచ్చు కానీ అది యెద రగిలించదు. పగ కలిగించదు.

స్వార్థానికి, అసూయకి, దుఃఖానికి మానవుడు అతీతుడైన నాడు ఈ భూమి మీద నీతి యొక్క అవసరంలేదు!

ఆ పరిస్థితిలో ప్రతి ఒకడూ మహాత్ముడు కావాలి.

కానీ—

మనిషి వీటికి అతీతుడు కావటంలేదని కాలం యొక్క చరిత్ర చెబుతున్నది.

ఒక యుగానికి, కొన్ని కోట్ల జవాభాకి ఒక మహాత్ముడు మాత్రమే సంభవిస్తున్నాడు.

కానీ—

నీతికి అంతటి విలువ— ఒక బ్రతుకును శూన్యం చేసేటంత విలువ ఈయటం అవసరమా?

ఈ సమస్యను

కాలం

అనేక నాగరికతలలో, తరాలలో చర్చిస్తూ— ప్రయోగాలు చేస్తూ సాగిపోతూనే ఉంది.

సత్యాన్ని ఆవిష్కరించకుండానే సాగిపోతూ ఉంది.

కాలం,

నీతి కలవనిచోట నిలబడిన నావంటి వారిని దుఃఖానికి ఎరచేస్తూ సాగిపోతూనే ఉంది.

నిజం తెలిసినంతమాత్రాన దుఃఖం నివారణ కాదు. దుఃఖ నివారణకు కొంతకాలం, మనసుకు సాధన కావాలి.

సుస్థిరమైన హిందూధర్మం పాత సంప్రదాయాలను వదలి కొత్త నీతిని విరచించుకోవలసిన సమయం ఆసన్నమయిందా?

నీతిలేక విశ్వశాంతి సాధ్యమా?

విశ్వశాంతి!

నా యీ ఒక్క జీవితాన్నే ఆవరించుకుని అశాంతి ఉంది. ప్రపంచ శాంతిని ఊపివేసే అశాంతికి వేరు ఉంది.

నా అశాంతిలో బాధ, ద్వేషం నశించిపోయాయి.

ఇంకా దుఃఖం మిగిలి ఉంది.

నేను ఇల్లు వదలి వచ్చాను. రావటంలో నా నీతి ఏమయింది? రెండేళ్ళు నా శాంతికోసం పరిభ్రమించాను.

నా ఆనందం, నా ద్వేషం, నా శాంతి, నా బాధ్యత, నా తప్పు, నా పశ్చాత్తాపం... వీటిని గురించే మథనపడుతూ బతికాను ఇన్నాళ్ళూ. సుధను గురించి ఆలోచించానా ఒక్కనాడైనా?

21

ఆశ్రమం నుంచి తీసుకువచ్చాను. ఆమె బాధ్యత నాది అన్నాను. నా రక్షణ ఆమెకి ఉందన్నాను. అన్నిటినీ మరిచి విడిచి వచ్చాను.

సుధ ఎట్లాగ ఉంది? ఎంత దుఃఖపడుతుంది? అని ఆలోచించానా?

యోగిని వంటి ఆమెను ఆశించి, తిరిగి బతుకు పిపాస కలిగించి ఆమెను గురించి ఆలోచించకుండానే నిర్దాక్షిణ్యంగా వదలి వచ్చాను.

ఎప్పుడూ తప్పులు చేస్తూ, దిద్దుకుంటూ ఉండటమేనా జీవితం?

నాకు అన్నీ తెలుసనీ ఆనందమే నా వంతనీ ఆరంభించాను జీవితం.

జీవితంలో తప్పులు చేయక తప్పదా?

తప్పదు.

సుధ దగ్గరకు వెళ్ళాలి.

ఆమె క్షమ నర్థించాలి.

ఆమె నన్ను క్షమించటమే నన్ను నేను క్షమించుకోవటం.

అదే నా శాంతి.

ఇంటికి—

సుధ దగ్గరకు వెళ్ళటానికి—

నిశ్చయించుకున్నాను.

ఇల్లు వదలిన మూడేళ్ళకి తిరిగివచ్చాను. తలుపులు తీసి ఉన్నాయి.

వరండా దాటి గదిలో అడుగు పెడుతుంటే—

కిటికీలోనుంచి ప్రసరించే సూర్యుడి సంజ కాంతుల్లో సుధా—

చీకటి, వెలుగు సంయోగం చెందుతున్న సంజ కాంతుల్లో సుధా—

సుధ ఒడిలో రెండేళ్ళ బాలుడూ—

కూర్చునిఉన్నారు.

ఎవరా పిల్లవాడు?

ఎందుకిక్కడ ఉన్నాడు?

సుధ కొడుకేనా?

ఎవరికి పుట్టాడు? నా లోపలికి కళ్ళకివివో దుఃఖపు పొరలు కమ్ముకుంటున్నాయి.

నాకు తెలిసింది, మళ్ళీ నా హృదయం కన్నీటి కాలువలోకి నన్ను విసురుతోంది.

"సుధా!" అన్నాను,

బాధో, నిరాశో, సందేహమో తెలియని నీరసంతో.

సుధ అవే నయనాలతో నిశ్చలమైన చూపులతో నన్ను చూస్తోంది.

సుధ కనులలో ఆ వెలుగు తరగలేదు.

ఆమె నన్ను గుర్తించింది.

"ఎవరమ్మా?" కుతూహలంతో ప్రశ్నించాడు పిల్లవాడు నన్ను చూస్తూ.

ఆమె కదలలేదు.

కానీ

ఆమెలోని స్పందన నాలో ప్రతిస్పందించింది.

''ఎవరమ్మా?'' ఆ బాలుడి సుకుమారమైన కంఠం ప్రశ్నించింది.

నాలో ప్రతి అణువు ఒక గొంతుకగా లెక్కలేనన్ని కంఠాలు నాలో తలెత్తి ప్రశ్నించాయి.

''చెప్పు సుధా, ఎవరినో చెప్పు. నేను ఎవరినో చెప్పు''.

సుధ పెదవులు కదిలాయి.

''మీ నాన్నగారు.....''

నా గుండెలో గుడిగంటలు మ్రోగాయి.

నా సంభ్రమం ఏమని చెప్పను. నా కొడుకేనా? నా బ్రతుకులో నాకు తెలియకుండానే ఇంత ఆనందమా? రహస్యమా?

సంతోషాన్ని మించిన అనుభూతితో ముందుకు వెళ్లి—

''సుధా, నన్ను క్షమిస్తావా?'' అన్నాను.

సుధ ఒడిలోనుంచి లేచి పిల్లవాడునుంచున్నాడు. సుధకూడా లేచి నిలబడింది.

''అవసరంలేదు. మీరు నన్ను క్షమించారు.

ఆర్ద్రత—

నా జీవితానికంతకూ చాలిన మధురానుభూతిని నాకు ప్రసాదించారు. నా బ్రతుకునంతటినీ అలమివేసే తృప్తిగా, ధ్యేయంగా వీణ్ణి అందించారు. నాకు ఇంకేమీ అవసరంలేదు. మీరు నాపట్ల న్యాయానికంటె ఎక్కువగా ప్రవర్తించారు'' అంది సుధ.

''కానీ సుధా, నాకు శాంతిలేదు. నువ్వు క్షమిస్తే కానీ నన్ను నేను క్షమించుకోలేను'' అన్నాను.

సుధ దగ్గరగా వచ్చింది.

''క్షమ అని అడగకండి. నేను మీ భార్యని'' అంది.

''సుధా!'' అని ఆమెను ఆలింగనం చేసుకున్నాను.

ఆ క్షణంలో గతం అంతా కరిగిపోయింది.

''అవును. సుధ నా భార్య. నా జీవనసుధ'' అని నా హృదయం లోలోపల పరవళ్లు తొక్కింది.

తేజోవంతమైన భవిష్యత్తుకోసం

ఆంధ్రప్రదేశ్ అవతరించి ఒక దశాబ్దం పూర్తి అయింది. ఈ శుభావసరాన నాలుగుకోట్ల తెలుగు ప్రజలు ఒక్కపై హర్షానందాలను వర్షిస్తున్నారు. 1956 నవంబరు ఒకటి ఆంధ్రుల చరిత్రలో అత్యంత ఉజ్వలమైన సంఘటన అకుంఠితమైన విశ్వాసంతో, అచంచలమైన ప్రయత్నంతో, అపూర్వమైన సంచలనంతో, అవధులు దాటిన సంరంభంతో గడచిన ఒక దశాబ్దిలో ఆంధ్రప్రదేశ్ ఆశాపూరితమైన భవిష్యత్తుకు అనేకమైన బాటలు వేసింది. ఆంధ్రావళిలో నూతనోత్సాహాల దీప కళికల్ని వెలిగించి మన ఆర్థిక ప్రణాళికలు మనలో ఆశావహమైన అతివిశాలమైన ఆలోచనల్ని రేకెత్తించాయి.

ఒకవంక వ్యావసాయిక ఉత్పత్తుల అభివృద్ధికి, మరొక వంక పారిశ్రామిక రంగపు ప్రాతిపదిక వ్యవస్థకు మన ప్రణాళికలలో ప్రాధాన్యం లభించింది. ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి దృష్ట్యానేగాక మన జాతీయ అవసరాల కారణంగాను మనం వ్యవసాయానికి విశేషమైన ప్రాముఖ్యం ఇవ్వక తప్పదు.

సంఖ్యలు చాటుతున్న సత్యాలను గమనించితే మొదటి ప్రణాళికలో 101 వ శాతం, రెండవ ప్రణాళికలో 105 వ శాతం, మూడవ ప్రణాళికలో 115 వ శాతం పెట్టుబడుల రూపంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన అభివృద్ధి మనకందరికి గర్వహేతువుగా ప్రస్ఫుటమవుతుంది.

వ్యావసాయిక, పారిశ్రామిక రంగాల అభ్యుదయానికి ఆధారభూతమైన విద్యుచ్ఛక్తి విస్తృతి కొరకు గడచిన దశాబ్దంలో, అంటే రెండవ—మూడవ పంచవర్ష ప్రణాళికల పరిధిలో 126.01 కోట్ల రూపాయలను వెచ్చించడం జరిగింది. ఇదేకాలంలో వ్యవసాయం, నీటిపారుదల రంగాల అభివృద్ధి కొరకు వెచ్చించిన ధనం 266.14 కోట్ల రూపాయలు.

ఉరవళ్లతో, పరవళ్లతో, ఉద్ధృతరూపంతో ఆంధ్రప్రదేశ్‌లో ఆవిర్భవిస్తున్న ఒక నవ్యమైన చైతన్యస్వరూపానికి సజీవ చిహ్నంగా 635 కోట్ల రూపాయల పెట్టుబడితో మనరాష్ట్రం నాలుగవ పంచవర్ష ప్రణాళికను రూపొందించు కొన్నది. ఇందులో ఇంతకు ముందువలెనే వ్యవసాయానికి, నీటిపారుదలకు ప్రత్యేకమైన ప్రాధాన్యం లభ్యమయింది. వేయి రేకులతో వికసిస్తున్న 'రేపు' నిత్యనూతనమైన పరిమళాలను పంచి పెడుతుంది. అందుకొరకు మనం యీ రోజు జరిపిన అంకురార్పణ సుదృఢమూ, సుఫలసూచకమూ, అయినదనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

సడలని సత్తువతో, విడువని పట్టుదలతో మనం రెండవ దశాబ్దపు మంగళకరమైన రంగవల్లికల మధ్య అడుగు పెడుతున్నాం. మాతృభూమి సేవకు మన మనసుల్ని పునరంకితం చేస్తున్నాం.

నిన్నటి చైతన్యవంతమైన దశాబ్దం రేపటి తేజోవంతమైన భవిష్యత్తుకు భ్రమరగీతాలను పాడుతున్నది. వైతాళిక గీతాలను వినిపిస్తున్నది.

టి. రామచంద్రరావు,

డైరెక్టర్,

సమాచార పౌర సంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

Super Mind లేక పురుషోత్తమతత్త్వం

శ్రీ వేలూరి శివరామ శాస్త్రి

రూపసృష్టికి ముందుగా జరగవలసిన సృష్టికల్పనను (Creative Ideation) సదాశివ—ఈశ్వర—శుద్ధవిద్యాతత్త్వాలద్వారా తంత్రం తెలిపింది, సదాశివతత్త్వంలో విశ్వవ్యాప్తమైన [1]అద్వైత భావన. విశ్వమంతా కలిసి 'నేనై' కూచుంది ఈ తత్వంలో. ఈ 'నేనులో' ఎన్నో నేనులు ఉన్నా వానికి ఇచట స్ఫూర్తి లేదు. కనుమూత కనువిప్పులలో కనుమూత ఎట్టిదో ఈ తత్త్వం అట్టిది. అనగా జగత్తు అపుడు సుషుప్తిలో ఉన్నట్లు ఉంది. దీని వివరణం తత్త్వసందోహంలోనూ ప్రత్యభిజ్ఞా విమర్శినిలోనూ చూచేది. ఈ తత్త్వానికి తనకు వేరయిన ప్రపంచం మసకమసకగా తనలో ఒక భాగంగానే అనుభవ మవుతుంది.

ప్రపంచం తనకు వే రని విస్పష్టంగా అనుభూతమైనప్పటికీ పరమశివాభిన్నుడైన తనలో 'నేను ఈశ్వరుడను, ఇదంతా నా వైభవం' అనే వ్యక్తిత్వమూ, తల్లికి శిశువు తన అవయవాలలో ఒక అవయవమే అని తోచినట్లు విశ్వమంతా నా అవయవమే అనే తోచుబడీ కలదే ఈశ్వర తత్త్వం. ఇక్కడే వ్యక్తిత్వానికి అంకురార్పణం. ఇది ఏకత్వంలో వైశిష్ట్యం.

ఈశ్వరునితో జీవుని ద్వైతాద్వైత లీల శుద్ధవిద్యాతత్త్వంలో కనబడుతుంది.

అరవిందుని తంత్రం అద్వైతానికీ తంత్రానికీ ముందడుగు కాబట్టి వారు చెప్పిన తత్త్వాలనన్నీ తంత్రతత్త్వాలతో పోల్చి చూదాం. వారు Life Devine లో ఏడెనిమిది తత్త్వాలను చెప్పారు. అవి వేదంలోనివే. వీని నడుమ విజ్ఞానం లేక మహర్లోకం (వ్యాహృతి సప్తకంలో నడిమిది) ఒకటి ఉంది.[2] ఆ విజ్ఞానమే లోగడ చెప్పిన పరాప్రకృతి. అదే పరాశక్తి పురుషోత్తముడు లేక Super Mind. వేదంలోనూ ఉపనిషత్తులలోనూ పురాణాలలోనూ తంత్రంలోను గీతలలోనూ ఉండే ఆయా పేరులు తాము పెట్టిన Super Mind అనే పదానికి ఆయారూపాలలో[3] సరి అని అన్నటులు అరవిందుల గ్రంథాలలో అక్కడక్కడ సాక్ష్యం ఉన్నది. కాబట్టి అరవిందుల ఈ Super Mind అనే తత్త్వం, సదాశివేశ్వరశుద్ధవిద్యాతత్త్వాలను మూటినీ తనలో ఇమిడ్చికోవడమే కాక పరాసంవి త్సచ్చిదానంద సత్యతపోజనోలోకాలతోనూ పురుషోత్తమునితోనూ ఆయారూపంలో[4] సమానార్థకంగా వాడబడింది. ఇవన్నీ అతిమానసతత్త్వాలే కదా!

ఈ Super Mind లో (1) ఎడతెగని ఏకత్వం లేక అద్వైతభావం (2) ఏకత్వంలో వైశిష్ట్యం (3) బహులీలా మధ్యంలో ఐక్యప్రతిష్ఠ ఏకత్వంలో

---

1. పఞ్చదశి చిత్రదీపంలో ఈశ్వర హిరణ్యగర్భ విరాట్పురుషుల అవస్థలో జగచ్చిత్రాన్నిగూర్చి చెప్పిన తెరగు చూచేది.

2. సత్—చిత్—ఆనంద—విజ్ఞాన—మనః ప్రాణ దేహ, లేక భూ—ర్భువ—స్సువర్—మహ—ర్జన—స్తప స్సత్య.

3. 4. Life Devine లో Super Mind as Devine Maya, Super Mind as Creator, The Triple Status of Super Mind అనే ప్రకరణాలు చూచేది.

బహులీల ఉన్నట్లు Life Devine చెపుతుంది. తంత్రం చెప్పిన సదాశివతత్త్వంలో విశ్వవ్యాప్తమైన పురుషోత్తమాద్వైతభావమూ ఈశ్వరతత్త్వంలో పురుషోత్తమవ్యక్తిగతేశ్వరభావమూ శుద్ధవిద్యాతత్త్వంలో జీవులలో ఈశ్వరునకుగల ద్వైతాద్వైతతత్త్వ లీలా మళ్ళా ఊహింపలేనంత భేదంతోగూడిన ఐక్యమూ కనబడతై. ఏస్తరంలో పరాప్రకృతి జీవత్వం పొందిందని గీత చెప్పిందో అది ఈ శుద్ధవిద్యాతత్త్వం చేసిన పని. కాగా శుద్ధవిద్య పరాప్రకృతి రూపంలో జీవ జనని. తంత్రం మాయాక్షేత్రంలో-అవిద్యా క్షేత్రంలో-కలా కాల నియతి విద్యా రాగము లనే కంచుకాలు అనగా ఆవరణాలున్న వని చెప్పింది. అరవిందులీ అవిద్యా క్షేత్రాన్ని అజ్ఞాన క్షేత్రమని అన్నారు. అజ్ఞానం చేత మోసపడే జీవులు జన్మకర్మపరంపరలో సంస్కార వశులై కొట్టుకొనిపోతూవుంటారు. దీనికి క్రింద నున్న త్రిభువనాలు మనః ప్రాణ దేహాలు సృష్టి. అవిద్య మొదలుకొని జడమైన దేహంవరకూ ప్రకృతిక్షేత్రం. ఈ క్షేత్రాన్నంతా సాంఖ్యం విడబరచివిడబరచి చూపింది. తంత్రంతోపాటు అరవిందులున్నూ దాన్ని స్వీకరించారు. ఈ ఇరువదినాలుగు తత్త్వాలూ తంత్రమతంలో మిథ్య కాకున్నా అధోభువనాలకింద అశుద్ధసృష్టి కింద జమ. తంత్రం శుద్ధవిద్యాతత్త్వంతోసహా దానివెనుక నున్న ఈశ్వర సదాశివ సచ్చిదానంద తత్త్వాలన్నీ శుద్ధతత్త్వాలని చెప్పింది. శ్రీ అరవిందులు తను Integral Yoga లో శుద్ధవిద్యాసహాయంతో అశుద్ధభువనాల నన్నిటిని శుద్ధభువనాలనుగా మార్చడానికి వీలవుతుందని దేహ ప్రాణ మనోరూపాలైన భూర్భువస్స్వర్లోకాలను అతిమానసమైన ఒక క్రొత్త 'భాగవతీ ప్రకృతి' శుద్ధవిద్యా సహాయంతో శుద్ధ భువనాలనుగా చిన్మయాలనుగా చేస్తుందనిన్నీ అన్నారు.

2

ఈ Super Mind ను లేక యీ అతి మానసతత్త్వాన్ని గురించి అరవిందులు Life Devine లో ఏమిచెప్పారో సంగ్రహించి చూదాం.

పరతత్త్వం సచేతనమైన తనశక్తిగుండా ఆనందం వల్ల సృష్టి చేస్తున్నది. ఆ పరతత్త్వమే మన స్వభావానికీ చిత్తవృత్తికీ ఆచార వ్యవహారాలకూ ఒకదానికేమిటి—అన్నిటికీ కుదురు లేక ఆత్మ. ఒక కవి గాని ఒక చిత్రకారుడుగానీ ఒక గాయకుడుగాని తమలో నిగూఢంగా ఉన్న ప్రతిభకు రూపకల్పనచేసి ఒక కావ్యంగాని ఒక చిత్తరువుగాని ఒక కృతిగాని సృష్టించాడని అంటే తన్నే అభివ్యక్తం చేసుకొనడంకాక వేరేమయినా ఉందా? సృష్టికీ భగవంతునికీ ఉండే సంబంధం అలాటిదే. భగవంతుడు సృష్టిస్తున్నాడంటే ఆత్మాభివ్యక్తి చేసికోవడమే. విత్తునుండి కలిగే అంకురాది పరిణామాలన్నీ విత్తులోనే ఇమిడి ఉండి అభివ్యక్తాలవుతున్నవి. విత్తు ఉనికిలోనే అంకురాది మహావృక్షాంతమూ లోగడనే ఉండలేదా? పుట్టవలెననే—మొలవవలెననే—ఇచ్ఛ లోగడనే ఉండలేదా? పుడదామనే ఆనందం లోగడనే ఏర్పడలేదా? అంచేత కవి చిత్రకార గాయకుల నుండి బయలుదేరే సృష్టి వారిలో ఒకానొక భాగమో అంశమో కాక మరేమీ కాదు. వారిలో అభివ్యక్తం కాని అంశం వ్యక్తమయింది, అంతే. తమలో నుండియే యీ సృష్టి వస్తున్నది కాబట్టి ఆ సృష్టికీఆయాయీ స్రష్టలకూ ఆత్మగతమైన భేదంలేదు. ప్రపంచ చరమసత్యం సచ్చిదానందం. సృజింపబడినది యావత్తూ ఆ సచ్చిదానందంనుండే వస్తున్నది. అది ఆ పరమ వస్తువులోని ఏదో ఒకానొక ఉన్నదానియే—సత్యముయొక్కయే—అభివ్యక్తి. ఈప్రపంచం ఎందుండి అభివ్యక్తమయిందో అది ఆనందంవల్లనే. దానిని పెంపొందించేది ఆనందమే. మరలిపోయేది ఆనందంలోనికే. ఆనందంనుండి అభివ్యక్తమయిన ప్రతీదీ వెంపరలాడేది ఆనందం కోసమే గాని మరో దానికి గాదు. నిజానికి ఈసృష్టి ఉనికి నెడబాయని ఆనందాన్ని ప్రసవించడానికే శ్రమపడుతూంది. తన రూపాన్ని అభివ్యక్తంచేసికోడానికి ఆపుకోలేని ప్రేరణవల్ల ఆ శ్రమ పడేది నిగూఢమైన శక్తే. ఆ శక్తి తన్నుతాను తెలిసికొందామని అనుకొనేశక్తే. ఆప్రేరణకూడా ఆ శక్తిదే. తనలో అభివ్యక్తం కాకుండా ఉన్న ఆ యా కళలను శిల్పాలను పాటలను సృష్టిచేసే వ్యక్తిమాత్రం తనకంటె తనసృష్టి వేరని తనలో అనుకుంటాడు. నిజానికి సృష్టించిన ఆ శక్తి తానే. తన్ను సాధనంగా కరణంగా తలపించే వైయక్తిక జ్ఞానమూ తానే. ఆ జ్ఞానం ఉపయోగించే సరకూ సప్పటూ తానే. దీనికి అంతకూ ఫల మయిన రూపమూ తానే. ఈ విషయాన్నే మరో

రీతిగా చెపితే—అది ఒకేసత్తా, ఒకేశక్తి, ఒకే ఉనికిలోని ఆనందం అని అవుతుంది. వీని మొత్తమైన ఆత్మ వేరు వేరు కేంద్రాలలో ఘనీభూత మవుతుంది. ఘనీభూతమైన ఆ ఉనికి ఆ ఎరుకా ఆ ఆనందమూ తమకు తాము తమ తమ కేంద్రాలలో ఉండి 'నేను, 'నేను' అని అంటూ వివిధ లీలలతో తమ్ము రూపొందించుకోవాలని—అభివ్యక్తం చేసుకోవాలని—అపేక్షిస్తవి. ఆ లీలా ప్రకాశం క్రమక్రమంగా అభివ్యక్తి చెందుతుంది. కాగా ప్రపంచంలో ఏకొంచెం నలుసు ఆవిర్భవించినా అదంతా తన సత్తా ప్రసారంకోసం—తనలోఉన్న చేతనా శక్తిని వాస్తవంగా పరిణమింపజేసే కోసం అభివ్యక్తిలో గల ఆనందాన్ని అనుభవించడంకోసం ప్రయాస పడుతూంది. ఈ ప్రయాసకు ఫలమేమిటంటే వ్యక్తిలోగాని వ్యక్తులన్నిటిలోగాని సత్తా శక్త్యానందాల పరిపూర్ణవికాసం—పరిపూర్ణాభివ్యక్తి. అయితే వ్యక్తిచేతన ఎంతవరకు గిరిగీచుకొని వ్యక్తిగతమైన ఆధారంలోనే కూచుంటుందో అంతవరకూ దానిలో భూమానందం ప్రకాశించడానికి వీలు లేదు. ఏమిటీ విశ్వరహస్యం? అంతంలేని దేశకాల రూపంగా ప్రసృతమై అంతకంటే అంతంలేని సత్తాఅనే పటభూమికలో అఖండసచ్చిదానందవస్తువు జడంలో సంవృతమై నిలీనమయింది. ఇదీ రహస్యం. ఎందుకు? అనంతంగా విభక్తం కావడానికి అలా ఐతే ప్రయోజనం ఏమిటి? అలా కాకపోతే వ్యష్టి జీవరాశి ఎలా ఉద్భవిస్తుంది? ఖండలీల ఎలా పొసగుతుంది? విధిరూపంగా చెపితే లీలావైచిత్రంకోసం. ఇందుకోసం చిత్సత్తా, జడంలో నిలీనంకావడం మొదటి పర్వం. దీని పిమ్మట—తనకు తానై నిరుద్ధమైన చిచ్ఛక్తి రూపమయ ప్రాణమయ మనోమయ విగ్రహ రూపంగా విస్ఫారింది. ఇది రెండవ పర్వం. శేషపర్వంలో మనోమయ విగ్రహం స్వరూపం పొందడానికి తెలియక గిజగిజలాడుతున్నా తన్ను ఈ విశ్వలీలా సూత్రధారునిగానూ సాధనోల్లాసంలో ముక్త్యుల్లాసంలో మళ్లా తాను తన సచ్చిదానంద స్వరూప జ్ఞానం పొందగలటులున్నా తన మూఢదశలోగూడా తాను గుహాచరమైన సత్యంగా ఉన్నటులున్నా తెలిసికొంటుంది. శక్తిస్పందంయొక్క ఈ మూటి దశలయు జ్ఞానమే విశ్వలీలారహస్యజ్ఞానం.

ఈ విశ్వ పరిణామజ్ఞానం నేటికాలపు ప్రాతిభాసిక పరిణామవాదుల మతాలలోనూ ప్రాచీన వేదాంతాలలోనూ దర్శనాలలోనూ కనబడుతుంది. ప్రాచీన ఋషులు ఆనాడు విశ్వపరిణామలీలను ఎట్లా చూచారో అట్లా నేటి వైజ్ఞానికులున్నూ జడశక్త్యుభయతత్త్వాలోచనం చేసుకుంటూవచ్చి చూస్తున్నారు కాని యాథార్థ్యాన్ని కింకా ఎడంగానే ఉన్నారు. యథార్థం తెలియాలంటే మన జ్ఞాన భాండారంలోని వేదవేదాంతపురాణాలలోని సత్యజ్యోతిని దర్శించాలి. ఇట్లా చేస్తే పాతకొత్తల కలయికవల్ల ఒండొరులమీద ఒండొరులదీప్తి ప్రవహిస్తుంది. నేటి భావధార ఈ గంగా యమునల కూడలి వెంటనే నడుస్తున్నటులు తోస్తుంది.

విశ్వం ఇట్లా పరిణమించిందని తెలిసినంత మాత్రాన 'సర్వం ఖల్విదం బ్రహ్మ'[5] అనేబ్రహ్మతత్వాన్ని ఆవిష్కరించినంతమాత్రాన— విశ్వవ్యాఖ్య పూర్తికాదు. ఈ సద్వస్తువు ఏయేపద్ధతిలో ఏయే ప్రక్రియతో ఈ ప్రాతిభాసికరూపం[6] ధరించింది? అభివ్యక్తికి ఒక విశిష్టరీతి ఉన్నదని పయిపయికే మనకు కనబడుతుంది. చంచల మయిన శక్తియొక్క బహువ్యాపారాలలో నిత్యంగానూ నూతనంగానూ సామ్యావస్థ ఒకటి ఉన్నటులున్నూ కనబడుతూనే వుంటుంది. ఇంతేకాక పూర్వ సంచితమూ సునిర్దిష్టమూ ఐన తన వేగానికి దైవాతూ సుగమంగా ఏర్పడ్డ దారిలో ఆ శక్తి ప్రసరిస్తుం దనిన్నీ ఇట్టే తెలుస్తుంది. కాని శక్తి, సత్తాయొక్క ప్రకాశానికి ఉపాయమాత్రమే. కాబట్టి శక్తియొక్క క్రియాధార ఆ సత్తాలో ఉన్న సత్యాన్ని వెన్నాడుతూ ఉండి తీరాలి. దాని లక్ష్యమూ క్షేత్రమూ పోయేదారీ ఆ సత్యంచే నియంత్రితమై ఉండి తీరాలి. ఆ సత్తా సచేతనం కాబట్టి ఆ సత్యం సత్తాయొక్క విశిష్టమైన ఆత్మబోధరూపం—లేక తనయొక్క అనంతరూపాలలో ఏదో ఒకరూప ప్రతీతి. ఇలా అయితే సత్తాచేతనంలో నిత్యసిద్ధమైన ఆత్మనిర్దేశ శక్తినుండి శక్తియొక్క గతిధారకగూడా నిరూపితం అయిందని తేలిపోయింది. అనంతమైన సత్తాలో

---

5. అంతా రామమయం, ఈజగమంతా రామమయం.

6. ఇప్పుడు మనకు కనబడే రూపం.

ఖండసత్యాన్ని తెలిసికొనే శక్తీన్నీ తదభివ్యక్తికి తగిన దారిలో నడిపే శక్తీన్నీ అనంతసత్తాలో గల ఆత్మ సంపాదనశక్తే. అదే ఈ విశ్వసృష్టికి నియామకం. దీనికి ఉదాహరణం చెపితే సులభంగా గ్రాహ్యం అవుతుంది. ఒక మఱ్ఱివిత్తు ఉందని అనుకుందాం. విత్తు మాత్రమే సత్యం కాదు. దీనిలో నుండి వెలువడే మొలక చిగుళ్లు కొమ్మలు రెమ్మలు బోదె ఊడలు పండ్లు ఇట్టివన్నీ వేనికి వానికే సత్యమేకాక వీని అన్నిటినీ గర్భంలో దాచుకొన్నట్లు కనబడి వీనితో విశిష్టమయిన విత్తు సత్యం. కాబట్టి విత్తనగా వీని అన్నిటిని కలిగినదే అని అర్థం. అలాగే ఈ ప్రపంచబీజాలతో కూడిన సత్తా, సత్యం. విత్తులో ఇమిడి ఉన్న ప్రతిదీ సత్యమయినటులు సత్తాలోఉన్న ప్రతిదీ సత్యం. ఈ సత్తా సచేతనంకాబట్టి దానికి తనలో వున్నది ప్రతిదీ తెలుసు. విత్తు ఖండసత్తా. అఖండసత్తాకు ఖండసత్యాన్ని తెలుసుకొనే శక్తీన్నీ ఉన్నది. ఖండసత్యాన్ని తదభివ్యక్తికి తగిన దారిలో నడిపే రీతీన్నీ ఉన్నది. ఇదే వెనుక చెప్పిన ఆత్మబోధ. కాగా విత్తును శక్తి మొలకగా చిగురుగా కొమ్మగా తుట్టతుదకు మహావృక్షంగా అభివ్యక్తం చేస్తున్నది. ఈ అభివ్యక్తిలో క్రమం ఉన్నది. ఇంతేకాక మఱ్ఱివిత్తునుండి మఱ్ఱిచెట్టే అభివ్యక్తమవుతున్నది. దానికి పినతల్లి బిడ్డలయిన రావి జువ్వి కలజువ్వి మొదలయినవానితో సాంకర్యమే కాక మరొక వంశంలోని చెట్లు అభివ్యక్తం కావడం లేదు. సత్తాకు ఇదంతా కొట్టిన పిండే. సత్తాలోఉన్న ఆత్మసంవేదనశక్తే పలుశక్తులై సత్తాలో గల రూపాలనన్నిటినీచక్కగా పోతపోస్తున్నది.7

ఉపనిషదాదులలో ఈశ్వరుడు అనుకొన్నంత మాత్రాన ఏదో సృష్టి అయిందని చూస్తాం. ఈలాగే భిన్నమతంవారి గ్రంథాలలోగూడా ఈశ్వరుడనుజ్ఞయీయగానే సృష్టి అయిందనిన్నీ 'వద్దు' అని అంటే ఆగిందనిన్నీ చదువుతాం. 'Let there be light'8 అని దేముడు అనంగానే వెలుగులేనిచోటినుండి వెలుగు పుట్టించే శక్తి ఈశ్వరునకు ఉన్న దన్నట్లు కాదా? మళ్లా 'There was light'* అని అన్నప్పుడు అంతకుముందు వెలుగేకాక లెక్కలేనన్ని వస్తువుల సృష్టికా దగిన యోగ్యత ఉన్నదని ఊహించడం కాదా? ఇంకా ఈక్షణాన్ని—అనుజ్ఞను—అనుసరించి వస్తు సృష్టిని వెలువరించే శక్తి ఈశ్వరునకు అంగీకరించినట్లు కాదా?

అట్టిదానిని ప్రాచీన ఋషులు 'మాయ' అని అన్నారు. అది దిగువ మాయకాక ఎగువ మాయ. దేవ మాయ. అది పరాసంవిత్తు యొక్కయే బలం—వీర్యం. అరవిందుని భాషలో ఈ దేవమాయ (Divine Maya) అనంతసన్మాత్రంలోని అసీమమూ విశాలమూ ఐన సత్యసామగ్రిని చక్కగా అవగతం చేసుకొని గుర్తుపెట్టుకొని ఒక హద్దులో ప్రమితం చేసి (వృక్షబీజాలు అనే అనేకసత్యాలున్నవికదా! ఆ సత్యంగురించి దాన్ని వృక్ష జాతిలోనే ప్రమాణ బద్ధం చేసి) దానిలో నామరూపాలను వికసింపజేస్తుంది. ఆ పరమ పురుషునిలో సత్తాతో సత్తా, చేతనతో చేతనా, శక్తితో శక్తీ, ఆనందంతో ఆనందమూ, తమ అన్యోన్య సంబంధ లీల కోసం ప్రయాసపడతవి. దానికి ఫలంగా వ్యష్టి సమష్టి వైవిధ్యంతో వ్యష్టిలో సమష్టి సమష్టిలో వ్యష్టీ ఏర్పడతై. అదే ప్రాతిభాసిక సత్యం. మొదట మొదట సమష్టిలో వ్యష్టి లీలను వ్యష్టిలో సమష్టిలీలను మన మనో లీల—లేక దిగువ మాయ— మనకు తెలియకుండా చేస్తుంది. అప్పుడు వ్యష్టి, సమష్టిలో తా నున్నా లేనట్లు తలపిస్తుంది. క్రమక్రమంగా సమష్టికి తాను విడిగానే ఉన్నట్లూ అందరతో ఏకాకారంగా లేనట్లూ తలపిస్తుంది. మనోలీలయొక్క యీ ప్రవాహంనుండి మనం దీర్ఘసాధనతో మేల్కొని అతిమానసలీలలో దేవమాయా సత్యంలో నిలదొక్కుకొన్నప్పుడు వ్యష్టిసమష్టులు పెనగొని ఉన్నట్లులున్నా ఒకే ఒక సత్యం బహుప్రతిరూపాల బిగికౌగిట్లో ఉన్నట్లులున్నా తెలిసికొంటాం.

---

7. తంత్రంలో — రూపాలనన్నిటిని తెలిసి వానిలో ఒక్కొక్క రూపాన్ని ఏరి సమగ్రంగా అభివ్యక్తి చేసే శక్తియొక్క ఒకరూపం శుద్ధవిద్య, ఒకరూపం ఈశ్వర, ఇంకొకరూపం సదాశివ — తత్వాలు. అరవిందుల భాషలో Super Mind యొక్క రూప త్రయంలో ఒకటి.

8. వెలుతరు పుట్టాలి. *వెలుతురు పుట్టింది.

ఇక ఈ దిగువ మాయ మనల గిరివేసికొని ఉన్నది. మనం దీన్ని మన్నిస్తూనే దీనిని తప్పుక పోవాలి. తమస్సు చేసిన చీకటినిబట్టీ ఖండత్వంబట్టీ శాసనాదులబట్టీ కలిగే తాపదుఃఖాదులబట్టీ యీ మాయా వంచనను తొలగించుకోవాలి. ఈ లీలకోసం అల్లతడే తనశక్తిసన్నిధిలో తన్ను సమర్పించుకున్నాడుకాబట్టి ఈ చీకటి ముసుగుతో తన్ను కప్పుకోడానికి అతనికి కొంకూ గింకూ ఏమాత్రమూ లేదు. కాబట్టి ఈ మలినమాయను తొలగదోసికొని పై దేవమాయను అవలంబించాలి. ఈ మాయ పరమ పురుషుని లోకోత్తర లీల. ఈ అతిమానస లీలతో దేవమాయను లేక విద్యామాయను అందుకొంటే అక్కడ ఖండసత్తా అఖండసత్తా, వ్యక్తీ విశ్వమూ, విడదీయరాని ఏకత్వంలోనూ ఆ యేకత్వం కూడా బహుముఖమైన తన ప్రతీక రూపంగానూ నిత్యమూ యౌగపద్యంగా ఉంటుందని అవగతమౌతుంది. ఈ పై మాయను మరచినవారు మనకు పైకి కనబడే విరోధాలను కలిపే శృంఖలను మరచినవారే. అలవారికి ఈ మానసికమాయే ఈఅవిద్యామాయే— ప్రపంచాన్ని సృజించినట్లు కనబడడంవల్ల ఈప్రపంచం కల్లగాక నిక్కమూ కాక అనిర్వచనీయమై అనగా ఉన్నదనిగాని లేనిదనిగాని చెప్పడానికి వీలులేనిదై ఊరకుంటుంది. వారీ మనస్సే ప్రపంచాన్ని సృజించిందని అనుకోడాన ఈ ప్రపంచ రహస్యం మాయావాద (Illusionism)[9] ప్రతీతి వాదాల (Subjective Idealism)[10] నడుమ ఊగులాడుతూంది. ఈ ప్రపంచం మనోభావన—మనోధారణ—అని అనేవారూ, వీరిలో ఒక తెగ (భావవాదులూ), ఇత్యాదిగా ఎందరో ఉన్నారు. సత్యవస్తువుకూ భావనకున్నూ—ధారణకున్నూ కొంచెంసంబంధం లేకపోలేదు, ఆ సంబంధం అత్యంత విరుద్ధ రూప సంబంధం కాదు అని అంటారు. ఈ వాదాలేవీ విశ్వపు ముడి విప్పలేవు. ఈ ధారణకూ భావనకూ దూరజ్ఞాతి సంబంధం కాక జన్యజనకభావ సంబంధమే ఉంది. ధారణవల్లా—భావనవల్లా రూపసృష్టి కలుగుతుంది. ఆలాటి ధారణవల్లా—భావనవల్లా కలిగే రూపసృష్టి సత్యంయొక్క చిద్రూపం. అంటే ప్రకృతసత్తాను అభివ్యక్తంచేసే మహాసత్తాజన్యమే. ప్రకృతసత్తా సత్యరూపం శక్తిలోనే ఉంది. చిన్మయ మయిన పరమ సత్తాయే తన్నుబహుపరిణామాలు పొందేధర్మంగల ఆధారంలో ప్రకాశింప జేసికొంటుంది. అభివ్యక్తమయే సత్యానికి తదనురూపమైన జ్ఞానం అతిమానస చేతన యొక్క సత్యబోధలో జాగరిల్లి ఉంటుంది. అటుపిమ్మట ఋత—చేతనయొక్క సత్యసంకల్పంచతురంగా విశ్వపు సత్యభావమూర్తిని[11] మొదట ఉద్బుద్ధం చేసి పిదప దానిని దేహప్రాణమనో రూప మయిన ఆధారంలో రూపు కల్పిస్తుంది. దేహప్రాణమనస్సులు ఆభావమూర్తియొక్కయే అపూర్ణమూ నిమ్నతరమూ ఐన అభివ్యక్తి. కాబట్టే ఉత్తరాయణంలో—క్రమారోహణ సోపానంలో—అతిమానసంయొక్క ఆదర్శభావమూర్తిని వాస్తవంగా అభివ్యక్తం చేయడానికి వానిలో ఎల్లప్పుడూ మెలకువతో ఉండే చేష్ట కనబడుతుంది. పరమసత్తా ప్రథమాత్మ ప్రకాశరూపం సత్యాదర్శం లేక చిద్రూపం. పరిణమించే స్వభావం కల సచేతనవ్యక్తి ఆ ఆదర్శానికి ప్రాతిభాసికరూపం. తిరిగి ఆవ్యక్తి పరమార్థందేన నిరూపింపరాని ఆకర్షణతో ఆదర్శపూర్ణత్వం పొందగల చేష్ట చేస్తాడు. కాబట్టి ప్రకృతం మనకు కలిగిన ఈ అవస్థలో ఇంత అపూర్ణతా ఇంత అతృప్తీ. కాగా ప్రాతిభాసికరూపాన్ని రూపాంతరం పొందించాలని అల్ల అధ్యాత్మసత్తాకు ఎంతో ఆకులత, ఎంతో ప్రయత్నం. కాబట్టి పరమసత్తాను చిద్రూపాన్ని విశ్వాన్ని ఈ మూటినీ కూడా సత్యం అని ఎన్నాలి పరమసత్తయునూ విశ్వమునూ సవిశేషమునూ నిర్విశేషమునూ కేవలం నిత్యవిరుద్ధాలని అనుకుంటే సెగదు.

---

9. బ్రహ్మ సత్యం జగన్మిథ్యా......'

10. 'ప్రతీతిమాత్రమేవై తద్భాతి విశ్వం చరాచరమ్'విశ్వంప్రతీతిమాత్రం. బ్రహ్మము సత్యం. జగత్తు మిథ్య జీవుడు టకాయించిబ్రహ్మమే.

11. I take the phrase from the Rig—Veda,—rta-cit, which means the conciousness of essential truth of Being (Satyam) of orderd truth of active being (Rtam) and the vast Self-awareness (brihat) in which alone this Conciousness is possible—See—The Devine Maya—Life Devine Book 1. Xiji.

మనస్సే స్రష్టఅని అనుకొంటూ కూచుంటే విశ్వాస్తిత్వాన్ని వ్యాఖ్యానించడానికి వీలులేదు. పోనీ! ప్రకృతం పైకి కనబడే అసమగ్రత లేని అనంత మయిన మన స్సొకటి ఉండరాదా? అది సృష్టి చేయరాదా? అని అంటే, అహంకారంగాని అజ్ఞానం గాని లేక, సర్వజ్ఞమూ సర్వశక్తి మయమూ ఐన మన స్సొకటి ఉన్నదని అంటే, అది మనస్సెట్లా అవుతుంది? అది అతిమానస జ్ఞానం—Super Mind అవుతుంది. మానవ మనస్సనగా మానవమనస్స జాతీయమై అనంతమైన మనస్సని అంటే అట్టి మనస్సు అనంత మయిన గజిబిజి పుట్టి స్తుంది. అస్తవ్యస్తమూ పిచ్చి పిచ్చి ఐన సృష్టి చేస్తూ కూచుంటుంది. పోనీ! చీకటిలో తడుము కుంటూనే ప్రకృతి జీవులవంటి జీవులను సృజిస్తుందని అందాం. అని అంటే ప్రకృతి లోపాలూ అశక్తతలూ అనంతంగా పెరగవూ? దానికి ఫలం,—భగ్నక్రమ మైన సత్యాలు — అనగా కోతులకు కుక్కలు కుక్కలకు నక్కలు మానవులకు దానవులు ఇత్యాదిగా పుట్టుకొనిరారూ? ఇంకా అనంత విరుద్ధాలు పుట్టు వచ్చు, తుద కిది ఎంతవరకు తారుమారవుతుందో అంతమేరకూ పోవచ్చు! ఆ మనస్సుకు ఎంతో జ్ఞానమూ ఎంతో ఎంతో శక్తి నీవు కల్పించినా అది మానవ మనస్సు!

ప్రపంచం దివ్యసృష్టి. ఇది పూర్వ దృష్ట సత్యానికే అభివ్యక్తి. ఇచ్ఛాశక్తి లోగడనే నిర్ణయించి ఉండగా దానికి ప్రపంచం విధేయంగా నడుచు కొంటుంది. చెట్టుయొక్క సత్యం అనగా చెట్టులో ఉండే యావత్తూ దాని విత్తులోనే ఎప్పుడో నిర్ణీతమై ఉంది. విత్తులో ఉన్న ఇచ్ఛను తూచా తప్ప కుండా చెట్టువల్ల అభివ్యక్త మవుతుంది. మనసుకు అట్టి చూపూ లేదు, తాను అభివ్యక్తం చేయవలసిన సత్యము అనగా యావదంశమూ తరచు కనిపెట్టనూ లేదు. దానికి ఊహలు మాత్రం గంపెడు. నిక్కంగా పరిణమించజాలని కల్పనలు తట్టెడు. మితంగా అనుమిస్తుంది కాని ఆ అనుమానాలలో నూటికి తొంబై పొల్లు. అది ప్రత్యక్షంగా ఉన్న దాన్నే గ్రహి స్తుంది. సృష్టి ప్రక్రియగుండా తనంత తాను క్రమక్రమంగా వికసిస్తున్న సత్యాన్ని తనకు పరమయినదాన్ని కనుక్కునే శక్తి దానికి సున్నా. ప్రత్యఙ్మార్గంలో వెళితేనేగాని మనస్సుకు ఆ పరమసత్యం అందదు. దానిది బహుపరాక్. Super Mind లేక పురుషోత్తముడు స్రష్టృరూపంలో ప్రపంచం సృజించే రూపంలో ఎట్లా ఉంటాడో ఇటుముందు చూదాం.

స వ ర ణ

[సెప్టెంబరు నెల భారతిలోని 'పురుషోత్తముడు' అనే వ్యాసంలో—3 వ పుట 2 వ పెడలో 9 వ పంక్తిలో 'కఠంలో'కు బదులు 'కేన' అనిన్నీ, 13 వ పంక్తిలో—'కఠభాష్యంలో'కు బదులు కేన-పదభాష్యంలో అనిన్నీ, 4 వ పుట 2 వ పెడలో 4 వ పంక్తిలో— 'సంపదాదచ'కు బదులు 'సంపదాచ' అనిన్నీ, 6 పంక్తిలో 'పరాశక్తియే'కు బదులు పరాప్రకృతియే అనిన్నీ దిద్దుకొనేది.]

బెర్ట్రండ్ రసెల్ భావప్రపంచం-2

శ్రీ బుచ్చిబాబు

బెర్ట్రండ్ రసెల్ భావాల పరిశీలన రెండు విధాలుగా జరగాలను కుంటాను. తాను నిర్మించుకున్న సమాజంలో ఆత్మ వికాసం కలిగి మానవుడు సుఖంగా జీవించడానికి ఉపకరించే భావాలు, ఏవో చెప్పడం ఒక పద్ధతి. మానవ శ్రేయస్సుకి అడ్డు తగులుతూ అనాదిగా ప్రచారం అవుతూ, చలామణిలో వున్న తుక్కుభావాలని పేర్కొనడం మరొక పద్ధతి. కొత్త భావాన్ని స్వీకరించడం కోసం, పాత భావాలన్నింటినీ పాతెయ్యాలని కాదు; చెత్త భావాలకి వీడ్కోలిస్తేగాని, కొత్త భావాలని స్వీకరించే మనస్తత్వం, వాతావరణం ఏర్పడవు కావున, మానవుడి ఆనందానికి అంతరాయాలుగా వుంటున్న భావాలేవో తెల్సుకుని, వాటి బాగోగులను గురించి ఆలోచించడం అవసరం. నిత్య కృత్యాలలో నిమగ్నులై, తమ స్వార్థం దెబ్బతిన్నప్పుడుగాని, మనుషులు 'భావాలను' గురించి పట్టించుకోరు; వారాని కో గంట స్వయంగా ఆలోచించే అలవాటు చేసుకుని, ప్రపంచ ఖ్యాతి తెచ్చుకున్నాను — అన్నాడు బెర్నార్డ్షా. ఇట్లా ప్రజలలో పాతుకుపోయి, మానవ వికాసానికి అడ్డుతగిలే చెత్త భావాల సంగ్రహచరిత్ర వ్రాశాడు రసెల్. వీటిని చెత్తబుట్టలో పడెయ్యాలంటాడు. ఇట్లాంటివి మన వారిలోనూ కొన్ని వున్నాయి. కొన్నింటిని గూర్చి తెలుసుకుందాం.

మానవుడు బుద్ధిశీలుడు — మంచి, చెడ్డలు గ్రహించి, ఉద్రేకానికి లొంగక, నిదానంగా ఆలోచించగల బుద్ధిమంతుడంటారు కాని, నేను ప్రపంచమంతటా పర్యటించాను, దీనికి నిదర్శన నాకు కనబడలేదంటాడు, రసెల్. బుద్ధిని వాడకపోవడం సరికదా, సంస్కృతి నాగరికతల పెత్తందారులుగా, వక్తలు, నాయకులు, ఉద్రేకాలని రగులుస్తూ చేసే తుక్కుభావాల ప్రచారానికి లొంగిపోయి మనిషి, హింసాకాండకీ, మూఢ విశ్వాశాలకీ గురై ఉన్మత్తుడౌతున్నాడు. బుద్ధిమంతుణ్ణి, పాతకాలపు మనిషిగా పరిగణిస్తున్నారు. వెనకటి యుగాలలో చలామణి అయిన తుక్కు భావాలేవో తెలుసుకుంటే, మనతరంలో వున్న చెత్త భావాలని ఎదుర్కోడం సుళువంటాడు రసెల్. పాపభీతి తుక్కు భావాలలో ప్రధానమైంది. భూకంపం, అగ్నిపర్వతం ప్రేలడం, ఉప్పెన, వరదలు, కాలేఅడవులు — మొదలైన భీభత్సాలు ప్రకృతి విజృంభించినప్పుడు జరుగుతాయి. ప్రాచీన మానవుడు వీటికి భయపడేవాడు. ఇవి ఎందుకు జరుగుతాయో, వీటినుండి తప్పించుకుని ఎల్లా క్షేమంగావుండాలో తెలియక, ఆది మానవుడు, ఇదంతా దైవ నిర్ణయం అనుకునేవాడు. తన కర్మ; తాను చేసిన పాపాలకి, ఇది ఫలితం అనుకునేవాడు. దయ్యాలు, భూతాలు, మాంత్రికుడు, బలులివ్వడం, రాయినీ రప్పనూ మొక్కడం, చేతబళ్ళు— ఇంద్రజాలం — వీటిని సృష్టించుకుని సమాధాన పడేవాడు. పాపభీతి వల్ల, 'ఇది కూడదు' —'ఇది నిషేధం' — అని ఎన్నో అర్థశూన్యమైన అలవాట్లను, ఆచారాలనూ అలవర్చు కొన్నాడు. "ఎవరన్నా తుమ్మినప్పుడు, ఛాందసులు 'దైవం నిన్ను రక్షించు గాక' అంటారు. ఇల్లా అనడానికి కారణం వుండేది. తుమ్మినప్పుడు, తమ శరీరంలోని ఆత్మకూడా బైటకి వచ్చేస్తుందని వారి నమ్మకం. ఆత్మలేకుండావున్న శరీరంలోకి, భూతం ప్రవేశిస్తుందిట. దైవం పేరు చెప్పగానే, ఆ భూతం పారిపోతుందని వారి నమ్మకం.'' ఇట్లాంటి నిషేధాలూ, ఆచారాలూ మనలోకూడా ఎన్నోవున్నాయి. రాత్రిపూట భోజనం చేసేటప్పుడు తుమ్మితే ఆయుష్షు తగ్గిపోతుందని, నెత్తిన నీళ్ళుచల్లడం—

ఒక ఉదహారణ. తుమ్మినా, చీదినా, కాళ్ళు కడుక్కుని ఆచమనం చెయ్యమన్నారు మొదట్లో. దగ్గరలో నీళ్ళు లేనప్పుడు, చెవి, ముక్కు, చేతితో స్పృశించమన్నారు; ముక్కు చివర అగ్ని, చెవి చివర నీరు వుంటాయట.

గాలివానతో మెఱుపు, ఉరుము వుంటాయి. ఈ మెఱుపులో విద్యుత్‌శక్తి వుంది. నేలపై ఏ వస్తువుని మెరుపు తాకినా, అది దగ్ధమౌతుంది. భవనంని తాకితే, భవనం నాశనమౌతుంది. మెఱుపు వల్ల ఈ ప్రమాదం జరక్కుండా, బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనే అమెరికా దేశీయుడు, ఒకకడ్డీయంత్రం కనుక్కున్నాడు. లోహపు కడ్డీని ఇంటిపై పెడితే, మెఱుపుని ఆకడ్డీ లాక్కుని, ఇంటికి ప్రమాదం జరక్కుండా, భూమిలోకి పంపిస్తుంది. పాపాలు చేసిన దుర్మార్గులని శిక్షించడం కోసం, దైవం, ఈ మెఱుపుని పంపుతుంటె, అది జరక్కుండా కడ్డీని అడ్డువెయ్యడం, అపచారమని, అనాటి మతపెద్దలు తీర్పు చేశారు. మూడవ జార్జి చక్రవర్తి, వీరి వాదాన్ని బలపరిచాడు. మంచివారికి మెఱుపు హానిచెయ్యదు. చెడ్డవారిని శిక్షిస్తుంది. ఈ కడ్డీ పెట్టడంవల్ల చెడ్డవాళ్ళు శిక్షింపబడక తప్పించుకు పోతున్నారు — అన్నారు వీరంతా. అక్కడ ఒక ప్రాంతంలో ఆ సమయంలో భూమి కంపించిందిట. ఈ కడ్డీలు చూసి దైవం ఆగ్రహించి భూకంపం కలుగజేశాడన్నారు. రాను రాను, ఈ కడ్డీలను వాడుతూవచ్చారు జనం. భూమి కంపించిన ప్రాంతం, మళ్ళీ భూకంపానికి గురికాలేదు. "ఇండియాలో ఒకప్పుడు, భూకంపాలు జరిగినప్పుడు, వారు చేసిన పాపాలకు శిక్షగా భావించమన్నాడు మహాత్మాగాంధీ, తనతోటివారిని." అని రసెల్ పాపభీతికి తార్కాణని విపులీకరించాడు. అస్పృశ్యత, గాంధీ పేర్కొన్న 'పాపం'.

తాను చెప్పిన దాన్ని గాంధీ నిజంగా నమ్మి చెప్పాడనుకోను నేను. సామాన్య ప్రజలో, మతం పట్ల ఎంతో నమ్మకం వుంది. వారి మనస్సుకు నచ్చేలాగు చెప్పాలంటె, వారి కర్థమయ్యే భాషలో చెప్పాలి. అందుకోసం గాంధి ఇల్లా అన్నాడనుకుంటా.

మరొక ఉదహారణ: జీవకారుణ్య సంఘం వారు, తమ ఉద్యమాన్ని బలపరచమని, క్రైస్తవ మతాధిపతిని కోరగా, ఆయన బలపరచనన్నాడుట. జీవహింస 'పాపం' కాదు, జంతువులకు ఆత్మలు లేవు, అన్నాడుట. "నేను పాపిని — కావుననే నాకు ఈ పాపభీతిలో అంతరార్థం బోధపడదులెండి" అంటాడు రసెల్ తమాషాగా. చనిపోయిన వాడు మళ్ళీ పుడతాడు — కావున శవాన్ని సమాధిచెయ్యాలి కాని దహనం చెయ్యకూడదట. సమాధి చేసిన దేహానికి మళ్ళీ ప్రాణం పొయ్యగలడు దైవం; దహనం జరిగితే, మళ్ళీ అవయవాలన్నింటినీ సృష్టించి ప్రాణం పొయ్యడం, దేవుడికి అంత సులువు కాదు. కాబట్టి సమాధి మంచిది. "దహనం జరిగాక, ఆ వ్యక్తికి దేవుడు ప్రాణం ఇవ్వలేడు — అనడం దైవం పట్ల అపచారమేనంటాను." అంటాడు రసెల్. పూర్వకాలంలో, శవానికి ఎంతో మహత్తు వుండేది. ఈజిప్టు దేశీయులు, శవాన్ని భద్రంగా వుంచుతారు. చైనాలో కూడా ఈ పద్ధతి వుంది. వైద్యరంగంలో పరిశోధన నిమిత్తం ఒక ఫ్రెంచ్ డాక్టరు, శవాలు ఇప్పించమని చైనీయులను కోరితే, వారు ఆశ్చర్యపడి ఆ పనిమట్టుకు చెయ్యం, కావాలంటే, బతికున్న నేరస్థుల్ని ఇస్తాం, మీ పరిశోధనలకి, — అన్నారుట!

కామక్రీడ అన్నింటినీ మించిన మహాపాపం. కాథలిక్కులు బ్రహ్మచర్యం మంచి దన్నారు. అది సాధ్యపడకపోతే పెండ్లి చేసుకో వచ్చు. పిల్లలు కలగాలన్న కోర్కె వుంటె, దంపతులు కామక్రీడ జరపవచ్చు. సంతాన నిరోధకచర్య తీసుకుంటే, భార్యాభర్తలు కామక్రీడ జరపకూడదు. వైద్యుల సలహా ప్రకారం, తల్లి ప్రాణం కాపాడలంటే, గర్భస్రావం తప్ప వేరే మార్గం లేకపోయినా, కడుపు పోగొట్టకూడ దంటారు. వైద్యులకేంతెలుసు, తల్చుకుంటె, చివరిఘడియల్లో తల్లి ప్రాణం కాపాడగలడు దైవం. పాపం చేసిన వారిని, దేవుడు సుఖవ్యాధుల ద్వారా శిక్షిస్తాడు. పాపం చేసిన భర్తద్వారా, సుఖవ్యాధులు అమాయకులైన తల్లి బిడ్డలకు సంక్రమించినా, ఇది ఇల్లా ఎందుకు జరిగిందని మనం ప్రశ్నించకూడదు.

"స్త్రీ పురుష సంబంధం విషయంలో కాథలిక్కు మత గురువులు నిర్దేశించిన దానికంటే కఠినమైన సూత్రాలుండాలంటారు కొందరు పెద్దలు.

పిల్లలు కలగాలన్న కోర్కె వుండి కూడా, భార్యా భర్తలు కామక్రీడ జరపడం తప్పని, వార్ధక్యంలో, టాల్‌స్టాయ్, [1]మహాత్మాగాంధి సూచించారు.... పొగపీల్చడం, కామక్రీడంతటి పాతకం అంటాడు టాల్‌స్టాయ్. ఆయన వ్రాసిన ఒక నవలలో ఒక పాత్ర, హత్యచేసేముందు, తగినంత క్రోధం తెచ్చుకోడానికి, సిగరెట్టు కాలుస్తాడు. మతగ్రంథాలలో, పొగాకు ప్రశంశ లేదు. ఆ నాటి వారికి పుగాకు విషయం తెలిసివుంటె, దాన్నికూడా నిషేధించి వుండేవారు.'' అని, ఈ విషయమై రసెల్ వ్యాఖ్య.

నేడు అమలులోవున్న నైతిక సూత్రాలు రెండు విధాలుగా వున్నాయి. సమాజంలో అందరం సుఖంగా వుండాలంటే, ఏవేంకావాలో కూడబలుక్కుని, బుద్ధిని వినియోగించి, అలవరచుకున్న సూత్రాలు కొన్ని; క్రైస్తవ, మహమ్మదీయ, హిందూ బౌద్ధ మత గ్రంథాలలో నిర్వచించబడిన ప్రాచీన కాలపు సూక్తుల ననుసరించి, సంప్రదాయంగా, అమలు జరుగుచున్న సూత్రాలు మరికొన్ని. హత్య, దొంగతనం — మొదలైన విషయాలపట్ల, ఈ రెండు నీతులకూ అంగీకారం కుదురుతుంది. పందిమాంసం తినకూడదన్నది కొన్ని మత గ్రంథాలలో మాత్రం వుంటుంది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం పరిశోధించి తెలుసుకున్న పరిజ్ఞానాన్ని వినియోగించుకోక, ఏనాడో, మరో దశలో — వెనకటివారెవరో వ్రాసిన వాటినే ప్రమాణాలుగా స్వీకరించడం ఆశ్చర్యంగా వుందంటాడు రసెల్.

వెనక వ్రాయబడినవి మానవుడికి హానిచేసేవిగా వుంటే, వాటిని మనం ఎందుకు స్వీకరించి పాటించాలి? దయాదాక్షిణ్యాలు గలవారు, ఈ ప్రాచీన సూత్రాల వెనకవున్న చింతనని గుర్తించాలి గాని, తూచా తప్పకుండా పాటించి తీరాలని లేదు.

'పాపం' అన్న భావంలో పేచీలున్నాయి. దేవుడు శాసించినదాన్ని అతిక్రమించడం, పాపం అంటారు. సరే. దీన్ని వితర్కిద్దాం. దేవుడు సర్వజ్ఞుడు; సర్వశక్తులూ గలవాడు. అట్లాగైనప్పుడు, దైవం శాసించిన దానికి విరుద్ధంగా ఏదీ జరగడానికి వీల్లేదు. కావున, పాపి, దైవాన్ని దిఃఖరిస్తే, ఇటా దిఃఖరించాలన్నదికూడా దేవుడే శాసించాడనుకోవాలి. మనుషులు పాపాలు చెయ్యాలి, అని శాసించాక, దేవుడు ఈ మనుషుల్ని, నరకానికి పంపడం ఏం బాగుంది? ప్రతిదీ దైవం శాసించినదే ఐతే, నీరో (క్రూరుడైన రోము చక్రవర్తి) తల్లిని హత్య చెయ్యడం కూడా దేవుడు శాసించివుండాలి. దేవుడు మంచివాడుగావున, నీరో చేసిన హత్యకూడా మంచిదే అవాలి. ఈ తర్కంనుండి మనం తప్పించుకోలేమంటాడు రసెల్.

'అహం' — మనం అధికులమన్న భావం—మతంద్వారా మనం స్వీకరించిన నమ్మకాలలో చాలా భాగం ఈ భావంతో ముడిపడినవే. పాపం చెయ్యడం — 'నేను పాపిని' అన్న భావం కూడా, ఈ 'అహం' నుండి జనించినదే. ఇక్కడ వొక సంఘటన ఉదహరిస్తాడు రసెల్. ఒకాయన దిగులుగా వున్నాడుట. ఏడుస్తున్నాడుట. ఎందుకయ్యా నీకీబాధ అని ప్రశ్నిస్తే, 'నా చిన్నప్పుడు ఒక అపచారం చేశాను.' అన్నాడుట. 'నువ్వు బాధపడనక్కర్లేదు. ఇట్లాంటి అపచారం ఎందరో చేశారు— నువ్వు ఒక్కడివేకావు.' అన్నాక, ఆ వ్యక్తి, దిగులు పోయి, సుఖంగా వున్నాడుట. "ఇంకెవ్వరూ చెయ్యనిది తనుచేశాడు గనక, ఆ వ్యక్తి అల్లా బాధపడటంలో అహం ప్రకటించి ఆనందం పొందుతున్నాడు. అది అందరూ చేస్తున్నారు, అపూర్వమైంది కాదు, అని తేలేసరికి, పాపంచేశానన్న బాధలో ఆనందం లేకుండా పోయింది.''

'అహం' పెరగాలంటె, ఇతరులని హింసించడం ఒక పద్ధతి. ద్వేషపూరితమైన ఈ ఉద్రేకం వెనక, అపోహలు, అద్భుతకల్పనా, కూడా వుంటాయి. ఒక్క వ్యక్తి ఈ అపోహలు కల్పించుకుంటె, పిచ్చివాడనిపించుకోవచ్చు. కాని, సమాజంలో చాలామంది ఈ అపోహలు కల్పించుగుని ప్రచారం చేస్తే అద్భుత కల్పన, యదార్థమై, అందరిచేతా స్వీకరింపబడుతుంది, సాముదాయక ఉద్రేకం యుద్ధానికి పురిగొల్పినట్లుగా. అద్భుత కల్పన పురిగొల్పేది ద్వేషం, పగ, కసి. నరబలిద్వారా గొజాకాండని యూదులు హత్యకావించారన్న కల్పనని, నాజీలు నమ్ముతూ

1. సంతానం కోసం దాంపత్యవిధులు నిర్వహించమని, గాంధీగారనడం ఎరుగుదును. మరి ఇల్లా ఎక్కడ అన్నాడో తెలియదు.

వచ్చారు. ఈ నమ్మకాన్ని పురస్కరించుకుని, ద్వేషించే వారిని వారు హింసించ వచ్చు. భూతాలు ఆవహించడం వల్ల పిచ్చెత్తుతుందని నమ్మేవారు, పదునెనిమిదవ శతాబ్దంవరకూ. పిచ్చివాణ్ణి కొడితే, అతనిలోవున్న భూతాలుకూడా దెబ్బలు తిని, వాణ్ణి వదిలి వెళ్ళి పోతాయన్న నమ్మకతో పిచ్చివాణ్ణి హింసించడం జరిగేది. మూడవ జార్జి రాజుగారికి పిచ్చెక్కినప్పుడు కొట్టి, హింసించారట. వైద్య వృత్తిలో, రోగిని హింసించడంతోటె చికిత్స ప్రారంభమయ్యేది. క్రితం శతాబ్దిలో రోగికి బాధ తెలియకుండా వుంచే మత్తు మందు కనుక్కున్నారు. పురుడు పోసేటప్పుడు ఈ మత్తు మందు స్త్రీలు వాడచ్చునన్నాడు డాక్టర్ సింప్సన్. ఛాందసులు వల్లకాదన్నారు. బాధపడి కవాలని దైవం శాసించాడన్నారు. ఆదిమ స్త్రీ 'ఈవ్' పాపం చేసింది కావున స్త్రీ బాధపడాలన్నారు. మత్తు మందు, బాధ తెలియనివ్వదు గావున, తప్పన్నారు. తొలి మానవుడైన ఆదమ్ నిద్ర పోతున్నప్పుడు, అతని ప్రేగుతీసి స్త్రీని సృష్టించాడు దేవుడు — కావున పురుషులకి మత్తు మందిస్తే ఫరవాలేదన్నారుట! పాశ్చాత్య దేశాలలో స్త్రీలకు వోటింగు హక్కు వచ్చాక, ఇదంతా తప్పని గ్రహించారు. క్రైస్తవ మతంతో నిమిత్తంలేని జపానీయులు, ఈనాటికీ, స్త్రీలకు బాధతొలిగే మందు కూడదు అంటారుట.

'అల్లాగే, 'మాది ఉత్తమజాతి' — 'మాది స్వచ్ఛమైన రక్తం' అనే నినాదాలు, సాముదాయక జాత్యహంకార సూచకములే. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో, గాయపడిన వారికి, రక్తమిచ్చి సహాయ పడేది రెడ్‌క్రాస్ సంస్థ. అప్పుడు, నీగ్రోల రక్తం వాడకూడదన్నారుట అమెరికా రెడ్‌క్రాస్ వారు. నీగ్రోల రక్తం, నీగ్రోల కియ్యవచ్చునని మాత్రం అంగీకరించారు. హిట్లర్ కాలపు జర్మనీలో, యూదుల రక్తం, నాజీ సైనికులకు వాడకూడదన్నారు. జాతినిగూర్చి వింత వింత అభిప్రాయాలున్నాయి. రాజులు, రాజ్యం ఏలినకాలంలో, ప్రజ కంటే రాజు ఘనుడు. రాజు జాతి ఉత్తమజాతి. స్త్రీలకంటే, పురుషులు తెలివైన వారు — అని నిన్న మొన్న వరకూ నమ్ముతూ వచ్చారు. ఇతర జాతులకంటె, తెల్ల జాతివారు అధికులు — ముఖ్యంగా నల్ల జాతులకంటె. జపాన్‌లో, పసుపుపచ్చరంగు జాతి వారు అధికులు. హైటీలో, క్రీస్తుని నల్లగానూ, సాటన్‌ని (దైవాన్ని ధిఃకరించిన దుర్మార్గుడు) తెల్లగానూ చూపుతారు. గ్రీకుజాతి ఉత్తమమైందని, ప్లాటో, అరిస్టాటిల్‌లు చెప్తూవచ్చారు గావున, బానిసత్వం నెలకొల్పబడింది — ఎటొచ్చీ, గ్రీకులు ప్రభువులు, హూణులు బానిసలూ అవాలి. ఇదంతా పదవుల్లో వున్నవారు ప్రచారం చేసిన అభూతకల్పన కాని, ఏ మాత్రం యదార్థం కాదంటాడు రసెల్. "యూరప్ అంతటా, ఎక్కడాకూడా స్వచ్ఛమైన జాతి అంటూ వొకటుందనుకోను. రష్యనులలో టార్టార్ రక్తం, జర్మనీవారిలో స్లావనిక్ రక్తం, ఫ్రెంచ్‌వారిలో కెల్టు, జర్మనీయుల మిశ్రమరక్తం, ఇటాలియన్‌లలో రోముదేశపు బానిసల రక్తం, వున్నాయి. బాగా మిశ్రమమైన జాతి ఇంగ్లీషువారు. స్వచ్ఛమైన జాతికి చెందడంలో విశేషమైన మేలు కనబడదు. నిజానికి, స్వచ్ఛమైన జాతులను, ఆస్ట్రేలియా ఆదిమవాసులలోనూ, ఆఫ్రికాలో పిగ్మిల (పొట్టివాళ్ళు) లోనూ, హొటెన్‌టాట్ జాతులలోనూ చూస్తాం — అంటాడు రసెల్. ఈ జాతులు గొప్ప సంస్కృతిని నెలకొల్పాయనలేము.

జాతికి సంబంధం లేకుండా, రక్తం గురించి ఎన్నో మూఢ నమ్మకాలు ఉన్నాయి. బహిష్టు, రజస్వల విషయంలో పెట్టిన ఆంక్షలు చూస్తే, రక్తం మలిన పరుస్తుందన్న నమ్మిక ఎంత దృఢమైందో తెలుస్తుంది. 'బిడ్డది తండ్రి రక్తం' అనుకోడం కూడా ఈ రకమైన ఆచారమే. నిజానికి బిడ్డలో వుండేది తల్లి రక్తం కాని, తండ్రిది కాదు. మార్క్సు సిద్ధాంతాల ఫలితంగా రూపొందిన రష్యాలో, జాతుల విభజన ఆర్థిక వ్యవస్థద్వారా జరిగింది. శ్రామికులు మంచివారు; ఇతరులు చెడ్డవారు. కమ్యూనిస్టులు మంచివారు, ఇతరులు చెడ్డవారు. ఈ రెంటినీ సమన్వయ పరచాలంటె, మాటల అర్థాలనిమార్చాలి. శ్రామికుడంటె, ప్రభుత్వపక్షం వాడు. 'కులక్' అంటె మొదట్లో స్థితిపరుడైన కర్షకుడు— అని అర్థం. తర్వాత, సమిష్టి పద్ధతికి వ్యతిరేకుడన్న అర్థం వచ్చింది. ఘనకార్యం చేసిన నల్లరంగు వ్యక్తిని

మెచ్చుకోవాలంటె, అమెరికాలో 'అతను తెల్లవాడు' అంటారుట. ధైర్య సాహసాలుగల మహిళ 'మగతనం' కొనియాడతారు.

ఆర్థిక రంగంలో ఇట్లాంటి మూఢనమ్మకాలు కొన్ని వున్నాయి. బంగారం, వజ్రాలు — వీట్లకున్న విలువ వీటిల్లో ఒకటి. బంగారానికీ, వజ్రానికీ, ఒకప్పుడు మహత్తు వుందని నమ్మేవారు. "ట్రాన్స్‌వాల్ గనులలో బంగారం తవ్వి, అమెరికా బ్యాంకులలో వుంచుతారు. అప్పుతీసుకున్న దేశాల వారివద్ద అప్పు చెల్లించేటందుకు డబ్బుండదు; వస్తు రూపేణా ఇస్తే స్వీకరించరు గావున, దివాళా తియ్యాల్సి వస్తుంది. నలభై ఏళ్లక్రితం ఏర్పడిన ఆర్థికమాంద్యానికి కారణం, బంగారానికి మహత్తున్నదన్న నమ్మిక వల్లనే నంటాడు ఈయన.

మానవ స్వభావము, అన్ని చోట్లా, ఎల్లప్పుడూ ఒకేలాగుంటుంది, మార్చలేం — అన్నది మరొక తుక్కు భావంగా పేర్కొన్నాడు రసెల్. 'మనుషులు —అంతా ఒకటేనండీ, మారరు' అని ఎవరన్నా అంటే, ఆ వ్యక్తి తన గ్రామంలో తానెరుగున్న నలుగురైదు గుర్నీ దృష్టిలో పెట్టుకుని అంటున్నాడన్నమాట. ప్రాచీన సమాజాలలో మనుషుల్ని పరిశీలిస్తే, ఈ నిర్వచనం తప్పని తెలుసుకోవచ్చు.

ఒక భార్యని పోషించే ఆర్థిక స్తోమతలేనందున టిబెట్టుదేశంలో, స్త్రీకి నలుగురైదుగురు భర్తలుంటారు. మరి కొన్ని ప్రాచీనపు తెగలలో, అతిథికి భార్యని వప్పగించడం ఆచారం. పోషించలేక, పిల్లల్ని చంపివెయ్యడం వుండేది. జనాభా పెరిగిపోకుండా వుండాలంటె, ఈ శిశు హత్య మంచిదే నన్నాడు 'ప్లేటో' (గ్రీకుతత్వజ్ఞుడు). కొన్ని ఆదిమవాసులలో, వ్యక్తిగతమైన ఆస్థిపాస్థులే లేవు. నాగరిక సమాజాలలోకూడా, మానవ ప్రకృతికి అతీతమైన ఏర్పాట్లు జరిగేవి. వీటికి కారణం, ఆర్థిక పరిస్థితి. మాస్కోలో, ఇళ్లు దొరకడం కష్టంగా వున్నకాలంలో, గర్భవతి అయిన స్త్రీకి కలగబొయ్యే సంతానానికి, నేనే తండ్రినని, వ్యక్తులు ఎగడేవారుట — ఎందుకంటె, గర్భవతికి ఒక గది ఇచ్చేది ప్రభుత్వం; తండ్రి అనిపించుకున్న వ్యక్తికి, ఆ గదిలో సగం వాటా దొరికేది. విద్య, శిక్షణ, — మానవ స్వభావానికి రూపం కల్పించే శక్తులు. తిండి, విద్య, తగు శిక్షణ—వీట్లతో మనుష్యుల్ని కఠినులుగా తయారు చేయవచ్చు; లేక అమాయకులుగా, బానిసలుగా రూపొందించవచ్చు. మానవ స్వభావం మారదు— అన్న నమ్మకం వల్ల ఏర్పడిన ప్రమాదం ఏమిటంటె, పోటీ పడటం మానవుడి స్వభావం గనక, యుద్ధాలు ఎప్పుడూ జరిగి తీరతాయన్న నమ్మకం. కోరినదాన్ని పొందలేక విఫలులైన వ్యక్తులు, యుద్ధానికి సిద్ధులౌతారన లేము. 1814 వరకూ స్వీడన్ దేశీయులు యుద్ధాన్ని ఎరగరు. వారు నిస్పృహులు కాలేదు. చాలా సంతోషంగా వుండే ప్రజ. ఇతరులు జరిపే మరో యుద్ధంలో తాము ఇరుక్కుంటామన్న బెంగ తప్ప, మరొక చింతలేదు, వారికి. "బలమైన ప్రభుత్వం, సైనికదళం, ప్రచార సాధనాలు నాకు ఇవ్వండి, ముప్పైయేళ్లల్లో, రెండు, రెండూ కలిపితే, మూడన్న భావాన్ని ప్రజలు స్వీకరించేటట్లు చేస్తాను. నీరు వేడెక్కినప్పుడు గడ్డకడుతుందనీ, చల్లబడినప్పుడు, మరిగి పోతుందనీ — నమ్మేటట్లు చెస్తాను. ఇది నమ్మినంతమాత్రాన, నీళ్లు కాచాలంటె, రెఫ్రిజిరేటర్లో పెట్టరనుకోండి. కాని పైకిమాత్రం వారంతా ఆ పాటే పాడతారు. ప్రభుత్వంచెప్పిన దానికి భళాభళీ అంటారు. అట్లా అనని వారిని, ప్రభుత్వం, ఉద్యోగంనుండి తొలిగిస్తుంది. అధికార వర్గంలో, పెద్ద పదవుల్లో వున్న కొద్దిమంది ఉద్యోగులు మాత్రం ఒకర్నొకరు చూసుకుని, చెప్పుకుని, నవ్వుకుని, కన్నుగీటి— తమ పనుల్లో పడిపోతారు. కొన్ని ఆధునిక ప్రభుత్వాలు, ఈవిధంగా కొనసాగుతున్నాయనడం అతిశయోక్తి కాదు." అని రసెల్, ఊహించిన ఉదహరణ, చమత్కారమైంది. నేడు, ప్రచారానికున్న బలం, పలుకుబడి ఎంతటివో చూపేటందుకు, ఇది మంచి ఉదహరణ. ఎప్పుడన్నా రెండు రెండు కలిపితే మూడు అని నమ్మిన ఒక వూహాసామ్రాజ్యంచరిత్ర, కథగా, వ్రాయాలనిపిస్తుంది నాకు. కాని, ఈ ఉదహరణలన్నీ, 'మానవ ప్రకృతి మారదు' అన్నది తప్పుగా ఋజువు చేస్తాయనిపించదు నాకు. విద్య, శిక్షణ, వల్ల మానవుడి నమ్మకాలని, వూహాలని మార్చవచ్చు — కాని ఇవి మానవ ప్రకృతిని మార్చలేవు. ఆకలేసినప్పుడు అన్నం కావాలంటాడు మనిషి; అలిసినప్పుడు నిద్రిస్తా

నంటాడు. ఈ మానవ 'వ్యవస్థని'— తర్ఫీదు, విద్య — మార్చలేవు. కొందరు పెద్దలు కలిసి ఒక సమాజాన్ని రూపొందిస్తారు. ప్రజలు అందులో ఇమిడేలాగు, దాన్ని స్వీకరించేలాగు, విద్యద్వారా చెయ్యవచ్చు. ఆర్థిక స్థితి ఈ సమాజాల స్వరూపం నిర్ణయించవచ్చు. నిజమే. సంప్రదాయాన్ని స్వీకరించేటట్లు చెయ్యడం వేరు; అంత మాత్రంచేత మానవ ప్రకృతి మారిందనలేము. ఒక గ్రామంలో ఒకే విద్యాలయంలో విద్య నభ్యసించిన ఇరవైమంది, పెద్దయ్యాక, ఒకచోట గుమిగూడారనుకుందాం. అట్లా వుండగా ఎవరో 'పులి', 'పులి' అని అరుస్తాడనుకుందాం. ఏం జరుగుతుంది? వారందరూ భయపడి, చిందర వందరగా పారిపోతారు. భయం నుండి పారిపోవడం మానవ స్వభావం. దీన్ని ఎవ్వరూ మార్చలేరు. పారిపోక, మొండికెత్తి, తెగించి, పులితో దెబ్బలాడే వ్యక్తి వుండొచ్చు. ఇల్లా తెగించి, ధైర్యంగా ఎదుర్కొనడంకూడా మానవ స్వభావమే. ఆ గుమికూడిన ఇరవైమందిలో, ఒకడు పారిపోక నిలబడి దెబ్బలాడ్డానికి సిద్ధపడితే, ఆ వ్యక్తి విద్యా, శిక్షణ వల్ల అలా తయారయ్యాడు, అనలేం. మిగతా పందొమ్మిదిమందీ, ఆ విద్యాలయంలో తర్ఫీదు పొందిన వారే. వారంతా పారిపొయ్యారు, 'పులి' అనగానే. విద్య, శిక్షణ వల్ల అందరికీ పులి నెదుర్కొనే ధైర్యసాహసాలు నేర్పవచ్చు నన్న భావాన్ని స్వీకరించడం కష్టం. అందరికీ, పుష్టికరమైన ఆహారమిస్తే, ధైర్య సాహసా లబ్బుతాయనీ అనలేం. వారు బలంగా, ఆరోగ్యవంతంగా వుండొచ్చు, మొండి ధైర్యం, సాహసం, త్యాగశీలం మొదలైనవి, మానవ ప్రకృతిలో భాగాలు. విద్యవల్ల, వాటిని ఉపయోగంలోకి తేవచ్చు— కాని మార్చలేం. జంతువు, ఆకలేసినప్పుడే వేటాడి తింటుంది. రేపటికి దాచుకోగలడు మనిషి. దానికోసం ఈ పూట పస్తుండ గలడు. రెండు రెండు మూడు కాదు, నాలుగని తెలుసుకున్న ఉన్నతోద్యోగులు కూడా తాము ప్రచారం చేస్తున్న 'రెండు రెండు మూడు'అన్న సత్యానికి, నవ్వుకున్నట్లు రస్సలే వ్రాశాడు. ప్రచారం, ప్రభుత్వం— వారి నమ్మకాలనీ భావాలనీ మార్చింది కాని, — సహజ ప్రకృతిని కాదు. ఇంక ఆ ఇరవై మందికీ, చిన్నప్పటి నుంచీ పాఠశాలలో పులి చాలా సాధువైన జంతువు అని బోధిస్తే, 'పులి' అనగానే వారు పారిపోరు — అని రస్సెల్ అంటె, నేనేమీ చెప్పలేనుస్మాండి.

సంప్రదాయ సిద్ధమైన భావాలకు విరుద్ధంగా నడుచుకొన్న వ్యక్తులు గొప్పవారనీ, వారి భావాలు మంచివనీ అనుకోడం పొరబాటే నంటాడు రసెల్. పొరబాటుపడే అవకాశాలెన్నో వున్నాయి. ప్రజామోదం పొందని సత్యాన్ని అన్వేషించడం బదులు, కొందరు, వెర్రివాళ్ళు, ప్రజామోదం పొందని పొరబాట్లని అలవరుచుకుంటారంటూ రసెల్ ఇల్లా వ్రాస్తాడు:

"ఒకాయన, తనకి తత్వశాస్త్రంలో అభిరుచి వుందంటూ, నా పుస్తకాలు, చదివిస్తానని, తీసుకెళ్ళాడు. మర్నాడు నాదగ్గరకొచ్చి, ఆ పుస్తకం చదివాననీ, అందులో తనకి అర్థమైన వాక్యం ఒక్కటే వుందనీ, ఆ ఒక్క వాక్యమూ అబద్ధమనీ— అన్నాడు. ఆ వాక్యం ఏదన్నాను. 'జూలియస్ సీజర్ రోము చక్రవర్తి చనిపోయ్యాడు' అన్న వాక్యం అన్నాడు. ఆ వాక్యంలో వున్న అబద్ధ మేమిటో చెప్పమన్నాను. 'వేరే చెప్పాలా. నేనే, సీజర్ చక్రవర్తిని!' అన్నాడు."

మంచి రోజు చూసుకుని ఒక పనికి ఉపక్రమించటం ప్రపంచం అంతటా వుంది. ఇదొకతుక్కు భావం అంటాడు రసెల్. "ఆదికాలంలో, సైనిక వీరులు, మంచి రోజు చూసుకుని యుద్ధానికి వెళ్ళేవారుట. పాశ్చాత్యులకు శుక్రవారం మంచిది కాదు. 'పదమూడు' సంఖ్య అమంగళమైంది. మేడ కడితే, 13 వ అంతస్థు వుండదు. ఇవన్నీ అపకారం చెయ్యని మూఢనమ్మకాలు. రెండు వేల సంవత్సరాల తర్వాత, మనం ఈనాడు అలవరుచుకున్న నమ్మకాలు మూఢనమ్మకాలుగా మూలపడొచ్చు. మానవుడు ఏదో ఒకటి నమ్మాలి. నమ్మకానికి నిదర్శనం దొరకనప్పుడు, తప్పుడు నిదర్శనాలతో తృప్తిపడతాడు. పాలకులు పదవులు స్వీకరించేటప్పుడు, మంచి రోజు చూసుకుంటారు. కాని ప్రభుత్వంలో ప్రధాన నాయకుడు చనిపోయినప్పుడు, అనువైన వ్యక్తిని వెంటనే ప్రధాన నాయకుడుగా పదవిలో వుంచాలి. వ్యవధి వుండకూడదు. అట్లాంటి సందర్భంలో, మంచిరోజు, తిధి, వారం, నక్షత్రం చూసుకోరు.

వెనక క్షురకర్మకి కూడా మంచి రోజు చూసు కోవాలి. ఇప్పుడు ఇది పోయింది.

సహజంగా, ప్రకృతిననుసరించి జీవించాలి— అన్నది కూడా మరొక చెత్త భావం. ఈ భావం చికిత్స విషయంలో బాగా చలామణీ అయింది. ఏమీ చెయ్యక, సహజంగా అల్లా వదిలేస్తే, కొన్నివ్యాధులు అవే కుదురిపోతాయి— శరీరం కోలుకుంటుంది— అన్నభావం. నిజమే. శరీరం సహజంగా తనకి తనే చికిత్స జరుపు కుంటుంది. చిన్నగాయాలు వాటంతటఅవే మానిపోతాయి. జలుబు తగ్గిపోతుంది. లంఖణం పరమౌషధం. కాని ప్రకృతి సిద్ధమైన చికిత్సకి, మనుష్యయత్నం కూడా కావాలి. క్రిమి నిర్మూలన ద్రావకం వాడకపోతే, పుండు విషమించొచ్చు. జలుబు, న్యూమోనియాగా పరిణమించ వచ్చు. దుస్తులు ధరించడం, స్నానం, తల దువ్వకోడం— ఇవన్నీ ప్రకృతికి విరుద్ధమైన పనులే. టీకాలు వేయించుకోడం అసహజమనీ, ప్రకృతి విరుద్ధమనీ, అనేవారు ఈనాటికీ వున్నారు. వండిన వంటకం, ప్రకృతి విరుద్ధం. క్రీస్తుపూర్వము, 600 సంవత్సరంలో వర్ధిల్లిన చైనాదేశపు తత్వశాస్త్రజ్ఞుడు, 'లవోట్సే' రోడ్లు, వంతెనలు, పడవులు— ప్రకృతి విరుద్ధాలైన పరికరాలుగా భావించి, చీదరించుకుని చైనాదేశం వదిలి వెళ్ళిపొయ్యాడు. నాగరికత తెచ్చి పెట్టిన ప్రతి కొత్త పరికరమూ, మొదట్లో, ప్రకృతి విరుద్ధమైందిగా పరిగణించబడటం, ఎప్పుడూ జరుగుతూనే వుంది. బ్రహ్మచర్యం, ప్రకృతి విరుద్ధం అనరు, ఎందువల్లనో — కాని, సంతాన నిరోధక ప్రక్రియని మాత్రం ప్రకృతి విరుద్ధమైందిగా ఖండించి వేస్తారు పెద్దలు. పిల్లల్ని సృష్టించిన భగవంతుడు, వారిని పోషించ లేకపోతాడా అంటారు వీరు. క్షామము తాండవించి, వేలాది ప్రజ చని పోయిన చరిత్ర మరిచి పోతారు వీరు. ఇహంలో తిండి లేక మాడి చస్తేనేం, పరంలో స్వర్గం అనుభవిస్తాడుగా, అంటారు వీరు.

అల్లాగే స్త్రీని గురించి ఎన్నో చెత్తభావాలు ప్రచారంలో వున్నాయి. ప్రతి మగవాడూ స్త్రీలని గురించి ఏదో ఒక నిర్వచనం చేస్తాడు. ఈ నిర్వచనాలన్నీ పోగుచేసి ఎవరన్నా ఒక చరిత్ర వ్రాస్తే బాగుండును. క్రైస్తవ మతం ప్రబలాక, స్త్రీ వగలాడిగా పేరుతెచ్చుకుంది, మరికొందరు ఆమె యోగిని కూడా కావచ్చునన్నారు. క్రితం శతాబ్దిలో స్త్రీచే వంచించబడటానికిష్టపడని పురుషులు, స్త్రీని దేవతగా పరిగణించి, ఆమెకి రాజకీయాలలో ప్రమేయం లేకుండా చేశారు. స్త్రీకి వోటింగ్ హక్కు కోసం కృషిచేసినవారు, స్త్రీ ప్రవేశంతో రాజకీయాలు చక్కబడతాయన్నారు. ఇది భ్రమ అని తెలిసిపోగానే, చాలామంది పురుషులు స్త్రీని వగలాడిగానే ఎంచుతున్నారు. పురుషుడి దౌర్జన్య, దారుణాలనుండి రక్షించగలవారుగా, స్త్రీలు తమని తాము ఎన్నిక చేసుకున్నారు. చెడ్డ నవలల్లో స్త్రీ ఏ స్థితిలో వుందో చూడొచ్చు. మొగాడు వ్రాసిన నవలలో ప్రధాన నాయికను రచయిత ప్రేమిస్తాడు గావున, ఆమె అబలగా చిత్రించ బడుతుంది. రచయిత స్త్రీ ప్రవర్తన, మనస్తత్వం, గమనించి వ్రాయడు. తన ఉద్రేకాలని పరోక్షమైన యదార్థాలుగా రూపొందిస్తాడు. ఇతర పాత్రల చిత్రణలో, పరిశీలన వుండొచ్చు. స్త్రీలు వ్రాసిన నవలల్లో, రెండు రకాల స్త్రీపాత్రలు తటస్థపడతారు. అందం, తెలివి, ప్రేమ, వివేకము, లాలన — ఇవన్నీ కలిగిన తమలాంటి పాత్రలు, లేదా అన్ని దుర్గుణాలూ గల వేటకత్తెలుంటారు. పురుషులతు గాని, స్త్రీలకు గాని, స్త్రీని సమగ్రంగా చిత్రించడం సాధ్యం కానట్లుంది. అల్లాగే ఒక జాతిని గురించిన అభిప్రాయాలు కూడా, సత్యదూరాలంటాడు రసెల్. కండ్లజోడు ధరించిన ఆచార్యులు, జర్మనీ వారు; ప్రేమ కలాపాలలో నిమగ్నులైనవారు ఫ్రెంచ్‌వారు; దుకాణదారులు ఆంగ్లేయులు — మొదలైన అభిప్రాయాలన్న మాట — ఆంధ్రుల ఆరంభశూరత్వం లాంటి అభిప్రాయం.

ఇట్లాంటి భావాల, నిజానిజాలు కనుక్కోవాలంటె, పరిశీలన అవసరమంటాడు. దృష్టాంతరాలు వెదకాలంటాడు. గ్రీకు తత్వజ్ఞుడు అరిస్టాటెల్, పురుషుడికున్నన్ని పళ్లు స్త్రీకి లేవంటాడు. ఆయన భార్య నోరు తెరవమని, నోట్లో పళ్లు లెక్కించి వుంటె, తీరిపోను. అట్లా పరిశీలించక, గుడ్డిగా కొన్ని అసత్యాలు ప్రచారం చేసిన అరిస్టాటెల్ 'నాగరికతకు పట్టిన జాడ్యం' అని రసెల్. తెలియని

విషయం, తెలుసుననుకోవడం మనం చేసే పొరబాట్లలో ప్రధానమైంది. రూఢైన ఆధారాలు లేని విషయాలని గురించే, వాదోపవాదాలు చెలరేగేది. ప్రయాణం చెయ్యి, మరో దేశంలో గడుపు, నీ భావాలకి విరుద్ధమైన భావాలని ప్రచారం చేసే వారి స్నేహం చెయ్యి, నీ పార్టీకి వ్యతిరేకులైన పార్టీవారి పత్రిక చదువు, వారి భావాలు నీకు వెఱ్ఱివిగా తోస్తే నీ భావాలు వారికి వెఱ్ఱివిగా తోస్తాయనుకుని తృప్తిపడు. ఇట్లా చెయ్యడం వల్ల, ఉద్రేకం సమసి, నిదానంగా ఆలోచించే మనస్తత్వం ఏర్పడుతుంది అంటాడు రసెల్.

"రైల్వేలు, స్టీమర్లు, యంత్రాలు — ఇవి మహాత్మాగాంధీకి నచ్చవు. పారిశ్రామిక విప్లవం తెచ్చిన మార్పులు లేకపోతేనే బాగుండు నంటాడు ఆయన. పాశ్చాత్య దేశాలలో, ఇట్లాంటి అభిప్రాయం గలవారు దొరకరు. వారంతా, పారిశ్రామిక విప్లవాన్ని స్వీకరించిన వారే. నీకిష్టం కాని భావంలోని నిజానిజాలు తెలుసుకోవాలనుకున్నప్పుడు, గాంధీగారు, ఏ విధంగా ఈ భావాన్ని వితర్కించి వుందురో వూహించు. ఈ విధంగా వూహించి, అప్పుడప్పుడు నా అభిప్రాయాలు మార్చుకున్నాను. ఈ భావంకాక మరొక భావం వుండే అవకాశం వుందనీ, అదికూడా నా భావం అంతటి మంచిదై వుండొచ్చునని గ్రహించడం వల్ల మూఢ విశ్వాసం నుండి జనించే మొండి పట్టు, — బల్లగుద్ది కచ్చితంగా చెప్పే, స్వభావం, క్షీణించి పోతాయి."

ముఖస్తుతి చేసేభావాలను స్వీకరించేముందు జాగ్రత్తపడు, పురుషుడు అధికుడంటారు, స్త్రీ అధికురాలంటారు. కవులంతా పురుషులేనంటే, నేరస్థులంతా పురుషులే నన్న సమాధానం వస్తుంది. ఇందులో ఏది నిజమో ఎవ్వరూ నిర్ణయించలేరు. మనం అధికులం, మనజాతివారు అధికులు, మన దేశం గొప్పది, ఇతర దేశాలతో పోల్చి చూసినప్పుడు మన లోపాలని విడిచేసి, మంచి లక్షణాలను మాత్రం వక్కాణిస్తాం. మనిషి అధికుడో కాడో ఎవ్వడూ చెప్పలేడు. ఎందుకంటె మనిషిని మనిషితో కాక, నిర్జీవమైన బాహ్యజగత్తుతో పోల్చలేం. ఇట్లాంటప్పుడు, అతి విశాలమైన విశ్వంలో, భూగోళం ఎక్కడో మారు మూలగా వున్న చిన్ని గోళం. అందులో మనిషి మహా అల్పుడు. ఇతర గోళాలలో, మనిషిని మించిన ప్రాణులుండొచ్చు. — ఇలా అనుకుంటే తప్ప, మానవుడి అల్పత్వం తెలిసిరాదంటాడు రసెల్.

మన పొరబాటు కి మరొక కారణం, భయం. దయ్యాలంటే భయం. యుద్ధ సమయంలో, పుకార్లు, కల్పనాకథలు ప్రచారంలో కొస్తాయి. ఇవన్నీ భయం కల్పించినవే. ఎక్కడో అమృతం వుందనుకోడం, మనకి స్వర్గం, మన శత్రువులకి నరకం — యీ కల్పనలన్నీ భయం రూపొందించినవే. చీకటంటె భయం. మరొక గుంపు అంటే భయం. మృత్యువంటే భయం. వారిలో వున్న అస్పష్టమైన భయాన్ని దాచెయ్యడానికి యత్నించేవారిలో రేకెత్తే భయం— ఈ భయాలకి లొంగ కూడదు. లొంగిపోతే మూఢాచారాలకు తలఒగ్గినట్లే. మూఢ నమ్మకం క్రౌర్యానికి దారితీస్తుంది. భయాన్ని జయించడమే జ్ఞానం, సత్యాన్వేషణకి ఇదే మార్గం.

కొన్ని తత్వశాస్త్రాలు నేర్పింది, భయం జయించాలనే. శీలం కలిగి వుండటమే జీవిత పరమావధి. ఏ శత్రువూ, నా శీలాన్ని అపహరించలేడు, కాబట్టి, శత్రువులంటే భయపడనక్కర్లేదు. శీలం ఒక్కటే పరమార్థం అని నమ్మడం కష్టం. ఐహిక కష్టాల పట విముఖత చూపడం ఒక్కటే పరమార్థం అంటాడు తత్వజ్ఞుడు, స్పినోజా. శారీరిక బాధ చెడుగు కాదన్న వాదం మూఢనమ్మకం నుండి జనించినదే నంటాడు రసెల్. ఎందుకంటె, ఇది నమ్మిన వారికి వారి కష్టాలపట్ల విముఖత ఏర్పడడమే కాకుండా, ఇతరుల కష్టాలని గురించి పట్టించుకోని మనస్తత్వం ఏర్పడుతుంది. "మనిషి, ధైర్యంగా మృత్యువు నెదుర్కొని, ప్రాణాన్ని అర్పించగలడు, ఒక ఆదర్శం కోసం. కాని ఆ ఆదర్శం, ప్రాణత్యాగం చెయ్యవల్సినంత ఘనమైంది కాదు — అని మాత్రం అంగీకరించడు. మృత్యువు కంటె బాధాకరమైంది, అపనింద. అందుకనే, ఒక సమాజంలో వారందరూ ఒక విపత్తుకి గురైనప్పుడు, సమాజం చెప్పిన దానికి విరుద్ధంగా చెప్పక, అందరివలే తామూ తలొగ్గి నడుచుకుంటారు." అని ఒక ఉదంతం

చెప్తాడు రసెల్. 1820 లో, ఉత్తర న్యూయార్క్ ప్రాంతంలో చెరువుగట్టున వొక యోగిని నివసించే దిట. ఫలానా రోజున, చెరువులో నీళ్లపై నడిచి వెడతానని, తన అనుచరులకి తెలియచేసిందట. ఆ రోజుకి, వేలాదిగా జనం వచ్చారుట ఆ వింత చూడ డానికి. "నేను ఈ నీళ్ళ మీద నడిచి వెళ్ళగలనన్న నమ్మకం మీ అందరికీ వుందా?" అని అడిగిందట. ఏక కంఠంతో వారంతా "ఓ, గట్టి నమ్మకం వుంది" అన్నారుట. "అట్లాగైతే, నేనింక ఈ నీళ్లపై నడిచే అవసరమే లేదు" అందిట ఆమె. వారంతా తృప్తిచెంది ఇళ్లకు పొయ్యారుట.

మానవుడు ఎదుర్కొనే దురదృష్టాలు రెండు రకాలు. జీవంలేని బాహ్యజగత్తు తెచ్చిపెట్టేవి; తోటి మానవుడు తెచ్చిపెట్టేవి. విజ్ఞాన శాస్త్రం ద్వారా మొదటిదాన్ని ఎదుర్కోవచ్చు. రెండోరకంవి, హెచ్చిపోతున్నాయి. వెనక క్షామం సంభవించేది; అది బాహ్యజగత్తు కలగచేసిందే. మానవుడు ఎంతో యత్నంచేసి దాన్ని ఎదుర్కొన్నా, ఆకలి బాధచే జనం చనిపోతూవుండేవారు. ఈ నాడు సంభవించే క్షామాలకి, మానవుడే కారణం అనొచ్చు. ఐదారేళ్లగా యుద్ధం పేరిట, ఒకర్ని ఒకరు చంపుకోటంతో గడిపారు; ఇప్పుడు బ్రతికివుండడమే వారికి కొత్తగా వుంది. మానవుడి శత్రువు, మానవుడే. మానవుడి వల్ల కలిగే అరిష్టాలకి కారణం, భావాలూ నమ్మ కాలూ కాదు; వీటిని ముసుగుగా కప్పుకుని తాండ వించే ఉద్రేకాలే కారణం. క్రైస్తవ మత సూత్రాలని పాటించనివారిని బాధలు పెట్టేవారు. మత విద్రో హులను అగ్నిలో కాల్చి చంపుతుంటే, జనం చూసి వినోదించేవారు. అల్లాగే వినోదక్రీడగా యుద్ధం కావాలనే వారుంటారు— ఓడించిన ప్రజని చెఱచి, కొల్లగొట్టే అవకాశాలుంటే. వీటిని ధర్మయుద్ధా లుగా పరిగణించే వారున్నారు. డాక్టర్ ఆర్నాల్డ్ అనే ఆయన పేరుగాంచిన ప్రధానోపాధ్యాయుడు. పిల్లల్ని కొట్టి శిక్షగరిపే వారు. ఇది తప్పన్నవారిపై విరుచుకు పడేవాడు. ఇల్లా శిక్షించి హింసించడంలో ఆయన కాస్త వినోదిస్తున్నాడనుకోవాలంటాడు రసెల్. శిక్షించి, హింసించి బాగుచెయ్యడం అనేది మానవుడికి హానికలిగించిన భావం. కుక్కనీ, భార్యనీ, దేవదారు వృక్షాన్నీ, కొట్టిన కొద్దీ బాగవుతాయన్న ఆంగ్ల సూక్తి వొకటుందట. "దేవదారు వృక్షం సంగతి నాకుతెలియదు కాని, భార్యని హింసించాలన్నదాన్ని నేడు ఎవ్వరూ హర్షించరు." బాగా వెనక ఇట్లాంటి భావాలన్నీ, ఒక సిద్ధాంతంగా రూపొంది, హానికలగ చేశాయి. నరబలి వల్ల పంటలు మెరుగవుతాయన్న నమ్మకం వుండేది. బలైనవారి రక్తం, దేవుడికి ప్రీతిట. శరీర సౌఖ్యాలని త్యజించిన వాడు యోగి. త్రాగుడు, మాంసభక్షణ, స్త్రీలోలత— అన్నీ త్యాగం చెయ్యాలి. మానసికమైన ఆనందాన్ని చూర గొంటాడు. ఇది, శరీర సుఖంకంటె, మంచిది, ఉన్నత మైంది. మత విద్రోహులు నరకానికెళ్లి అక్కడ వారు పడే బాధల్ని తిలకించడంలో వీరు ఆనందం పొందుతున్నారు.

ఐహిక వాంఛనీ, శరీర సుఖాలనీ పరిత్యజించిన వారితో దయాదాక్షిణ్యాలు కలుగుతాయనలేము. తను బాధలు పడుతున్నాడు గావున, ఇతరులుకూడా బాధలు పడాలని కోరతాడు. ఇట్లాంటి దృక్పధాన్ని బలపరిచే తత్వాన్ని స్వీకరించి ప్రచారం చేస్తాడు. కష్టపడాలి—అన్న 'నీట్‌షె'తత్వం స్వీకరించిన నాజీలు అధికారంలోకి రాకముందు, సుఖాలు వొదులుకుని కష్టపడేవారు. 'వెన్నకంటె తుపాకి' మెరుగన్నారు. దీని పర్యవసానం యుద్ధం, నాజీల పతనం. విలా సము, షోకు, దర్జా, భోగాలు విడిచేసి కష్టించడమే పరమావధన్నారు కమ్యూనిస్టులు. సర్వపరిత్యాగము, కాఠిన్యము—ఈ రెండూ కలిసే వుంటాయి. పాపులు, యోగులు, రెండు తెగలు. పాపపరిహారార్థమై శిక్ష అనుభవించడం అన్నది, బాల్యంలో ఏర్పడే మాన సిక స్థితి. కాని ఈ శిక్ష మరొకరు పడాలన్న తాప త్రయం వుండిపోతుంది, ఎందుకో. ధనికులమో, బీద లమో, మన సంప్రదింపు లేకుండా, ఆర్థిక వ్యవ స్థలో, మనం వొచ్చిపడతాం. ఒక దేశంలో ధనికుల మైతే మేలు; మరొక దేశంలో బీదలమైతే మేలు. కారల్‌మార్క్స్, బాలుడుగా వున్నప్పుడు, ఆయన తండ్రి క్రైస్తవమతాన్ని స్వీకరించాడు. ఆయన అల వరుచుకున్నమనస్తత్వంలో కొంతభాగమైనా,మార్క్సుకి అబ్బి వుండాలి. మనం చాలా ముఖ్యులం, ఇతరులు ఏ కార్యాలు చేసినా, మనకే వర్తిస్తాయి—అనుకోడం వల్ల ఎన్నో ఇబ్బందులేర్పడతాయని, రసెల్ వొక ఉదహరణ చెప్తాడు

''మనం రైల్లో వెడుతుంటె, వొక పొలంలో వున్న ఆవులు, బెదిరి, చెదిరిపోయే దృశ్యం చూస్తాం. ఆ మందలో వొక ఆవు తత్వశాస్త్రజ్ఞుడై వుంటె ఇల్లా అనుకుంటుంది. 'నాకోర్కెలు, నాకెంతో ముఖ్యం. ఈ జగత్తులో జరిగేవన్నీ నా కోసమే జరుగుతున్నాయి. ఈ రైలుబండి, నాకు అపకారం చెయ్యడానికో మంచి చెయ్యడానికో వొస్తోంది. కాని దీని రొద, ఆర్భాటం చూస్తే, నాకు అపకారం చేసేటట్లుంది. అందుకని దీన్నుండి పారిపోతాను' అనుకుంటుంది. కాదు, నీదంతా వెఱ్ఱి, రైలుబండికి నువ్వు ఏమైందీ అక్కర్లేదు,—నీ సంగతే దాని కక్కర్లేదు అంటే, ఆవు ఆశ్చర్యపడి, మతి పోగొట్టుకుంటుంది. తననిగురించి పట్టించుగోని రైలుబండికంటె, తనకి కీడు చెయ్యాలని సంకల్పించన రైలుబండే మెఱుగు, అట్లా అనుకుని, రైలుబండి వున్నా బాగుండిపోను అనుకుంటుంది. మనుషులూ అంతే. ప్రకృతి తమకి కాస్తంత మేలు, కాస్తంత కీడు సమకూరుస్తుంది.''

ఇది ప్రమాదవశాత్తు జరిగిందనుకోలేదు మనిషి. ఇందాకటి ఆవు విషయం చూడండి. రైలుపట్టాలమీదికి వెళ్ళి రైలింజన్ కిందపడి చనిపోయిన మరొక ఆవుని చూసివుంటె, 'పాపం చేసింది గనక, రైలుబండి అనే దైవం దాన్ని శిక్షించింది' అనుకుంటుంది, ఆ ఆవు. ఆవులమందలో పెద్దలు, రైలుపట్టాలకి ఇరుప్రక్కలా, అట్లాంటి ప్రమాదాలు జరక్కుండా వుండాలని, తడకలతో అడ్డుగోడలు లేపితే, సంతోషిస్తుంది. ఈ విధంగానే, మనుషులు తమకి సంభవించే ఆపదలను, తమ పరపతి దెబ్బతినకుండా, సమర్థించుకుంటారు. పాపాలు చెయ్యని బుద్ధిమంతులు కొందరుంటారు. వారికీ ఆపదలు సంభవిస్తాయి—వారి మాటేమిటి? మనల్ని ద్వేషించే శక్తులు, కొన్ని వున్నాయి, మనం బాగుంటె సహించలేని శక్తులు అవి, వీరి ఆపదలకు, కారణం, అనుకుంటాడు మనిషి. ఇవే, దయ్యాలు, భూతాలు మొదలైన దుష్టశక్తులు. మంత్రం తంత్రం, చేతబడి, గారడి, ద్వారా, యీ శక్తులను, ధ్వంసం చెయ్యాలనుకోడంతో, వీటి పట్ల నమ్మకాలు బైలుదేరాయి. నరబలులు, దీన్నుండి బైలుదేరినవే. పాశ్చాత్యదేశాలలో నిన్నమొన్న వరకూ మంత్రకత్తెలను వేటాడి చంపడం—ఇందువల్లనే. విజ్ఞానశాస్త్రం ప్రబలాక, ఈ మూఢనమ్మకాలు సమసిపొయ్యాయి. కాని, రేపిన భయం కాస్తోకూస్తో నిలిచిపోయి, ఇతరదేశీయుల పట్ల ద్వేషంగా, పరిణమిస్తోంది.

అసూయ, మరొక తప్పుడు భావం, లేనివాళ్ళు గుమిగూడి, ఆ వూళ్ళోవున్న ధనికుణ్ణి, పీనాసిగా చెప్పుకుంటారు. స్త్రీలకి వొకరంటె వొకరికి, అసూయా అని చెప్పుకుంటారు పురుషులు. కాని పురుషులలోనూ ఈ అసూయ వుంది. ఒక ఆఫీసులో ఎవరికన్నా మేలుజరిగి, పై పదవి లభ్యమైతే, 'వాడికి, పెద్ద వాళ్ళని పట్టడం బాగా చేతనౌనండీ—వాడిలాగా, చిత్తం చిత్తం అంటూ, చేతులు నలుపుకుంటూ ముఖస్తుతి చేసే నీచమైన అలవాట్లు తెచ్చుకుని వుంటె, ఆ పై పదవి నాకూ వొచ్చును. పైకి చటుక్కున నచ్చేవిధంగా పనిచెయ్యగలడనుకోండి—నిజంగా పెద్ద శక్తిసామర్థ్యాలు వాడిలో లేవు. పై అధికారులకి, రేపోమాపో వాడి బడాయి తెలిసిపోతుందిలెండి'' అని, విశేషమైన సామర్థ్యంలేని రెండోరకం ఉద్యోగులందరూ ఆఫీసుల్లో చెప్పుకుంటారు. ఇట్లాంటి అసూయాభావం బైలుదేరకుండా వుండటం కోసమే, అందరికంటె ఎక్కువకాలం పనిచేసిన వ్యక్తికి పై పదవి ఇవ్వాలన్న సూత్రం చలామణిలో వుంది.

నా కులం, నా జాతి, నా భాష, నా ప్రాంతం, నా దేశం—గొప్పదన్న గర్వం, అహంకారంకూడా హానికరమైన భావమే నంటాడు, రసెల్. ఆయన చిన్నప్పుడు, ఇంగ్లీషు వారు, ఫ్రెంచ్ వారిని తక్కువగా ఎంచేవారుట. ఫ్రెంచ్‌వారు తిండిపోతులనేవారు. ఒక ఇంగ్లీషువాడు, ముగ్గురు ఫ్రెంచ్‌వారిని ఓడించగలడనేవారుట. తర్వాత, జర్మనీవారు వారికి శత్రువులయ్యాక, ఫ్రెంచ్‌వారిని చులకన చెయ్యడం మానుకున్నారు. మనదేశంలో తమిళులంటె, తెలుగు వారికి చులకన. తెలుగు వారంటె, కన్నడంవారికి హేళన. అంతేకాదు తెలుగువారిలో, కోస్తా ప్రాంతం వారంటె, రాయలసీమ వారికి చులకన. ఒకరు, మరొకరి కంటె అధికులమనుకోడానికి, ఆధారాలు లేవంటాడు రసెల్. ఇల్లా అనుకుని 'అహం'ని పెంచుకోవడం పొరబాటంటాడు. ఒక సమిష్టి కుటుంబంలో, తండ్రి అన్నయ్యకి ఎక్కువ డబ్బిస్తున్నా

డంటాడు తమ్ముడు. ఇరువురి ఆస్తులూ సమంగా పంచేవరకూ, ఈ తగాదాలు పోవు. అన్నయ్యకీ, తమ్ముడికీ బాగానే జరిగింది, నా మాటేమిటంటుంది చెల్లాయి. ఆమెకికూడా ఆస్తిలో సమభాగం వుంటే, ఈ అసహనం వుండదు. తెగలలో, జాతులలో, ఆర్థిక సదుపాయాలుండి, సమాన అవకాశాలు వున్నట్లైతే, ఈ అసహనం పోయి, ఐక్యభావం ఏర్పడుతుంది. ఈ పనికి ప్రభుత్వం పూనుకున్నట్లే, దేశాల తరఫున అంతర్జాతీయసంస్థ పూనుకోవాలి. చైనావారిది పసుపు పచ్చరంగు. అందకని చాలామంది అమెరికా వారికి, వారంటె గిట్టదు. ఇండియా పాలించిన ఇంగ్లీషువారు, తాము అధికులమన్న గర్వంతో, విజ్ఞులైన భారతీయులతో శత్రుత్వం తెచ్చుకున్నారంటాడు రసెల్. భారతీయులలో, ఉత్తరాదినుండి వొచ్చినవారు అధికులమనుకుని, చతుర్విధవర్ణాలతో రూపొందిన సమాజం నెలకొల్పబడింది. తెల్లవారి అహంకారం ఎంత చెడ్డదో, ఈ వర్ణవిభేధాలూ అంత చెడ్డవేనంటాడు.

మొగాడు అధికుడన్న భావం ఎంతో అపకారం చేసిందంటాడు. వివాహ సంబంధం, 'యజమాని—బానిస' బంధంగా పరిణమించింది. స్త్రీ మెప్పు పొందకుండానే, మొగాడు ఆమెను భార్యగా చేసుకోగలడు. దీనితో ప్రేమ, శృంగార జీవితం దెబ్బ తిన్నాయి. స్త్రీని బైటకి రానీయక, వేరుగా, మూలగా వుంచడంవల్ల, వీరిలో శృంగారభావం లేకుండా పోతుంది. గౌరవ కుటుంబాలలో స్త్రీలు ఆకర్షణీయంగా వుండక, పురుషుడు, పురుషుడితో అసహజమైన సంబంధం పెట్టుకోడం జరుగుతూంది. నాగరీక దేశాలలో కొన్నిచోట్ల ఈనాడు చాలావరకూ ఇవన్నీ తగ్గిపోయినా, ఇరువురూ సమానులమన్న భావం పూర్తిగా నెలకొనడానికి చాలాకాలం పడుతుంది. ఎవరి కిందోపడి వుండాల్సిన బానిస వ్యవస్థ నుండి, బైటపడగానే, మొదట్లో కొంత కీడు జరుగుతుంది. ఇదివరలో అధికులమనుకున్నవారు, కొత్త పరిస్థితికి తట్టుకోలేరు; ఇదివరలో అణగ తొక్కబడ్డామనుకున్నవారు, వెనకటి అధికులపట్ల ద్వేషాన్నిపూర్తిగా విస్మరించలేరు.

'నేను ఘనుణ్ణి' అన్నభావంవల్ల ఏర్పడిన దుస్థితిని గూర్చి రసెల్ ఇల్లా వ్రాశాడు:

“మనం మానవులం — కావున మానవుణ్ణి సృష్టించడమే పరమాత్మ ఆదర్శం; మేం అమెరికా వారలం; అమెరికావారలు గొప్పవారు—వీరంటే దేవుడి కిష్టం; మేం తెల్లవారం; నల్లవారంతా దేవుడి శాపానికి పుట్టారు. మేం ప్రొటెస్టెంట్‌లం—కావున కాథొలిక్కులు పనికిరానివారు; మేం పురుషులం, స్త్రీలు తెలివిహీనులు; మేం స్త్రీలం, పురుషులు జంతుసమానులు. మేం ప్రాగ్దేశీయులం, పాశ్చాత్యులు అవివేకులు; మేం పాశ్చాత్యులం; ప్రాగ్దేశీయులు అనాగకరీకులు; మేం మెదడుతో పనిచేస్తాం, కావున కాయకష్టపడేవారు అధములు, మేం కాయకష్టపడతాం, కావున కష్టించడమే గౌరవం. ఇంతే కాదు; ఎవరికివారు, తాము అసాధారణమైన ప్రజ్ఞావంతులం; అనుకుంటూ, జీవిత సమరానికి దిగుతాం. అందరం సమానులమే, గొప్ప, తక్కువ లేవు,—అనుకోగలిగిన నాడు, జీవితం యుద్ధంగా పరిణమించదు—పరిణమించినాకూడా, ఈ అపోహలు, దగా కల్పనలు, సాహసాలుగా స్ఫులించం.”

అల్లాగే ప్రజాస్వామ్యం వొక్కటే అనువైన పాలనాపద్ధతి, అంతకు మించింది మరొకటిలేదు అన్న భావం పట్ల ఉన్మత్తత తగదంటాడు. అధికసంఖ్యాకులు, తప్పకుండా, వివేకంతో చర్యలు తీసుకుంటారనుకోకూడదు. అధికసంఖ్యాకులు తీర్పుని, స్వీకరించడం మంచిదన్న సూత్రాన్ని మాత్రం అంగీకరించాలి; ప్రజాస్వామ్యాన్ని అభిమానించినవారు, సామాన్య మానవుడిలో ఏదో మహత్తు వుందనుకుని ప్రజాస్వామ్యాన్ని అంగీకరించకూడదు. నిరంకుశ పాలనకంటె, పరిమిత శక్తులద్వారా, నిరంకుశాన్ని అదుపులోకి తేవాలన్న సూత్రం అన్నమాట. మనల్ని బలవంతంగా ఎవరో పాలించడం కంటె, మనకిష్టులైన వారి పాలన మెరుగన్న సూత్రం నిర్వహింపబడాలంటే, ప్రజకి శిక్షణ అవసరం. ప్రపంచం బాగవాలంటె, యుద్ధాలు రేగకుండా అమలుజరిగే రాజకీయ సూత్రాల సమీకరణ వుండాలి; ఉత్పత్తి పెంచే ఆర్థిక వ్యవస్థ నెలకొల్పబడాలి. అంతర్జాతీయ దృక్పథాన్ని బోధించే విద్యావిధానముండాలి. నైతికంగా, సహనము, దయ,—పెంపొందాలి. ఇట్లాంటి స్థితి, హైడ్రోజన్ బాంబ్ వల్లకాని ఏర్పడే సూచన లేదనుకుంటే, ఆ బాంబ్‌ని కనిపెట్టిన వారిని అభినందించాలి.

అన్నియుగాలలోనూ, అన్నిదేశాలలోనూ కొన్ని పనులు చెయ్యొద్దు, కొన్నింటిని చెయ్యి—అన్న పెద్దలు శాసనమే నైతిక సూత్రాలకి ఆధారమైంది. హత్య, దొంగతనము, వ్యభిచారము యీాదులదృష్టిలో ఘోరమైన అపరాధాలు. కులపెద్ద కోసం పెట్టిన కంచంలో తినడంకి మించిన అపరాధంలేదు, సౌత్‌సి' దీవులలో నివశించేవారి దృష్టిలో. అమెరికాలో కళాశాల విద్యార్థులు, 'హత్యని మించిన అపరాధం, వ్యభిచారం' అన్నారుట. పెద్దలని దిఃఖరించడం, అన్నింటినీ మించిన అపరాధమని, జపానీయు లంటారు. ప్రాచీన సమాజాల అలవాట్లు, ఆచారాలు, మనకి ఈనాడు అర్థరహితమైనవిగా అగుపడతాయి. యుద్ధంలో గెలుచుకున్నవారిని చంపి తినెయ్యడం, అజెటెక్ జాతివారి నియమం. సంతానం కలగనప్పుడు, అన్నగారి భార్యని వివాహమాడడం, కొన్ని సమాజాలలో ఆచారం. దీని ఫలితంగా కలిగిన మొదటి సంతతి అన్నగారికి పుట్టినట్లే భావిస్తారు. చైనీయులు, రోమనులు, సంతానం లేనప్పుడు, మరొకర్ని పెంచుకుంటారు. పెద్దల్ని గౌజించే ఆచారం ఈ విధంగా ఏర్పడినదే. ఎవరో వొకరు, పూజించకపోతే, చనిపోయిన వ్యక్తి భూతమై, గొడవ చేస్తాడని వీరి భావన. ఇండియాలో, విధవావివాహం సహించరాని అపరాధం. ఇవన్నీ చూస్తే ఈ ఆచారాలన్నీ దైవం శాసించినవి కావనీ, నైతిక సూత్రాలు మారుతూ వుండే అవకాశం వుందనీ, కొన్ని మార్పులు మంచి సమకూర్చొచ్చుననీ తెలిసొస్తుంది. ఈ నాటి సమాజాలలో కూడా, ఇట్లాంటి మార్పులకు అవకాశముందనీ, ప్రతిమార్పూ, చెడ్డదే అవక్కరలేదనీ గ్రహించాలంటాడు రసెల్.

ప్రచీన సమాజాల నైతిక సూత్రాలని పరిశీలించిన ''ముల్లర్—లైయర్' అనే శాస్త్రజ్ఞుడు, నాగరికత పరిణామంలో మూడు దశ లున్నాయని సూచించాడు—ఒక గుంపు అలవరుచుకున్న నీతి మొదటి దశ—కుటుంబం అలవరచుకున్నది రెండవ దశ:—చివరి దశలో, ఎవరికి వారు, వ్యక్తిగతమైన నైతిక ఆదర్శాలని పాటిస్తారు. స్త్రీ పురుష సంబంధము, పెండ్లి—ఇవి ఆర్థిక పరిస్థితిని అనుసరించి నిర్ణీతమౌతాయి. ఒక్కొక్కదశలో, వొక్కొక్క రకం నీతి. వేటాడేదశ: తిండి కోసం వలసపోయి జీవించే దశ: వ్యవసాయ జీవనము, పారిశ్రామిక నాగరికత ఈ దశలలో నైతిక సూత్రాలు వేర్వేరుగా వుంటాయి. ఏకపత్నీవ్రతమా? బహుభార్యాత్వమా? అనేక భర్తృకతా? ఏకపత్నీవ్రతమైతే, జీవితాంతం, విచ్ఛిన్నంకాని వివాహమా?—ఇవన్నీ వొక సమాజంలో వుంటున్న ఆర్థిక స్థితిగతులపై ఆధారపడతాయి. ఆ సమాజం, తదనుగుణంగా కొన్ని నైతిక సూత్రాలను పాటిస్తుంది. వాటిని అతిక్రమించడం దుర్నీతౌతుంది. ఆర్థిక పరిస్థితి మెరిగ్గా, మారిన వెంటనే ఈ నైతిక సూత్రాలు మారిపోతాయని లేదు. నీతి,—సంప్రదాయమై కరడు కట్టడంవల్ల—వెంటనే మారదు. ఆ మార్పుకి మరికొంత కాలం పడుతుంది. విధవ ఎవరి పోషణలోనో వుండాలి; అందుకని భోజనం పరిమితమైంది. ఆర్థిక స్థితి మారింది. స్త్రీ చదువుకోవాలి; రాజకీయరంగంలో మార్పులు హర్షించిన పెద్దలు, నైతికరంగంలో మార్పు హర్షించకపోవడం శోచనీయమంటాడు రసెల్. మనదేశం విషయం చూద్దాం. అనాదిగా—రాజు-ప్రజ—వంశపారంపర్యంగా చక్రవర్తి—పాలకుడు, పాలితులు, ఈ రాజకీయ జీవనానికి అలవాటు పడ్డ మనం, ఈనాడు ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని అమలు జరుపుకుంటున్నాము. ఇది చాలా పాశ్చాత్యదేశాలలో అమలులో వుంది. ఇందులో మంచివుంది గనకనే, దీన్ని మనం స్వీకరించాం. కాని పూర్వుల్లు నెలకొల్పిన నైతిక సామ్రాజ్యంలో, మార్పులు జరిగితే హర్షించలేరు పెద్దలు. ఒక నైతిక సూత్రం, మానవుడి సౌఖ్యానికీ, శ్రేయస్సుకీ దోహదమిచ్చేదిగా వున్నప్పుడు, దాన్నికూడా మార్చుకుని, కొత్త సూత్రాన్ని అమలు జరుపుకోడం మంచిదంటాడు రసెల్.

కొత్త నైతిక సూత్రాలు నలుగురూ ఆమోదించడానికి కొంతకాలం పడుతుంది—కొన్నిచోట్ల, శతాబ్దాలు పట్టొచ్చు. ముల్లర్—లయర్ సూచించే సూత్రం బట్టి, ప్రభుత్వం బలంగా వున్నప్పుడు, కుటుంబంయొక్క ప్రభావం సన్నగిల్లుతుంది. అట్లాంటప్పుడు, స్త్రీల పరిస్థితి బాగుంటుంది; ప్రభుత్వం అంతబలమైంది కానప్పుడు, కుటుంబం ప్రభావం పెరిగి, స్త్రీల స్థితి హీనంగా పరిణమిస్తుంది. కుటుంబంపరపతి ప్రబలంగా వున్నప్పుడు, స్త్రీల స్థితి హీనంగా వుంటుందన్న విషయం చాలా మంది గ్రహించగలుగుతారు. కాని, దీనికీ, ప్రభుత్వం

యొక్క బలానికీ వున్న సంబంధం, అంతగా గ్రహించ లేరు. వెనకటి తరం చైనా, జపాన్ దేశాలలో, బలమైన ప్రభుత్వం లేక, కుటుంబం ప్రభావం అధికమై స్త్రీల స్థితి హీనమైంది. జపాన్‌లో కుటుంబం ప్రభావం సన్నగిల్లి, స్త్రీల పరిస్థితి మెరుగయ్యే టట్లుంది.

కుటుంబనీతిపరిణామంలో కూడా, మూడు దశలున్నాయి. ప్రారంభ దశ; మధ్య దశ; చివరి దశ. మధ్యదశ కుటుంబం నీతి, కాఠిన్యానికీ, హింసకీ దారి తీస్తుందంటాడు ఈయన. విడిపోడానికి వీలులేక, జీవితాంతం వుండిపోయ్యే బంధంగా, వివాహబంధాన్ని పరిగణించడంవల్ల, భర్త త్రాగుబోతు, అనాగరీకుడూ, అయినప్పుడు, భార్య నానాబాధలూ భరించాల్సి వొస్తోంది. అట్టి తలిదండ్రులు నిత్యమూ తగవులాడుతుంటె, పిల్లలు చూసి భరించాల్సి వొస్తోంది. ఇది వేశ్యాలోలతకీ, సుఖవ్యాధులకీ దారితీస్తోంది. కట్నాలిచ్చి పుచ్చుకోవడం, పోషణకి అవసరమైన ఆర్థిక ఏర్పాటుగా వుండిపోయి ప్రేమకి తావులేని వివాహంగా పరిణమిస్తోంది. ఆకర్షణ, ప్రేమ లేనప్పుడుకూడా, భార్యాభర్తలు, వైవాహిక విధులను నిర్వర్తించాల్సి వొస్తోంది. వివాహానికి సంబంధించిన నైతిక నియమాలు, శాశ్వతంగా వుండిపోవాలి, వాటిని మార్చకూడదు—అన్న భావాన్ని రెండు విధాలుగా ఎదుర్కోవచ్చు. ప్రాచీన సమాజాలలో అమలు జరిగిన వివిధమైన ఆచారాలనూ, కట్టుబాట్లనూ తెలుసుకోవడం, వొక పద్ధతి. రసెల్ ఇట్లాంటివి కొన్నింటినిగూర్చి ప్రస్తావించడం చూశాం—"ఒక వ్యక్తి స్వీకరించే నైతిక నియమాలు, తన తాతగారి కాలంలో ఆర్థిక స్థితిపై ఏర్పడిన సమాజం అలవరచుకున్న నియమాలే ఐవుంటాయి. ఆర్థిక స్థితి మారిన, రెండుమూడు శతాబ్దాల పిదప, నైతిక విలువలు మారతాయి. ఇది గ్రహించినట్లైతే, ఇప్పుడు, వొక సమాజంలో వున్న నైతిక విలువలు, శాశ్వతంగా వుండనక్కర్లేదని తెలిసొస్తుంది. ఒకప్పుడు మరొక సమాజంలో ప్రబలిన విలువలు, తన వాటంత మంచివి కావనీ, తనవే మంచివనీ అనుకోడం జరగదు." సాధారణంగా ప్రజలు అంగీకరించే నీతి, జీవిత పరమావధికి సంబంధించినది కాక, ప్రవర్తనకి సంబంధించినదై వుంటుంది. నిజానికి నైతికసూత్రాలు, ప్రవర్తనకి సంబంధించక, జీవిత పరమావధిని సూచించేవిగా వుండాలంటాడు రసెల్. ఎల్లా నడుచుకోవాలో చెప్పడంకంటె, మనకేం కావాలో చెప్పడం మంచిదంటాడు. "తన బంధువులను, స్నేహితులను, వీలైతే మానవులందరినీ ప్రేమించి వారి మేలు కోరేవాడు మంచిమనిషి; కళలు, విజ్ఞాన శాస్త్రాన్ని ప్రేమించిన వాడు మంచిమనిషి. అట్లాంటి మనిషి, వెనక ఎప్పుడో కొన్నివేల సంవత్సరాల క్రితం ఎవరో చెప్పిన విధంగా నడుచుకోవడం ముఖ్యంకాదు. అంతేకాదు, వెనక ఎవరో చెప్పిన విధంగా నడుచుకొని కూడావొక వ్యక్తి చెడ్డవాడు కావచ్చు"నంటాడు రసెల్. ఈ భావాన్ని విపులీకరిస్తూ ఇల్లా వ్రాశాడు:

"నా కొక స్నేహితుడున్నాడు సాహసంతో కూడిన ప్రజాహిత కార్యాలు చేశాడు. ఇంటి వ్యవహారాలలో, ఎంతో నెమ్మదైనవాడు; దయ చూపుతాడు. అతని భార్య త్రాగుతూ, ఏ పనీ చెయ్యలేక, చికిత్స కోసం ఏ సంస్థలోనో వుంటూ వుండేది. అసహాయ ఐనందున భర్తకి విడాకులివ్వలేదు. తగిన కారణం లేనందున, అతను విడాకులివ్వలేదు. అతను, ఆమె పట్ల నైతికబాధ్యత చూపలేదు గావున, లోకం అతన్ని చెడ్డవాడుగా పరిగణిస్తుంది. మరో వ్యక్తి విషయం చూడండి. అతను త్రాగుబోతు, భార్యని హింసిస్తాడు. గర్భవతి ఐనాకూడా కొడతాడు; పదిమంది, పనికిరాని సంతానాన్ని కంటాడు. సమాజం అతన్ని అంత చెడ్డవానిగా పరిగణించదు. అల్లాగే, క్రింది ఉద్యోగుల పట్ల కరుణ చూపుతూ, ఆదరంతో చూసే వొక సంస్థ అధికారి, సెక్రటరీగా వుంటున్న స్త్రీతో ప్రేమకలాపం జరిపితే, అతన్ని చెడ్డవాడంటుంది సంఘం. మరొక అధికారి, సంస్థలో ఉద్యోగులందర్నీ కఠినంగా చూస్తూ, నిరంకుశంగా నడుచుకుంటాడు. అతను ఏకపత్నీవ్రతుడు గనక, సంఘం మంచివాడంటుంది. ఇది ఘోరమైన పాతకాలపు దృష్టి. దీన్ని మనం మార్చుకోవాలి." కాబట్టి ఏం చెయ్యాలి? దగా, మోసము, హింసాకాండ, యుక్తవయస్కులు కానివారిపై దౌర్జన్యం చెయ్యడం, ఇట్లాంటి అపరాధాలని చట్టరీత్యా శిక్షించి, కట్టుబాటు చెయ్యాలి. యుక్తవయస్కులైన స్త్రీ పురుష సంబంధాలలో సమాజం పెద్దలుగాని, న్యాయశాస్త్ర నిర్వాహకులుగాని, జోక్యం కలగచేసుకో

కూడదు. వారికి సంతానం వుంటె, వారి పోషణ, విద్య, క్రమశిక్షణ, సక్రమంగా జరిగేలాగు ప్రభుత్వం చూడాలి. తండ్రి, వారి పోషణకై, కొంత డబ్బు ఇచ్చేలాగు నిక్కచ్చి చెయ్యాలి. ప్రేమానురాగాలు లేని దంపతులు తప్పనిసరిగా కలిసే వుండాలని నిర్దేశించకూడదు. పిల్లల దృష్ట్యా రోజూ అమ్మానాన్నా తగవులాడుకోడం కంటె, విడిపోవడమే మంచిది—అని రసెల్ సూచన.

చట్టాలు, ప్రజాభిప్రాయం—ఈ రెండూ ఏకపత్నీవ్రతం నిర్దేశిస్తాయి. వీటికి భయపడి, బలవంతంగా కలిసి వుండడం కంటె, స్త్రీపురుషులు వొకర్నొకరు ప్రేమించుకుని, నిజమైన అనురాగం అన్యోన్యం కలవారై ఏకపత్నీవ్రతులుగా వుండడం మంచిదంటాడు.''అనేకమంది పురుషులకు తన శరీరాన్ని అమ్ముకున్న స్త్రీని వేశ్య అంటున్నాం. ప్రేమ లేకపోయినా, ఒక ధనికుడికి జీవితాంతం అమ్ముడుపోయిన స్త్రీ గౌరవింపబడి, సంఘంలో ప్రముఖురాలవుతోంది. ఆ ఇరువురు స్త్రీల చెడ్డతనం వొక రకందే. ఇట్లాంటప్పుడు ఆయా వ్యక్తులను నిందించ కూడదు మనం. అట్లాంటి చర్యకు దారి తీయించిన సంస్థలని నిందించాలి. ప్రేమని సంస్థలు నలిపి వెయ్యడం ప్రపంచపు టనర్థాలలో వొకటి. వ్యభిచరించిన ప్రతివాడూ దుష్టుడని తీర్పు చేసిన వ్యక్తి, కవిత, సౌందర్యం—ఈ రెండూ బంధించబడిన జైలు భవనం లేవనెత్తడానికి వొక రాయి తగిలిస్తున్నాడు.

నైతిక విలువలు కాలానుగుణంగా మారతాయన్న రసెల్ సూచనలో యదార్థం మనదేశ పరిస్థితిలో కూడా చూడవచ్చు. భారతదేశ చరిత్రలో స్వర్ణయుగంలో, స్త్రీకి గౌరవం, ప్రాముఖ్యం వుండేవి. చక్రవర్తి, ధర్మశీలుడై పాలించినప్పుడు, కుటుంబ నీతి ఉన్నతదశ నందుకుంది. రాజులు, రాజ్యకాంక్షతో పోటీబడి తగవులాడుకున్న రెండవ దశలో, కుటుంబం నిలబడినా, స్త్రీకి ప్రాముఖ్యం తగ్గింది. క్రితం శతాబ్దిలో మరీ పాడైంది. ఇరవయ్యో శతాబ్దిలో నూతన వికాసం, విద్యావ్యాప్తి, పెరగడంతో పాటు ఆమె స్థానం మెరుగైంది. ఉద్యోగం చేసి తన పొట్ట తాను గడుపుకోవాలి; సంసారం పరిమితం చేసుకోవాలి. పురుషుడితో సమంగా హక్కులొచ్చాయి. మొగాడి చేతికింద—ఆస్తిలో భాగంగా వుండక, స్వతంత్రంగా, వొక సంపూర్ణమైన వ్యక్తిగా నిలబడగల ఆధునిక దశ ఏర్పడినప్పుడు, విధవా వివాహానికి ఎవ్వరూ ఆశ్చర్య పడరు. వివాహం చేసుకోవాలంటారు కూడ. ఈ మార్పుకి, పెద్దలెందరో కృషి చెయ్యాల్సి వచ్చింది. అల్లాగే, యుద్ధంలో వోడిపోయి, పరరాజు చేతుల్లో పడ్డ స్త్రీలను, శత్రువులు చెరుస్తారన్న భయంవల్ల సహగమనం వొకప్పుడు, వుండేది. రాజు, ధనికుడు అనేక మంది భార్యలను పోషించగలడు. పెరిగిపోతున్న సమాజాలలో కుటుంబ నియంత్రణ అవసరమైనట్లు, ఏకపత్నీవ్రతం కూడా, వొకప్పుడు, ఆర్థికంగా అవసరమై యుండాలి. పూర్వాచార పరాయణులు ఛాందసులూ, ఈ విషయం పట్ల మార్పు హర్షించరు. కొన్నిసందర్భాలలో విడాకులకు వీలున్నా మొత్తం మీద, మతగురువులు దీన్ని హర్షించరు.

పారిశ్రామిక విప్లవంతోబాటు పాశ్చాత్య దేశాలలోకూడా స్త్రీకి పురుషుడితోబాటు సమమైన స్థానం లభించింది. మనదేశంలో, స్వాతంత్ర్యోద్యమం ఈ మార్పుకి చేయూత నిచ్చింది. స్త్రీ ప్రాముఖ్యం, క్షీణిస్తూ, మెరుగవుతూ వచ్చినా, పాతివ్రత్యం వొక అదర్శంగా, అనాది నుండీ వొస్తూ వుంది. వెనక, భర్త సమక్షాన, భార్య నిలబడే వుండాలి. బావగారు మొదలైన పెద్దలముందు నిలబడాలి—తలుపు వెనక. పరపురుషుడి కంట బడ కూడదు. ఆమె స్థానం ఇంట్లోనే. ఆస్తిలో వాటా లేదు. చదువు, ఉద్యోగం అసలే కూడదు. ఈ శతాబ్దిలో ఇవన్నీ మారిపోయ్యాయి. వెనక రంగస్థల నటుడు నీచమైనవాడుగా పరిగణింపబడేవాడు. డాక్టర్లు, ప్లీడర్లు రంగస్థలంపై ప్రవేశించగానే, ఆవృత్తి పరపతి పెరిగింది. పతివ్రత—త్రికరణ శుద్ధిగా—(మనస్సు, వాక్కు, కర్మ) భర్తనే కొలవాలి. మరిప్పుడు సినిమానటి, పరపురుషుణ్ణి, వెండితెరపై కౌగలించుకుంటుంది—వొక పాత్ర నటిస్తూ. ఆమెకి భర్త, పిల్లలు వుంటారు. కథానాయకుడికి కూడా భార్య, పిల్లలు వుంటారు. తెరపై నటే, ఎదటి వ్యక్తిని, తన భర్తగా ఊహించి మనోవాక్కాయకర్మలలో మొదటిది పాటించి—నటించినా, ప్రేమ, విరహం ప్రకటించే మాటలు, (వాక్కు) కలిసి నృత్యం చెయ్యడం, కౌగలించుకోడం (కర్మ) చూసిన ప్రేక్ష

కుడు పాతివ్రత్యం గురించి పట్టించుకోడు, తాను చూస్తున్న చిత్రం, పాతివ్రత్యంయొక్క మహిమని చాటేదిగా వున్నా. వెనకటి శతాబ్ది భర్త, తన భార్య ఇల్లా పరాయి వ్యక్తితో నటిస్తే సహించలేడు. ఆమెని చంపడమో, ఆ మరో వ్యక్తిని చంపడమో, లేక తాను ఆత్మహత్య చేసుకోడమో జరుగుతుంది. ఈ అసూయా భావం, ఇప్పటికీ కాస్తోకూస్తో వుందనుకోవాలి. పాశ్చాత్య సినిమారంగంలో నటులు, పదేపదే పెళ్లిళ్లు చేసుకోడం ఈ అసహనం వల్లనేమోననిపిస్తుంది. ఈ కారణంగా, మనం నటులను చులకన చెయ్యం. వారిని గౌరవిస్తాం. ప్రభుత్వం ఎవార్డులిస్తుంది. వీరిని చూడడానికి వేలాదిగా జనం ఎగడతారు. సన్మానాలు జరుపుతారు. ఇందుకు కారణం, కళ, సౌందర్యం—ఇవిచ్చే అనుభూతి, సంస్కృతిలో ప్రధాన అంగాలన్న నమ్మకమూ, ఈ అనుభూతి మన జీవితానికి మంచిదన్న భావం, మనలో వుండడమే.

భార్యాభర్తల దాంపత్య జీవితంలో ప్రభుత్వం ప్రజాభిప్రాయం, జోక్యం కలగచేసుకోకూడదన్న రసెల్ భావం, ఎంతవరకూ మన పరిస్థితులకు అనుకూలిస్తుందో చెప్పలేను. భార్యాభర్తలు చదువుకున్నవారై సంస్కృతి గలవారై, తగినంత ఆర్థిక స్థోమత కలిగి, వొకర్ని వొకరు గాఢంగా ప్రేమించుకున్నవారై, వివేకము, శీలము వుండి బాధ్యతని గుర్తెరిగి ప్రవర్తించే వారలైనప్పుడు, ప్రభుత్వం, సంఘంలో పెద్దలు, జోక్యం కలగచేసుకోనక్కర్లేదు. అట్లాంటప్పుడూ, పోలీసులు, కోర్టులు, విచారణలు, ధర్మశాసనాలు వుండనక్కర్లేదు. నిజమే—అందరూ, లింకన్, గాంధీ, రసెల్ లాంటి వ్యక్తులై, తాము స్వంతంగా పాటించే నీతినియమాల శిక్షణకు బద్ధులైనప్పుడు ప్రభుత్వం శాసించనక్కర్లేదు. కాని అంతటి నిగ్రహంగలవారు సంఘంలో ఎందరో వుండరు. వివేకం, విద్య, ఆర్థిక సదుపాయాలు లేని వారే వుంటారు ఎక్కువగా. ప్రభుత్వం వీరికి పీటినిచ్చి, జోక్యం కలగచేసుకుని శిక్షణలో పెట్టకపోతే, నైతిక అరాజకం ప్రబలుతుంది. అందరూ శీలంగల మహాపురుషులయ్యేటంతవరకూ, ప్రభుత్వం తొడపాశం పెడుతూ వుండాలి. పెద్దలు మొట్టికాయలు వేస్తూ వుండాలి. ఎటొచ్చీ విద్య, ఉద్యోగం, ఆర్థిక సదుపాయాలు కల్పించిన పెద్దలకే, ప్రభుత్వానికే ఈ అర్హత వుండాలన్న భావాన్ని ఖండించడం సుళువు కాదేమో. అందుకే హాల్లో పొగ పీల్చడం నిషేధం, అందుకే స్త్రీలకు ప్రత్యేక స్థలం.

మతం గూర్చిన రసెల్ భావాలు కొన్నింటిని చూద్దాం. ఆయన నాస్తికుడు. మానవతావాద ప్రచారానికీ, విజ్ఞాన శాస్త్రాభివృద్ధికీ, మతం అడ్డు తగులుతూ వొచ్చిందంటాడు. క్రితం శతాబ్దివరకూ, పాశ్చాత్యదేశాలలో, వ్యాధులు పాపాలు చేసిన వారికి సంక్రమిస్తాయనీ, అట్లాంటివారు బాధ అనుభవించి తీరాలనీ, కర్మఫలం మతగురువులు చెప్తూ, వైద్య శాస్త్రపరిశోధన నిలుపు చేశారంటాడు. వెనక మత సిద్ధాంతాలు స్వీకరించనివారినీ, ప్రశ్నించినవారినీ హింసించి చంపేసేవారు. ఇప్పుడు అంతటి కఠినమైన చర్యలు తీసుకోకపోయినా, మతసూత్రాలని పాటించని వారిని ఏదోరకంగా, కాస్తంత నాజూకుగా, ఇబ్బంది పెడుతూనే వున్నారు. మతప్రభావాన్ని వ్యతిరేకించేవారు కొద్దిమందే వుంటారు. ఇట్లాంటి వారిని అధికసంఖ్యాకులైన మతోన్మాదులు సహించగలిగితే విశేషమే. నాస్తికుడు తన అభిప్రాయాలని పైకి వెల్లడి చేస్తే అతనికి ఏదో రకమైన అపకారం జరుగుతుంది. సాంకేతిక నైపుణ్యం, విద్య, యోగ్యతా వున్నా, అతనికి ఉద్యోగం దొరక్కపోవచ్చు. ఇరుగు పొరుగువారు అతనితో మైత్రి సలపక, దూరంగా వుంచొచ్చు. మతంపట్ల పరిపూర్ణమైన స్వేచ్ఛ, సమానత, చూపాలన్నది ప్రజాస్వామ్యం ఆదర్శం. రెండు మతాలవారిని సమంగా చూడ్డం వొకటి; అసలు మతమే లేదన్నవారిని సహించడం మరొకటి.

భక్తిమార్గాన్నీ, ఆధ్యాత్మికచింతన, అతీంద్రియ జ్ఞానం ద్వారా సత్యాన్ని అన్వేషించేవారినీ, తపస్వులనూ, వెక్కిరించడు బెర్ట్రాండ్ రసెల్. మతాన్నుండి జనించే మూఢనమ్మకాలనీ, హానికరమైన అపోహలనీ హేళన చేస్తాడు. ఆయన భావాలు, చాలా వరకూ, క్రైస్తవ మతాన్ని దృష్టిలో వుంచుకొని చెప్పినవే. అన్నిమతాల ప్రధాన సూత్రాలు, ఇంచుమించు వొకే రకంవి ఐవుంటాయి గావున, ఈయన భావాలు మనదేశపు మత సంప్రదాయానికి అనుయించి, పోల్చి చూసుకోవచ్చు. క్రైస్తవమత ప్రచారం కొంత హింసాకాండతో జరిగింది. అట్లాంటిది హిందూమతంలో అంతటి తీవ్రతతో జరిగిందన

లేము. ఏ కొత్త సిద్ధాంతం వొచ్చిపడినా, హిందూ తత్వం దాన్ని స్వీకరించి, తనలో వొక భాగంగా చేసుకుంటూ నిలబడింది. ఇతర మతాల పట్ల సహనం చూపింది. తప్పనిసరైనప్పుడు కొత్త సూత్రాన్ని స్వీకరించింది. కొన్నిసందర్భాలలో అబద్ధం ఆడొచ్చునంది. ఈ మతం తెచ్చిపెట్టిన ముప్పు, అంటరానితనం. ప్రాచీనకాలంలో వొక స్థలంలో వొక బృందం వుండేవారు. ఆ ప్రాంతంలో కొన్ని లభ్యమయ్యేవి. పై ప్రాంతాలకి వలసబోయి, ఇతరులమీద ఆధారపడే అవసరం లేకుండా, స్వయంపోషకంగా వుండాలనుకుని, 'నువ్వు ఈ పని చెయ్యి' 'అతను ఆ పని చేస్తాడు' 'నేనిది చేస్తాను' అని పనులు నిర్ణయించుకుని, వ్యక్తులు కేటాయించుకుని, స్వయం పోషకంగా వుండేవి. గ్రామాలలో బృందాలు పరమార్థచింతన, దాని కవసరమైన ఆధ్యాత్మిక సంపత్తిని, వొకకులం వారు తమ పనిగా స్వీకరించి, ఇతరులకు అందజేసేవారు. ఆ విధంగా వృత్తి ధర్మాలు, కులాలు ఏర్పడినవి. రానురాను స్వయం పోషకంగా వుండటం సాధ్యంకాలేదు. ఆ భూమి బీడైంది; ఆ లోహం అక్కడ ఖర్చయిపోయింది. మరో ప్రాంతానికి వెళ్ళక తప్పిందికాదు. మరో ప్రాంతం వారు వీరిని రానిచ్చేవారు కాదు. యుద్ధాలు జరిగేవి. పోటీతత్వం ఏర్పడింది. రాజ్య విస్తీర్ణ కాంక్ష ఏర్పడింది. పరమార్థ చింతన సాగిస్తూనే వున్నాయి కొన్ని కులాలు; మరొక బృందం వొచ్చి వీరిని వోడించి వారి రాజ్యంలో కలుపుకునేవారు. దాస్యంచేసే వారి మనస్తత్వం ప్రబలింది. ఇహంలో లేని సుఖాలు పరంలో పొందవచ్చునన్న భావం ఏర్పడి, శరీరసుఖాన్ని ఖండించి,మానసిక ఆనందాన్ని, పరమాత్మలో ఐక్యమై జన్మరాహిత్యం పొందాలనీ—కొన్ని సిద్ధాంతాలు ప్రచారంలో కొచ్చాయి. పరమార్థచింతన, కులతత్వాన్ని పాటించడంలోనూ, కర్మ జరపడంలోనూ, విధులను నిర్వర్తించడంలోనూ వుందనుకొని, కాండకి ప్రాధాన్యమిస్తూ వచ్చారు. ఈ ఆచారాలు కరడుగట్టి, కుల తత్వం ఘనీభవించి, అంటరానితనంగా ప్రబలింది. ఇదొక చెడుగు. దీన్ని నిర్మూలం చెయ్యాలనే ప్రజాస్వామ్యం ఆదర్శం. అన్నికులాలూ, అన్నిమతాలూ సమమే. ఎవరి దైవాన్ని వారు కొలవవచ్చు. వీటితో నిమిత్తం లేక, వీటికి అతీతమైన ధర్మాన్ని నెలకొల్పాలన్న సంకల్పం, ఆధునిక తత్వం. తాను నిర్మించుకున్న సమాజంలో మానవుడు సుఖంగా వుండటానికి అవసరమైన సదుపాయాలనూ, పరికరాలనూ సమకూర్చడమే ప్రజాప్రభుత్వాల లక్ష్యం. ఇది మనస్సులో వుంచుకుని రసెల్ భావాలు చూద్దాం.

1926 లో ఈయన ఇచ్చిన ఉపన్యాసం,గ్రంథరూపంగా వెలువడింది. దీనిపేరు "నేనెందుకు క్రైస్తవుణ్ణికాను" అన్నది. పరిపాలనలో మతానికి ప్రమేయం వున్న దేశాలలో ఈ పుస్తకం ఎంతో సంచలనం కలిగించింది. ఎందరో దీన్ని ఖండించారు. "రసెల్ ఎందుకు క్రైస్తవుడు" అంటూ ఈయనకి సమాధానమిస్తూ, టి. ఎస్. ఎలియట్ వొక వ్యాసం ప్రచురించాడు. ఇది నాకు దొరకలేదు. విజ్ఞాన శాస్త్రం విజయాలు సాధిస్తూ, అణువుని బద్దలు కొట్టింది. బుద్ధిద్వారా, మానవుడు ప్రకృతిని జయించి, తనకి కావల్సిన వాటిని విజ్ఞానశాస్త్రంద్వారా సమకూర్చుకోగలడన్న ధైర్యం, ప్రబలిన కొద్దీ, ఈ గ్రంథం పట్ల ద్వేషం తగ్గింది. ఇక్కడ క్రైస్తవమతం గురించింది గనక, ఈ గ్రంథంలో భావాలని ఇక్కడ ఉదహరించడంలేదు నేను. కోపతాపాలు తగ్గి, నిదానంగా దీన్ని పరిశీలించే వాతావరణం ఏర్పడింది. ఇట్లా ఉద్రేకం, కోపం, ద్వేషం లేకుండా, వొక విషయంలోని నిజానిజాలు, సత్యాసత్యాలు తెలుసుకోవాలన్న కుతూహలమే, ఆధునికతత్వం అనొచ్చు. మతం గూర్చిన కొన్ని రసెల్ భావాలు పొందుపరుస్తాను.

"ప్రపంచంలో దేవుడంటె గురిలేనివారు, ఎందరో వున్నారు. వారు ఇందుమూలంగా కష్టాలకు, బాధలకు గురైనట్లులేదు. ఒకవేళ దేవుడుంటే, 'వీళ్ళంతా నన్ను కొలవడంలేదు—వీరిపై పగ సాధించాలి' అనుకునేటంత, అహంకారం దైవానికుంటుందనుకోను. (కొన్నేళ్ళ క్రితం వరదలకి రైలుపట్టాలు కొట్టుకుపోయి, రైలుపెట్టె నీళ్ళల్లో మునిగిపోయింది సంతమాగలూరులో. అందులో ప్రయాణికులంతా పండరిపురం నుండి, తిరిగి వస్తున్న భక్తులే.) క్రైస్తవులు, తమ మతం మంచిదనీ, ఇతర మతాలు చెడ్డవనీ అంటారు. ముఖ్యంగా కమ్యూనిస్టుల మతం, హానికరమైందంటారు. అన్నిమతాలూ అపకారమే చేస్తాయంటాను నేను. నిదర్శనం,

దృష్టాంతరము, గూఢమైన కారణం ఏ విషయమైనా లేవో, ఆవిషయంపట్ల విశ్వాసంకలిగి వుండడమే—'మతం' అంటె. నిదర్శనం దొరికినప్పుడు, విశ్వాసం గురించి ఎవరూ పట్టించుకోరు. 'భూమి గుండ్రంగా వుంది'—'రెండు, రెండు నాలుగు' అన్నవి మనం నమ్మడంవల్ల ఏర్పడిన సత్యాలు కావు. నిదర్శనకి బదులు, ఉద్రేకాన్ని నెలకొల్పినప్పుడే, 'నమ్మకాలు' మతాలు ప్రబలుతాయి.

సృష్టి అంతటిలోనూ, మానవుడి పుట్టుకే పొరబాటుగా తోస్తుంది. అతను లేకుంటె, సృష్టి మధురంగా వుంటుంది. ఉదయాన, సూర్యకిరణం తాకిడికి గడ్డిపోచపై మంచుకణం, వజ్రంలా మెరిసిన దృశ్యాన్ని, పాపిష్టి మానవుడు చూస్తున్నాడను కోడంలో బాధవుంది. హేయమైన వాంఛలు, అహం, కాఠిన్యం కనబరిచే మానవుణ్ణి, తన 'అంశగా' పరమాత్మ సృష్టించాడని ఎల్లా అనుకోను? మనకి కావల్సిన వాటిని, ప్రార్థనవల్ల, ఆధ్యాత్మిక నమ్రత వల్లా, సాధించలేము. ప్రకృతి సూత్రాలని తెలుసుకుని, హేతువాదాన్ని స్వీకరించి, సృష్టిని గూర్చిన పరిజ్ఞానంతో కావల్సిన వాటిని పొందగలం. ఇది మన చేతుల్లో వున్నది. ప్రార్థన ఫలం మనచేతుల్లో లేదు. పరమాత్మ, మన ప్రార్థన విన్నాడో లేదో చెప్పలేం. పైగా, ప్రార్థనవల్ల తీర్చుకునే కోర్కెలకు పరిమితి వుంది. మరీ ఎక్కువ కోర్కెలు కోరకూడదు. విజ్ఞానశాస్త్రం సాధించేవాటికి పరిమితి లేదు. నమ్మకంవుంటె, పర్వతం కదిలి మనచెంత కొస్తుందంటే ఎవరూ నమ్మరు. ఏటంబాంబు, పర్వతాన్ని కదుపుతుందంటె అందరూ నమ్ముతారు.

చప్పటి నీ హేతువాదంవల్ల ముక్తిసాధకుడికి నువ్విచ్చే ఆనందం ఏమిటని అడుగుతారు నన్ను. మూఢవిశ్వాశాలిచ్చే ఆనందం నే నివ్వలేను. త్రాగుడు, మత్తుమందులు, వితంతువుల్నీ అనాథల్నీ మోసగించి లక్షలు సంపాదించడంలోవున్న ఆనందాన్ని నే నివ్వలేను. నేకోరేది వ్యక్తి ఆనందంకాదు; మానవుల ఆనందం. మానవుల ఆనందం కోరినవారు, క్షుద్రమైన సుఖాలు కొన్నింటిని వొదులుకోవాలి. నీ బిడ్డకి జబ్బుచేస్తే, ఎంత నిరుత్సాహకరంగా డాక్టరు చెప్పినా, ఆధునిక వైద్యశాస్త్రం సూచించిన చికిత్స జరుపుకోవాలి. బూటకపు వైద్యుడి చేత మందు ఇప్పించి, బిడ్డ చనిపోతే, బూటకపు వైద్యం పట్ల నాకు నమ్మకం వుందని తృప్తిపడితే, నీచర్య క్షమించరానిది.

దేవుడున్నాడా లేడా అన్న దాన్ని వితర్కిస్తూ: ప్రతిదానికీ ఏదో కారణంవుండి తీరాలనుకుంటే దేవుడికి కూడా ఏదో కారణం వుండాలి. మూలకారణం లేకుండాకూడా ఏదన్నా వుండొచ్చు ననుకుంటే, ఆ 'ఏదన్నా' అన్నది, దేవుడికి బదులు, భూగోళమే అనుకోకూడదూ? భూలోకం ఏనుగుపై నిలబడిందంటాడు హిందూదేశీయుడు. ఆ ఏనుగు తాబేలుపై నిలబడిందంటాడు. అ తాబేలు దేనిమీద నిలబడిందయ్యా అని ప్రశ్నిస్తే, ఈ ప్రస్తావన విడిచేసి మరో విషయం చెప్పకుందాం అంటాడు. మూలకారణం దేవుడన్న వాదం, ఇట్లాంటిదే.

మనశ్శాంతినిస్తాయని తెలిసే, మనిషి కొన్ని మూఢనమ్మకాలని పాటిస్తాడు. కాని ఇల్లా దగా చేసుకుంటున్నాడన్నదాన్ని ఎదుర్కోలేడు. తన నమ్మకాలు పరామర్శిస్తే, నిలబడవని మానవుడికి తెలుసు—అందుకనే వాటిని ఎవరన్నా ఖండిస్తే మండిపడతాడు.

మన కర్మ ఇదివరకే దైవం నిర్ణయించాడు, దాన్నుండి తప్పించుకోలేము—అన్న నమ్మకంవల్ల, వ్యక్తిగతమైన కృషికి ఉత్సాహం లేకుండా పోతోంది. నేనింతే;—ఈ సంఘంలో వొచ్చి పడ్డాను. నాకిల్లా రాసిపెట్టి వుంది.నేనేం చేసినా ఈ సంఘం మారదు—నాకర్మ—అనుకుని నిరాశచెంది, ముందు జన్మలోనైనా కాస్త మంచి జరిగేలా చూడమని, దైవాన్ని కోరతాడు. ముందు జన్మలో మాత్రం నే బాపుకునేదేముంది—అసలు జన్మే వొద్దు—జన్మరాహిత్యం, కావాలి—పరమాత్మలో ఐక్యం ఐపోతాను మొర్రో అని, దైవచింతన సాగుతుంది—సామాన్యుడు మన దేశంలో స్వీకరించే సిద్ధాంతం ఇదేనేమో. ఈజన్మలో పాపాలు చెయ్యక, పుణ్యాలు చేస్తే, వొచ్చే జన్మలో నా పరిస్థితి బాగుంటుంది. అప్పుడు మరికొన్ని పుణ్యాలు చేస్తాను.

ఇట్లా పాపాన్ని మెల్లగా వొదుల్చుకుని, పుణ్యం చేస్తూపోతే, చివరికి జన్మలేకుండా, పరమాత్మలో ఐక్యంఅయిపోతాను. ఇదీ సామాన్యుడు అర్థం చేసుకున్న తత్వం. లోకంపై, జీవితంపై

రోత. ఈ చెట్లు, నదులు, కొండలు, మెరిసే తారకలు, అందమైన స్త్రీలు, రేడియోలు, బ్యాంక్ బాలెన్సులు,పిల్లలు,కళ, కవిత, నాట్యం, సినిమాలు— ఇవేవీ నాకు అక్కర్లేదా? నా క్కావాలి. పదేపదే పుట్టాలి. వొందేళ్ల తరవాతైన నా పార్టీ ఎలక్షన్‌లో నెగ్గితే చూడాలనివుంది. పాపాలు చేసి, పదేపదే పుడతాను. కొన్నివేల జన్మలెత్తాక, పాపాలన్నీ పూర్తిగా పొయ్యాక, చివరలో దైవంలో కలుస్తాను. తొందరేం— అనుకుంటే తప్పా? కాదునాయనా, దైవాన్ని ప్రార్థిస్తేనా, స్థిరమైన ఆనందం దొరుకుతుంది. కోర్కెలుకూడా తీర్చగలడు దైవం, అంటారు కొందరు. యుద్ధసమయంలో, ఇరుపక్షాల వారూ, తమదేశం నెగ్గాలనీ, అవతలదేశం నాశనమవాలనీ ప్రార్థనలు సల్పితే, దైవం ఎవరి మొఱ ఆలించాలి? ఎన్నికలలో రెండుపక్షాల అభ్యర్థులు పోటీ చేస్తారనుకుందాం. ఒకపక్షం అభ్యర్థికి శీలం వుంది, తెలివిలేదు. మరో పక్షం అభ్యర్థికి తెలివుంది, శీలం లేదు. శీలం వుంటేగాని మంచిపనికి పూనుకోడు; తెలివుంటేగాని తలపెట్టిన పని నిర్వహించలేడు. ఇద్దరూ దైవాన్ని ప్రార్థిస్తే, ఎవర్ని నెగ్గిస్తాడు దేవుడు? ఎలక్షన్ సమయం, ప్రజాస్వామ్యంలో ప్రజలకేకాక దైవానికికూడా గడ్డుకాలమే. రసెల్ సూచించిన హేతువాదాన్ని స్వీకరిస్తే, ఇట్లా వితర్కించుకోవాలి, నేను, నాతోపాటు పాఠకుడూ.

మన కష్టాలను మతం తొలిగించగలదా? అన్న మరొక ప్రశ్నకు రసెల్ సమాధానం చూద్దాం. మతానికి సంబంధంలేని నైతికనియమాల విషయంలోనే ఇబ్బందు లొస్తాయంటాడు. ఒక ఉదాహరణ, దొంగతనం. సమాజంలో వారందరికీ దొంగతనం లేకపోవడం మెరుగు. నీతి, మతం, న్యాయచట్టంలేని సమాజంలో, ప్రతివ్యక్తీ, ఆదర్శసమాజం అంటె, తనొక్కడూ చోరుడు, మిగతా వారంతా బుద్ధిమంతులూ వున్న సమాజం అనుకుంటాడు. కాబట్టి తన ఆదర్శాన్నీ, ఇతరుల ఆదర్శాన్నీ క్రోడీకరించాలంటే, సంఘ నియమాలు అవసరం. నేరస్థులను శిక్షించే చట్టం, పోలీసు అవసరం అన్నమాట. కాని కొందరు నేరస్థులు పట్టుబడరు. ధనానికాశపడి, పోలీసు ఆరాలు తియ్యడు వొక్కొక్కప్పుడు. పోలీసు విధినిర్వహణలో అశ్రద్ధ చూపినా, దొంగతనాన్ని శిక్షించే దైవం వున్నాడనుకున్నప్పుడు, దైవాన్ని నమ్మడం మంచిదే. సమాజంలో అందరూ దైవం పట్ల నమ్మికగలవారైతే, దేవుడే దొంగతనాన్ని రూపుమాపాడనుకుంటారు. రమణాశ్రమంలో రాత్రి దొంగలు పడి, పూజా సామగ్రి దొంగిలించారుట. అడ్డుకున్న రమణ మహర్షిని కొట్టి తోశేశారుట. ఇది జరిగిన మరో గంటకి శిష్యులొచ్చి, 'పూజకిరండి' అన్నారుట. 'అయిందిగా పూజ' అన్నారుట రమణ. 'ఎప్పుడు?' ''ఇప్పుడేగా అయింది బడితి పూజ'' అన్నారుట. యోగికికూడా ఇట్లాంటి హాస్యదృష్టి అవసరం. వెనకటి రోజుల్లో ఇట్లాంటి నమ్మకంవల్ల, కొంత మేలు జరిగివుండొచ్చు. కాని ఈనాడు అట్లాంటి నమ్మకంవల్ల కలిగే మేలుకన్నా చెడుగే ఎక్కువవుతోంది. నాగరికత ప్రబలినకొద్దీ, దైవశాసనం ప్రభావం తగ్గి, లౌకికశాసనాల ప్రభావం హెచ్చుతుంది. దొంగతనం చేస్తే, దైవం శిక్షిస్తాడన్న భయం కంటె పోలీసులు పట్టుకుంటారన్న భయం ఎక్కువగా వుంటుంది. దైవభక్తుడుకూడా దొంగతనం చేస్తే, నరకానికెడతాననుకోడు, ఈనాడు. నరకం, వెనకటివారు చెప్పినంత భయంకరంగా వుండకపోవచ్చు ననుకుంటాడు— మెల్లిగా కూర్చుని పశ్చాత్తాపపడితే సరిపోతుందనుకుంటాడు. నిజానికి ఇక్కడ, ఈ లోకంలో పట్టుకొని దండిస్తారన్న భయంవల్లనే, దొంగతనాని కొడిగట్టరు జనం. ఎక్కడో బంగారం గని వుంది— వూరికే వెళ్లి తెచ్చుకోవచ్చునని తెలియగానే జనం అంతా అక్కడికి ఎగడి, బంగారాన్ని దొంగిలించడం మొదలెడతారు. దొంగతనం లేకుండాపోవడం మంచిదే కదా, మతం దొంగతనం కూడదని శాసిస్తే తప్పేమిటి అని అడుగుతారేమో. తప్పులేదు నిజమే. కాని అల్లా శాసించడంవల్ల మరో ప్రమాదం వుంది. మతం అల్లా ఎందుకు శాసించింది అని ఎవరన్నా ప్రశ్నిస్తే, వారిమీద విరుచుకుపడతారు మతోన్మాదులు. మానసిక స్వేచ్ఛ, కౌతూహలం దెబ్బతింటాయి. అల్లా అడిగినవారిని, నిప్పుగుండంలో పడేసి చంపారు, వెనక. నాగరికమైన దేశాలలో పాఠ్యగ్రంథాలద్వారా, పిల్లలు మతసూత్రాలని స్వీకరించేటట్లు, వాటిని ప్రశ్నించే అవకాశం లేకుండా, నిర్బంధ విద్య ద్వారా, సంకుచిత మనస్తత్వాన్ని రూపొందిస్తారు; అదీ ప్రమాదం అంటాడు రసెల్.

మనదేశంలోకూడా, మతం పేరిట హింసాకాండ బోలెడు జరిగింది నిన్నమొన్న వరకూ. హిందూ తత్వ శాస్త్రం, ఇతర సిద్ధాంతాలపట్ల సహనం చూపి, వాటిల్లో మంచిని స్వీకరించి వుండొచ్చు. ప్రాచీన మతగ్రంథాలలో ఈ హింసాకాండ జరపమని వ్రాసి వుండకపోవచ్చు. అయినా, మతప్రాబల్యం నుండీ, మతోన్మాదుల నిర్వచనాల నుండి, బైలుదేరిన హింసాకాండ వుంది. కొన్నింటిని ఉదహరిస్తాను. ఒరిస్సాలో, కొండజాతులు, ఖోండ్‌లు. వారు నరబలు లిచ్చేవారు. బలి కాబొయ్యేవాడు మెరయా. డబ్బిచ్చి అతన్ని కొంటారు— పందులు, మేకలు, కోళ్ళు, ధాన్యం రూపేణ. మిడతలదండుని చంపాలన్నా, భూమి సారవంతం అవాలన్నా అతన్ని బలి చెయ్యాలి. చంపాక, అతని శరీరంలో మాంసపు ముక్కలని, భూమిలో నాటేవారుట. మెరయని చంపే ముందు, కులపెద్ద ఎందుకు అతన్ని బలియ్యాల్సి వొచ్చిందో చెప్పి, ఆ బలిలో పాపం ఏదన్నా వుంటే, అది అమ్మినవాడికే కాని, కొన్నవాడికి చుట్టుకోదని చెప్పేవాడుట. మతంన్నుండి జనించిన మూఢ నమ్మకమే ఈ బలికి కారణమైంది. నీలగిరిలో తోడాలు, బంజరులు, నేలలో పూడ్చిన శిశువుల పైనుండి పశువుల మందను తోలేవారుట. ఈ ప్రాచీన సమాజాలు, హిందుతత్వానికి దూరంగా వున్నమాట నిజమే ఐనా, తంజావూరులో ప్రతి శుక్రవారం, వొక మొగ శిశువుని శివాలయంలో బలిచ్చే ఆచారం వుండేదిట. బస్తర్‌లో 1830 లో రాజాగారు, వొక్కసారి పాతికమందిని బలిపీఠానికి ఆహుతుల్ని చేశాడుట. మతం ఆదేశించిన కర్మకాండ పేరిట, నరబలులు, అనేకప్రాంతాలలో, 1854 వరకూ జరుగుతూ వుండేవిట.

అల్లాగే సహగమనం—భర్త చావగానే, భార్య కూడా చావాలనడం—బలవంతంగా విధవల్ని చంపడం, క్రితం శతాబ్దిలో జరిగిన హింసాకాండ. ఇహంలో స్త్రీకి, భర్తే దైవం. ఆమె విధవగా వుండిపోతే, పతివ్రతగా వుండలేదు. శీలం కాపాడుకోలేదు. మరెవరో ఆమెని అనుభవిస్తున్నాడంటే, భర్తకి బాధగా వుంటుంది. నిరుపయోగమైన విధవని, పోషించడానికి డబ్బు కావాలి. వేదాలలో ఇల్లా చెయ్యమని లేకపోయినా, తర్వాత బైలుదేరిన, శాస్త్రాలలో, అల్లా చనిపోయిన వితంతువు స్వర్గాని కెడుతుందన్న మూఢ నమ్మకం వల్లనే ఈ దురాచారం కొనసాగింది. టాడ్ రచించిన రాజస్థాన కథావళిలోనూ, 'స్లీమాన్' రచించిన గాథలలోనూ, భర్తలతో హతులైన స్త్రీల అద్భుత గాథలెన్నో వున్నాయి. రాజస్థాన్‌లో, భర్తలు, వీరమరణాన్ని చూరగొంటారు. అట్టివారి భార్యల సహగమనం,అద్భుతంగా వుండొచ్చు.కాని బెంగాల్‌లో జరిగిన 'సతి' చర్య అతి ఘోరమైనది. ఆనాటి విధవలు, అయిష్టంగా భయంతో సహగమనం చేసినట్లు కనబడుతుంది. భర్త శవానికి ఆమెని కట్టివేస్తారు. బలవంతంగా చంపేవారు. ఒక సందర్భంలో, వితంతువు తప్పించుకు పారిపోతే, ఆమె కొడుకు, ఆమెని పట్టుకుని, బలవంతంగా నిప్పుగుండంలో తోశాడుట. 1806 లో బెనారస్‌లో జరిగిన ఉదంతం, చిత్రమైంది. 'స్లీమాన్' వివరించాడు: కాశీ మేజిస్ట్రేట్‌గా వుంటున్న హార్డింగ్, ఒక వితంతువు సహగమనం చెయ్యకుండా, నచ్చజెప్పి, నిలుపు చేశాడుట. కాని ఏడాది గడిచాక, ఆమె బంధువులంతా, ఆమె చనిపోయి స్వర్గాని కెళ్ళడం మంచిదని, ఆమె మనస్సు మార్చి, ఒప్పించి, కాశీకి రెండుమైళ్ల దూరంలో, గంగ ఆవలి ఒడ్డున చితిపేర్చి, అందులో పడవేశారుట. తాళ్ళు గట్టిగా కట్టలేదో ఏమో, శగ తగలగానే, ఆమె లేచి గంగానదిలో దూకిందిట. ఆమె బంధువులు, గట్లమీద పరుగెడుతూ వెళ్లారుట. కొంత దూరం నీళ్లలో వెళ్ళాక, పోలీసులు పడవలో వచ్చి, ఆమెని రక్షించి తీసుకువెళ్లారుట. బంధువులు, ఆమెని తమకి ఒప్పగించమని అడిగారుట. "ఈ త్యాగాన్ని దైవం హర్షించలేదు. చూడండి, గంగానది ఆమెని మీకు దక్కకుండా ఇటుతీసుకొచ్చింది. దాన్నిబట్టి, దైవం ఈమెని పరిత్యజించాడు, వద్దన్నాడు." అని మేజిస్ట్రేట్ నచ్చచెప్తే, తృప్తిపడి బంధువులు వెళ్లిపొయ్యారుట. బెంటింక్ ప్రభువు సాహసించి, చట్టరీత్యా, 'సహగమనం' లేకుండా చేసినా, మతోన్మాదులు, తమ ఛాందసాన్ని విడనాడడానికి చాలాకాలం పట్టింది. 1911 లో కూడా, ఒక సహగమనం జరిగిందంటాడు ఎడ్వర్డ్ తాంప్సన్. పాతిక, ముప్ఫై సంవత్సరాల పూర్వంవరకూ ఈ హింసాకాండ జరిగిందంటే, మూఢ నమ్మకాలవల్ల సంక్రమించే కీడు ఎట్లాంటిదో తెలిసొస్తుంది.

అర్థంలేని నమ్మకాలూ, అలవాట్లూ కొన్ని మనలో ఈనాడూ వుండిపోయ్యాయి. బస్‌లో వెడుతుంటే, సాయంత్రం రోడ్డుమీద విద్యుత్ దీపాలు వెలగగానే, బస్సులో సూటు ధరించిన వ్యక్తి, నమస్కారం పెట్టి, చెంపలు వేసుకోవడం నే చూశాను. వ్యాధి కుదరాలన్నా, సంతానం కలగాలన్నా, ముడుపు కట్టి, ఏ ఆలయానికో వెళ్లడమో, ఏ యోగినో దర్శించి, ఇంత విభూతి తెచ్చుగుని, తమ ఇబ్బందులు తొలిగించుకోవాలని, యాత్రలుచేసి వచ్చిన వారెందరో వున్నారు. భర్త, విద్యాధికుడై, శాస్త్రీయ దృక్పథం కలిగినవాడైనా, భార్య పూర్వకాలపు మనస్తత్వం కలదై, ముడుపులు, మొక్కుబళ్లవల్ల కోర్కెలు సిద్ధిస్తాయన్న, నమ్మకం కలదై వుండడం వల్ల, ఆమెని కష్టపెట్టడం ఇష్టంలేక, నొచ్చుకుంటుందేమోననుకుని, భర్త, పెట్టి, మూటా నెత్తిని పెట్టుకుని, యాత్రలకి బైలుదేరుతాడు. యోగుల్ని సందర్శిస్తాడు. విజ్ఞాన శాస్త్రం ప్రబలి, శాస్త్రీయ దృక్పథం అలవడితే, ఈ వృధాయత్నాలు చెయ్యరు. సంతానం కలగకపోతే, పూర్వజన్మలో ఏదో పాపం చేశామన్న భావం తొలగాలి. హాస్పటల్ లో చేరి, భార్యాభర్తలిరువురూ పరీక్ష చేయించుకుని చికిత్స పొందాలి. సిగ్గు, భయంవల్ల చాలామంది ఈ పరీక్షకు ఇష్టపడరు. నూటికి తొంభై పాళ్లు, చికిత్స వుండితీరుతుంది. పుట్టుకతో వచ్చిన అవకరమో, వైకల్యమో వుంటే తప్ప, చికిత్సద్వారా ఫలితాన్ని పొందొచ్చునన్నభావం కలగాలి.

ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి, కొరుకుపడని సమస్యలు చాలావున్నాయన్న మాట నిజమే. తేలుమంత్రం, పాముకాటు మంత్రం, మనకిష్టులైన వారు, దూరంగా మరోచోట ఆపదకులోనైతే, మనకిక్కడ ఏ తలనొప్పోవచ్చి, ప్రమాదం జరగబోతోందన్న స్ఫురణ కలగడం; దయ్యాలు, భూతాలు దుస్వప్నాలు, క్రితం జన్మలోని స్మృతులు— వీట్లకి కారణాలు విజ్ఞాన శాస్త్రంలో దొరకవు. పరిశోధనలు జరుగుతున్నాయి. నిదర్శనం, దృష్టాంతరం, రూఢైన కారణం తెలిసేవరకూ, వీట్నిగూర్చి, తీర్పు చెయ్యక, బుద్ధి భవనం, కిటికీలు తెరిచివుంచడం మంచిది.

దేవుడు, అమరత, జన్మరాహిత్యం— ఈ భావాలకు విజ్ఞాన శాస్త్రంలో స్థానం లేదంటాడు రసెల్. మతానికి, ఈ భావాలు పునాదులులాంటివి అనలేంకూడా. ఎందుకంటే, బౌద్ధంలో ఈ రెండూ లేవు.— అమరత్వంపట్ల పూర్తిగా వర్తించక పోయినా స్థూలంగా చూస్తే బౌద్ధమతంలో అమరత ప్రధాన సూత్రంకాదు.— "ఈ రెండూ నేను నమ్మను. నమ్మేటందుకు తగిన ఆధారాలు లేవు. దేవుడు లేడని ఋజువు చెయ్యగలను అనడం లేదు నేను. క్రైస్తవ మత స్థాపకుడైన క్రీస్తు, ఒకప్పుడు వర్ధిల్లి వుండవచ్చు; అనేక మతాలు పేర్కొన్న దేవుళ్లు వర్ధిల్లి వుండవచ్చు; ఇవన్నీ అనుకోడమే అవుతుంది. ఒకటి మరొక దానికంటె సంభవమైందనుకోడానికి ఆధారంలేదు. మానవుడు తెలుసుకోగల విజ్ఞాన జగత్తుకి అతీతమైనవి ఇవి. అమరజీవులు కావడం అన్న భావాన్ని మరోవిధంగా సమర్థించవచ్చు.మనిషి ఎల్లాపుట్టి, వర్ధిల్లి, నశింపవుతున్నాడో, విజ్ఞాన శాస్త్రానికి అవగాహన అవుతుంది. నీటిబిందువు, అమరజీవి కాదు. దాన్ని జల, ప్రాణవాయు కణాలుగా మార్చవచ్చు. తానల్లా మారిపోయి కూడా, 'నాలో నీటితత్వం— అనే అమరత వుంది' అని ఆ నీటిబిందువు వాదిస్తే, 'ఆ, చెప్పొచ్చావు, పోదూ' అని త్రోసిపారేస్తాం. ఆవిధంగానే మెదడులో అమరత లేదు. శిక్షకు లొంగిన సజీవ కణాల సమీకరణ— మెదడు. మృత్యువుతో ఆ సమీకరణ అంతమౌతుంది. మనస్సు, ఊహ,— ఇవికూడా, శారీరకమైన భౌతిక శక్తులతో ముడిపడినవే. కావున శరీరం అంతమవడంతో, మిగత శక్తులన్నీ అంతమొందుతాయి. నిలబడి మరో శరీరంలో ప్రవేశించేది, ఒక్కటీ లేదు. కాని కొందరు మరోజన్మ వున్నట్లూ, తాము వెనకటి జన్మలో ఎవరైందీ తెలియడం, మొదలైన అద్భుత గాథలు వింటాము. వీటిల్లో కొన్ని భూటకాలైనా, కొన్ని నమ్మతగినవిగా వున్నాయి. వీట్ని గురించి పరిశోధనలు జరిగి, తగినంత నిదర్శన దొరికేవరకూ పునర్జన్మ సాధ్యమైందనీ, కాదనీ, నిర్ణయించ కూడదు" —అంటాడు రసెల్.

మనిషి ఆశించేది అమరతకాని పునర్జన్మ కాదు. అమరత సాధ్యమని చెప్పేవారు, ఆత్మ

శరీరం, వేరు, ఒకటి హతమైనా రెండోదానికి చావు లేదంటారు. ఇది అతీంద్రియజ్ఞానం తెచ్చి పెట్టిన మూఢవిశ్వాసం. మనస్సు, పదార్థము— ఈ రెండూ విడివిడిగావుండే యదార్థాలు కావు. ఆత్మవలెనే, ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లుకూడా శాస్త్రజ్ఞుల తార్కిక కల్పనలే. ఇవి కొన్ని దశల కూర్పు— వాటికొక చరిత్ర వుంది. ఆత్మవిషయం చూడండి. మనిషి పుడతాడు— శిశువుగా— తర్వాత బాల్యం— యౌవ్వనం— ఇంకా పెరగడం— వార్ధక్యం — ఈ అన్ని దశలలోనూ, ఆత్మ ఒక్కటిగా వుంటుందనలేము. స్త్రీ పురుష సంయోగంవల్ల ఏర్పడ్డ స్థితి— మార్పులేకుండా స్థిరంగా ఒకే స్థితిగల యదార్థం కాదు ఆత్మ. ఆత్మకి అమరత వుందన్న తత్వజ్ఞులకు ఒక పరీక్ష పెట్టొచ్చు. ఆత్మ, స్థలం అంతటా వ్యాపిస్తుందంటారు. మనం చాలాకాలం జీవించాలని కోరతాంగాని, లావుగా అవాలని కోరం. తత్వజ్ఞులు ఈ విషయం గమ నించి వుంటే, ఇట్లాంటి కారణాలు చెప్పరు. మృత్యువంటే భయం. ఆ భయంనుండి జనించినదే 'అమరత'ని గూర్చిన చింతన.

మృత్యువుని కొంతవరకూ నిలుపు చెయ్య గలం కాని, జయించలేము. జయించగలమన్న భ్రమే, మత సిద్ధాంతమైంది. లోకాన్ని దేవుడు పాలి స్తున్నాడు. ప్రార్థనద్వారా, దేవుణ్ణి మెప్పించి కోర్కెలను సాధించగలం— దీనిద్వారా, సర్వశక్తు డైన దైవంలో కొంత శక్తిని మనమూ పంచు కుంటున్నాం. మొత్తానికి మతం, భయాన్ని ప్రవేశ పెట్టింది. కొన్ని భయాలు, మెచ్చుకోతగ్గవంటుంది. నిజానికి అన్నిరకాల భయాలూ చెడ్డవే. "చని పోగానే, నే కుళ్ళి, నశింపవుతాను. నా తాలూకు ఏదీ మిగలదు. నేను వృద్ధుడను. జీవితం అంటే నా కిష్టం. కాని మృత్యువంటె భయంతో వణికి పోను. అన్ని సుఖాలూ అంతమొందుతాయన్నంత మాత్రాన, అవి సుఖాలు కాకుండా పోవు. నేను ప్రేమించిన వారు, అమరజీవులు కారు, చనిపోతారు, అనుకుని వారిని ప్రేమించకుండా వుండలేను. మాన వుడు గొప్ప త్యాగాలు చెయ్యగలడు, సాహసించి ప్రాణం ఇవ్వగలడు. ఇంతటి శక్తిగల మానవుడు మృత్యువుకి ఎందుకు వణికిపోవాలో!"

ఇంక, 'ముక్తి', 'మోక్షం' పొందడం అన్న భావం గురించి రసెల్ ఏమన్నాడో చూద్దాం. ముక్తిపొందడం అన్నది అన్ని మతాలలోనూ వుంది. ఒక వ్యక్తి ముక్తిచెందుతాడు అన్నది, మతసంప్ర దాయం తెచ్చిపెట్టిన లోపం అంటాడు రసెల్. ఆత్మకీ, దైవానికీ నడుమ జరిగే సంభాషణే, ఆధ్యా త్మిక జీవనానికి ప్రాతిపదిక. దైవ శాసనానికి తల వొగ్గడం — నీతి. తను ఎట్లాంటి సమాజంలో వున్నా, వ్యక్తికి ఇది సాధ్యం. ఒకదశలో ఇది కొంత మేలు సమకూర్చింది. కాని ఈనాటి ప్రపంచంలో, వ్యక్తుల ముక్తికంటె, సమాజాల సాముదాయక ముక్తి ముఖ్యం అంటాడు రసెల్. రాజకీయ వ్యవస్థలో ఏ స్థానమూ లేక, బానిసలైన రోము సామ్రాజ్య ప్రజలలో క్రైస్తవ మతం అవత రించింది. క్రైస్తవ మతం ప్రబలిన మొదటి మూడు శతాబ్దాలలోనూ, ఆ మతాన్ని స్వీకరించిన వారు తాము సమాజాన్ని మార్చలేమని తెలుసుకున్నారు. తాము వుంటున్న సమాజం మంచిది కాదన్నారు. ఈ పరిస్థితిలో, ప్రపంచం చెడ్డదైనా, వ్యక్తి ముక్తి సాధించగలడన్న అభిప్రాయం ప్రచారమైంది. మోక్షకామి, ఈ ప్రపంచం ఎల్లావున్నా పట్టించుకో నక్కర లేదన్నారు. తత్వజ్ఞుడు ప్లేటో, హక్కులు, బాధ్యతలు ఎరుగున్న పౌరుడు.. కావున, సంఘ న్యాయాన్ని గురించి వ్రాసేటప్పుడు, వ్యక్తులని గురించి కాక, బృందాలను గురించి వ్రాశాడు. గ్రీకులు స్వాతంత్ర్యం కోల్పోయింతర్వాత, నిస్సం గత్వం ప్రచారమైంది. క్రీస్తు కాలంలో 'జుడియా' ఏ దశలో వుందో, ఇండియాలో రాజకీయ పరిస్థితి ఆ దశలో వుంది. క్రీస్తు బోధించినవాటినే, ఇండియాలో గాంధీ బోధించాడు. రోముదేశపు న్యాయ మూర్తి పొంటియస్ పైలేట్ వారసులైన ప్రభు వుల దండనకు గురైనాడు. ఇండియాలో జాతీయ వాదులు వ్యక్తిగతమైన ముక్తితో తృప్తిపడక, జాతి కంతటికీ ముక్తి కావాలన్నారు. పాశ్చాత్య దేశాల ప్రజాస్వామ్య సూత్రాన్ని స్వీకరించారు వారు. ఐనా కూడా, 'వ్యక్తి ముక్తి' అన్న సూత్రం తాలూకు ప్రభావం వారిలో కొంతవుండిపోయి, తగినంత ధైర్యంతో, జిజ్ఞాసతో 'జాతీయముక్తి' అన్న భావం రూపొంది, సుస్థిరం కావడం లేదేమో—

అంటాడు రసెల్. సత్ప్రవర్తన అంటే, దైవం శాసించిన దానికి తలొగ్గడం.— దైవం ఏమి శాసించాడో చెప్పేది అంతరాత్మ. పరప్రభువుల నిరంకుశ పాలనకు తలొగ్గే మనస్తత్వంనుండి జనించిన భావం— ఇది అంటాడు. సత్ప్రవర్తనలో కొస్తంత తెలివికూడా వుండాలి. ఇంక అంతరాత్మ చెప్పింది అన్ని సమయాలలో నమ్మడానికి వీల్లేదు. చిన్నప్పుడు దాది, అమ్మ, అమ్మమ్మ నేర్పిన పాఠాల సారాంశమే అంతరాత్మ. దానికీ, వారికున్నంత తెలివే వుంటుంది. నిండు జీవితానికీ, మంచి ప్రవర్తనకీ చదువు, స్నేహితులు, ప్రేమ, పిల్లలు, కొంత డబ్బు, ఆరోగ్యము, అనువైన వృత్తి అవసరం. ఇవన్నీ సంఘ జీవనంలో తెచ్చుకోవల్సినవే. మంచి సమాజంలో, మంచి జీవనం సాధ్యపడుతుంది — మరో విధంగా, దీన్ని పూర్తిగా ఎవ్వరూ సాధించలేరు.

మూఢాచారాలు, తప్పుడు నిర్వచనాలు, గ్రుడ్డి నమ్మకాలు మతాన్నుండి జనించాయి గనక, మతం మొత్తం మీద అపకారం చేసింది గావున ఏమతాన్నీ స్వీకరించ నక్కర్లేదు— అని రసెల్, మతాలలోని లోటుపాట్లని పరామర్శించాడు. ఐతే, అనాదిగా ప్రపంచమంతటా వర్థిల్లుతూవచ్చిన మతాలన్నీ వృధాయే? వీటిలో మంచిఏమీలేదా? మతాలని నెలకొల్పిన మహాప్రవక్తలూ, అనుసరించిన కోట్లాది ప్రజలూ— వీళ్ళంతా మూర్ఖులేనా? మతం ఏ ప్రయోజనమూ సాధించలేదా? మతాలన్నీ బూటకాలేనా; ఏదీ అక్కర్లేదు అనడం సరిపోతుందా? ఇంతేనా?

ఈ ప్రశ్నలు రసెల్ అడగక పోలేదు. మతంలో ఒక ప్రత్యేకమైన అనుభూతివుంది. తిండి, బట్ట, ప్రేమ, ఇల్లు, ఉద్యోగం, ఆరోగ్యం, సంపద, స్నేహితులు, కళలు, వినోదాలు, వ్యాయం, సత్యం, ధర్మం, నీతి, శీలం — ఇవన్నీ వుంటే మనిషి ఇంకేమీ కోరడా? బుద్ధుడు, క్రీస్తు, మహమ్మద్, లావొట్జి, — వీటన్నింటినీ పరిత్యజించి, మరి దేన్నో అన్వేషించారు. అదేది? మానవుడి బుద్ధికి, తార్కిక అన్వేషణకి అతీతమైన సృష్టివైచిత్రి,— ఒక 'మాయ' ఏదో వుంది. ఆ వైచిత్రి అన్వేషణ ఫలితమే మత ప్రవక్త తొలిబోధ; యోగి దర్శన; ఋషి వాక్కు; తపస్వి శోధించిన రహస్యం. ఇదే అన్ని మతాలలోని సారాంశమూ. ఈ సారాంశాన్ని, రసెల్ 1912 లో హిబ్బర్ట్ పత్రికలో చర్చించాడు. సంశయ శీలుడు, నాస్తికుడు, హేతువాది అయిన రసెల్, మతాలలోని ప్రధాన సూత్రాన్ని, దాని ప్రాముఖ్యాన్ని తృష్ణతో, ఉద్వేగంతో, విశదపరచడం చూసి నేను ఆశ్చర్యపడ్డాను. ఈ ఊహ, తృష్ణ, అతీంద్రియ జ్ఞానం (Mysticism) కలగచేసే కవితావేశము, కళా సృష్టిలో గల తపన — రసెల్ భావప్రపంచం పొలిమేరలోమాత్రం వున్నాయనుకునేవాణ్ణి. కాని ఈ వ్యాసం చదివాక, రసెల్ హృదయం ఈ ఆవేశంతో కొట్టుకోగలదని తెలుస్తుంది. అందులో కొన్నిభాగాలని పొందుపరచి, మతంగూర్చిన రసెల్ భావాల పరామర్శ ముగిస్తాను.

వెనకటి తరంవారిలాగు, మతం ఆదేశించిన నమ్మకాలు, కర్మకాండ, మహత్తు. వీటిని ఈనాడు మనం విశ్వసించలేము. వీటిని విడిచేస్తే, మతంలో ఏముంది? మతాన్ని సమకూర్చేది — చిత్తవృత్తి (Feeling) లేక వాత్సల్యత, కాని నమ్మకాలు కావు. చిత్తవృత్తిని నమ్మకాల చిట్టాలో చేరిస్తే 'ఇది మంచిది', 'అది చెడ్డది' — అనిపించేటట్లు చేస్తుంది, కాని, మేధస్సుకి గురికానప్పుడు, వాత్సల్యతగానే వుండిపోయి, మన చర్యని, ప్రవర్తననీ రూపొందిస్తుంది. మన అల్పమైన వాంఛలు, స్వల్పమైన ఆలోచనలు— అనే జైలు నుండి మనల్ని విడుదల చేసి, స్వార్థరహితమైన పరిపూర్ణతనీ, అనంతత్వాన్నీ చవిచూసేటట్లు చేసే శక్తి మతంలో వుంది. మూఢనమ్మకాలతో ముడిపడని మతానికి, ఈ విముక్తి సాధ్యం.

మనిషిలో దైవత్వమూ, పశుత్వమూ కలిసి వుంటాయి — ఒకటి అనంతమైనది; రెండోది పరిచ్ఛిన్నమైనది. పరిచ్ఛిన్నమైన భాగం జంతుకోటిలో వున్నట్లే, శరీరానికి కట్టుబడి, — ఇక్కడ, ఇప్పుడు — తనకన్నీ కావాలంటుంది. స్త్రీ పురుషుల ప్రేమ, తల్లిబిడ్డల ప్రేమ, — పరిచ్ఛిన్నమైన, ప్రవృత్తి, పశుప్రకృతి, శత్రుత్వము, బంధుకోటి పట్ల వాత్సల్యము, గుంపులుగా నివశించే జంతువుల ప్రకృతి వంటివే. ఇవన్నీ వుంటేనే మనిషి — తోటి

వారినుండి, వేరైన మనిషి. మేఘావృతమైన సముద్రంపైనుండి మసగగా ప్రసరించే వెలుగు వలె, అనంతత్వమైన భాగం, లోకాన్ని ఒక్కకోణం నుండి చూడక, సదా వెలుగుతూవుంటుంది. ఇప్పుడు, ఇక్కడ ఎంతస్ఫుటంగా కనబడతాయో, అనంతత్వానికి, గతం, దూరప్రాంతం అంత స్ఫుటంగా, యదార్థంగా కనబడతాయి. వ్యక్తిక్షేమం దాటి, సర్వమానవుల క్షేమాన్ని కాంక్షించగల ఏకభావన, అనంతత్వం.

నీ మంచి, నామంచి అనికాక,అసలు "మంచిని" కోరుతుంది; నిష్పక్షపాతమైంది; ఈ నిష్పక్షపాతమైన సూత్రమే, భావనలో సత్యాన్ని, ప్రవర్తనలో న్యాయాన్ని, మనోధర్మంలో ప్రేమనీ శోధిస్తుంది. ఇక్కడ, ఇప్పుడు, నేను — వీటి మీద ఆధారపడక మానవులందరినీ, సృష్టినంతటినీ వెదికే యీ సూత్రం సమైక్యతని సాధిస్తుంది. ఈ రెంటికీ వైరుధ్యంలేదు. ఈ రెండూ కావాలి మనిషికి. పరిచ్ఛిన్నమైన భాగం జీవించాలంటుంది. పదార్థంపై ఆధిక్యతని కోరుతుంది; చుట్టూ గిరులు గీస్తుంది; జైలుగోడ లేవనెత్తుతుంది — తనే దైవం అనుకుంటుంది. చాలామందిలో పరిచ్ఛిన్నమైన భాగం, విశ్వాత్మకి కాపలావానిలా వుండిపోతుంది; కొందరు, ఇందులోంచి పారిపోయి, కాసేపైనా, స్వేచ్ఛ పొందుతారు; కొందరు, ఈ గోడని పూర్తిగా పడగొడతారు. ఈ విముక్తే, అనంతత్వం. మహావేదనలో క్షణం సేపు, సౌందర్యం సాక్షాత్కారమైనట్లు, అపారమైనప్రేమ ముంచెత్తినట్లు, చెట్లనడుమ చీకటిగాలులు వీచినట్లు, నిత్యజీవితంలో పడేబాధ, తగవు, పేచీ, జగడం నిలిచిపోయి, స్థిరమైన శాంతి మనస్సుని ఆవహిస్తుంది.

ఏదోక్షణంలో, ఒక్కసారిగా ఉత్పన్నమైన ఈ జ్ఞాన రేఖే మతాల సారం. క్షుద్రమైన దృష్టికి అగుపడే వస్తువులూ, పదార్థమూ, — వీటినే తెలుసుకుంటుంది జ్ఞానరేఖ — కాని కొత్తకోణం నుండి తెలుసుకుంటుంది. అవి, వాటి ప్రత్యేకత, స్థిరత్వము కోల్పోయి, అనంతమైన సుందర దృశ్యంగా కనబడతాయి. నేను రోజూ ఎరుగున్న జగత్తులో, నే చేసే పనిలో, ఇప్పుడు, ఇక్కడ, ఈ సౌందర్యం నాకు లభ్యమవాలి. విశ్వాత్మని కౌగలించుకొన్న ఈ జ్ఞానరేఖవల్ల, నా కివి దొరుకుతాయి.

ఇందుకు పరిచ్ఛిన్నమైన భాగాన్ని జయించి, విడిచేసి, అణగద్రొక్కి, పరిత్యజించాలి. ఆ స్థితిలో ఏదీ కోరను; వాంఛించను; నాదిగా చేసుకోవాలన్న తపనలేదు. ప్రత్యేకాత్మ, జీవాత్మ అవుతుంది. ఈ చింతననుండి, విశ్వప్రేమ జనిస్తుంది.

మతం కలిగజేసే అనుభూతి, మూఢనమ్మకాలు కలవారికి సాధ్యంకాదు. వారి ప్రకృతి పరిచ్ఛిన్నమైనది. సత్ప్రవర్తన పేరుచెప్తే, సంప్రదాయమైన నీతి వుండాలంటారు; అనంతాన్ని అన్వేషించేవారికి, ఈ వొక్క నీతిని గురించిన ప్రస్తావన తృప్తినియ్యదు. చుట్టూ గూడుకట్టిన, సూత్రాలు, నమ్మకాలు, కాండ — వీటిని తొలిగిస్తేనే, మతంలోని అనుభూతిని; నిజాయితీపరులు స్వీకరిస్తారు.

క్రైస్తవమతంలో మూడు ప్రధానమైన సూత్రాలున్నాయి. (ఇవి అన్నిమతాలలోనూ వున్నాయనుకుంటాను. అందుకనే, క్రైస్తవ మతం

ఆయుర్వేద భూషణ

పండిత నోరి రామశాస్త్రులవారి

*** క్షీరవర్ధని ***

చనుబాలను వృద్ధి చేయు రసాయనము. దీనిని వాడుటవలన చనుబాలు స్వచ్ఛమై సమృద్ధిగా పసిపాపకు సరిపోవునట్లుచేసి, తల్లి పిల్లల యారోగ్యమును కాపాడును.

వెల 100ml రు. 3/– : 200ml రు. 5/–

*** జీవనవటి ***

ధాతు పుష్టికి, నరముల పటుత్వమునకు ప్రసిద్ధి గాంచినది. శుక్లనష్టము, నపుంసకత్వము లచే పీడింపబడు వృద్ధులకు సైతము శక్తినిచ్చి, ఓజస్సును వృద్ధి చేయును.

వెల 30 మాత్రలు రు. 6/–

మాచే దీర్ఘవ్యాధులకు పోస్టుద్వారాకూడ సలహా యిచ్చి, ప్రత్యేక చికిత్స చేయబడును. క్యాటలాగు, సలహా ఉచితము.

డాక్టరు నోరి వెంకటేశ్వరశాస్త్రి,

A.V.A.C., A.L.I.M.

చీఫ్ ఫిజిషియను. ఆయుర్వేద నిలయం,

పోస్టుబాక్సు 32, విజయవాడ–1. ఆంధ్రప్రదేశ్.

సూత్రాల పరామర్శలో భాగాలని ఇక్కడ పొందు పరుస్తున్నాను.) ఆరాధన, విధికి తలలొగ్గడం, ప్రేమ — ఇవీ, ప్రధాన సూత్రాలు.

మతం నెలకొల్పబడిన తొలిదశలో; భయం నుండి జనించింది ఆరాధన — శక్తికలిగి, మానవ యత్నాన్ని విధ్వంసంచేసే ప్రతిదాన్నీ మంచిచేసు కుంటూ, పూజించేవారు. రాను రాను ఈ పూజ, దైవంపట్ల కేంద్రీకృతమైంది. పరరాజులు, ఒక ప్రాంతం వారిని లోబరుచుకున్నప్పుడు, 'నిన్ను మించిన శక్తిగల దేవుడు, వున్నాడులేవోయ్' — అనేటందుకు దేవుడు కావలిసొచ్చాడు. మరొక దశలో, దేవుడిపట్ల చూపినభావం భయంగా కాక, ప్రేమగా రూపొందింది. ఆరాధనతో మహదానందాన్ని చూరగొన్నారు. ఆరాధనలో ఒక్క ఆనందమే ముఖ్యంకాదు, సృష్టివైచిత్రిపట్ల వినయము, తన కర్థంకాని 'మాయ' పట్ల భక్తి భావము,— ఇవి, ఆరాధనలో ముఖ్యం. తానెరుగున్న యదార్థ జగత్తులో, వ్యక్తిపట్లా, విషయంపట్లా, ఏర్పడే భక్తిభావము, ఒకటి. ఈ భావమే కళారాధనగానూ, మహాపురుషులపట్ల గురుభావంగానూ రూపొందుతుంది. రెండోది, యదార్థ జగత్తులో కనబడని ఒక ఆదర్శంపట్లా ఆదర్శపురుషుడిపట్లా, ఏర్పడే భక్తిభావము. ఇదే దైవపూజ. పరిపూర్ణమైన సౌందర్యము, సడలని సత్యమూ, తొణకని నీతీ — ఇవే, ఆదర్శమైన దైవాన్ని ఆరాధించడంలో తాను నెలకొల్పుకున్న, జీవితపు విలువలు. కళలలో సౌందర్యము, మహాపురుషుల జీవితంలో నీతి, విజ్ఞాన శాస్త్రసాధనలో సత్యమూ — వీటిని నిష్పాక్షికంగా, మానవుడు ఆరాధించగలడు. వీటిని ఆరాధించడానికి, దైవంపట్ల నమ్మిక అక్కర్లేదు అంటాడు రసెల్. దైవంపట్ల నమ్మిక వుంటే తప్ప, ఈ విలువల్ని మానవుడు స్వీకరించలేడు— అనుకోడం పొరబాటంటాడు. ఇల్లా అనుకోడానికి కారణం, సృష్టిలో వున్న ప్రతి విశేషమూ, ప్రతి ప్రాణీ, ప్రతి వస్తువూ, దైవంలో ఒక అంశమే. దైవంలో అంశమైన ప్రతిదీ మంచిదే, ఆరాధించ తగ్గదే — అనుకుని, ఉన్నదానికి విలువకట్టి, ఈ దైవపూజ తంతు అంతా కల్పించుకున్నాడు. ఇది అవసరం లేదు, అంటాడు రసెల్.

రెండోది విధికి తలొగ్గడం — అంటే బ్రహ్మ రాసినదానికి తిరుగులేదు, ఇది దైవశాసనం గనక, దీన్ని దిఃఖరించను — అన్న భావం అన్నమాట. సృష్టిలో మంచీ వుంది, చెడుగూ వుంది. మనం తొలిగించలేని 'చెడుగు' కూడా దేవుడు సృష్టించిందే గనుక, దాన్ని కాదనక, తలలొగ్గి, స్వీకరించాలి. చెడుగుని మానవుడు నిర్మూలం చెయ్యలేడు, అన్నది క్రైస్తవ మతం. ఈ చెడుగు, దైవంకల్పింది గావున, చెడుగే కాదు, ఇదీ మంచేనంటుంది. ఈ భావంవల్ల మంచి చెడుగులకు మనం కట్టే విలువలకు అర్థంలేకుండా పోతుంది. కారణం ఏమిటంటే, లోకంలోవున్న చెడుగు, యదార్థంగా చెడుగే. మనం దీన్ని ఉన్నదున్నట్లు స్వీకరించాలి. ఏమీ చెయ్యలేము — మానవుడు అసహాయుడు— అన్న మత సూత్రంవల్ల, నైరాశ్యంచెంది, పనికీ, కార్యానికీ పూనుకోక, స్తబ్దుడై, పురోగమించలేక పోతున్నాడు. మనం చేసినపని వృధా అనిపిస్తుంది. వృధాకనక, చెయ్యనక్కర్లేదు. ఏ దెల్లావుంటే నాకేం, ఎవరేమైతే నాకేం, నేను మాత్రం దైవాన్ని కొలిచి, తపస్సు ద్వారా, జన్మ రాహిత్యంచెంది, అమరుడుగా దైవంలో ఐక్యమౌతాను — అన్నభావం. ఈ భావాన్ని స్వీకరించకపోతే, దైవశక్తికి హద్దుంది, పరమాత్మలో కాస్త చెడుగుంది అనుకోవాల్సివస్తుంది. పరిమితమైన దైవాన్ని, చెడుగున్న దైవాన్ని మనం కొలవనక్కర్లేదు. మానసికంగా పెరిగి, వికాసం తెచ్చుకున్న, మానవుడు, ఈ తికమకని త్యజించి, కార్యానికి పూనుకోగలుగుతాడంటాడు రసెల్. మనకి జరిగే చెడుగుకి తలొగ్గడం ఒకటి — లోకంలో వున్న చెడుగుకి తలొగ్గడం మరి ఒకటి. తలొగ్గడం వల్ల, మనకి జరిగే చెడుగుని తొలిగించే యత్నం చెయ్యలేక పోతున్నాం. ఈ చెడుగు అందరికీ జరుగుతోంది గనక, ఇతరులపట్ల సానుభూతి చూపి, 'ప్రేమించి' ఈ చింతనలో, మనకిజరిగే చెడుగుని మరిచి పోగలగడం — జరుగుతుందంటాడు. ఇల్లా లోకాన్ని ప్రేమించ గలిగితే, మనకి జరిగెడు చెడుగుకి, మండిపడి, ఎవరిపైననో విరుచుకుపడటం వుండదు. సమాలోచన, సమాధి, నిర్వాణం, తపస్సు, ఆధ్యాత్మిక చింతన, సాధించే ప్రయోజనం, ఇదే — విశ్వమానవప్రేమద్వారా, వ్యక్తిగతమైన బాధను

మరిచి, ఎదుర్కోవడం. 'అహం'ని చంపుకుని సృష్టిని తిలకిస్తూ, లయక్రమాలతో ఐక్యత పొందడానికి అవసరమైన శిక్షణపొందాలి. మూఢ నమ్మకాలు, ఆచారాలు, కర్మకాండ — వీటిని విడిచి వేసినవారికి, ఈ మానసిక శిక్షణ సాధ్యం. ఈ శిక్షణకి గురయ్యే మనోనిబ్బరంలేని మతోన్మాదులు, ఆచారాలు, మూఢనమ్మకాలు, కర్మకాండ, శాసించి, వాటి నిర్వహణలో, పరిమిత జీవితాన్ని గడుపుతారు.

మూడవది ప్రేమ. రెండు విధాలైన ప్రేమ వుంది. ఒకటి భౌతిక జగత్తుకి సంబంధించిన ప్రేమ — అందమైనదాన్నీ, మంచితనాన్నీ, ఆనందాన్నిచ్చేదాన్నీ — ప్రేమించడం. రెండోది స్వర్గతుల్యమైన విశ్వప్రేమ. భౌతికమైన ప్రేమ ద్వంద్వాలతో కూడివుంటుంది — శత్రువులు, స్నేహితులు, పాపులు, యోగులూ, దేవుడూ, దయ్యం. సృష్టిలో ఈ విభిన్న ప్రవృత్తులు నిరంతరం పోరుసల్పుతూ వుంటాయి. కాని విశ్వప్రేమలో ఈ విభజన లేదు. ఔన్నత్యాన్నీ, అల్పత్వాన్నీ, మంచినీ, చెడునీ, సజీవమైనదాన్నీ, జీవం లేనిదాన్నీ — అన్నిటినీ ప్రేమించగలగడం. మన దయ దాక్షిణ్యాల వల్ల, బాధని నివృత్తి చేయలేని దాన్నికూడా ప్రేమించగలగడం అన్నమాట. బాధని తొలగించే అవకాశంవుంటే, మనం కార్యానికి పూనుకుంటాం. ఈ అవకాశంలేనప్పుడు, ఆలోచనతో, చింతనతో తృప్తిపడతాం. ఆ చింతనవల్లనే, ఈ ద్వంద్వప్రకృతి, విభజన అపోహకాని, యదార్థాలు కావని గ్రహిస్తాం. ఈ దివ్యమైన ప్రేమయే, విశ్వాత్మపట్ల వాత్సల్యతగా స్థిరపడుతుంది. విశ్వాత్మని తిలకించడంలో బుద్ధిపొందే అనుభూతి ఎటువంటిదో, మనోధర్మానికీ, చిత్తవృత్తికీ, విశ్వప్రేమ అటువంటి అనుభూతి నిస్తుంది. ఈ ప్రేమ, 'అహం' 'స్వార్థం' లేవనెత్తిన గోడలను పడగొడుతుంది; ఇవి గీసిన గిరులను తుడిచివేస్తుంది. దుఃఖం సమసిపోతుందని కాదు. మానవుడు విషాదజీవే, ఐనాకూడా, తాను ఓడిపోయానన్న భావనలో నిస్పృహపడలి, ఆశాజీవి కాగలడు. ఏకాకిగావచ్చిన జీవి, అనేక ఇతరజీవుల జిజ్ఞాసతో కలిసి ఐక్యత చెంది వ్యక్తిగతమైన విషాదాన్నుండి విముక్తుడౌతాడు. ఈ ఐక్యత మూడు విధాలైనది. భావనలో, చిత్తవృత్తిలో, సంకల్పంలో — సాధించగల ఐక్యత.

గుండె
జలుబును
వెంటనే
పోగొట్టుకోండి!
అమృతాంజనం
పైనేరాసి త్వరగా గుణాన్ని పొందండి
అమృతాంజన్ బాధా నివారిణి నిరపాయకరంగా శీఘ్రంగా గుండె జలుబుకి సాధారణ జలుబులకు అమోఘంగా గుణాన్ని కల్గించడానికి 10 రకాల ఔషధాలు చేరిన మందు. కండనొప్పులకు, తలనొప్పికి, బెణుకులకు కూడా అమృతాంజన్ అమోఘంగా పనిచేస్తుంది. కొంచెం కొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది కాబట్టి ఒక సీసా నెలల తరబడి వస్తుంది మీ కుటుంబానికంతా. అవసరానికెప్పుడూ అందుబాటుగా అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిని పొందిన నమ్మకమైన గృహ ఔషధం.
అమృతాంజన్ నొప్పుల జలుబుల నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు
అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN

కవిత్వంలో అనిర్వచనీయత

శ్రీ చిరుమామిళ్ల సుబ్బారావు

కొన్నికొన్ని పద్యాలు చదివినప్పుడు లేక విన్నప్పుడు వెంటనే మధురమైన ఒక అనుభూతిని మనం పొందుతాం. 'పద్యం ఎంత బాగుంది!' అంటాం. 'ఏం చెప్పాడు కవి ఆ పద్యంలో?' అని అడిగితే, మాత్రం వెంటనే ఇదమిత్థమని స్పష్టంగా ఏమీ చెప్పలేం.

ఉదాహరణకి—

'మాట్లాడని మల్లెమొగ్గ
మాదిరిగా నడచిరా!' (దాశరథి)

అన్నపంక్తులు చదివినప్పుడు కవి ఎవరిని సంబోధిస్తున్నాడనే సందేహం మనకిరాదు. ఆ వ్యక్తిని 'మాట్లాడని మల్లెమొగ్గ' అని ఎందుకంటున్నాడు అనే జిజ్ఞాసా మనకు కలగదు. పద్యం మాత్రం బాగుంది అనిపిస్తుంది. ఏదో పర్యుత్సుకత మనకు కలుగుతుంది. అలాగే—

'ఎవరో ఆకలిని ఆరవేశారు' (కేశవరావ్)

అనే పంక్తి చదివినప్పుడు ఒళ్లు ఝల్లుమంటుంది. మన సాంప్రదాయిక కవిత్వంలో ఎక్కువభాగం చదివేటప్పుడు మనం అడిగే ప్రశ్నల్లాంటివి ఇలాంటి పద్యాలు చదివినప్పుడు మనకు తోచవు.

నిజమైన కవిత్వం అంతా మాటల్లో చెప్పడానికి వీలులేని అనుభూతిని మాటలమధ్య ఇముడ్చడానికి చేసే ప్రయత్నమే అనవచ్చు. ఈ భావాన్నే ఆంగ్లకవి టి. ఎస్. ఇలియట్— 'A Continual raid on the inarticulate' (అనిర్వాచ్యమైన తత్త్వంమీద కవి నిరంతరం జరిపేదాడి కవిత్వం) అంటాడు. కవిత్వంలో అర్థం అనేది దోపిడిదొంగ వచ్చి 'మనస్సు' అనే కావలికుక్కకు నోరెత్తకుండా పడిఉండడానికై పడవేసే రొట్టెముక్కలాంటిది మాత్రమే. (Meaning is only a meat to the house dog of the intellect) అని, అర్థానికి కవిత్వంలోఅప్రాధాన్యాన్ని సూచిస్తాడు ఇలియట్ మరోకచోట. అర్థం అవడానికి ముందే అనుభూతమవుతుంది కావ్యం. పాతకుడి నాడీమండలానికి విందుచెయ్యాలి కావ్యం ముఖ్యంగా—ఆయన దృష్టిలో.

'అనిర్వచనీయత'[1] అనే భావం మరింత విశదంగా బోధపడడానికి ఒక ఇంగ్లీషు పద్యం పరిశీలిద్దాం.

'Batter my heart, three person'd God; for you,
As yet but knock, breathe shine and seek to mend
That I may rise, and stand, O'erthrow me, and bend
Your force, to break, blow, burn and make me new.
I, like an usurpt town, to another due,
Labour to admit you, but oh, to no end,
Reason your viceroy in me, me should defend,
But is captiv'd, and proves weak or untrue.
Yet dearly I love you, and would be loved fain,
But am betroth'd unto your enemy:
Divorce me, untie, or break that knot again,
Take me to you, imprison me, for I

---

1. Obscurity అనే ఆంగ్లపదపర్యాయం అనిర్వచనీయత.

Except you enthrall me, never shall be free,
Nor ever chaste, except you ravish me.2
(John Donne)'

పాపభూయిష్ఠమైన ఐహికజీవితం మీద ఏవగింపుతో తనను తాను భగవంతునికి ఆత్మార్పణ చేసుకుంటూ కవి వ్రాసిన పద్యం ఇది. ఇంచుమించు ఇదే భావంతో ఉన్న ఎన్నోపద్యాలు మనం చదవవచ్చు. కాని వాటన్నిటినుంచీ దీన్ని వేరుచేసి చూపే లక్షణం ఒకటి ఉంది దీనిలో. అది పద్యబాహ్యార్థంలో కంటె పద్య నిర్మాణరీతిలోను, పదాల ఎన్నిక, అనుక్రమణిక, చివరికి విరామ చిహ్నాలలోనూ ఎక్కువగా ఇమిడి ఉంది. ఇదే కావ్యశక్తి. మన నాడీమండలాన్ని కదిలించేదీ, పద్యభావాన్ని అపరిమేయం చేసేదీ ఈశక్తే! 'break, blow, burn'వంటిఏకాక్షర పదాలు వరుసగా వాడడంలోనూ, 'బ' కార పునరావృత్తిలోనూ మొత్తం పద్యగమకంలోనూ తీవ్రమైన ప్రాకృతిక రతి సంరంభాన్ని నిగూఢంగా, నిపుణంగా కవి స్ఫురింప చేస్తాడు. ,Nor ever chaste, except you ravish me' అనే పద్యం చివరిపంక్తి చదివినప్పుడు ఈ భావం మనకు మరింత స్పష్టమవుతుంది. అయితే పద్యగమకంవల్ల మనకు కలిగే అనుభూతి అంతా ఇదే అనడానికి వీల్లేదు. దానిలో ఇది ఒక అంశం మాత్రమే! పద్యం అంతా శక్తిసంకీర్ణరూపం. ఆ శక్తి అంతా ఇదేఅని సంపూర్ణంగా వివరించగలగడం ఎవ్వరికీ సాధ్యంకాదు. అది కేవలం అనుభవైక వేద్యం. ఈ అనిర్వచనీయతాలక్షణమే కావ్యానికి అపరిమేయతను, నిత్యతనూ సమకూరుస్తుంది.

అనిర్వచనీయతా లక్షణంగల పద్యాలు ప్రాచీన భారతీయ సాహిత్యంలోకూడ అక్కడక్కడ మనకు కనిపించకపోవు. ఉదాహరణకు కాళిదాసకవి అభిజ్ఞాన శాకుంతలంలోని ఈ క్రింది శ్లోకం చూడవచ్చు—

'రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్యశబ్దాన్
పర్యుత్సుకోభవతి యత్సుఖితోఽపి జంతుః
తచ్చేతసా స్మరతి నూనమబోధపూర్వమ్
భావస్థిరాణి జననాంతర సౌహృదాని'

దుర్వాసుని శాపంవల్ల దుష్యంతుడు శకుంతలతో తన ప్రణయవృత్తాంతం మరచిపోతాడు. ఆమెను నిరాకరించి పంపివేస్తాడు. ఒకసాయంత్రం హంసపదిక అనే అంతఃపుర స్త్రీ పాడుతున్న ఒక గీతం ఆయన చెవిని పడుతుంది. ఆ గీతం భావం—"ఓ తుమ్మెదా! అప్పుడు అంతగా చూతమంజరిని పరిచుంబించిన నీవు క్రొత్తమధువుమీది కోరికతో ఆమెను మరచి ఇప్పుడు కమల వసతిమాత్ర సంతృప్తుడవై ఆనందిస్తున్నావు" అని. ఈ అన్యాపదేశ గీతం మహారాజుకు వినపడాలనే గొంతెత్తి పాడుతుంది హంసపదిక. ఆమె ఒకప్పుడు ప్రభువు అనురాగానికి పాత్రురాలైన స్త్రీ. ఆ గీతం విని దుష్యంతుడు పర్యుత్సుకత పొందుతాడు. పర్యుత్సుకత అంటే నాడీమండలంలో సంచలనం అనవచ్చు. చీకూ చింతాలేకుండా సుఖంగా

---

2. ఈ గుండెని పగుల గొట్టేయ్
త్రిమూర్త్యాత్మకా! భగవన్
మెల్లిగా తట్టి, గుసగుసలాడి,
మెరిపించి నువు నన్ను మార్చలేవు
నిట్టనిలువున కూల్చివెయ్యి, నీ శక్తి అంతా
చూసి నుగ్గునూచం చెయ్యి
ఆపాదమస్తకం దహించివెయ్యి;
మళ్ళీ క్రొత్తమనిషిని చెయ్యి!
అన్యాక్రాంత నగరిలా అన్యాధీనంలో
ఉన్న నేను
నీకు స్వాగతం చెప్పడానికి అశక్తుణ్ణి!
నాలో నీ వైస్రాయి 'బుద్ధి' నన్నే
నిజానికి సమర్థించాలి
కాని శక్తిరహితం, బందీ ఆ 'బుద్ధి'—
కాకపోతే విద్రోహి!
ఇప్పటికీ గాఢంగా నిన్నే ప్రేమిస్తున్నాను—
నీ ప్రేమ నర్థిస్తున్నాను.
అయితే నీ విరోధితో నా వివాహం
స్థిరపడిపోయింది
సంబంధం చెడగొట్టేయ్, ముడివిప్పేయ్,
లేదా త్రెంచేయ్
నీలోకి నన్ను తీసుకో నీ బందీగా చేసుకో
నన్ను నువ్వాక్రమిస్తేతప్ప నాకు
స్వేచ్ఛలభించదు
నన్ను నువ్వు చెరిస్తేతప్ప నాకు
విశుద్ధి కలుగదు.

ఉన్న తనకు ఆ గీతం వినగానే సంచలనం ఎందుకు కలగాలి అని ప్రశ్నించుకొని దానికిలా ఆయన జవాబు చెప్పుకుంటాడు: 'అందమైన వస్తువుల్ని చూసి నప్పుడు, మధురమైన శబ్దం విన్నప్పుడు మనకు తెలియని ఏవో సంగతులు మనకు జ్ఞాపకం వస్తాయి. జననాంతర సౌహృదాలను-ప్రణయాలను మన మనస్సు లోతుల్లో పేరుకొని సుస్థిరంగా ఉన్నవాటిని ఇవి జ్ఞాపకం చేస్తాయ్.' శకుంతలాప్రణయం దుష్యం తుడికి—పాపం — జననాంతరసౌహృదమే అయింది, దుర్వాసుని శాపంవల్ల ఆ గీతం ఆ వృత్తాంతాన్ని స్మరింపజేస్తోందని అతనికి తెలియదు—నాటకం చూసే సామాజికులకు మాత్రం తెలుసు.

పై ఆంగ్లపద్యంలోలాగ రచనానిర్మాణంకాక పద్యబాహ్యార్థం అనంతంగా ప్రతిధ్వనులను గలిగిస్తూ పద్యభావాన్ని అనిర్వచనీయం, అపరిమేయం చేస్తూ ఉండడం ఈ శ్లోకంలో విశేషం.

స్పష్టంగా అర్థం చెప్పడానికి వీల్లేకపోవడం చెడ్డ కావ్యానికే లక్షణం అని భావించే వాళ్ళు ప్రపంచంలో అన్నిదేశాల్లోనూ కనిపిస్తారు. లండన్‌లో 1955 మార్చి 11 న బెట్జెమన్ అనే కవికి పౌ. 250 ల చెక్ ఇచ్చి సత్కరిస్తున్న ఒక విందులో ప్రధానాతిథిగా వచ్చిన లార్డ్ శామ్యూల్ ఇలాఅన్నాడు—"ఇటీవల వచ్చిన చాలా కవితాసంకలనాలు చదివి చూశాను. అస్పష్టత అనేదౌర్భాగ్యలక్షణం ఇంగ్లీషు కవిత్వంలోకి ఎంత ఎక్కువగా ప్రాకిందో చూస్తే నాకు విచారం కలుగుతుంది. వందలకొద్దీ అలాంటి ఉదాహరణలు చూపించగలను. కాని ఇక్కడ ఒక పద్యం మాత్రం చదువుతాను...." అని సుప్రసిద్ధాంగ్లకవి డైలాన్ తామస్ వ్రాసిన 'A grief ago....' అనే పద్యం చదివాడు. ఆయన ప్రసంగం ముగిసిన తరువాత సమ్మానం స్వీకరించినకవి సమాధానం చెబుతూ లార్డ్ శామ్యూల్ చదివిన ఆ పద్యం ఏకవి వ్రాసిందో తనకు తెలియదన్నాడు. ఆ సభలోఉన్న మరో ప్రసిద్ధాంగ్లకవి స్టీఫెన్ స్పెన్డర్ కోపంతో మధ్యలో డైలాన్ తామస్ వ్రాసిన పద్యం ఉదాహరించడం మొదలుపెట్టగానే సభలోనుంచి లేచిపోయాడు.. తరువాత ఆయన అన్నాడట—'సభలో ఎవరైనా లార్డ్ శామ్యూల్‌ను కోడిగ్రుడ్డు పెట్టి కొట్టిఉంటే బాగుండేది' అని. డైలాన్ తామస్ పద్యంలో కొన్ని భాగాలు అర్థం కానివి ఉంటే ఉండవచ్చుగాక! తిరిగి తిరిగి మన మనస్సును వెంటాడే మాటలు ఎన్ని అంటాడు అతను? అస్పష్టతతోపాటు సౌందర్యంకూడా లేదా అతని పద్యాల్లో?' అని కూడా స్పెన్డర్ అన్నాడట.

సాహిత్య విమర్శకులలో కావ్యంలో అస్పష్టత ఎంతమాత్రం పనికిరాదనే వాళ్ళూ ఉన్నారు; అన్ని అత్యుత్తమ కావ్యాల్లోనూ అస్పష్టాంశం, అనిర్వచనీయాంశం ఉండితీరుతుందనే వాళ్ళూ ఉన్నారు—కావ్యాల్లో అస్పష్టత అసలు ఎందుకు వస్తుంది? ఇటీవలి కావ్యాల్లోనే అస్పష్టత తల యెత్తిందా లేక ప్రాచీనకాలంనుంచీ ఇది వస్తూనే ఉందా? అన్నిరకాల అస్పష్టతా కవిత్వంలో పరిహరించ దగిందేనా? ఇటువంటి సూక్ష్మప్రశ్నలనుగూర్చి జాన్‌ప్రెస్ వంటి ఆంగ్ల విమర్శకులు సునిశితమైన పరిశీలన జరిపారు.

పద్యం అర్థం కాకపోవడానికి అనేక కారణా లుండవచ్చు. చదివేవాడికి పరిచితం కాని మారుమూల పదజాలం, వాక్యవిన్యాసం ఒక్కొక్కప్పుడు పద్యాన్ని దుర్గ్రాహ్యం చేయవచ్చు. లేక కవి ఆలోచనా ధోరణి పాఠకజన సామాన్యంకాని ఒక విలక్షణ మార్గాన్ననుస రించడంవల్లా పద్యం తికమక పెట్టవచ్చు. నూతన సామాజికవు విలువలను కవి పాటించడంవల్ల ఆ విలువ లతో పరిచయంలేని పఠితకు పద్యం ఒక్కొక్కప్పుడు కొరుకుడు పడకపోవచ్చు. కవి ఉదాత్తతకు తగిన స్థాయిలో పాఠకుల సంస్కారం లేకపోవడమూ వారికి ఆ కావ్యం అస్పష్టం అనిపించడానికి కారణం కావచ్చు. దేశకాల పరిస్థితులను గమనించకుండా కవి తన సంకుచిత స్వర్గంలో తాను కూర్చొని కావ్యాలు వ్రాసుకు పోతూఉంటే అలాంటి కావ్యాలు పాఠకులకు అర్థరహితంగా తోచవచ్చు. దేశంలో వస్తున్న పరిణామా లకు కవి స్పందించినంత సూక్ష్మంగా సంఘం స్పందించ లేకపోవడంవల్లకూడా ఒక్కొక్కప్పుడు ఆ పద్యాలను అస్పష్టతా దుష్టాలు అని త్రోసివేయడం జరగవచ్చు. పూర్తిగా వ్యక్తిగత సంకేతాలు ఎక్కువ కావడం, వ్యక్తిగతమైన వింతఅనుభూతులను ప్రకటించడం మరొక్కొక్కప్పుడు కావ్యాన్ని అర్థరహితం చేయవచ్చు—

'ఒకటిఁ గొని రెంటినిశ్చల యుక్తిఁజేర్చి
మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగాఁ జేసి

యేనిటినిగెల్చి యాతింటి నెఱింగి యేడు
విడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు'
(ఉద్యోగపర్వము—ద్వి. ఆ. ప. 37)

ఇటువంటి పద్యాలలో సంకేతాల అర్థం బోధపడకపోవడంవల్ల వచ్చే అస్పష్టత. ఇలాంటి అస్పష్టత కాదు కావ్యానికి అనిర్వచనీయతాలక్షణం సమకూరుస్తుందని నేనంటున్నది.

తెలుగులో 'భావకవిత్వం' మీద చెలరేగిన దుమారంలో ముఖ్యంగా వినవచ్చిన విమర్శ ఆ కావ్యాల అర్థం బోధపడదని. భావకవిత్వోద్యమ ప్రధాన నాయకుడు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆ విమర్శకు జవాబు చెప్పాడు. కవిత్వంలో అస్పష్టత అభిలషించదగిన లక్షణమే అంటూ—

'....ఏదియొ అపూర్వ మధుర
రక్తి స్ఫురియించుగాని, అర్థమ్ముకాదు
భావగీతమ్ములవి......'

అన్నాడు—ఆయన. అర్థం కాకపోయినా చదివినవెంటనే అనుభూతిని పాఠకుడికి అందించి కదిలించగల లక్షణం ఏదో ఆ కావ్యాల్లో ఉండడంవల్లే ఆ కవులూ, కావ్యాలూ కొన్నేళ్లపాటయినా ప్రజాదరణ చూరగొన గలగడం జరిగింది.

భావకవిత్వానికి ప్రతినిధి కావ్యంగా శ్రీ కృష్ణశాస్త్రి వ్రాసిన ఈ క్రింది గీతం మనం పరిశీలించవచ్చు—

'ఎవరోహో! ఈనిశీథినెగసి, నీడవోలె నిలిచి
పిలుతురెవరొ, మూగకనులు మోయలేని
చూపులతో
ఎవరోహో! ఎవరోహో!
ఇపుడా నను బలుకరింతురు!
మోయలేని నీరవగళమున జలించు కోరికతో
ఇపుడా నను బలుకరింతురు!
ఎవరని ఈరేయి నిదుర హృదయమదర
వేయిచేయి
చాయలాడ పెనుచీకటి సైగలతో నాకన్నుల
రక్తమురల లాగికొందురు!
ఎవరో, నా హృదయనాళ మేలా తునియలుగా నా
నిర్జీవపు జీవితమ్మునిటు వదలుదురా!
ఎవరోహో! ఎవరోహో!
ఇపుడా నను పలుకరింతురు?
('ప్రవాసము' నుండి పు. 106)

'నిశీథి' దేనికి సంకేతమో, 'పిలుపు' అంతరార్థం ఏమిటో ఈ గీతంలో స్పష్టంగా బోధపడవు. కాని, గీతం చదవగానే ఒక నిరాశోపహతుడికి హఠాత్తుగా ఆశాకిరణం గోచరించినప్పుడు కలిగే తీవ్రమైన అనుభూతి పాఠకుడిని జిమ్మున ముసురుకొంటుంది. ఆ దృష్ట్యా ఈ గీతం అనిర్వచనీయ మనోహరం అనవచ్చు.

ప్రతికవి వ్యక్తిత్వంలోను రెండు అంతస్తులు మనం గుర్తించవచ్చు. ఒకటి 'తన' తనము. రెండవది తదతీతంగా సర్వమానవ సమానమైన అంశం. మొదటి అంతస్తులోనే ఉంటూ రెండో అంతస్తును అందుకోవాలనే తహతహయే చాలామంది కవులలో మనకు కనిపిస్తుంది. అలాంటి కవుల రచనలలో కూడా వారి అనుభూతి తీవ్రతవల్ల అనిర్వచనీయతాలక్షణం గోచరించవచ్చుగాని, రెండవ అంతస్తును అందుకొన్న కవుల రచనలలోని అపరిమేయత, అనిర్వచనీయత అంత హృదయంగమంగా అది ఉండదు. అందుకే 'మాట్లాడని మల్లెమొగ్గ..' 'ఎవరోహో..' వంటి పద్యాలు 'డాన్' పద్యం లాగ, కాళిదాసు శ్లోకంలాగా మనల్ని శాశ్వతంగా వశం చేసుకోలేవు.

పద్యం అర్థం కాకపోవడంఅనేది చాలా సందర్భాలలో చెడ్డలక్షణమే కావచ్చుగాని, కావ్యం అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు ఉండాలని అభిలషించడం మాత్రం హర్షించదగిన లక్షణం అనలేం. సాహిత్య విమర్శ సందర్భంలో కాకపోయినా, హెన్రీ హెన్సన్ అనే మతాధిపతి ఒకసారి—

'I have little sympathy with this lust for intelligibility.'3

అంటాడు. సాహిత్యం విషయంలోమాత్రం 'Lust for intelligibility' అక్షరాలా గర్హించదగిందే! మానవుడిలోని అనిర్వచనీయ తత్త్వంలోకి ఎంతో కొంత ప్రకుంకులిడడానికి మనం సిద్ధపడితే తప్ప ఉత్తమ సాహిత్యం చదివే అర్హత మనకు కలుగదు.

---

3. సుగ్రాహ్యత అంటే పడిచచ్చే వారితో నేను ఎంతమాత్రం ఏకీభవించలేను.

పాశ్చాత్య ప్రపంచంలో మార్క్సిస్ దర్శనం-3

శ్రీ సిడ్నీ హుక్

మార్క్సిస్టు పరిభాషపట్ల, సిద్ధాంతాల పట్ల సి. రైట్ మిల్స్ ధోరణి పట్టి అతర్కితోపనత మైనది. అందుకు ఈయన వ్రాతలు ప్రథమోదాహరణలు. అయితే ఇతరులైన స్వయంమార్క్సిస్టులలో ఈ లక్షణం లేదని చెప్పలేము. అంత ప్రత్యగ్రంగా కాకపోయినా, కించిదూనంగానైనా అందరిలోను ఈ లక్షణం వుంది. వీరిలో కొందరు సిద్ధాంతం లేని, ప్రయోజనంలేని "విప్లవవాదులు", "విప్లవ సిద్ధాంతులు". ఇప్పుడు ఏది వున్నదో అది వీరికి తుచ్ఛం. ఇదే వీరి సిద్ధాంతం. సమాజంలో సంస్కరణలకోసం సాగే వుద్యమాలు, తలపెట్టబడిన కార్యక్రమాలు అన్నీకూడా వీరికి తుచ్ఛాలే—ఇవి మరీ ముఖ్యంగా తుచ్ఛాలు. ఇంగ్లండులో సామ్యవాదం అంతగా సిద్ధాంత జటిలమై ఎప్పుడూ లేదు. ఐరోపాలో కంటే, ఆఖరుకు అమెరికాలోకంటే అక్కడ అంతా ఎంతో నయం. దీనికి ఫాబియన్లు కారణం. వీరు మార్క్సిజంపట్ల ఉదాసీనంగా వుంటూ వచ్చారు. వున్న పరిస్థితిపట్ల సిద్ధాంత రూపంగా ధ్వజాలు ఎత్తలేదు. ఇప్పుడు, అచ్చట గూడ "కొత్త వామపక్షం" బయలుదేరింది. ఈ వామపక్షం అణ్వాస్త్రాలపట్ల, కార్మిక పక్షం కార్యక్రమంలో సోషలిస్టు భాగాన్ని కొంచెం నుసిమెత్తన చేయటం పట్ల తీవ్రమైన వ్యతిరేకతను ప్రకటిస్తున్నది. పెట్టుబడిదారీ సమాజంయొక్క వ్యాపారపు విలువలను బట్టి సంస్కృతిని వికారం చెందించడం ఇష్టంలేకపోవడంగూడ వీరి ఒకానొక వైఖరి. కాని, వీరుగూడా మార్క్స్ జోలికి పోలేదు. మార్క్స్‌ను గురించి పట్టించుకోలేదు. మార్క్స్ చిన్నప్పుడు వ్రాసిన Economic Philosophical manuscripts' ను తప్ప, వానిలోని కొన్ని ముఖ్యమైన భాగాలను తప్ప వీరు మార్క్స్ గ్రంథాలను సమర్థించిందీ లేదు; ప్రకటించిందీ లేదు.

అయితే ఈ బ్రిటిష్ "వామపక్షం" కూడా విదేశాంగ విధానాలు అంటూ వచ్చేసరికి కొంతకు కొంత సిద్ధాంత జాడ్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చింది. హంగరీలో స్వాతంత్ర్య వీరులను అణచివేసిన సందర్భంలోను, స్టాలిన్ పరిపాలనలో జరిగిన ఘోరాలను గురించి కృశ్చేవ్ చెప్పినవిషయాలను వదలివేస్తే, తక్కిన చాల విషయాలపట్ల ఈ బ్రిటిష్ "వామ పక్షీయులు" కూడా, రష్యాలోని "సహసోషలిస్టుల" పట్ల ఎక్కువ సానుభూతిని ప్రదర్శిస్తూ వచ్చారు. చివరకు పెకింగ్‌లోని సహసోషలిస్టుల పట్లకూడా వీరు సానుభూతి చూపిస్తూ వచ్చారు గాని, అమెరికా కార్మికోద్యమంలో వున్న కమ్యూనిస్టు వ్యతిరేకులైన "సహకార్మికులపట్ల" మాత్రం అంతటి సానుభూతిని ప్రదర్శించ లేకపోయారు. మరి ఈ "వామ పక్షీయులు" కమ్యూనిస్టులు అంటామా? అనలేము. వారు కమ్యూనిస్టులు కాదు.

కమ్యూనిస్టులు కాని సోషలిస్టు కీర్తిశేషులు శ్రీ జి. డి. హెచ్. కోల్. ఆయన అమెరికాకు వ్యతిరేకంగా సోషలిస్టులు, కమ్యూనిస్టులు పని చేయాలని చనిపోయేంతవరకు చెబుతూనే వున్నారు. ఇందుకోసం ఐక్యసంఘటనను ఏర్పాటు చేయాలనికూడా ఆయన అంటూండేవారు. కమ్యూనిజం మీద ప్రజాస్వామ్య సామ్యవాదులు చేస్తూవచ్చిన ఆరోపణ

లను అన్నిటినీ శ్రీ కోల్ కూడా ఆమోదించేవారు. అందులో లోపం ఏమీ లేదు. హంగరీలో విప్లవం దెబ్బతీయబడిందని, హంగరీలో కార్మికులపై అమానుషకృత్యాలు జరుపబడినాయని అంగీకరించే వారు. అంగీకరిస్తూనే కమ్యూనిజం అభ్యుదయ పద్ధతి అని ఆయన విశ్వసించడం వుంది. ప్రపంచ స్థాయిలో అది అభ్యుదయలక్షణం కలిగింది అని ఆయన వాదం. అందువల్ల సోషలిస్టులు కమ్యూనిజంను సమర్థిస్తూ వుండాలని ఆయన సిద్ధాంతం. రష్యాలో, చైనాలో వచ్చిన విప్లవాల మూలంగా ఎన్ని ఘోరాలు జరిగినా, ఎంతటి బాధ ప్రజలకు తటస్థమైనా, ఈ అధునాతన ప్రపంచంలో ఆ రెండు విప్లవాలూ పెద్దవిశేషాలని జి. డి. హెచ్. కోల్ భావించారు. ఈ భావ పద్ధతి వస్తూత్పత్తి పద్ధతిని గురించి ఆయన సూత్రీకరించిన అపసిద్ధాంతంలో ప్రస్ఫుటం అయివుంది..6

ఇటీవల మార్క్స్‌మతాన్ని పుచ్చుకున్న వారిలో చెప్పదగిన వాడు జీన్‌పాల్ సార్త్రే. ఇంతకు పూర్వం సార్త్రే చాలా రచనలు చేసివున్నాడు. కమ్యూనిజంలో రాజకీయంగా సహయాత్రికుడుగాగూడ కొంత జీవితం గడిపాడు. అయితే తన "ఎగ్జిస్టెన్షలిస్టు" తాత్విక భావప్రపంచాన్ని తీసుకుపోయి మార్క్స్ మతంతో ముడిపెట్టాలని ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. మార్క్స్ మతంపట్ల కొంత వైరస్యాన్ని ప్రదర్శించి కూడా వున్నాడు. ఇందుకు కారణంవుంది. వ్యక్తి విషయమైన వాదాన్ని మార్క్స్‌మతం దుయ్యబట్టింది. ఎంత దుయ్యబట్టిందంటే భావప్రత్యయవాదంకన్నా గూడ ఈ వ్యక్తి విషయ సిద్ధాంతాన్ని విమర్శించి వుంది. మరి ఎగ్జిస్టెన్షలిస్టు సిద్ధాంతం వ్యక్తివిషయమైన అనుభూత్యాత్మక భావప్రపంచంనుంచి వుద్భవించి వుంది. సార్త్రే కాదంటారు గాని, ఆయన ఒక పద్ధతిలో ఆలోచిస్తే, ఇప్పుడుగూడ ఎగ్జిస్టెన్షలిస్టుగానే వున్నారని అనవచ్చు. ఈ వుండటం, దానిని అంటిపెట్టుకొని వుండకపోవడంలో ప్రత్యగ్రమై వుంది. ఆయనది విరుపులేని ఎగ్జిస్టెన్షలిస్టు తత్వం కాదు. విరుపుకలిగి వుండడంలో ఆయన విరుపు లేకుండా వున్నాడు. స్టాలిన్ ఏలుబడిని సమర్థించడంలో సార్త్రేకు సార్త్రేయే సాటి. స్టాలిన్ మరణానంతరం శ్రీ కృశ్చేవ్ సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 20 వ మహాసభలో ఆ స్టాలిన్ ఘోరకృత్యాలను కడిగివేసినప్పుడు, సార్త్రే తన్ను తాను వురితీసుకుంటాడని కొంతమంది ఫ్రెంచివారు భావించారు. సార్త్రే వురి తీసుకోలేదు. పెద్ద పుస్తకం వ్రాశాడు. "క్రిటిక్ దోలా రీజన్ డైలెక్టిక్" అని ఆ గ్రంథం పేరు. ఆగ్రంథంలో ఆయన తాను మార్క్సిస్టునని కచ్చితంగా చెప్పుకున్నారు. అంటే తాను ఒక్కడే నిజమైన మార్క్సిస్టునని ఆయన తాత్పర్యం. మార్క్సిజంను ఈ గ్రంథంలో ఆయన ఈ యుగ దర్శనం అని కూడా అన్నాడు. చరిత్రను స్పష్టంగా అర్థం చేసుకుని, తార్కిక సమగ్రమైన ప్రగతి పద్ధతిని ఈ దర్శనం చెప్పిందని, సమన్వయాన్ని చర్చించిందని ఆయన ఇందులో విశదంచేశారు. అయితే మార్క్సిజంకు అధికారకమ్యూనిస్టు వివరణాన్ని మాత్రం ఆయన తిరస్కరించారు. ఈ అధికార వ్యాఖ్యానం లేక వివరణం స్టాలినిస్టు వైపరీత్యాల వల్ల సంభవించిన అపసిద్ధాంతమని తేల్చారు. అయితే స్టాలిన్ పదచ్యుతుడు కాకముందు సార్త్రే ఈ విషయాన్ని గురించి మాట్లాడి వుండకపోవడం బ్రహ్మాండమైన మౌనాన్ని వహించి వుండడం, మధ్యే మధ్యే సమర్థిస్తూ వుండడం ఇచ్చట పేర్కొనదగిన విశేషం. ఇప్పుడు సార్త్రే రోగర్ గరాద్‌తో ఏకీభవిస్తున్నారు. ఈయన ఫ్రెంచి స్టాలినిస్టు. అపక్వబుద్ధి. ఈయననుకూడా ఒక్క తాను ఏకీభవించిన విషయంలో తప్ప తక్కిన అన్ని విషయాలలోను మార్క్స్ మతం అసలు తత్వానికి అపచారం చేసిన వాడినిగానే సార్త్రే భావిస్తున్నారు. అయినా, ఆయన భావాలతో సార్త్రే ఏకీభవించారు. ఇట్లా ఉదాహరించారు: "ఇప్పుడు ప్రపంచంలో సర్వమైన విచారధారను ఏ రంగంలో అయినాసరే—ఇటు అర్థశాస్త్రం దగ్గరినుంచి అటు ఫిజిక్స్ దాకా, ఇటు చరిత్రనుంచి అటు నీతివాదం దాకా—పట్టుకుని నిర్వచించేందుకు వీలైన ప్రమాణ పద్ధతిగల సిద్ధాంతం మార్క్సిజం ఒక్కటే." ఇందులో ఈ తన మడికట్టుకున్న

6. World Socialism Restated-London 1957. New Statesman and Nation 1957, Jan 12, April 20 సంచికలు. Moral Judgment and Historical Ambiguity, Problems of Communism July, Aug 1957: Sydny Hook.

తనంలో అనుమానం ఏమన్నా వుందని ఎవరన్నా ఏమన్నా అనుకుంటారేమోనని ఆయన ఎంగిల్స్‌ను ఉదాహరించి, ఆయన మాటలను (ఎంగిల్స్ మాటలను) చూపించారు. "ఎవరు ఎంతచెప్పినా సంస్కృతియొక్క అన్ని ముఖాలను తుట్టతుదకు ఆర్థిక ఉత్పత్తి పద్ధతే నిర్ణయిస్తున్నది. (అటువంటిది ఏదో వున్నట్టు!) ఈ సూత్రం సర్వవ్యాపి. నిత్యస్థితి కలిగింది. అన్ని వివరాలను పూసలలో దారంలాగా—అందులో-ఇది ఎర్రని దారం-ఇది ఒనగూడి వుంటున్నది." ఇట్లా అని సార్త్రే కూడా ఎంగిల్స్‌ను వుదాహరించి అనివున్నప్పటికీ ఈ వ్యవహారం ఇంతకంటే జటిలమైందని, గరాద్ ఎంగిల్స్‌లు అనుమానించిన దానికంటే ఇది ఇంకా లోతైన విషయమని సార్త్రే భావించారు. ఇందులో అద్వైత పద్ధతి (Monistic) ప్రబలంగా వున్న దన్నారు. ద్వైతవాదం (Dualism) సామాజికంగా ప్రతీప లక్షణం కలిగింది. అనేకత్వవాదం (Pluralism) పట్టి సంస్కరణాభిలాషి దుష్టమయింది.

ఇచ్చట సార్త్రే చేయదలచుకున్న పని ఇది:— ఎగ్జిస్టెన్షలిస్టు పద్ధతిని లేక వైఖరిని మార్క్సిజంకు అనుషంగికంగా దిద్దుదామని ఆయన భావించారు. మార్క్సిజంలో కొన్ని విపరీతా లున్నాయి. సర్వమైన సాంస్కృతిక విశేషాన్ని ఆర్థికమైన మదింపులద్వారా చెప్పడం మార్క్సిజం పద్ధతి. అదేవిధంగా మహా సంఘటనలు జరిగినప్పుడు, వాటికీ వ్యక్తులకూ అభేదాన్ని చెప్పడం, ఆ రెండిటిని విడమరచకపోవడం కూడా మార్క్సిజంలో వుంది. ఈ రెండులోపాలను మార్క్సిజంనుంచి తొలగించి దానికి ఎగ్జిస్టెన్షలిజం ద్వారా విముక్తిని కలిగించాలని సార్త్రే ఆశించారు. "ఒక చారిత్రక సంఘటన జరిగినప్పుడు దాని ప్రత్యేకతను లేక దాని వివిక్త స్థితిని పునరుద్ధాటించడం ఎగ్జిస్టెన్షలిజం వాంఛిస్తుంది. ఆ సంఘటన యొక్క వ్యాపారమును, దానియొక్క బహుముఖీన తను కూడా పునరుద్ధరించడం కోరుకున్నది." స్టాలినిస్టు జగత్తులో సంఘటన మహత్వపూర్వమైన మిధ్యగా పరిణమించి పోయిందని సార్త్రే చేసిన భావనలో దోషం లేదు. కాని, ఆ మార్క్సిజంను తాను పునర్నిర్మిస్తున్నప్పుడు ఆ పునర్నిర్మాణంలో కూడా ఈ సంఘటన మార్క్సిస్టు పాత పద్ధతిని పూర్వపక్షం చేయడమూ లేదు, దాని యొక్క అప్రమాణికతను నిరూపించడమూ లేదు. ఇందుకు కారణ మేమిటంటే, మార్క్సిస్టు పద్ధతిని అనుభవవేద్యమైన వాదప్రాతిపదికగా నిర్వచించక, ప్రరూఢమైన నిర్బాధ్యమైన ప్రమాణ పద్ధతిగా గ్రహించడం జరుగుతున్నది. సర్వమైన సమాజ జీవితంయొక్క సామగ్ర్యమును ఈ పద్ధతి ద్వారానే ప్రతిఒక్క ప్రత్యేక సంఘటనలోను, ప్రతిఒక్క ప్రత్యేక వ్యక్తిలోను వ్యవస్థితమూ, అభివ్యక్తమూ అవుతున్నదని కూడా ఇచ్చట అంగీకరించబడుతున్నది. సాంస్కృతిక విశేషాలను రాజకీయ విశేషాలను కమ్యూనిస్టులు వ్యాఖ్యానంచేసే పద్ధతిని సార్త్రే తీవ్రంగా విమర్శించారు. ఆ విమర్శ సబబుగా కూడా వుంది. అట్లా విమర్శించవలసిందే. కాని, దాని స్థానంలో సార్త్రే ఏమి నిలుపుతున్నారు? మార్క్సిజంను హెగిల్ తత్వంలో ముంచి అక్కడ పెడుతున్నాడు. ఈ తత్వంలో ఆత్మ (Spirit) స్థానంలో మార్మికమైన, గుహ్యమైన ప్రత్యయీకరింపబడిన కార్మికవర్గాన్ని తెచ్చి నిల్పడం జరుగుతున్నది. ఇందులో ఈ కార్మికవర్గం యొక్క సర్వమైన కార్మిక విశేషమూ ప్రత్యయీకరింపబడిన (Idealized) రాజకీయవర్గంలో కేంద్రీకరించబడింది. ఈ రాజకీయవర్గం సార్త్రే దృష్టిలోకూడా ఓటి బోటే కావచ్చు. అయినప్పటికిన్నీ అదే పరమార్థంగా ఆయన భావిస్తున్నారు. ఆ పరమార్థం ఇచ్చట కమ్యూనిస్టు పార్టీ. అనగా ప్రత్యయీకరింపబడిన కార్మికవర్గం యొక్క సర్వమైన కార్మిక ధర్మమూ ప్రత్యయీకరించబడిన ఈ రాజకీయవర్గంలో ప్రతిభాసం చెందుతున్నది. ఈ కార్మికవర్గం యొక్క కర్తవ్య మేమిటంటే, ఈ ప్రపంచాన్ని సమరసంగాను, మనుష్యులను మరింత మానుషం కలవారినిగాను, స్వతంత్రులనుగాను చక్కనొత్తడం. ఇది సార్త్రే భావం.

"క్రిటీక్ దో లా రీజన్ డైలెక్టిక్"లో సార్త్రే ఏమి చెప్పదలచుకున్నదీ, అది అంతాకూడా పారిభాషికజటిలమైన తాత్త్వికసిద్ధాంతంచేత ఆచ్ఛాదితం చేయబడిపోయింది. అమూర్త సత్యము, నిరవయవి అయిన సత్యము అంటూ ఒకటి వుంటుందన్న భావాన్నే ఈ గ్రంథంలో సార్త్రే తిరస్కరించాడు. దేశ కాలాబాధ్యమైన అమూర్త భావప్రపంచం

అంటూ వుండదని, అది వుంటుందనడం సహేతుకం కాదనికూడా ఆయన వాదించాడు. అటువంటి భావ ప్రపంచం ఏదైనా వుందని అంగీకరిస్తే అందు వల్ల ప్రత్యేకతకు, వ్యష్టికి అన్యాయం జరుగుతుందని ఆయన వాదం. అంతేకాక ఉనికిగొని, అగాధ జ్ఞానసముద్రాలను తరించివున్న వారికి కూడా అన్యాయం జరుగుతుందని సార్త్రే అంటాడు. ఉదాహరణకు: చారిత్రక సత్ పదార్థ వాదం వుంది. ఈ వాదంద్వారా ఫుబేర్, బొడలేర్ మొదలయిన వారి కృషిని, రచనలను వివరించడానికి పూనుకుని ఆర్థిక పరిస్థితుల పద్ధతిని, వర్గముల పద్ధతిని లేక ఏ ఇతర మైన మార్క్సిస్ట్ సిద్ధాంత పద్ధతిని అనుసరించి వివరించడానికి పూనుకున్నప్పటికీ, వారిమధ్యన వున్న అరాచకములను, వారు వ్యక్తం చేసివున్న వేరు వేరు అభిప్రాయాలను సాధారణ్యములైన మామూలు పరిస్థితులద్వారా సర్దిచెప్పడం సాధ్యమయివచ్చే విషయం కాదు. పూర్తిగా వేరువేరయిన పనులకు కారణమయిన ఆలోచనను, ఉపజ్ఞను ఈ పద్ధతి గణించనిస్థితి ఒక్కటి ఇక్కడ సంప్రాప్తమౌతున్నది. టైన్ (Taine) విషయంలో సెయింట్ బూవే (Sainte-beuve) ఈ విధమైన ఆక్షేపణను ఎప్పుడో వ్యక్తం చేశాడు. అదేవిధంగా, చరిత్రకు, సంస్కృతికి అద్వైత పద్ధతిని వ్యాఖ్యానం చెప్పదలచినవారిని కూడా బవే అదేవిధంగా విమర్శించివున్నాడు. అయితే ఆయన ఆ వైఖరి యొక్క పరిమిత ప్రయోజనాన్నిమాత్రం నిరసించ లేదు; అంగీకరించాడు.

ఇప్పుడు, సార్త్రే చేసిన విమర్శనలు గూడ మార్క్సిజంలో ఒకవర్గం వ్యాఖ్యానాలకు అనువర్తిస్తాయి. "ఇది తుచ్ఛమైన మార్క్సిజం. ఇది Vulgar Marxism". మానవుని విచారధార యొక్క లేక విజ్ఞానం యొక్క పారిణామిక ఫలితాలు ఏవిధంగా వుంటాయో, ఇచ్చట సాపేక్షమైన స్వాతంత్ర్యం ఎట్లా వుంటుందో, దాని యొక్క వ్యాపారం ఏమో అంతాగూడ జాన్‌డ్యూయీ మొదలయిన అమెరికన్ ప్రాగ్మాటిస్టులు లేక సమయోచిత సిద్ధాంతవాదులు ఇప్పటికి ఎప్పుడో చెప్పేవున్నారు. అయితే వారు మిథ్యాకల్పనలు చేయలేదు. మిథ్యా వాదాలు ప్రపంచించలేదు. ఇచ్చట నిజానికి సార్త్రే అమూర్తత్వాన్ని, అమూర్త భావప్రపంచాన్ని తిరస్కరించవలసిన అవసరం లేదు. ఇందుకు కారణం వుంది. వ్యష్టి అంటూ ఒకటి వున్నప్పుడు, ఆవ్యష్టి యొక్క స్వరూప స్వభావ విశేషాలను బహువిధాలుగా నిర్ణయించడానికి వీలుంది. సాపేక్షరీత్యా స్వతంత్ర మయిన విషయాలచేత ఉపపత్తుల చేత భాషత చేత, అసమములయిన పరిస్థితులచేత ఆ వ్యష్టియొక్క స్వరూప స్వభావాలను వివరించే వీలున్నదని మనం గుర్తించినప్పుడు అమూర్త సత్యాలను తిరస్కరించ వలసిన అవసరం కన్పించదు. ఈ వ్యష్టినిగూడ అది ఈ సందర్భములలో ఈ పరిస్థితులలో ఇట్టిదని చెప్పగలమే కాని, దీనిని సృష్టించలేము, తుదముట్టించలేము. పరిస్ని ఈ వుపపత్తులేమి, ఈ పరిస్థితులేమి ఒకదాని పక్కన ఒకటి అట్లా స్తబ్దంగా పడివుండవు. పరస్పర సంఘటితములై చరిత్రలో పనిచేస్తూ వుంటాయి. ఒకని జీవితాన్నే తీసుకుందాం. ఆ జీవితం పరిస్థితి చేత, సామాజిక వ్యవధిచేత పరిధీకరింపబడుతున్నది. ఈ పరిధిలో ఆ జీవితపు సర్వవివరాలు మనకు లభించి వుండవచ్చు. అట్టి వివరాలెన్నయినా కానీ అవి, సామర్థ్యముయొక్క శక్తిని లేక లోతును మనకు పట్టి యివ్వలేవు. ఆశక్తికి న్యాయమునూ చేయలేవు. ఒక ప్రతిభావంతుణ్నే తీసుకుందాము. అతని దృష్టికి, అతని ప్రతిభకు వ్యక్తిత్వపు ఇంద్రజాలమంతా అందింది. దాని నతడు అభివ్యక్తం చేశాడు. ఇట్టి ప్రతిభను కూడ కాదనలేము. అనగా, ఆశక్తియొక్క ఆ ప్రతిభ యొక్క రసాయనిక వ్యవస్థ ఏమో తెలియడం కష్టమని తాత్పర్యం. అంటే సార్త్రే పద్ధతిని తెలుసుకొనడం కష్టమని తాత్పర్యం. బహుధామార్గ విచారధారను సార్త్రే తిరస్కరించి వుండడం ఇందుకు కారణం. సార్త్రే ఆ మార్గాన్ని ఖండించాడు. ఎందుచేత? ఒక వస్తువును, ఒక సంఘటనను, ఒక మానవ జీవిని, వానివాని తార్కిక సామగ్ర్యంలో అవగాహన చేసుకొనడం, లేక అర్థం చేసుకొనడం ఈ బహుధామార్గ పద్ధతితో సాధ్యంకాదని, అసాధ్యమని సార్త్రే భావించాడు. సార్త్రేకు మూర్త జగత్తు ప్రధానంవలె అయింది. ఆమూర్త జగత్తులో ఒక వస్తువును ఒకభాగంగా ఒక సంఘటనను ఒక అంశంగా వివక్షచేసి, అర్థం చేసుకున్నప్పుడే, దాని

యొక్క లేక వానియొక్క యదార్ధ స్వరూపం, లేక లక్షణం మనస్సుకు అందుతుందని, యథార్థ ప్రగతి కలుగుతుందని సార్త్రే నమ్మకం. చరిత్ర విషయంలో, మానవుని విషయంలో ఇదిట్లే జరగాలని ఆయన స్పష్టంగా చెప్పాడు. ఇట్లాగే చెప్పాలి అన్నాడు. ఒక భాగంలో ఏది యదార్థమో అదే అది భాగమైన మూర్తసత్యంలో కూడా యథార్థం. ఈ మూర్తసత్యంకూడా మరొక మూర్త సత్యంలో అంశమయ్యే వుంటున్నది. ఈ విధంగా ఏకమైన అద్వయమైన సామాజిక సంస్కృతిని చేరేదాక ఇది ఇట్లాగే జరుగవలసి వుంటుంది. సార్త్రే చెప్పిన Dialectical Totality (తార్కిక సామగ్ర్యం) ఇదే. ఈ కాలంలో చరిత్ర అంటే ఇదేనని ఆయన అంటాడు.

“క్రిటిక్ దో లా రీజన్ డైలెక్టిక్”లో సార్త్రే తన ప్రమాణ పద్ధతి ఏమో వివరించి వున్నాడు. దానిని మనం చూచినట్లయితే సంప్రదాయసిద్ధమైన మార్క్సిజంతో సార్త్రే పద్ధతి ఎచ్చట భేదిస్తున్నదీ తెలుస్తుంది. అంతేకాక, ఈ పద్ధతిలోవున్న దౌర్బల్యం ఏమో కూడా అవగతమవుతుంది. నెపోలియన్ కాని, లేక మరొక ఇతర మహాపురుషుడుగాని చరిత్రలో పుట్టి జీవించి వుండకపోయినట్లయితే ఆ నెపోలియన్‌యొక్క లేక ఆ ఇతర చారిత్రక పురుషులయొక్క పనిని ఏకశ్చన వ్యక్తియో చేసి వుండేవాడని ఏంగిల్స్ అన్నాడు. ఇట్లాఅనడం సరేనా? వ్యక్తులకు నిజమైన గొప్పతనం అనేది వుండదనే విషయాన్ని గుర్తించి, ఆ గొప్పతనాన్ని మనం తిరస్కరించినప్పుడు, ఇట్లా అనడం సాధ్యం కావచ్చు. అంటే, ఒక మనిషి లేనంత మాత్రంచేత జరగవలసిన పని జరుగకపోదు. ఆ పనిని ఇంకో కశ్చన ఎవరైనా సరే చేయగలడు. ఆ మొదటి మనిషి మరణించినా లేక అతనికి ఏమైనా జరిగినా, ఆ స్థానంలో ఇంకొక మనిషి రావచ్చు. ఆ పనినే చేయవచ్చు. చేయవచ్చు ననడమేకాదు. చేస్తాడు. ఇది ఈ వాదం. ఈ వాదంలో ప్రకృతిని తీసుకురావడం, దానికి గుహ్యమైన తర్కాన్ని కల్పన చేసి, మానవజీవులకు, విశ్వానికి, సామాజిక చారిత్రక క్రమానికి అనుసంధానం కల్పించడం మొదలయినవి కూడా వున్నాయి. ఏంగిల్స్ ఏమంటారంటే, మానవుని అవసరం అంత బలీయమే అయినట్లయితే,అప్పుడు జెరంప్లాజం (germ plasm)లో విచ్ఛిత్తి సంభవించి ఆ అవసరాన్ని తీర్చడానికి అవసరమైన ప్రాణిగా రూపొందుతుంది. సార్త్రే మార్క్సిస్టు చెప్పిన ఈ పద్ధతిని కాదనడు. తిరస్కరించడు. అతిసామాన్యమైన విషయంగా కొట్టివేస్తాడు. ఇది ఎంతదూరం పోవాలో అంతదూరం పోలేదని అంటాడు. నెపోలియన్ అనేవాడే పుట్టకపోయినట్లయితే ఫ్రెంచి విప్లవాన్ని నిధనం చెందించడమూ, సైనిక నియంతృత్వం ద్వారా ఆ విప్లవాన్ని సంఘటిత పరచడమూ అనే పనులను చేసే వ్యక్తి ఇంకొకడు ఆవిర్భవిస్తాడు అనే విషయాన్ని ఇచ్చట రుజువుపరచడం లేక స్థాపించడం అప్రస్తుతమని సార్త్రే అభిప్రాయం. నెపోలియన్ అనేవాడు పుట్టాడు. ఆ నెపోలియన్ ఒక్కడే. చరిత్రకు అవసరం ఏర్పడింది. ఈ విషయాన్ని వివరించగలిగితే చాలు. ఆ బూర్జువా వర్గము, ఆ విప్లవము, ఆ విప్లవం తెచ్చిన మాలాయిత సంఘటనలు, ఆ సంఘటనపట్ల అతను వ్యవహరించినట్లు వ్యవహరించవలసిన అవసరాలను వివరించగలిగితే చాలు సార్త్రేకు సరిపోతుంది. అనగా ఈ అవశ్యంభావ సిద్ధాంతమును ప్రతి సంఘటనయందూ, చారిత్రకమైన స్ఫూర్తిని కలిగిన ప్రతియొక్క సంఘటనయందూ తంతువాయకుడు వస్త్రములు నేసినట్లు నేస్తే సార్త్రేకు చాలునని అర్థం.

సార్త్రే చెప్పిన ఈ మూర్త సామగ్ర్య సిద్ధాంతం లేక పద్ధతి Hegelian Begriff తప్ప మరేమీ కాదు. ఇట్లా అంటే సార్త్రే కాదంటాడు. కాని, సార్త్రే వాదంలోకూడా హెగిల్ వాదంలో లాగానే, అదృష్టమూ, బహుదృష్టి మొదలయినవి చెల్లవు. అవి చెల్లుతాయనుకునే వారు ఎవరైనావుంటే వారు వట్టి మూఢులు. సార్త్రే ఈ వాదం ఎంత అసంబద్ధమో ఎంత అసంగతమో నిరూపించడం కష్టంకాదు. అమెరికాను కొలంబస్ కనుగొన్నాడు. ఈ కొలంబస్సే కనుగొనాలని ఎక్కడైనా వుందా? ఈ చారిత్రక యుగంలో ఈ కొలంబస్సే ఆ అమెరికాను కనుక్కోవాలని అన్నది అవశ్యంభావి అయిన విషయమా? దీనికి ఒక్కటే ప్రత్యుత్తరం. ఇచ్చట అటువంటిది అట్లాగే జరుగాలని ఏమీలేదు. ఈ కొలంబస్ లేకపోయినా ఇతరులు

అమెరికాను చూచి వుండేవారు. చూచివున్నారు కూడాను. అయితే నెపోలియన్ విషయం తీసుకుచూస్తే, ఆయన కొన్ని కొన్ని సంఘటనలను, కొన్ని కొన్ని పనులను అవి ఆవిధంగా జరిగేట్టు చేశాడు. ఈ నెపోలియనే ఇతర శతఘ్ని వీరులు గుండుదెబ్బకు ఎరయై చని పోయినట్లే చనిపోయి వుంటే, ఏమయ్యేది? ఇంకో నెపోలియనును ఎవరు పంపించి వుండేవారు? ఇంకో నెపోలియన్‌ను ఎవరు సృష్టించి వుండేవారు? విశ్వ సత్తా సృష్టించి వుండేదా? లేక ప్రకృతిలోని గతి తర్కం సృష్టించి వుండేదా? నేపోలియన్ పుట్టాడు. నెపోలియన్ తనపనిని గార్తి చేసేదాకా ఆయనకు ఏవీ జరుగదని చెప్పడానికి ఆస్కారం ఏమైనా వుందా? ఆటువంటి వాదమూ, ఆటువంటి హామీ అచ్చట వున్నాయా? నెపోలియన్ మధ్యలో చనిపోయి వుంటే, సార్త్రే ఏమనేవాడంటే ఆ నెపోలియన్ ఆ సమయంలో ఆవిధంగా మరణించడానికి అవశ్యం భావిత్వంను నిరూపించవలసి వుంటుంది అనేవాడు.

చరిత్రలో కొన్ని విరోధాలు వున్నాయి. కొన్ని అధ్యాసలు వున్నాయి. వాటిని తొలగించడానికి ఏంగిల్స్ ప్రయత్నం చేశాడు. ఇందుకు ప్రయత్నం చేశాడన్న అద్భుత భాగధేయం ఏంగిల్స్‌కు వుంది. కొన్ని లక్షణాలను, కొన్ని ధర్మాలను అనుసరించి చరిత్రలో కని పించే విచిత్ర పరిస్థితులకు అర్థకల్పన చేయడానికి ఆయన ప్రయత్నం చేసివున్నాడు. సార్త్రే అట్లా కాదు. అతనిది తిరిగి జీవించాలనే పద్ధతి. అంటే కథలో సంఘటనలు ఒక విధిలో జరిగిన విధంగా, ఒక పద్ధతిలో జరిగిన విధంగా జరుగవలసి వుంటాయి, జరుగుతున్నాయి, జరిగాయి అని. ఇందులో విధి అన్నది విధించబడుతున్నది. అయితే, చరిత్రలో ఆయా పరిస్థితులను విచక్షణతో పరిశీలించి చూసి నట్టయితే అవి అట్లా జరుగడానికి బహువుపపత్తులు చూపించవచ్చు. ప్రత్యామ్నాయ పరిస్థితులను గూడ దర్శించవచ్చు. వివక్షించవచ్చు. ఇచ్చట బహువిధ తరతమ స్థితులలో ఆ పరిస్థితులు వైభాషికాలు కావడం సాధ్యమని చెప్పడానికి వీలున్నది. చరిత్రలో ఒక సంఘటన జరిగినప్పుడు, ఆ సంఘటన జరుగ కుండా చేయడానికి జరిగిన పనులను, ఆ సంఘటన జరగడానికి జరుపబడిన పనులను కాదని, అది జరుగ వలసివున్నది గనుక జరిగినది అని అనడం యుక్తి సహం కాదు. ఒకప్పుడు సార్త్రే చరిత్రలో ఏమి జరిగినా జరుగ వచ్చుననే పద్ధతిగల మనిషి. ఇప్పుడు, చరిత్రలో ఒక పని జరిగినదనగా, ఆ పని జరిగి తీరవలెను గనుక జరిగిన దని ఒకవిధమైన నియతి పద్ధతిని పెట్టి, దానిని మనం నమ్మాలి అంటున్నాడు. అనగా, ఒక పని జరిగిన దంటే, అది అట్లా జరుగాలి గనుకనే జరిగిందని ఇప్పుడు సార్త్రే సిద్ధాంతం. ఒక్కొక్కప్పుడు, ఒక్కొక్క ప్రత్యేకసంఘటన ఒక్కవిధంగా జరుగు తుందని మనం ఊహాబలంచేత చెప్పగలగడం వుంటుంది. అయితే ఇచ్చట కూడా ఆ సంఘటనయొక్క, సర్వమైన లక్షణాలను, ధర్మాలను, సంబంధాలను, సాధారణ ధర్మాలను అనుసరించి, దత్త పరిస్థితులను అనుసరించి విడమరచి చెప్పడం మాత్రం సాధ్యం కాదు. ఇప్పుడు ఇచ్చట, ఇటువంటి సందర్భంలో ప్రాథమిక దత్త పరిస్థితులుకూడా అవసరంలేదు. ఎందుచేతనంటే ఆ సంఘటన జరిగినదంటేనే ఆ ప్రాథమిక దత్తపరిస్థితులు ఆ సందర్భంలో లీనమయి వున్నవనే వ్యాఖ్యానం.

మూర్తం, విశిష్టం, భూతార్థం అయిన కార్యం నుండి ఆలోచనాధారను ప్రారంభం చేసి, సద్యోభావ ముద్రావాద పద్ధతిలో విషయదర్శనం చేయడం, సార్త్రే పద్ధతి అయింది. అనగా, ఇచట లోతులకు పోవడం వుండదు. విషయ సామగ్ర్యమును పట్టడం వుండదు. ఇచట క్రమావగాహనంకన్నా యుగపదవ గాహనానికి ప్రాధాన్యం. అయినా, సార్త్రే ఇచ్చట గూడ లోతులు చూడగల్గినాడు. అయితే ఈ చూచిన దానిని సమాజ సర్వమునందు, చరిత్ర సర్వమునందు లగింపజేసేటప్పుడు, ఆ సమాజ చరిత్రలో ఆ సమాజ సంబంధాలను, చరిత్ర సంబంధాలను అతికేటప్పుడు ఆ సంఘటన యొక్క లేక ఆవ్యక్తి యొక్క వివిక్తత్వము శశవిషాణమై పోతున్నది; వృథ్యమై పోతున్నది. ఈ పద్ధతిచేత సామాజిక జ్ఞానాన్ని, చారిత్రకమైన ఎరుకను పొందడం సాధ్యమా అన్న ప్రశ్న వుదయిస్తుంది. ఈ పద్ధతిలో వివరణం సమర్థన మవుతున్నది. తుదకు గతి తర్క పద్ధతిని అవశ్యంభావ మవుతున్నది. అవి ఏమో అంతకన్నా వేరుగా వుండ డానికి వీలులేదు. ఇచ్చట, వైభాషికాలను భావించి వానిలో దేనినో ఎంచుకొనే స్వాతంత్ర్యం వృథ్యమై

పోతున్నది. ఇచ్చట, చరిత్రే తన క్రియచేత, తన్ను తాను దర్శనం చేసుకుంటున్నది, గుర్తిస్తున్నది. ఎరుక కలిగిన దవుతున్నది. మార్క్సిజంయొక్క ఆచరణమందే స్వాతంత్ర్యం లేక స్వేచ్ఛ ఉపలబ్ధమవుతున్నదని సార్త్రే భావం. హెగిల్‌లో చరిత్ర సత్తా లేక ఆత్మయొక్క స్వయం వ్యాపారం. అది అంతరంగిక విరోధం చేత, విచ్ఛిత్తి చేత అభివృద్ధి చెందుతున్నది. హెగిల్‌ను విమర్శించిన బహ్యార్థవాదులూ వున్నారు. వీరు చరిత్ర అంటే, ప్రయోజనాల, భావాల, వ్యక్తిత్వాల పరస్పర వ్యాపార విశేషమని చెప్పారు. సార్త్రేది ఈ రెండు కోవలకు చెందిన పద్ధతి కాదు; వాదం కాదు. ఇతని దృష్టిలో చరిత్ర అంటే మానవులైన జీవులు తమ దైనందిన వ్యాపారంలో అభివ్యక్తంచేసే ఆచరణ విశేషమనే పద్ధతి. ఈ ఆచరణం ఇంతవరకూ మనుష్యులను వారిని వారికి దూరం చేస్తున్నది. వారిలో వారినే దూరం చేస్తున్నది. ఆత్మధర్మ ప్రత్యాఖ్యానం తెచ్చిపెడుతున్నది. ఆత్మ సమృద్ధిని, ఆత్మ సామగ్ర్యమును తెచ్చిపెట్టడంలేదు. చరిత్రలో కార్మికవర్గం ఒక్కటే సార్త్రే దృష్టిలో విముక్తిని తెచ్చే శక్తి. ఈ శక్తిచేత సార్త్రే ఆకృషితుడయ్యాడు. తాను ఆకృషితుడయినట్లు ఆయన చెప్పుకున్నాడు. ఇది ఆయనలో ఇలా జరిపిందంటే, మార్క్స్‌ను అధ్యయనం చేయడంచేత జరుగలేదు. కార్మికవర్గం భూతార్థమయింది కావడంచేత ఆ వర్గం పోరాటాలు భూతార్థాలు కావడంచేత జరిగింది; మార్క్సిస్ట్ ఆచరణంలో రూపుగొన్నది కావడంవల్ల జరిగింది. ఇచ్చట విచిత్రమైన విషయం ఏమిటంటే సార్త్రే మార్క్స్ పద్ధతి సంప్రదాయాలకు, మార్క్స్ చెప్పిన వర్గానికి వ్యాఖ్యానం చేసిన పద్ధతి. సమాజాన్ని అర్థం చేసుకోడానికి, చరిత్రను నిర్మించడానికి, "సమష్టి" ప్రధాన సూత్రమైపోయింది. వ్యష్టి సమష్టిలో కరగించి వేయబడింది. ఈ సమష్టియే పార్టీగా మూర్తీభవింపజేయబడుతున్నది. ఇది సర్వకార్మిక వర్గం పేర తాను అధిష్ఠానమైనట్లు వ్యవహరిస్తుంది. ఆ కార్మికవర్గానికి విద్య గరపుతుంది. ఆ కార్మికవర్గాన్ని సాధ్వసక్రియచేత సమర్థిస్తుంది. కార్మికవర్గ నియంతృత్వమనేది మిథ్యఅని సార్త్రే అంగీకరిస్తాడు. సోవియట్ యూనియన్‌లోగాని, మరెచ్చట గాని, అది స్థితిగాని వున్నది లేదని ఒప్పుకుంటాడు. కార్మికవర్గంవంటి ఏ సమష్టి కాని, నియంతృత్వాన్ని ఆచరించడం సాధ్యంకాదని సార్త్రే భావం. కారణ మేమిటంటే అది అధివ్యవస్థ కాకపోవడం. దీనిని అంగీకరిస్తే బూర్జువా నియంతృత్వమనే పదబంధం కూడా అర్థవిహీనమయినదై పోతుంది. రష్యాలో మొదటి నుంచీకూడా ప్రభుత్వం పేరున పెరగుతున్నది కమ్యూనిస్టు పార్టీ నియంతృత్వమే నని సార్త్రే అరమరికలు లేకుండా అంగీకరిస్తాడు. ఈ విషయాన్ని వివరణాలతో కప్పిపుచ్చడానికి, లేక తోసివేయడానికి, బోల్షివిక్ లెనినిస్టులు శబ్దలాఘవం ప్రదర్శిస్తుంటారు. సార్త్రే అటువంటి పని చేయలేదు. రక్షించాడు. సాధ్వసప్రవృత్తి ఇచ్చట వుత్కర్షింపబడింది. అది అవసరమైన వుపకరణంగా చిత్రింపబడింది. ఆత్మధర్మ ప్రత్యాఖ్యానం చేత, "తారతమ్యస్థితి చేత" మానవత్వం రహితమైపోయినప్పుడ్యు తిరిగి సంపూర్ణ మానవత్వాన్ని తెచ్చిపెట్టడానికి ఈ సాధ్వసక్రియా కలాపం ఉపకరణ మవుతున్నదని సమర్థించబడుతున్నది. అంతేకాని, రాజకీయమూ సాంస్కృతికమూ అయిన అఖమగ్రతకు, అసంపూర్ణత్వానికి లక్షణంగా చెప్పబడడంలేదు.

"కమ్యూనిస్టులు అధికారం కైవసం చేసుకొన్న దేశాలలో ఏర్పడుతున్నట్టి సోషలిస్టు సమాజం యొక్క ప్రథమదశా నిర్మాణంలో ఉద్యోగివర్గం యొక్క సాధ్వస ప్రవృతియొక్క, వ్యక్తి ఆరాధనం యొక్క అవికిరమైన కూడిక తప్ప మరేవీ కన్పించడం లేదు. ఈ దేశాలలో చారిత్రకమైన అనుభవం ఇట్లా వుంది."[7]

సార్త్రే యొక్క ఈ సర్వగ్రంధాన్ని ఒక విమర్శకుడు, ఒక్క మాటలో తేల్చివేశాడు. "ఇది స్టాలినిజం యొక్క అభితత్వం" అన్నాడు.

---

7. Lionel Abel,—Dissent — spring 1961. P 137 ff.

ఇష్టదేవత

"తల్లావజ్ఝుల"

అతడు దీక్షాపరుండు, త్రియామలందు
శ్రద్ధతోడ జపమ్ములు చేయువాడు;
ఎన్నియవరోధముల్ తన నెదురుకొన్న
నిష్ఠ విడువక సాధనల్ నెరపువాడు.

అతని మనసున్న ఇష్టదైవతము నెవ్వ
రెరుగ రీనాటికింగూడ: ఎన్నియొన్ని
ప్రశ్నములు వేసినంకూడ బదులు చెప్ప
కుంటచే మంత్రవేత్తలే యూరుకొనిరి.

ఎట్టి ప్రత్యుత్తరం బైన నీయకుంట
కిం వదంతులు మిగులరేగినవి కూడ—
అతని నెరిగినవారిలో నాప్తులందు,
బంధులయందు, మిత్రులబృందమందు.

కాంచనార్థము తపము కావించు ననిరి
చేయు ఉచ్ఛిష్టగణపతి సేవ యనిరి
సత్కవిత్వముకై పూజ సలుపు ననిరి
అష్టసిద్ధులకై తప మనిరి కూడ!

కాని, కవి యనువాడు త్రికాలవేది
ఇతరచిత్తవృత్తులు గ్రహియించువాడు
ఎట్టిమర్మము లైన భేదించువాడు
అగుటచేతను కలయథార్థం బొకండు—

ఇ ష్ట దే వ త

సాధకుడు ముప్పదారు మాసముల వరకు
ఘోరతప మాచరించి కన్గొనియె తుదకు
ఇష్టదేవత తనమీద స్పష్టముగను
శీఘ్రకాలములో కటాక్షించు ననుచు

అతని యిష్టదేవత యొకయర్ధరాత్రి
సమయమున నేగుదెంచి సాక్షాత్కరించె!
ఉలికిపాటున చూచినా డొక్కసారి
తనపురోవర్తి యైనట్టి దైవతమును.

మాట రాదాయె నాతని నోటనుండి!
మిటుకరించుచు గ్రుడ్లను మీద చూచి
ఎవరు మీ రని యామెఁ బ్రశ్నించినాడు
కరయుగమ్మును జోడించి త్వరితగతిని.

మూడువత్సరములనుండి వేడికొనుచు
నిష్ఠతో పూజ చేసెదో నీ వెవతను
ఆమెయే నేను, ప్రత్యక్ష మైతి నేడు—
ఈక్షణమ్మున నిను గటాక్షించినాను—

అనుచు మందయానమ్మున నతనికడకు
అడుగు లిడసాగె నామె; నిజాంతికమ్ము
దరిసినంతనె లేచి యాతండు కేక
వేసి, లోనికి నొకయంగ వేసినాడు.

ఇంత పరివర్తనంబు నీ కేల కలిగె
ననగ దరహాసమున నాత డనియె బదులు:
ఇంత పరివర్తనంబు నీ కేల కలిగె ?
నీకటాక్షంబు నిక వడనీయ వలదు !

చేయునది లేక తరుణియు పోయె వెడలి :
అతడు తల యెత్తి మందహాసమ్ము చేసి
చెక్కిళుల జేర్చి చేతులు, చింతతోడ
కదలకుండగ పీటపై చదికిల బడె.

కవి నడిగినా రనంతర కాలమందు
చతురు లగువారు కొందరు—సాధకుండు
శ్మశ్రువులు తీసివేసి యుత్సాహసరణి
గ్రామమున సంచరించెడి కారణమ్ము.

ఇష్టదేవతలో మార్పు స్పష్ట మయ్యె—
శుక్ల కృష్ణ పక్షంబులశోభ దాల్చె
నామెమూర్ధము, గండద్వయమ్ము మిగుల
లోతుగా దిగె పాతాలలోకమునకు,
ఉన్నతిం గాంచె నాయమ యుదరసీమ !



కలగూరగంప:

"సిరియూరు" - "తామరవాడ" కాదా?

రెండవ అమ్మరాజ విజయాదిత్యుని కడలి తామ్ర శాసనములోని "సిరియూరు' తణుకు తాలూకా "తామరవాడ అగ్రహారము"ని నిర్ణయించుచు నేను "భారతి" (సంపుటము 43 — సంచిక 3) కలగూర గంపలో వ్రాసిన వ్యాసము నధిక్షేపించుచు శ్రీ మునునూరి సాంబశివరామమూర్తి గారు "భారతి" (సంపుటము 43 — సంచిక 8) కలగూరగంప లో నొక సుదీర్ఘ వ్యాసమును ప్రచురించినారు. వారు నావ్యాసములో తప్పులుగా చూపి, పరామర్శించిన విషయముల ఉచితానుచిత ముల నీ వ్యాసమున పునరావలోకనము గావించి పాఠకుల నిర్ణయమునకు విడిచివైచు లక్ష్యముతో నీ రచనా వ్యాసంగమున కుపక్రమించితిని. విజ్ఞులగు పాఠకులే నిర్ణేత .లగుదురు గాక!

శ్రీ సాంబశివరామమూర్తిగారు శాసనోక్త గ్రామ నిర్ణయముచేయు సందర్భమున, దాని సరిహద్దు గ్రామముల వివరించుచు "పశ్చిమగోదావరిజిల్లాయందలి పాగుణార విషయమందలి విప్పఱ్ఱు, (ఇలపఱ్ఱు), దేవ, మోరంబత్తి (ములపఱ్ఱు) నొడలి (వడలి) మధ్యస్థమైన ఏరామన్న పాలెమో, లేక కాలగర్భలీనమైన ఏ మతియొక గ్రామమోయని నిర్ధరింప ననువు కలుగుచున్నది. అంతేగాని వేరొక తావున గాదు" అని వ్రాసియున్నారు. ఆ వ్రాతనే నేను నా వ్యాసమున పరామర్శించుచు "ఏ రామన్న పాలెమో లేక కాలగర్భలీనమైన ఏ మతియొక గ్రామమో అని అనిశ్చయముగ వదలివైచి, జిజ్ఞాసువులకు కొంత పని కల్పించినారు.... ఇట్టి నిర్ణయమునకు వచ్చుటలో వారు కొన్ని సంగతులను విస్మరించి, భ్రమ ప్రమాదవశమున బడి, అపసిద్ధాంతీకరణ దోషమునకు పాల్పడినారు" అని వ్రాసియున్నాను. అంతతోబోక "ఈ గుర్తింపునకు మూలకారణము వారు తొలుదొల్తనే సిరియూరు గ్రామము రామన్న పాలెము అయి యుండవలెనను నిర్ణయమునకు వచ్చిన తరువాత సరిహద్దు గ్రామములను గుర్తింపదొరకొని, తమకు వీలుగా నుండులాగున ప్రాచీన గ్రామ నామములను తమ యూహల ప్రకారము నేటి గ్రామనామములకు అనుసంధింప జూచుటయేగాని అన్యముగాదు" అని కూడ వ్రాసియున్నాను.

ఈ వ్రాతలు శ్రీ సాంబశివరామమూర్తి గారికి కోపకారణమైనందులకు నా విచారము నంద జేయుచున్నాను. కాని — నా వ్రాతలలోని విషయోద్ఘాటన మిప్పటికినీ యదార్థమనే నా దృఢ విశ్వాసమును పునరుద్ఘాటించుచున్నాను. లేకున్న శ్రీ సాంబశివరామమూర్తిగారేమి యాధారమును పురస్కరించుకొని విప్పఱ్ఱు— ఇలపఱ్ఱుగను, మోరంబర్తి — ములపఱ్ఱుగను నిర్ణయింప సాహసించిరో తెలుపగలరా? శాసనములో నుదాహరించిన నాలుగు గ్రామములలో దేవ, వడలి గ్రామములను గుర్తించి తత్పరిసరముననున్న సిద్ధాంతము, ఆచంట, ఇలపఱ్ఱు, ములపఱ్ఱులపై దృష్టిసారించి, శాసనములోని వర్ణన కనుగుణముగా నుండమి సిద్ధాంతము, ఆచంట గ్రామములను వదలివైచి ఇలపఱ్ఱు, ములపఱ్ఱులకు ప్రాధాన్యమిచ్చి నా గ్రామముల రెంటినీ వరుసగా విప్పఱ్ఱు, మోరంబర్తి గ్రామములుగా నుట్టంకించినచో సమస్య తీరిపోవునను నుత్కంఠతో నూహించి వ్రాసిన వ్రాతగాకున్న విప్పఱ్ఱు— ఇలపఱ్ఱుగను, మోరంబత్తి— ములపఱ్ఱుగను రూఢియొనర్పదగు సాధన సామగ్రి నేమి చూచుకొని వారీ వ్రాతలు వ్రాసినారనవలె? పోనిండు. అట్లనేయనుకొందమన్న "సిరియూరు"నకు మోరంబత్తి పశ్చిమ దిశగా నున్న దన్న హంశమునైనను సరి

జూచుకొన్నారా? ములపఱ్ఱు రామన్నపాలెమునకు పశ్చిమముగా నున్నట్లు శ్రీ మూర్తిగారు రుజువు చేయగలరా?

శ్రీ సాంబశివరామమూర్తిగారి నిర్ణయము ప్రకారము శాసనోక్త గ్రామము "ఏ రామన్న పాలెమో, లేక కాలగర్భలీనమైన ఏ మరియొక గ్రామమో" కావలెను గాని యిప్పటికి నీ శాసనము లోని వర్ణనమునకు సరిపడి, నిలిచియున్న ఏ యితర గ్రామమైనను వారి అంగీకారమునకు నోచుకొనఁబోదను ధ్వని వారి వ్రాతలతో తొంగి చూచుచున్నది. లేకున్న వారు సందేహాస్పదముగ చెప్పినాననుచునే "రామన్నపాలెము" పై దృష్టి యుంచి, కాలగర్భలీనమైన ఏ మరియొక గ్రామమో యని గుర్తు పట్టుటకు వీలులేకుండ, రూపఱి పోయిన నష్ట గ్రామనామ ప్రశంస నెందులకు చేసినట్లు? అదియునుగాక శాసనములో చెప్పిన "సరిహద్దు యూళ్ల మధ్యనున్న 'సిరియూరు' గ్రామము కాలగర్భమున నేడు లీనమై పోయినను వసిష్ఠ గోదావరీ తీర సమీపమందున్నట్లు గోచ రించు చున్నదని" శాసనోక్త గ్రామ ముత్సన్నమై పోయి, కనబడకుండ పోయినదని ఘంటాపథముగ నెందులకు వక్కాణించినట్లు? అట్లగుచో శ్రీ సాంబశివరామమూర్తిగారి దృష్టిలో "సిరియూరు" గ్రామము ప్రస్తుతమున ఏ రూపములోను, ఏ పేరుతోను నిలిచియుండనేలేదని, అట్లుగాక నిలిచియే యున్నచో నది తప్పక "రామన్నపాలెమే" కావలెనని వారి అభిప్రాయమని మనమనుకొనుటలో తప్పే మున్నది? ఈ కారణములబట్టియే నేను పైన పేర్కొన్న విధమున వ్రాయ సాహసించితిని గాని లేకున్న నట్లు వ్రాసియుండెడివాడనుగాను. ఆయూహ గూడ నిజమే యున్నట్లు వారిటీవల వ్రాసిన విమర్శనా వ్యాసము వలన గూడ తెల్లమగుచున్నది. ఒకవేళ శాసనమునందలి వర్ణనమునకు సరిపడు నే యితర గ్రామమునైనను మనము గుర్తించిన పక్షములోకూడ నది వారి కంగీకారయోగ్యమైనది కాదను భావము గూడ వారి వ్రాతలలో స్ఫురింపు చున్నది. అట్లగుటచేతనే నా వ్యాసములో నేను శ్రీ మూర్తిగారు ముందుగా ఒక నిర్ణయమునకు వచ్చి, శాసనోక్త గ్రామము రామన్నపాలెమై యుండ వలెనను తమ అభిప్రాయమును వ్యంజకముగా సూచించినారని యంటిని. దానికి వారు అభ్యంతరము దెలుపుచు "సందిగ్ధ విషయములను సందిగ్ధముగనే వెలువరింపవలెను. అందుపై విజ్ఞులు పరిశీలించి, భ్రమ నివారణ గావించి, యదార్థ విషయముల వెల్వరింతురు. ఎంతటి వారలకైనను సంపూర్ణ విజ్ఞాన మొక్కరిసొత్తు కాదుగదా? అంతేగాక ప్రాచీన గ్రామనామ నిర్ధారణ బహు కష్టతరసాధ్యము. అట్టితరి నేను ప్రస్తుతము గానరాని "సిరియూరు" — "రామన్నపాలెమే" యని యూరక ఎచ్చట నిర్ధారణ గావించియుంటిని?" అని ప్రతివాదము చేసియున్నారు. వారి అభ్యర్థనములోని యాహ్వానమందికొనియే, శాసనోక్త గ్రామ నిర్ణయమునకు దొరకొని నా యోపినంత వట్టు శ్రమించితిని. దానస్థల నిర్ణయము విషయమై నా పూర్వ వ్యాసములో నుట్టంకించిన నాయూహ లెంతవట్టు సమర్థనీయములో చర్విత చర్వణముగా నిపుడు వివరింప బనిలేదనుకొందును.

శ్రీ మూర్తిగారు తమకు లభ్యమైన శాసన మెట్టి పరిస్థితులలో నుండియున్నదో వివరించుచు, దాని చదువుటకు తామెంతగా శ్రమించినదీ, శాసనోక్త గ్రామ నిర్ణయము చేయ నెట్టి యూహల చేసినదీ, చారిత్రకాంశముల నెమరుకు దెచ్చుకొని విజయాదిత్యుని ప్రవాసగతికిని, దాన ప్రదానావసరమునకును పొత్తుకుదిర్చినదీ సవివరముగాఁ దెలిపి యున్నారు. శాసన పరిశోధకు లందరికిని యీ పాట్లు అలవాట్లేయని యీ వరకే నేను మనవి చేసియున్నాను. ఈ రీతి అనుభవములు శాసన పరిశోధకు లందరికిని కలుగునవియే! కావున శ్రీ మూర్తిగారు తమకు లభ్యమైన యీ శాసనముతో నెంత పరిశ్రమించినది మా బోంట్లకు తెలియనిది గాదు. తోడి పరిశోధకులు వారు పడ్డ శ్రమకు సానుభూతి, సాధించిన విజయమునకు మెచ్చికోలు తప్పక చూపుచునే యుందురు. కాని శాసనస్థ విషయ ప్రస్తావనలో నభిప్రాయ బేధములు కలిగి, వాదోపవాదములు సంభవించినపుడీ సానుభూతులు, మెప్పులు సద్విమర్శమునకెట్టి అవరోధములుకాజాలవు.

అట్టి భావముతోడనే నేను శ్రీ మూర్తిగారి వ్యాసమును తిలకించి, దాని స్థల నిర్ణయమునకు దొరకొంటిని. ఆ నిర్ణయములో శ్రీ మూర్తి గారికి రుచించని యొండు రెండు విషయములు విమర్శనార్హములై తోచి, ప్రతి వ్యాసమును రచింప వారిని పురికొల్పినవి.

సీమా విభాగ వర్ణనములో నుట్టంకింపబడిన దేవ, నొడలి (వడలి) గ్రామముల నిర్ధారణగావించు కొన్న శ్రీ మూర్తిగారు విప్పఱ్ఱు, మోరంబఱ్ఱి గ్రామముల యునికికై ప్రయత్నించి సిద్ధాంతము, దేవ, పెనుగొండ, ఆచంట గ్రామ పరిసరముల నున్న పురాతన గ్రామములు "ఇలపఱ్ఱు" "ములపఱ్ఱు"లే యీ విప్పఱ్ఱి, మోరంబఱ్ఱి గ్రామములని యూహించి, దేశకాలానుగుణ్యముగ వాటి వాటి నామములు మారి యుండవచ్చునను యూహచే నట్లు నిర్ణయించితిమని వాకొనియున్నారు. ఇట వారు భ్రమ ప్రమాదమునకు లోనైరనియే నేను సవరింప యత్నించితిని. ఇలపఱ్ఱు, ములపఱు లెంత ప్రాచీన గ్రామములో మునమఱ్ఱు గూడ నంతటి ప్రాచీన గ్రామమే! శాసనములో మోరంబఱ్ఱి దాన గ్రామమునకు పడమరగా నున్నదని వక్కాణింపబడినది గదా! శ్రీ మూర్తిగారు మోరంబఱ్ఱిగా నిర్ణయించిన ములపఱ్ఱు గ్రామము వారన్న రామన్నపాలెమునకు గాని, కాలగర్భములో లీనమై పోయినదన్న "సిరియూరు" (శాసనములో నుదాహరింపబడిన సరిహద్దు గ్రామములకు మధ్య నేయూరును శిథిలమైన జాడ లింతవరకు తెలియరాలేదు) నకు గాని పశ్చిమముగా లేదు. కావున శ్రీ మూర్తిగారు ములపఱ్ఱు గ్రామము మోరంబఱ్ఱిగా గుర్తించుటనే నేను కాదంటిని. ఇప్పటికినీ కాదనియే నా వాదన. నావాదనను శ్రీ మూర్తిగారు ఖండించి యుండలేదు. సరికదా వారిప్పటికినీ "ములపఱ్ఱు" గ్రామము "మునమఱ్ఱు" గ్రామము యొక్కటే యను నమ్మికతో నున్నారు. నా ప్రకటనము గూడ వారికి నమ్మదగినదిగా తోచలేదు. "తామరాడ"కు పడమటి సరిహద్దుగా నున్నదని నేనుదాహరించిన "మునమఱ్ఱు" గ్రామ మొకటి యట్టిరునయున్నచో, దాని యునికి విషయమై పరిశీలింపవలసి యున్నదని, అట్లుకానిచో (లేనిచో) విప్పఱ్ఱి, మోనంబఱ్ఱి గ్రామములు వారిచే నిర్ణయింపబడిన "ఇలపఱ్ఱు" "ములపఱ్ఱు"లుగనే నిర్ధారణయగునను ఆత్మ విశ్వాసమును వారు ప్రకటించియున్నారు! ఇలపఱ్ఱు, ములపఱ్ఱు, మునమఱ్ఱు గ్రామము లొకదానితో నొకటి సంబంధము లేక విడివిడిగా స్వయంపూర్ణములై నిలిచియుండగా, ములపఱ్ఱు, మునమఱ్ఱు లిప్పటికినీ ఒకే గ్రామమని వాదించు వారితో నెట్టి ప్రతివాదనకు దిగగలను? శాసనోక్త గ్రామమునకు యెల్లలుగా పేర్కొన్న నాల్గింట మూడు సరిహద్దులు సరిపోవుచుండ, నాలవ దానిని పక్షాంతరమున శ్రీ మూర్తిగారి యూహను అంగీకరించిన నాకు వాదన వైరుధ్యము నంటగట్టు వెనుకాడని వారికి, ములపఱ్ఱు, మునమఱ్ఱు గ్రామములు వేర్వేరు గ్రామములని, మునమఱు "తామరాడ"కు పశ్చిమముగా నున్నదని, ములపఱ్ఱు యట్లుగా లేదని సహేతుకముగా నిర్ణయించి చూపినను ప్రయోజనకారి గాకపోవుట కేమందుము? శ్రీ మూర్తిగారూహించిన "ములపఱ్ఱు" (మోరంబఱ్ఱి) గ్రామము శాసనోక్త గ్రామసీమావిభాగమునకు సరిపడుట లేదనియు, నామసామ్యము గూడ కుదురుట లేదనియు చెప్పి, రెంటికినీ సమన్వయపరచి, నేటి "మునమఱ్ఱు" గ్రామమే చాళుక్యుల శాసనములలో "మోనంబఱ్ఱు" "మోరంబఱ్ఱి"గా నుదహరింపబడుచుండెనని నిరూపించిన నా ప్రయత్నము శ్రీ మూర్తిగారి ముందు వృథాయైనందులకేమన వలయును? "మునమఱ్ఱు" అను గ్రామ మొకటున్నదా? యని ప్రశ్నించు వరకు పోయినది వారి యనుమానము! కాని— వారుదహరించిన శ్రీరంగశాసన మందు "కొట్టాలపఱ్ఱు"నకు సరిహద్దులుగా "మోనంబఱ్ఱు", "దేవ", "నంగివ్రూడి", "చెఱుకువాడ", "విల్వార్రు" "తామరవాటిక" "పెనుగొండ" "మాఱుటేఱు" గ్రామముల ప్రసక్తియుండుటబట్టి యైనను "మోనంబఱ్ఱు"యను గ్రామ మొకటున్నదని, యది కొట్టాలపఱ్ఱునకు ఉత్తరదిశగా నున్నదనియైన శ్రీ మూర్తిగారు గుర్తించకపోవుట శోచనీయము! వారి "ములపఱ్ఱై" "మునమఱు" అయిన పక

మూలశంకకు
త్వరగా నమ్మకమైన
హెడెన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా! తీవ్రంగా దురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స ఎంతమాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారితీసి- శస్త్ర చికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేచనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసు చేస్తున్నారు. హెడెన్‌సా శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది—విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు. హె డె న్ సా లో ఉండే అమోఘమైన మందులు సామర్థ్యంగా గుణాన్ని కలిగించిరక్తశంకలను ముకుళింపజేసి ఆరోగ్యకరమైన టిస్యూ రంధ్రాలప్రవృద్ధికి సహకరిస్తుంది.గమనించండి.మూలశంకలకు సకాలంలోహెడెన్‌సా చికిత్సచేసుకుంటే ముస్ముందు శస్త్ర చికిత్స అవసరముండదు! హెడెన్‌సాలో మత్తును కల్గించే మందులు ఏమియు లేవు.

అసలైన .జర్మన్ సూత్రాలకు అనుగుణంగా
ఇండియాలో వీరిచే తయారు చేయబడుచున్నది.

దిడాలర్ కంపెనీ

337, తంబుచెట్టి స్ట్రీటు మద్రాసు-1.

ప్రసిద్ధి పొందిన కెమిస్టు లందరివద్ద లభిస్తుంది.

మున ''కొట్టాలపల్లి''న కది యుత్తర దిశగా నుండవలెను గదా! అట్లున్నదని శ్రీ మూర్తిగారు రుజువు చేయగలరా?

అంతతో శ్రీ మూర్తిగా రూరుకొనలేదు! ''ఇక మిగిలినది దాన స్థలమైన 'సిరియూరు' గ్రామ నిర్ణయము మాత్రమే!'' అని ప్రారంభించి, నేను నా వ్యాసములో నుదాహరించిన అసంపూర్ణ తామ్ర శాసన ప్రశంస నెత్తికొని ఏమో భావావేశమునకు లోనైరి! ఆ శాసనమును నాకొసంగిన దాతల, గురువుల ఆశయములకు విరుద్ధముగా దశాబ్దములు గడచినను వెలువరింపకుండ, గుప్తముగా నుంచి నా కర్తవ్యమును మరచినందులకు ఆవేదనము పొంది, ''ఇప్పటికైనను ఆ కొరతను తీర్చుటకై నన్ను తచ్ఛాసన ప్రతిబింబములతో సహా వెలువరించి, చరిత్ర పరిశోధకులకు ఒక నూతన సోపానము లభింపజేతురుగాక!'' యని కోరుచు, అందుల కవాంతరములున్నచో నాకు అజ్ఞాత మిత్రులును, శ్రీ మంచం బుచ్చిలింగప్ప శాస్త్రిగారికి ఏకలవ్యశిష్యప్రాయులును నగు వారికి ఆ భార మప్పగించినచో వారు యోపినంతవరకు తత్కార్యము నెరవేర్చి గురుపాద సేవాభాగ్యమును దక్కించుకొందుమని తమ యాశయమును వెల్వరించినారు! శ్రీ మూర్తిగారి ఆశయము మంచిదే! లోకోపకారార్థమై వారు శ్రమింప దొరకొనుట వారి యుదారాశయములకు ప్రతీకగా నిలిచియుండుననుట కెట్టి సందేహమును లేదు. విఖ్యాత శాసన పరిశోధకులు, నాకుమిత్రులు కీర్తిశేషులు నగు శ్రీ కొల్లూరు హర్షవర్ధనశర్మ గారీ శాసనపు రేకును, దీనితోబాటు లభ్యమైన మరొక శాసనపు రేకును పరీక్షించి, మిగిలిన రేకులను సంపాదించి ప్రచురించుట లెస్సయని హితవొసంగుటచే తత్ప్రయత్నమున నుండి వీని నింత వరకు ప్రకటింపక యుపేక్ష వహించితినిగాని అన్యముగాదు. అట్లయ్యును అజ్ఞాత మిత్రులగు శ్రీ మూర్తిగారికి శ్రమ కలిగించనెంచక నే నుదాహరించిన శ్లోక భాగములుగల శాసన ఫలక ప్రతిబింబము నిందుతో ప్రచురించు చున్నాను.

"సిరియూరు—"తామరవాడ" కాదా ?

"తామరవాడ' విషయమై నేనొనర్చిన వ్యాఖ్యలను శ్రీ మూర్తిగారు హేళగ కొట్టివేయుచు, నేనుదాహరించిన అసంపూర్ణ తామ్ర శాసనభాగము 14 వ శతాబ్ది నాటిదని నేనంగీకరించితిని గాన, యానాటికే "తామరవాటిక" గ్రామము విఖ్యాతి గడించికొని శాసన ప్రశంసల నందుకొన్నదని శ్రీరంగ శాసనము నుదాహరించి "సిరియూరు", "చెలువూరు", "తామరవాటిక లేక తామరవాడ" అను మూడు గ్రామములును ఏనాటికిని వేర్వేరు గ్రామములుగానే యున్నవి కాని యెన్ని విధములయోచించినను ఆ మూడుపేర్లును ఒకే గ్రామమైన "తామరాడ"కే చెల్లుబడి యైనట్లు ఎంత మాత్రము సావకాశము లేదని నిర్ణయించి, వారభిప్రాయపడినట్లు "సిరియూరు" "రామన్నపాలెము" గాక నేనన్నట్లు "తామరాడ"గాక వేరుగా నుండి కాల గర్భమున లీనమై పోయినదని నిశ్చితార్థము చేసినారు! "రామన్నపాలెము" — "చెలువూరు" యై యుండవచ్చునని భావించినారు!

నా తొల్లిటి వ్యాస మింత మాత్రమైన ఫలితము సాధించినందులకు ధన్యుడను. శ్రీ మూర్తిగారి అభిప్రాయములో "చెలువూరు" "రామన్నపాలెము"నుటలో "సిరియూరు" గుర్తింపునకు వీలులేనిదై, కాలగర్భమున లీనమైనది. నే నుట్టంకించిన విధానమున "సిరియూరు" "చెలువూరు" యగుటకాని, '"చెలువూరు" "తామరాడ" యగుట కాని పొసగనేరక పోయినను "చెలువూరు" "రామన్నపాలెమై" "సిరియూరు" "తామరాడ" యగుటకేమైన యాక్షేపణ ముండునా? లేక శ్రీ మూర్తిగారన్నట్లు కాలగర్భమున లీనమై పోయినదనియే నిశ్చయింప వలెనా?

వాదన సౌకర్యము కొరకు "చెలువూరు" శ్రీ మూర్తిగా రూహించినట్లు "రామన్నపాలె"మని అంగీకరింతము. పదునాల్గవ శతాబ్దమునాటికి "తామరవాటిక" గ్రామము తన ప్రత్యేకతను స్థిరీకరించుకొని, తన్నామముతోడనే నిలిచియున్నదనుకొందము. అయిన రెండవ అమ్మరాజ విజయాదిత్యుని కడలి శాసనములో నుదాహృతమైన "సిరియూరు" గ్రామ మెచ్చట నున్నది? శాసనకాలమున కది నిలిచియున్నది కదా! శాసనకాలము క్రీ. శ. 965—970 మధ్యకాలము కావలెనని శ్రీ మూర్తిగారే నిర్దేశించియున్నారు గదా! "సిరియూరు"తో బాటు ఆ కాలమున ప్రవర్ధిల్లిన "దేవ" "వడలి" గ్రామము లిప్పటికినీ ఆనామముల తోడనే నిల్చియున్నవి గదా! మొనంబఱు మోనంబఱు, మోరంబఱు, మోరంబఱ్తిగా పలువిధములుగా పిలువబడిన "మునమ" గ్రామ మిప్పటినీ యట్లనే నిలిచియున్నది గదా! అట్లగుట శాసనములో నుదాహరింపబడిన సరిహద్దులలో నున్న గ్రామము, పేరు యేమైనను, యెట్లు మారినను వేరొక పేరుతోనైనను నిలిచియుండ వలెను గదా! లేకున్న రూపుమాపోయి యుండవలెను గదా! అట్లు ఉత్పన్నమైన గ్రామ మా సరిహద్దుల మధ్య నున్నదో లేదో విచారించిన శ్రీ మూర్తిగారికి ప్రత్యుత్తర మేమియు లభించియుండలేదని వారే అంగీకరించుచున్నారు గదా! అదియునుగాక నీ ప్రాంతములందున్న వయోవృద్ధులవలన గూడ నట్టి వృత్తాంతములు వినరానందున శాసనోక్త గ్రామము కాలగర్భమున లీనముగాక నామాంతరమున నిలిచి యుండవలెనను యూహాసేతకు సావకాశము నిచ్చుచున్నది. 10 వ శతాబ్దమున "సిరియూరు" గానున్న "తామరాడ" గ్రామము 14 వ శతాబ్దము వచ్చుసరికి నామ పరివర్తనము చెందియుండవచ్చును. దందు ఆశ్చర్య పలవలసిన విషయమేమియు లేదు. అట్టి మార్పులు సాజముగా జరుగుచుండుట అనుభవైక వేద్యమే! అందువలన అమ్మరాజ విజయాదిత్యుని దానశాసనములో నుదాహృతమైన "సిరియూరు" పదవ శతాబ్దమున నాపేరుననే యుండి క్రమశః పదునాల్గవ శతాబ్దము వచ్చు సరికి 'తామరవాడ'గ మార్పు చెందియుండవచ్చును. ఈ నిర్ణయము చేయుటకు నాకుగల కారణములు మూడు. ఒకటి— శాసనోక్త సీమా విభాగములో నుదాహృతమైన సరిహద్దు గ్రామము లిప్పటికినీ యా పేరులతోనే నిలిచియుండుట. రెండు — శ్రీ మూర్తిగారన్నట్లు దానగ్రామము వశిష్ఠా గోదావరీతీర సమీపమున నుండుట. మూడు —

దాన మీయబడినప్పు డంతకు ముందున్న గ్రామ ఈ మూడు కారణములబట్టిన్నీ "సిరియూరు" నామమును మార్చి, దాత వేరొక పేరున యా నేటి "తామరాడ"యే యని నిశ్చయించుటలో గ్రామమును ధారవోయు సంప్రదాయ ముండుట. తప్పేమియు లేదని నే నిప్పటికిని నమ్ముచున్నాను.



పురాణపారగాన్। సామ ఋగ్యజుష శూర విశ్రుతా న్న్యా
యసా సమశినో దనేహసా। సోదరేభ్య ఒడలీతి విశ్రుతం
గ్రామ మాశ్రితజనాయ చాప్యదాత్। క్లుప్త భాగ నవతిం పృథ
క్కృత గ్రామ దైవతిక పంచభాగకం। తేభ్య ఏవ చెలువూరు
సంజ్ఞకం గ్రామ మన్యమపి సోదదా త్పునః। సంప్రదాన జన
వృత్తి పూర్తయే వాత్ర లాభ పరితోష నిర్భరః। ఐశ్వర్య
భోగైర్యుత మష్ట సంఖ్యే స్సకర్ష కారామగృహార్హ్వరాంకం।
చతుర్దిగంత ప్రవిభక్త సీమ గ్రామద్వయం ప్రాదిశ దగ్ర
హారం। భాగినః కలిచి దర్ధ భాగినః కేపి కేచి దిహ పాదభాగి
నః। ఏక ఏవ భవతి త్రిభాగకోద్వా ద్విజేష్వధికపాదభాగకా।

—శ్రీ తురగా కృష్ణమూర్తి.



లేఖలు

'భారతి' సంపాదకులకు

అయ్యా!

తమ 'పత్రిక'లో 1966 సెప్టెంబరునెల సంచికలో శ్రీ రంగాచార్యవ్రాసిన లేఖ (చందుపట్ల శాసనమును గురించినది) ప్రచురితమైనది. పురాతన శాసనములను, శిలాశాసనములు, తామ్రశాసనములు, నాణెములు మొదలైనవని—సేకరించి, ప్రజలకు ఆ సమాచారము తెలియుకొరకు ఈ కార్యాలయము వానిని ప్రకటిస్తూవుంటుంది. ఇప్పటికి ఒక వందసంవత్సరాలపైనుండి యీ కార్యాలయం పనిచేస్తున్నది. డబ్భయిఏండ్లపాటు ఉదకమండలంలో వుంది. ఇటీవల యీ కార్యాలయాన్ని ఇచ్చటికి మార్చారు. శాసనములను గురించిన సమాచారం ఏమైనా లభ్యం అయ్యే పద్ధతి వుంటే, యీ కార్యాలయం వారికి తెలియపరిస్తే, వారు వానికి నకళ్లు వ్రాయించి, అధ్యయనంచేసి ప్రకటించగలరు. కార్యాలయం అడ్రసు ఇది:

ఆఫీస్ ఆఫ్ ది గవర్నమెంటు ఎపిగ్రాఫిస్ట్ ఆఫ్ ఇండియా, ఓల్డు యూనివర్సిటీ ఆఫీస్ బిల్డింగ్; 100 ఫీట్‌రోడ్డు; మైసూరు—5.

—జి. ఎస్. గాయ్.

(గవర్నమెంటు ఎపిగ్రాఫిస్ట్ ఆఫ్ ఇండియా.)

రెడ్డిమడియలు

అయ్యా!

సెప్టెంబరు నెల భారతిలో శ్రీ తి. రా. గారు 'కుల తత్వం: అప్పుడు, ఇప్పుడు' అను వ్యాసములో ఉల్లేఖించని పద్య మింకొకటున్నది.

తి. రా. గారు ఉల్లేఖించిన పద్యమకుటములు:

ప్రభుత్వైకాప్తి రెడ్లజ్జడిన్.

— ఆముక్తమాల్యద.

రెడ్డిదొరల్ తమిహెచ్చ నచ్చటన్,

— రఘునాథరామాయణము

అలనాటి పూర్వీకుడగు పెద్దరెడ్డి.

— ద్విపద: పరమయోగి విలాసం.

ఇక ఉల్లేఖించనిది:

రెడ్డిమడియ ల్మలు గోలలంబూని

— నాథ పంచతంత్రము

బైచరాజు వేంకటనాథకవి తన పంచతంత్రములో చలికాలమును వర్ణించునప్పుడు యిట్లు పరిహాసము కావించెను.

ఆ ఉత్పలము:

అరికకూడు పుచ్చనరు
గావులవెన్నయు దోసగింజ సం
భారపుటాంబురంబు తని
మజ్జిగ నూకొన కంపుతోడఁ దం
డొరగఁ బట్టి రెడ్డి మడి
య ల్మలుగోలలఁ బూని యెడ్ల కో
పేరులు వైచి దున్నుటకు
నేగిరి కొండకు సాలివచ్చినన్.

— పంచ. ఆ. 1—687

ఇది కృష్ణరాయల పద్యానుకరణ మైనను, పరిహాస భిన్నతను సూచించుచున్నది.

అప్పటికి, ఇప్పటికి 'దున్నుటకు రెడ్డి మడియలే' మూల బలము. లేక — కులతత్వమో?

—దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి.

పద్యాంధ్ర వ్యాకరణము

అయ్యా!

విధిగా భారతి అందించే సాహిత్యమాధుర్యాన్ని గ్రోలేవారిలో నేనొకడిని. 3 సం.ల నుండి సేకరించిన భారతి మాసపత్రిక లాధారంగా వ్రాసిన కొన్నివ్యాసాలు సమీక్షలు ప్రముఖుల మన్ననలందినవనుటకు గర్వపడుచున్నాను.

అక్టోబరు సంచికలో ప్రచురితమయిన బి. పురుషోత్తముగారి పద్యాంధ్ర వ్యాకరణముల గూర్చి ఉదాహరించి వ్యాసమును కూలంకషముగా విషయ గ్రాహ్యముగునటుల చదివి తదుపలబ్ధ ప్రమోద చిత్తుడనై నే నీ అభిప్రాయములను వెలిబుచ్చు

చున్నాను. పద్యవ్యాకరణ గ్రంథములలోసహా ఛందో బంధము యిమిడ్చవలయుగదా. అందు జయదేవ సంస్కృత ఛందము, "అరిరాయ విభాళసోమ యువనీపాల" అను మకుటముతో రచింపబడిన శ్రీధరుని ఛందమునందలి పద్యములుగాని ఉదాహృతములు కాలేదు. భాషాసైదుష్యమునకు, సంస్కారమునకు ఆటుపట్టగు వ్యాకరణమునందు పూర్ణజ్ఞానోపార్జనా సాధనము కలదను ప్రబల విశ్వాసము కలదు. క్రీ. శ. 1100 సం.ల నుండి మన కుపలబ్ధమైన ప్రాచీన సాహితీ పద్యాంధ్రవ్యాకరణము మల్లియ రేచన కృతక మగు కవిజనాశ్రయమే. దీనికే ప్రతిబింబితమయిన కేశిరాజు గ్రంథమొకటి.

ఇంకా, ఆడిదము కవిసంశయవిచ్ఛేదము, రంగరాట్ఛందము, కూచిమంచి తిమ్మకవిగారి సర్వ లక్షణ సార సంగ్రహము యవతారిక చారిత్రకమైన విలువగల చక్కని ప్రామాణిక వ్యాకరణ గ్రంథముల గూర్చి మరింత తెల్పిన పండిత జన మోదముగా నుండెడిదేమో. అనువైన క్రియాపూర్వకముగా లాక్షణి కులకు సులభగ్రాహ్య పద్ధతిలో కేతన రచిత మెంతేని శ్లాఘనీయము. కాని యందలి సూత్రాది క్రమ సూచిక లెట్టివో అగమ్యములు. చిన్నయ సూరి గద్యాంధ్ర వ్యాకరణమందలి గూఢార్థ, దృత, దంత్య, తాలవ్యములు, దృతాంతకృతమైన జిత్సూత్రాదుల సోదాహరణముగా వివరించిన తార్కాణి కమై వెలుగుందునేమో యని నా ఆకాంక్ష. దృతాంత ముల యందలి శతృతుమున్నానంతర్య చేదర్థకముల నుపయోగించిన కేతన సూత్రములు స్వతంత్ర ప్రయోగములే అయినను, పాణినీయ పద్ధతిలో కాతంత్ర, తద్ధితాంత, కృదంత పరిచ్ఛేదములు ప్రామాణికమైనట్లు రచయిత చూపినందుకు ప్రశంసనీయులు. కన్నడ, తమిళభాషలయందలి సూత్రములగూడా ప్రసక్తముగా పాఠకుల దృష్టికి తీసుకువచ్చినందులకు కృతజ్ఞతలు.

ఎస్. రామానుజాచార్యులు.

గ్రంథ విమర్శలు

సోఫోక్లీజ్ "యాంటిగని"

(గ్రీకు నాటకం. అనువాదం: యం. ఆర్. అప్పారావు. ప్రచురణ: సాహిత్య అకాడెమీ, రవీంద్ర భవన్, న్యూఢిల్లీ—1. డిస్ట్రిబ్యూషన్: ఆంధ్ర ప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు. వెల: రు. 3)

ఐక్యరాజ్యసంస్థ యొక్క సంస్కృతీ విభాగమైన 'యునెస్కో' (UNESCO) పథకాల్లో ప్రాచ్య ప్రతీచీ సంస్కృతుల మధ్య సామరస్యాన్నీ సంపర్కాన్నీ పెంపొందించే పథకం ఒకటి ఉంది. తద్ద్వారా ఈ దేశానికి లభించిన ద్రవ్యసాహాయ్యంతో కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రచురించిన ఆంధ్రీకృత గ్రీకు నాటకం, మంచి కాగితం మీద, చక్కని ముద్రణతో, సరళమూ—సహజసుందరమూ అయిన వ్యావహారికంలో అవతరించడం, హర్షింపదగిన విశేషమే! 37 పుటల అసలు నాటకమేకాదు, దానితోబాటు గ్రీకు నాటకం పుట్టుపూర్వోత్తరాలనుగూర్చి శ్రీ హెచ్. డి. ఎఫ్. కిట్టో (బ్రిటిష్ కౌన్సిల్) వ్రాసిన 12 పుటల పరిచయమూ, అనువాదకర్త వ్రాసిన మరో 12 పుటల ఉపోద్ఘాతమూ, ఉండవలసినతీరుగా, ఉపయుక్తంగా పఠనీయంగా రూపొందటం ఎంతో హాయిగా ఉంది!

క్రీస్తుకు పూర్వం నాలుగువందల ఏళ్లప్పుడు గ్రీకు ప్రజలు వారి దేవతలకు చేసే ఉత్సవాలలో జరిగే నాటకప్రదర్శనం పురస్కరించుకొని అవతరించిన కొన్ని మహాకావ్యాల్లో 'యాంటిగని' ఒకటి. మహాకావ్యలక్షణం విశ్వజనీనత. యుగ ధర్మాన్ని అనుసరించి ఒక కాలంవారికి తోచిన అర్థం మరొక కాలం వారికి తోచే అర్థం భేదించవచ్చు గాక! ఏ యుగానికి కావలసిన సందేశాన్నీ, అర్థాన్నీ, ఆ యుగానికి యివ్వగలిగి, సరికొత్తగా ఆసక్తి రేకెత్తింపగలిగి, నిత్య నూతనంగా భాసించటమే విశ్వజనీనత. "యాంటిగని"లో.. ఒక సామాన్య వ్యక్తి అంతర్యానికీ, రాజు యొక్క ధర్మసూత్రాలకూ మధ్య సంఘర్షణ పరాకాష్ఠనందుకొంటుంది" అన్నారు ప్రొఫెసర్ కిట్టో. ఆ భావాన్నే విపులంగా చెబుతూ, "ఈ నాటకంలో క్రీయాన్‌ది తప్పో, యాంటిగనిది తప్పో నిర్ణయించలేము. క్రీయాన్ రాజాజ్ఞ చెల్లాలంటాడు. యాంటిగని భగవదాజ్ఞ నెగ్గాలంటుంది. ఈ రెంటికి మధ్య సంఘర్షణ అప్పటికీ, ఇప్పటికీ జరుగుతూనే ఉంది. ఏది తప్పు, ఏది సరైనదనే నిర్ణయం ఎవరి మటుకు వారు చేసుకోవాల్సిందే. నేటి ప్రజాప్రభుత్వపు రోజుల్లోకూడా శాసనానికి, వ్యక్తి ఆత్మవిశ్వాసానికి తగవు వచ్చినప్పుడు ఇదే స్థితి ఏర్పడుతుంది. గాంధి మహాత్ముడు వ్యక్తికి, శాసనంపై ప్రభుత్వంపై సత్యాగ్రహం చేసే హక్కున్నదన్నాడు" అని వ్యాఖ్యానించారు అనువాదకర్త. 'యాంటిగని'లో ప్రధానమైన సంఘర్షణనే పై యిద్దరూ సూచించారు. అయితే, ఇద్దరి వ్యాఖ్యానాలమధ్య కించిత్ భేదం ఉన్నట్లు సూక్ష్మంగా పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రొఫెసర్ కిట్టో 'వ్యక్తి అంతర్యం' అంటూ దేన్ని నిర్దేశించాడో అప్పారావుగారు దాన్నే 'భగవదాజ్ఞ'గా పేర్కొన్నారు. ఈ నాటకం గొప్పతనం—పై రెండు వ్యాఖ్యానాలకూ తగినట్లుగా యాంటిగని పాత్ర పోషింపబడటమే! వ్యక్తి అంతర్యాన్ని అంటే మన సాక్షిని, భగవదాజ్ఞతో ముడిపెట్టి, తాదాత్మ్యాన్ని నిరూపించడంలోనే ఈ నాటకంయొక్క మహత్తర సందేశం యిమిడిఉంది.

యాంటిగని: "నా బాధ్యతనేను నిర్వహిస్తాను.. అన్నకు అంత్య సంస్కారం చేస్తాను. నేను కుటుంబ ద్రోహం చెయ్యను." ఇస్మీని (యాంటిగని చెల్లెలు): "ఏమిటి? మతిపోయిందా? రాజు నిషేధించిన తర్వాత కూడానా?" యాంటిగని: "నా కుటుంబంనుంచి నన్ను విడదీయడానికి అతనికేమి హక్కుంది?"

నేడు చైనావంటి రాజ్య వ్యవస్థల్లో ప్రతి వ్యక్తికీ ఎదురయ్యే సమస్యే యిది, 'రాజు'కి బదులు 'పార్టీ' అని అన్వయిస్తే చాలు! 'రాజు', ప్రభుత్వం లేక వ్యవస్థ యొక్క ధర్మంకూడా నాటకంలో శక్తి

వంతంగానే వాక్రుచ్చబడింది. క్రీయాన్ అంటాడు: "తన స్నేహితుణ్ణి దేశానికన్న ఎక్కువగా చూచిన వాడు అధమాధముడు.....నా యింట్లో వుండే ఎంత దగ్గర రక్తస్పర్శకల బంధువైనా సరే, శాసనాన్ని ధిక్కరిస్తే ఘోరాతిఘోరమైన మరణదండన తప్పదు." క్రీయాన్‌రాజు యాంటిగనితో వాదిస్తాడు: "మంచివాడికి చెడ్డవాడికి ఒకేధర్మం ఉండదు." దీనికి యాంటిగని సమాధానం: "నరకలోకంలో ఎవరిది న్యాయమని యమధర్మరాజు నిర్ణయిస్తాడో?.. నా స్వభావం ప్రేమలో భాగం పంచుకోవడమే గాని శత్రుత్వంలోకాదు." యాంటిగని వాక్యాల్లో అప్పటికి పుట్టని క్రీస్తు ధ్వనిస్తాడు. చివరకు క్రీయాన్ కుమారుడు హీమాన్‌కూడా యాంటిగని పక్షం వహిస్తాడు. అతనికి నచ్చజెప్పే ప్రయత్నంలో క్రీయాన్ అంటాడు: "క్రమశిక్షణారాహిత్యం కంటె ఘోరమైన తప్పు యింకొకటిలేదు. ఇదే రాజ్యాలను నాశనం చేస్తుంది. గృహాలను దగ్ధం చేస్తుంది. సైన్యాలకు పరాజయాన్ని కలిగిస్తుంది.." ఎవరు కాదనగలరు? కాని హీమాన్ జవాబు: "నాన్నా!.. మీరు చెప్పినమాటలు మంచివి కావనే హక్కులేదు. వద్దు కూడా. కాని ఇంకెవ్వరికైనా యింకొక మాదిరిగా తోస్తే తోచవచ్చునేమో!.. ఏ మానవుడైనా తనకు తోచినంతే సమగ్ర విజ్ఞానమనీ, తన మాటకు తన ఆత్మకు సమానమైనవి ఎక్కడా లేవనీ అనుకున్నట్లయితే అతని అజ్ఞానం మాత్రమే బయటపడుతుంది..." ఈ వాక్యాలు ప్రజాస్వామ్య వ్యవస్థకూ నియంతృత్వానికీ గల తేడాని సూటిగా చెప్పడమే కాదు, ప్రజాస్వామ్యం పేరిట ప్రభుత్వాన్ని నిర్వహించే వారికి హెచ్చరికగా ఉన్నాయి. దీనికి క్రీయాన్ అంటాడు: "థీబ్జును ఎలా పరిపాలించాలో నిర్ణయించేది నేనేగాని మరింకెవ్వరూ కాదు." నిజమే, పదిమందివీ పది అభిప్రాయాలు సంగ్రహిస్తూ వుంటే పరిపాలన ఎలా సాగుతుంది? హీమాన్: "ఏ రాజ్యమైనా ఏ ఒక్కడి అష్టైశ్వరాలఅనుభవానికీ కాదు." క్రీయాన్: "దురాత్ముడా! స్త్రీకి లొంగిపోతున్నావు." హీమాన్: "లొంగితే లొంగానుగాని నేను స్త్రైన్యానికి మాత్రం లొంగను."— ఈ ఒక్కవాక్యంలో ఎంతో ధర్మతత్త్వం యిమిడి వుంది. క్రీయాన్ పాత్రలో మనకు కనిపించే **దోషం(Evil)** అతని అభిప్రాయాలు కావు, అతని దృక్పథంకాదు, అతని శాసనంకాదు. అతని దురహంకారము! అదే అతణ్ణి రాక్షసుణ్ణి చేస్తుంది. అందుకే నాటకం చివర నాటక కర్త క్రీయాన్ చేత "నేను మదోన్మాదిని....నా చేతితో ఏది ముట్టుకున్నా భస్మం అవుతుంది" అనిపించాడు.

పురాతనమైన ఈ నాటకంలో ఎంత ఆధునికత ఉన్నదో గ్రాహ్యం.

కొల్లాయి గట్టితేనేమి?

(నవల. రచన: మహీధర రామమోహనరావు. ప్రచురణ: నవ్యరచనా మండలి, గవర్నరుపేట, విజయవాడ—2. పుటలు: 420 వెల: రు. 6.)

తెలుగులో చరిత్రాత్మక నవల అంటే ఏ అశోకుని కాలమో, మొగలు కాలమో, కాకతీయులకాలమో ప్రాతిపదికగా తీసుకుని వ్రాయబడిన కల్పితగాథ. పోతే, వీరేశలింగంగారి 'రాజశేఖర చరిత్రము' మొదలుకొని ఉన్నవవారి 'మాలపల్లి', విశ్వనాథవారి 'వేయిపడగలు' దాకా అన్నీ సాంఘిక నవలలే! సంఘం ప్రతి దశాబ్దికీ, కాకపోతే, పాతిక,ముప్పైఏళ్లకైనా మార్పు చెందుతూ వుంటుందనీ, ఆ మార్పు దృష్ట్యా కొన్ని నవలల్లో వర్ణితమైన పరిస్థితులూ, పాత్రలూ ఒకానొక కాలానికి కట్టుబడి, దాని తాలూకు ముద్రతో వైలక్షణ్యంతో రూపొందుతాయనీ నిశితంగా వివక్ష చేసే అలవాటు మనకు ఉన్నట్లే కనిపించదు! అంత దాకా ఎందుకు? శరత్ నవలల్లోని సమాజాన్ని తెలుగు సమాజంగా, శరత్‌ని తెలుగువాడుగా భ్రమించిన పాఠకులు ఉన్నారు. ఈ రకం అజ్ఞతని 'భారతీయత'గా సమర్థించుకోవడంకూడా కద్దు. స్వాతంత్ర్యోద్యమంలో తెలుగుదేశం ఎలా వుంది? అనే ప్రశ్నకు ఒక్క 'మాలపల్లి' నవలలో కొంత సమాధానం లభిస్తుంది. అంతే! మరొక నవల మళ్లీ కనిపించదు! చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు రాచకీయాల సందడి తన నవలల్లోకి చొరకుండా జాగ్రత్తపడ్డారు. కొందరు రచయితలు వంగదేశమే ఆంధ్రదేశమనుకున్నారు. తతిమ్మా వారు 'రొమాంటిక్' మైకంలో పడిపోయారు. ఫలితం, మనకు స్వాతంత్ర్యోద్యమం తెలుగుదేశంలో రూపొందిన వైనం, ఆఖ్యాయిక రూపంలో అందజేసే నవలలే కరవు. 'రొమాంటిసిజమ్' శృంఖలాలని వదిలించుకుంటున్న

నేటి తెలుగు సాహిత్యంలో పైజెప్పిన కొరత తీర్చేందుకు చేసిన చక్కని ప్రయత్నంగా పేర్కొనవచ్చు మహీధర రామమోహనరావుగారి యీ నవలను.

“1921 మార్చి 31, ఏప్రిల్ 1—ఆనాడు బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగింది”—ఆ తేదీని లక్ష్యంగా పెట్టుకుని, ఆ నాటి తెలుగుదేశపు రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను చిత్రిస్తున్నదీ నవల. కథానాయకుడు రామనాథం గాంధీ పిలుపు విని కాలేజీలో చదువుతున్న చదువుకి స్వస్తిచెప్పి యింటికి చేరుకోవడంతో ప్రారంభమై, అతను స్వరాజ్యం అనే అమ్మాయిని ‘వర్ణాంతరం’ మాత్రమేకాదు ‘వివాహాంతరం’ కూడా అయిన వివాహం చేసుకోవడంతో నవల ముగుస్తుంది. తీగె కదిపితే డొంక కదుల్తుంది. బ్రిటిష్‌వారిని బహిష్కరించి, దేశం నుంచి వెడల నడిపే ఉద్దేశంతో ప్రారంభమైన ఉద్యమం, కాదు విప్లవం, భారతీయ సమాజంలో వేళ్ళు పాతుకుని ఉండిన విశ్వాసాల్ని సంప్రదాయాల్ని ఆచారాల్ని పద్ధతుల్ని యావజ్జీవన సరణిని దాని మూలాధారాల్ని—కదల్చి, పెకల్చి, సర్వమానవ సమాజమనే ఆదర్శానికి అర్హులు చేస్తుందనే హెచ్చరికతో, స్పృహతో వ్రాయబడిన నవల యిది! అంటే, రాచకీయ స్వాతంత్ర్యం రావటంతో, విప్లవం ముగిసి పోలేదు; విప్లవం సాగుతూనే ఉంది, సాగుతూనే ఉంటుంది అన్న ధ్వని యీ నవలకు విశిష్టత చేకూర్చింది. అదే ఈ నవలలో ‘ఆధునికత’ కూడా!

మార్పు విషయంలో మనస్సులు, హృదయాలు గాయపడక తప్పదు. మార్పు ప్రారంభం అయ్యాక అది ఎక్కడ ఆగుతుందో చెప్పలేము. కర్తవ్యం ముందుకు అడుగువేస్తూ ఉండటమే! ఈ సాహసం, జిగీష, వివేకవంతుడూ, ఆలోచనాపరుడూ అయిన రామనాథంలో కనిపిస్తుంది. “ఇక్కడ సమస్య.... మనస్సు నొప్పించడం కానేకాదు.....మన జీవితం, మన బ్రతుకు పద్ధతులూ ఎలా వుండాలి? మనం యింతవరకూ అలవాటుపడిన జీవిత పద్ధతులు ఏవీ హేతువాదానికి నిలబడడంలేదు. అవి మన నడకకి అడ్డం అవుతున్నాయి. సంఘ సంస్కర్తలు ఒక్కొక్కరు ఒక్కొక్కదాంట్లోవున్న పేచీ చెప్తున్నారు. కాని, అసలు మన జీవిత పద్ధతి యావత్తూ మారిపోవలసే వస్తుంది...మార్చాలి. మార్చి తీరాలి” (273 పుట). ‘కులభేదాలు దేశ స్వాతంత్ర్య యుద్ధానికి ఆటంకకారులుగా ఉన్నాయని’ రామనాథం గ్రహించిన పట్టున అన్న మాటలవి. కులభేదాల సంగతీ, మతభేదాల సంగతీ గాంధీ నెహ్రూ ఘోషిస్తూనే వచ్చారు; క్రమంగా దేశంకూడా గుర్తించింది, ఆచరణమాట ఎలావున్నా! కాని అంతకంటె ఒక్క అడుగు ముందుకే వేయాల్సి వచ్చింది రామనాథానికి: చివర అతన్ని ఎదుర్కొన్న సమస్య—వ్యక్తికీ సంఘానికీ గల సంబంధం ఎటువంటిది? అది భవిష్యత్తులో ఎలా రూపొందాలి? అని. రామనాథానికి భార్య బ్రతికే ఉంది; స్వరాజ్యానికి భర్త బ్రతికే ఉన్నాడు. ఈ యిద్దరికీ పెళ్ళి చేయడానికి ఏ సమాజం, ఏ సంస్కర్తలు ఒప్పుకుంటారు? ఇది వర్ణాంతర వివాహం అనే అభ్యంతరం పోయింది, దేశంలో వచ్చిన మార్పు మూలంగా. కాని యిది ‘వివాహాంతర’ వివాహం కూడా కావటాన్ని ఎవరైనా ఆమోదిస్తారా? రామనాథం స్వరాజ్యాల విషయంలో ‘ఆమోదించడమే భావ్యం; ధర్మం’ అనే రీతిగా సన్నివేశాలూ, పరిణామాలూ నవలలో మొదటినుంచీ చివరి దాకా సహజంగా, యథార్థంగా సమర్థంగా చిత్రించబడ్డాయి. అంటే ‘రొమాంటిక్’ ప్రేమ పద్ధతిలో కాదు. రామనాథం తన సంసారం చక్కదిద్దుకునేందుకు చిత్తశుద్ధితో సర్వప్రయత్నాలూ చేస్తాడు. స్వరాజ్యం కూడా అందుకే ప్రయత్నిస్తుంది. ‘ఆ ప్రయత్నాలు విఫలం అయినతర్వాతగాని నిభృతమైన వారి ‘మనస్సుల కలయిక’ వారికి గోచరంకాదు. ఈ నవలలో ‘ప్రేమ’ కు యివ్వబడిన స్థానం చాలా చిన్నది; వ్యక్తిత్వానికీ, వ్యక్తిగతమైన విశుద్ధ ప్రవర్తనకూ యివ్వబడిన స్థానం చాల పెద్దది. తత్కారణంగా, ఎటు చూచినా, నవల ముగింపులో, రామనాథం స్వరాజ్యాల పరస్పరానుబంధం సమాజానికి ఒక సమస్య, ఒక సవాలు, అనక తప్పదు. “మేము ప్రపంచాన్నే ధిక్కరించి నిలబడతాము మాస్టారూ! మేం చేస్తున్నది తప్పుకాదు...మా వివాహాన్ని గుర్తించని సమాజాన్ని మేమూ గుర్తించము” అంటాడు రామనాథం. రంగనాథరావు (కాలేజీలో అతని గురువు) సమాధానం: “స్త్రీపురుష సంబంధాలు కేవలం వైయక్తికాలు కావు. అవి సాంఘికమైనవి మాత్రమే కూడాకావు

అందుచేత కనీసావసరములైన పరిమితులతో వానిని ఆమోదించవలసి ఉంటుంది. రష్యాలో వాళ్ళు అటు వంటి దేదో తలపెట్టినట్లు తోస్తుంది. వాటిని నిందిస్తూ వస్తున్న అభిప్రాయాల్ని బట్టి అసలు ఏమిటో ఊహించవలసి వస్తున్నదేగాని, యథార్థ స్థితి తెలియడంలేదు.'' రచయిత యిలా తేలిపోవడం, మార్గంకోసం రష్యా వైపు వెఱ్ఱిచూపు చూస్తూ ఉండిపోవడం ఒక్కటే, అసంతృప్తి కలిగించే విషయం. ఆ 'కనీసావసరములైన పరిమితులు' ఏమిటో రచయిత విమర్శకూ ఊహకూ స్వోపజ్ఞకు అందటం లేదా? పోనీ, భవిష్యత్పరిణామానికే ఆ సంగతి వదలి పెట్టరాదా! పాఠకులకు వదలిపెట్టరాదా!

నవలలో సంఘటనలూ సన్నివేశాలూ వాస్తవంగా ఎక్కడా కార్యకారణ సంబంధం సడలకుండా కూర్చబడినవి. కీలకమైన ఒక్కసంఘటనమాత్రం 'విధివశాత్తూ' జరిగినట్లు తోస్తుంది: అల్లుడు రామనాథం ఖద్దరు దుస్తులతో తలవసితలంపుగా యింట్లో కనిపించటంమూలంగా పోలీసు యిన్స్పెక్టరైన మామగారు పొరపాటున కొరడాతో కొట్టడం, తర్వాత ఆ పొరపాటుని దిద్దుకోకపోవడం. ఇది ఒథెల్లో (Othelle) నాటకంలో డెస్డిమోనా చేతి రుమాలు పోగొట్టుకోవడంవంటి తిరుగులేని సంఘటన: 'విధివశాత్తూ' జరిగింది. పై సంఘటన కారణంగా రామనాథానికీ అతని భార్యకూ పెద్దఅఘాతం ఏర్పడి క్రమంగా పెద్దదైపోతుంది. ఆ సంఘటనే లేకపోతే? నవలలో ప్రధానమూ బలీయమూ అయిన శక్తి విప్లవం; రామనాథం దానికి ప్రాతినిధ్యం వహించడంతో, వ్యక్తిగతమైన సంబంధాలు కొన్ని వాటంతటవే తెగిపోక తప్పదు. తెగిపోకుండా రామనాథం చేసే ప్రయత్నాలు అతని కంటె బలీయమైన విప్లవ శక్తి ముందు నిరుపయోగమనే సత్యాన్నే ధ్వనిస్తుంది పై సంఘటన. అలా సమర్థనీయమే!

'కాస్త కాలు సాగితేనే నలిగిపోతామా?' 'కలిపోసివా ఉట్టికేసి చూడడంగా శాస్త్రి దానిని జమ కట్టేడు.' 'చమురు కాళ్ల తల్లులు.' ప్రాంతీయమైన పలుకుబళ్ళతో సజీవంగా ఉంది ఈ నవలలో భాష. గోదావరీ తీరగ్రామమైన ముంగండ నవలకు కేంద్రం. రచయిత తన శక్తియుక్తుల నెరిగి చక్కని సంయమంతో లక్ష్యశుద్ధితో చేసిన యీ రచన తెలుగువారు ఆదరించదగిన సాహిత్య కృషి.

—ఆర్. ఎస్.

విరిగిన కల్చర్

[నవకవిత. కవి: శ్రీ రంధి సోమరాజు. ప్రతులకు: శశిధర్ పబ్లికేషన్స్. C/o శ్రీ రంధి సోమరాజు బి. ఏ., అన్నపూర్ణపేట రాజమండ్రి—3. పేజీలు 84. వెల: రూ. 2—00.]

అందమైన అట్టతో ముచ్చటైన ముద్రణతో అచ్చు తప్పులు అధికంగా లేకుండా వెలువడిన నవకవితా సంపుటి 'విరిగిన కల్చర్'. కవి శ్రీ రంధి సోమరాజు, కథానికా నవలా నాటక రచయితగా పాఠకులతోవున్న పరిచయం పాతదే!

విరిగిన కల్చర్కు అర్థం ఆలోచిస్తే రెండు స్ఫురింప వచ్చు. బారుగావున్న వస్తువు వంటి కల్చర్ మధ్యకు విరిగి పోవటం ఒకటి. శ్రీ పురిపండా అప్పలస్వామి 'ఇటు వినండి'లో చెప్పినట్లు పాలు విరగటం మరొకటి. మొదటి అర్థంలో వున్న విరిగిన వస్తువు రెండుగా కానీ అంతకంటే అధికంగా గానీ అయి, విరిగిన భాగాలు ఏవిధంగానైనా ఉపయోగపడే అవకాశం వుంది. రెండో అర్థంలో విరిగిన పాలు, బాహిరంగా, దూరంగా మార్పుతో కనబడే అవకాశం లేదు. బాహిరంగా సమీపంగా పాలలో వచ్చిన మార్పు కనిపించవచ్చు. ఆంతరంగా చక్కగా అవగాహన అవుతుంది. పాలు విరిగితే నిరుపయోగం. కవితా సంకలనంలో చెప్పిన విరిగిన కల్చర్ నిరుపయోగంగా పాలులాగా విరిగిపోయిందా? ఆ విరిగిన కల్చర్ వస్తువులాగా మళ్ళీ ఉపయోగపడే అవకాశం కలిగివుందా? ఈ ప్రశ్నలకు సమాధానం కవి భావతీవ్రతపైగానీ, పాఠకుల నిరాశానిస్పృహల తీవ్రతపైగానీ ఆధారపడి వుంటుంది. ఎవరికి వారే సమాధానం చెప్పుకోవాలి. కవిదృష్టిలో క్షీణించి పోతున్న, అధునాతన జీవిత విధానంతో నాశనమవుతున్న మన సంఘం ఒక విరిగిన కల్చర్.

ఈ కవితా సంకలనంలో అక్షరాల వెనుక, భావ తీవ్రత మాటున కవి ఆత్మ ఘోషిస్తూవుంది. అది కవిని ఆదర్శవాదిగా, ప్రగతిశీలిగా చూపి

స్తుంది. నేటి సమాజం చుట్టూ రంధ్రాలు పడ్డాయి. కల్చర్ ధారపడి, దొర్లిపోయి మురికి గుంటల్లో చేరుతూ వుంది. కాళీపాత్ర మిగిలి పోయింది. ఆగ్నేయం పోయింది. ఆధారం మిగిలింది. ఆ పాత్ర అన్ని హంగులతో పూర్వశోభను చూపించాలని తాపత్రయపడి గుండె నిండా రంధ్రాలతో కుమిలిపోతూవుంది. ఇదీ సమాజం!

ఇది బాగుపడాలి. ఈ మార్పు రావాలి. ఒక శుభోదయం కలగాలి అని సుదూర భవిష్యత్తు మీద ఆశపెట్టుకొని జీవించే కవి ఆవేదనలో, ఆక్రోశంలో, ఆత్మసంస్పందనలో ఉదయించిన వెలుగు రేకలు విరిగిన కల్చర్‌లోని కవితా శీర్షికలు.

'దుష్కార్యాల డస్టరుతో సత్కార్యాలు చెరిపేసి,
గోనె సంచి దోపిడీలతో రాబడి తవుడు నిల్వవుంచి
ఆఫీసరుగోవుల కిట్టో దానిని దానాగా వేసి,
పాలు పిండుకొంటూ,
మంత్రి యంత్రాలకు నేయి ఆయిలుగా పోసి'
సంతోషించే జన సందోహం సందడి తిలకించి, కళ్ళవెంట నీళ్ళువచ్చి,

'తిరుగుడు మిల్లులోని బెల్టు తెగిపోయి,
చక్రాలు పటపట ఆగి పోయినట్లు పండ్లు కొరికి,
క్రౌర్యంతుపాకిని తీక్ష్ణంగా ప్రేల్చి,
చలించే పెదవుల మీది మాట' విని అర్థం

కాని మూగవేదనతో సాగుతున్న సమయంలో 'ఏ రాతి రాణీకి అన్యాయం బొట్టు' పెట్టకుండా, 'ఏ కన్నెనైనా విషవాంఛలకు బలి' పెట్టకుండా, కోరికల ప్రహరీ చుట్టూవున్న గోడలు పగలగొట్టకుండా నిజంగా ఎదిగిపోయిన మహామానవుణ్ణి చూచి సంతృప్తి పడబోతుంటే,

'దుశ్శీలుడైన ఊహాతీత విచిత్ర చిత్రకారుని
సృజనాత్మలా
పాపాత్ముడైన మహాకవిలోని అత్యద్భుత కవితాశక్తిలా'

ఉన్న సంఘం కనిపించింది దానిచుట్టూ అల్లిబిల్లిగా అల్లుకు పోయిన కల్చర్ తీగ వాడిపోతూ వుంది.

రిఫ్రిజిరేటర్ శరీరాల వెడిపోని నిల్వ సౌందర్యాలు, విస్కీ సీసాల రెక్కలమీద రిక్కలు, వాడని డబ్బు పూల జీవన వృక్షాల పెరళ్ళు, శాంతిని ఎడారిలో పాతి పెట్టడాలు, భూమిపై జీర్ణ స్తనద్వయంలా వ్రేలాడే పేదతనం, ఆశయాల సూర్యుడికి ఉండవలసినంత దూరంలో ఉండలేక మాడిపోయే బ్రతుకులు, నీడ నిచ్చే చెట్టుకు నీడ కావాలని లెక్చర్లుదంచే పెద్దలు, ఒంటిస్తంభం మేడమీద, ఆశయాల పావురంమేడమీద కురుస్తున్న అర్ధాకలి రాళ్ళవర్షం, డాలర్ పాలతిత్తి అందక రోదిస్తున్న ప్రణాళికా కూనలు— అంతా చూచి ఆ ద్వైధీభావం తారతమ్యం అర్థంకాక వెర్రెత్తిన బాధతో, విపరీత పీడిత మనస్వియై, దిగులుతో కుమిలిపోయే కవి వైపు నీళ్ళునిండిన కళ్ళతో చూడటంతప్ప, చేయగలిగిందేమీ కన్పించదు.

ఈ సమాజపు పునాది మీద లేవవలసిన చక్కని సంస్కృతి మందిరం పూర్ణరూపంతో తయారు కాలేదు. కవి ఘోషలో, సర్వ సమాజ విమర్శనంలో దాగిన సత్యం ఒక్కటే! ఇది— ఈ సమాజం— ఇలా కాదు ఉండవలసింది. ఇంకో మాదిరిగా వుండాలి. మరో విధంగా తయారయి ఉండవలసింది. అయితే ఆ విధంగా తయారు కాలేదు. అయితే ఏ విధంగా తయారు కావాలో అందుకు ఏమి అవరోధం వచ్చిందో కవి ఆలోచనలో ఈ విధంగా వుంది. 'సరిహద్దు గోడల దగ్గర చైనా పందికొక్కు కమ్యూనిజానికి వెలుగు లేకుండా చేసింది.'

ఆ దశ— పరిణామం, ఈ దేశానికి రాదని తలంచింతర్వాత కవి ఏం చేయాలో తెలియక, ఈ దేశ ప్రస్తుత పరిస్థితిని చూచి,

'ఆకలితో చచ్చిపోయే
సిసలైన మనిషికో నమస్కారం.
ఆ త్యాగమూర్తికి
చేయనక్కర్లేదే పూజా పునస్కారం'

అని దిగులువెళ్ళగక్కుకొని వ్యథతో తృప్తి చెందింది కవ్యాత్మ.

కేపిటలిస్టు సమాజంలో పది మంది ఒక్కడి కోసం పనిచేసి లాభాలు అందించినట్టు, మన ఆఫీసుల్లో పది మంది పనిచేసి ఒక్క ఆఫీసరు అధికారానికి, ఆధిపత్యానికి, అదుపాజ్ఞలకు లొంగి పోవటం, అండదండలకు ఆశ్రయానికి ప్రాకు

లాడటం, బాహాటంగా కవి నిరసించటం కని పిస్తుందీ కావ్యంలో.

'ప్రమోషను వరాల విచ్చిన ఆఫీసరువూవు' ఎదురైతే 'చర్మంలేని గుమస్తా భావాల అనిరుద్ధ హాహాకారాల సారం' రుచి చూడవలసిందే, అంతేకాదు. 'గుమస్తా అవస్థ' అనే శీర్షిక ఆఫీసరు—గుమాస్తాల సంకుల సమరంలో చక్కని గీతం.

శ్రీ రంధి సోమరాజుపై, భావాలలోనూ కవితా ధోరణిలోనూ, శ్రీశ్రీ ప్రభావం బాగా కని పిస్తుంది. ఈ సంపుటిలోని 'నేనెరుగుదును' శ్రీశ్రీని గుర్తుకు తెస్తుంది. శ్రీశ్రీలాగే శ్రీ రంధి సోమరాజు కార్మికుల కర్షకుల బాధలు తలపోసి 'మీ కష్టానికి వాచీ లేదని' గ్రహించటం గమ నింపవచ్చు.

'నిప్పులు చిమ్ముకొంటు
నింగికి నేనెగిరి పోతే
నిబిడాశ్చర్యంలో వీరు,
నెత్తురు చిమ్ముకొంటు
నేలకు నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే!' శ్రీశ్రీ పంక్తులను—
'నింగి నుండి భూమిపై
రాలి పడినా
నెత్తురు కక్కుకుంటూ
చచ్చి పోలేదు' శ్రీ రంధి సోమరాజు పంక్తులు గుర్తు తెస్తాయి.

ఈ కవికి పార్కు కనిపించిన తీరులో ఎంతో నిరాశ.

'అదేమిటి——
పార్కు సుందరి
వంటినిండా
గజ్జిలా వేరుశనగ పొట్టు'

పత్రికలు మంచి కథలకోసం పోటీలుపెట్టి ప్రైజులిస్తున్న ధోరణిని చూచి—

'సిరా కక్కుల
కలరా కథల్ని
ప్రైజులుగా ఎన్నుకొని' అని నిట్టూర్పు.

ఇలా ఆధునిక జీవితం చుట్టూవున్న గతి తప్పిన స్థితిచూచి అక్కడక్కడా కవి ఆత్మ స్పందన— వివర్శన విరిగినకల్చర్‌తో కనిపిస్తాయి.

ఈ సంపుటిలోని ఒక కవితా శీర్షికనే కావ్య మకుటంగా వుంచి, అందులో ఒక కుటుంబం ఆధునిక సంస్కృతి ఫలితంగా బాంధవ్యాలకూ ఆత్మీయతకూ, సహజంగా వుండవలసిన సత్సంబం ధాలకూ ఎలా దూరమయి పోయిందో, డబ్బు సమాజ జీవితంలో ఆత్మీయ వ్యక్తుల మధ్య ఎటు వంటి మార్పు తెస్తుందో, హృదయాలు ఎలా కలుషితం చేస్తుందో చూపుతూ చేసిన రచన రసరమ్యంగా వుంది. చక్కని ప్రారంభోపసంహారాలతో, వ్యక్తుల భావ సంఘర్షణలో కవితా రీతిలో సాగిన చక్కని శిల్పసిద్ధి ఉన్న కథానిక విరిగిన కల్చర్.

ఈ నవ కవితా సంపుటిలోని గీతికలన్నీ వచన కవితలు. కొన్ని కవితలలో ఛందస్సు లేక పోయినా నడకలో సమత, తూగు వున్నాయి. యతులు ఎలావున్నా, కొన్ని తావులలో అన్ప్రాసలు అతికి పోయాయి.

భాష సామాన్యంగా వుంది. అలంకారాల వల్ల భాష సుందరంగా గోచరమయ్యే అవకాశమూ వుంది. ఆంగ్లాంధ్ర పదాలు కలగాపులగంగా కలసి పోయాయి. ఎంత వ్యావహారికం వ్రాసినా కొన్ని పదప్రయోగాలు ఎబ్బెట్టుగా కనిపిస్తాయి. 'ఆస్థి, యువ్వనం, సంస్కృతీ దీపం, అరాఃకలి, ప్రణాళికా కూనలు' వంటి ప్రయోగాలు కొన్ని వున్నాయి. సంధిగత దోషాలూ ఉన్నాయి. అటు వంటివి పరిహరించుకోవటం కవితాస్థాయికి అవసరం.

ఉద్వేగపూరిత భావాలు, ఉన్నత భావాలు, కవితాంతఃకరణం కదిలించే భావాలు నీడల్లో కదిలే భావాలు కొన్ని పటిష్టత లేకుండా, నీరసంగా వుంటే కవితౌన్నత్యం దిగజారే అవకాశం ఉంది. అక్కడక్కడా అల్పంగా కనిపించే చిల్లరభావాలు, ఉదాత్త కవిత ప్రక్క చేర్చకుండావుంటే బాగుంటుంది.

ఈ నాడు తెలుగులో వెలువడుతున్న వచన కవితల్లో ఈ "విరిగిన కల్చర్" సముచితమైన స్థానం పొందుతుంది. —మనోరాణి.

మా మహారాజుతో దూరతీరాలు

[రచన: శ్రీ కురుమెళ్ల వెంకటరావు, ప్రాప్తిస్థానం: రచయిత, 1—8—57, ఎర్రమ్ మంజిల్ కాలనీ,హైదరాబాదు.మూల్యం: అయిదురూపాయలు.]

పాశ్చాత్య దేశాలు కొన్నింటిలో సైట్‌సీంగ్ టూర్ చేసి అక్కడ తాము చూచిన విశేషాలను తమ మిత్రునికి వ్రాసిన లేఖా సందోహమే ఈ పుస్తకం. పిఠాపురం మహారాజా శ్రీ రాజా రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరు వారు కుటుంబ సమేతంగా 1930 మే నెల 3 వ తేదీని బొంబాయి నుండి బయలుదేరి పశ్చిమ దేశయాత్ర చేసి 1930 నవంబరు 22 వ తేదీన తిరిగి బొంబాయి చేరుకున్నారు. వారి పరివారంలో ఈ లేఖల రచయిత వెళ్లారు. ఇంగ్లండు, అమెరికా, జర్మనీ, స్వీడను, ఆస్ట్రియా, స్విట్జర్‌లాండు, ఇటలీ, ఫ్రాన్సు దేశాలు చూచారు. చూచిన విశేషాల నన్నిటినీ పిఠాపురంలోని తమ ప్రియమిత్రులు శ్రీ పెమ్మరాజు వెంకటరావుగారికి ఎప్పటికప్పుడు లేఖలుగా వ్రాస్తూ పొయ్యారు. దాదాపు 30 లేఖలున్నాయి ఈ సంపుటిలో: ఈ లేఖలనుబట్టి ఈ పుస్తకం లేఖావాఙ్మయం క్రిందికి వచ్చినా విషయాన్నిబట్టి చూస్తే ఇది ప్రధానంగా ట్రావెలోగ్ అంటే యాత్రా విశేష వాఙ్మయంగా పరిగణింపబడుతుంది. ముప్ఫయి అయిదేళ్ల క్రితం వ్రాసిన లేఖలు ఇప్పుడు 1966 లో ఎందుకు పుస్తకంగా అచ్చు వేసిందీ సరిగా తెలియదు. బహుశా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వారు రచయితకు ఈ పుస్తకం ముద్రణ నిమిత్తం సహాయంగా మూడు వేల రూ.లు ప్రసాదించడం వల్ల ఇప్పుడు ప్రచురించడం వీలయిందేమో. లేదా పుస్తకంలో కొన్ని లేఖలలో రచయిత భారత ఇండిపెండింట్ స్టేట్సు తాలూకు ఇద్దరు మహారాజులు ప్యారిస్‌లో చేసిన విచిత్రపు పనులను ఏకరువు పెట్టడమూ బ్రిటిష్ వారి పరిపాలనకు వ్యతిరేకంగా సాగిన భారత స్వాతంత్ర్య సమరంపట్ల సానుభూతి, శ్రద్ధ వ్యక్తం చేయడమూ జరిగినందువల్ల వెంటనే అప్పుడు ప్రచురించడం వాంఛనీయంగా తోచ లేదేమో! కారణమేదైనా ఈ పుస్తకం ముప్ఫయి అయిదేళ్ల క్రిందటి పశ్చిమ దేశాల స్థితి గతులను ఇప్పుడు తెలుపడం చేత చాలా పాతకథలా వుందని చెప్పాలి. ప్రెసిడెంట్ హూవర్ అమెరికాకు అధ్యక్షుడుగా వున్నప్పుడు, ఇటలీదేశాన్ని ముస్సోలినీ నియంతగా పరిపాలిస్తున్నప్పుడు, డాలర్ విలువ దాదాపు మూడు రూపాయలైన కాలంలోని విశేషాలను రచయిత ఈ పుస్తకం ద్వారా ఈనాడు పాఠకులకు అందించారు. ఆ తర్వాత రెండవ ప్రపంచ సంగ్రామం దారుణంగా జరిగింది. ఆ సంగ్రామంలో ఇంగ్లండు, యూరపు ఎంతో దెబ్బతిన్నాయి. కొన్ని నగరాల రూపురేఖలే యుద్ధానంతర పునర్నిర్మాణంతో ఎంతగానో మారిపొయ్యాయి. కనుక ఈ పుస్తకంలో వర్ణింపబడ్డట్టుగానే ఆయా పశ్చిమ దేశాలు నగరాలు ఇప్పుడు లేవు. కనుక ఇది ఒకప్పటి చరిత్ర అన్న మాట. ముఖ్యంగా ఆ రోజుల్లో ప్యారిస్ నగరంలో ప్రభుత్వం వ్యభిచారం నిమిత్తం కొందరు స్త్రీలకు సర్టిఫికెట్లు ఇచ్చేదిట. ఇప్పుడు అలాంటి ప్రోత్సాహం వున్నదా? అయితే పూర్తిగా కాలదోషం పట్టలేదు. అప్పుడూ ఇప్పుడూ వున్న పరిస్థితులూ, సంప్రదాయాలు, వస్తు సంచయమూ కళాఖండాలు ఎప్పుడైనా తెలుసుకో దగ్గవే. ఆ రీత్యా ఈ పుస్తకాన్ని ఒక మారు తిరగ వేయవచ్చు.

ఇటువంటి యాత్రా విశేష గ్రంథాలు ఆ వ్రాసిన వ్యక్తి వ్యక్తిత్వంపైన, అభిరుచులపైన, అభినివేశముపైన, వైదుష్యంపైన ఆధారపడి వుంటాయి. ఈ రచయిత సామాన్యుడు. పాశ్చాత్య విద్య నభ్యసించినవాడు. జాతీయాభిమానం కలవాడు. అయితే ఒక సామాన్యుడుగా కుతూహలం కొద్దీ ఆయా దేశాలలోని విశేషాలను దర్శించాడు. చూచినవి చూచినట్లు తమ అనుభూతులతో, భావాలతో వ్రాయడం జరిగింది. అచటి నగరాలు, హోటళ్లు, వసతులు, కట్టడాలు, రైళ్లు, రోడ్లు, కార్లు, అవెన్యూలు, షాపులు, దీపాలు, అలంకారాలు, విందులు, వినోదాలు, నృత్యాలు, పాటలు, జూదాలు, అచటి ప్రకృతి రామణీయకము, కొండలు, లోయలు, నదులు, సరస్సులు, పచ్చిక బయళ్లు, మంచుశిఖరాలు, పూలవనాలు, జలపాతాలు, అగ్ని పర్వతాలు, కేనియనులు, గ్లేషియర్లు, బీచీలు, చర్చీలు, స్మారక చిహ్నాలు, శిల్పాలు శిలావిగ్రహాలు, బౌలివార్డులు, కొలనేడులు, క్వేలు,

కాంకోర్‌లు, మేనీక్యూర్ షాపులు, రిసెప్షనులు, నైట్‌క్లబ్బులు, స్విమ్మింగ్‌పూల్సు మొదలైన వన్నీ చూచి ఎంత అందంగా వున్నాయి! అక్కడ తిరుగు తూంటే ఎంత సరదాగా వుంది! ఎంత గొప్ప అనుభవం! మతిపోతోందనుకో! వంటి ఆశ్చర్యార్థకాలతో తమ అనుభవాలను రచించారు. "నా కళ్లు ఎంత అదృష్టం చేసుకున్నాయి" అనుకుంటూ "ఇంక ఆడవాళ్లని చూస్తున్నాను కదా!" అని చెబుతూ పాశ్చాత్యదేశాల సొగసుకత్తెలను గూర్చి వారి చేష్టలనుగూర్చి, నారీమణులనుగూర్చి కుటుంబ స్త్రీలను గూర్చి తమ పరిశీలనను విశదంగా వ్రాశారు. వారి శరీరాలు, ఒడ్డూపొడుగూ, రంగు, వంపులు, వాళ్ల పై మెరుగులు, పూతలు, పౌడర్లు, అత్తర్లు, గౌనులు, చేతిసంచులు, టోపీలు, బొచ్చుకోట్లు, ఆభరణాలు మొదలైనవన్నీ వివరంగా వ్రాశారు. అక్కడి నవనాగరిక యువతులను బాగా వర్ణించారు. గొప్ప ఆడవాళ్ల దర్శనభాగ్యం దూరం నుంచైనా తమకు కలిగినందుకు పరమానందం పొందారు. ఒకచోట "ఆడ అమ్మాయి" అని వ్రాశారు. "ఈ కళ్లు ఎంత అదృష్టం చేసుకున్నాయి" అను కున్నారు, తమకీ పర్యటన భాగ్యం కలిగినందుకు.

రచయిత లేఖల రూపంలో ఈ విశేషాలు వ్రాయడం వల్ల సాధారణంగా ఒకరికి చెప్పున చెప్పని సంగతులు, ఈ పుస్తకంలో పాఠకులకు తెలిసివచ్చే అవకాశం కలిగింది. ఈయనకు దొరసానుల దగ్గర డాన్సు నేర్చుకోవాలని సరదా పుట్టిం దట. కాని మహారాజావారికి తెలిస్తే తిరుగు టపాలో ఇండియాకు ప్రయాణం చేయవలసి వస్తుందని వాళ్లకి చాలా దూరంగా వున్నారట. మరొకదేశంలో వున్నప్పుడు "మా వాళ్ళెవరూ చూడకుండా ఒక రోజున ఎర్రగా జలజల మెరిసే వైన్ ఒక గ్లాసుడు తాగేశాను, ఏమిటో దీని తమాషా చూదామని" అని వ్రాశారు. ఇటువంటి వ్యక్తిగత అంశాలు ఆసక్తి కలిగించేవి కొన్ని వున్నాయి ఈ ఉత్తరాలలో.

రచయిత ఈ పశ్చిమ దేశాలన్నిటినీ చూచి, అచటి ప్రజలను పరిశీలించిన తర్వాత చివరకు తేల్చిందేమిటీ అంటే— పాశ్చాత్య దేశాల సాధారణ ప్రజలకు ఉత్తమ సంస్కారం వుందా అన్న సందేహం వెలిబుచ్చడం. మన పల్లెటూరి కరణాలకూ, మునసబులకూ వున్నంత తెలివి తేటలూ, ప్రజ్ఞ అక్కడి సామాన్య ప్రజలలో లేవన్నారు. మనదేశ సామాన్యుడే మెరుగు అన్నారు. పాశ్చాత్యులలో ఇంగ్లీషు వాళ్లు కొంచెం మంచివాళ్లు అన్నారు. ఇవి గమనింపదగ్గ అభిప్రాయాలు. ఆ రోజులలో కలిగిన భావాలు. వాళ్లను చూచిన భారతీయుల కందరికీ ఇలాంటి అభిప్రాయమే కలుగుతుందా? ఆ రోజులకూ ఇప్పటికీ పాశ్చాత్య సామాన్య ప్రజలలో ఏమైనా మార్పు వచ్చిందా? ఇవి పరిశీలించవలసిన అంశాలు.

పుస్తకానికి పీఠిక వ్రాసిన శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు "ఇంగ్లీషులో యువరాజును 'ప్రిన్సు ఆఫ్ వేల్సు', అని అందురు" అని వ్రాశారు. ఇంగ్లండులో అని అనడం సమంజసమేమో. రచయిత ఆయా దేశాలలో తాము తీసిన ఛాయా చిత్రాలను పుస్తకంలో చేర్చలేదు. పుస్తకానికి ధరమాత్రం బాగా పెట్టారు.

—వాణీకుమార.

ఒక మాట

భారతి సాహిత్య మాసపత్రిక అనీ, దానిపేరుకు తగినట్లుగా అందులో రచనలు పడటంలేదు అనీ—చాలామంది వ్రాస్తున్నారు. పడినవానిని విమర్శిస్తున్నారు. భారతిమీద మొదట సాహిత్య మాసపత్రిక అని వుండేదికాదు. తర్వాత వచ్చింది. అది అట్లా ఉండటం కొంత అసంగతంగా కన్పించినందువల్ల, ఆ ఉపశీర్షికను తీసివేసి, కేవలం 'మాసపత్రిక' అన్న ఉపశీర్షికను తిరిగి ఉంచాము. మరి భారతి సాహిత్య మాస పత్రిక కదా, అప్పుడు ఆ ఉపశీర్షిక ఎట్లా అసంగతం అవుతుంది అని ప్రశ్నించవచ్చు. అందుకు సమాధానం చెబుతాము.

సాహిత్యం అన్నది పరిమితమైన విషయం కాదు. అది అపరిమేయమైంది. అట్లా అయినప్పుడు ప్రతిదీ సాహిత్యానికి విషయమే అవుతున్నది. సాహిత్య మాసపత్రిక అన్న ఉపశీర్షిక అనవసరం అవుతున్నది. అందుకే భారతి ఇప్పుడు మాసపత్రిక అని మాత్రమే వెలువడుతూ వున్నది.

సాహిత్యం అన్నదానికి కేవల స్థితి లేదు. బహువిషయాలను సాహిత్యం ఆవరించుకు వుంటుంది. అన్నీ సాహిత్యానికి విషయాలే నన్నమాట. అందుకే సాహిత్యం అన్నమాట పరిమితమైన అర్థం కల్గిందన్నీ, కేవల స్థితి వున్నదన్నీ కాకపోతున్నది. ఇందువల్ల కూడా సాహిత్య మాసపత్రిక అన్న ఉపశీర్షిక అనవసరం అవుతున్నది.

ఈ విషయాన్ని చూడని కొందరు, భారతి సాహిత్య మాసపత్రిక గనుక అందులో కథలు, కథానికలు, నాటకాలు, పద్యాలు ఏవోకొన్ని విమర్శలు, విమర్శ వ్యాసాలువుంటే చాలు, సైన్సు, చరిత్ర, రాజకీయాలు తాత్త్విక విషయాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. సాహిత్యం అంటే పద్యాలు, కథలు, నవలలు, నాటకాలు, వానిని గురించిన వ్యాసాలు మాత్రమేనన్న పరిమితార్థాన్ని చెప్పుకొనడంచేత ఇటువంటి ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అందుచేతనే 'సాహిత్యమాసపత్రిక' అన్న ఉపశీర్షికను తీసివేసి, 'మాసపత్రిక' అనిమాత్రం వుంచడం జరిగింది. అయినా ఇంకా కొందరు 'భారతి'ని 'సాహిత్య మాసపత్రిక' అన్న పరిమితార్థంతోనే అర్థం చేసుకుంటూ, వెనక వ్రాసినట్లే ఉత్తరాలు వ్రాస్తున్నారు. దానికి తార్కాణం క్రిందటినెలలో మేము ప్రకటించివున్న శ్రీ ఆల్వారి వెంకటేశ్వరరావుగారి లేఖ ఒకటి. ఇటువంటి ఉత్తరాలు చాలా వచ్చాయి. ఈ సందర్భంలో మా వుద్దేశ్యం ఏమిటో స్పష్టం చేయడం అవసర మనిపించింది. అందుచేత ఆ వస్తున్న ఉత్తరాలకు నమూనాగా ఆ ఉత్తరాన్ని ప్రకటించాము. శ్రీ ఆల్వారి వెంకటేశ్వరరావుగారు తమ ఉత్తరంలో కొందరి రచయితలను పేరుపెట్టి వారిని తేలిక చేస్తున్న ధోరణిలో వ్రాసినాకూడా, పై కారణాన్ని పురస్కరించుకొనే ఆ లేఖను ప్రకటించాము.

శ్రీ ఆల్వారి వెంకటేశ్వరరావుగారికి ఒకందుకు వందనా లర్పిస్తున్నాము. అభినందిస్తున్నాము. 'భారతి' పేజీలు పెంచి, ధర ఎక్కువ చెయ్యవలసిందని ఆయన సూచించారు. బాగావుంది. కాని యీ వ్రాసేవారిలో కొందరు—మీారు వ్యాపారదృష్టితో 'భారతి'ని నడుపుతున్నారు; పేజీలు తక్కువ వేస్తున్నారు; అంటూ దూషిస్తూ వుంటారు—వ్యాపార దృష్టి తప్పైనట్లు. అట్లా నడపడం తప్పేమో అర్థంకాకుండావుంది. ఇట్లా విమర్శిస్తున్నవారంతా, వారికే లోకంకోసం రచనలు చేస్తున్నట్లు; వారికి డబ్బు అవసరం లేనట్లు; వారంతా కేవలం ఇతరులకోసమే జీవిస్తున్నట్లు; లోకోపకారం చేస్తున్నట్లు. ఒక పత్రికను నడుపుతున్నపుడు ఎవరుగాని, ఒకరి దాన దయా ధర్మాల మీద ఆధారపడకూడదు. అది వ్యాపారమూ కాదు; లోకజ్ఞతాకాదు. ఆ పత్రిక అమ్మాలని, దాని కాళ్ళమీద అది నిలబడాలని చూచుకొనడం పాపంకాదు. అసలు భారతివంటి పత్రికను నడపి ఎంత వ్యాపారం చేయవచ్చు, ఎంతగా లాభాలు గణించవచ్చో ఈ మహనీయులకు తెలియదు. అలాంటి పత్రికను ప్రచురించామన్న తృప్తి, ఆనందం తప్ప దానివల్ల వచ్చే మడిమాన్యా లేమీ లేవు. ఇంతకీ భారతికి రూపాయి ఇవ్వవలసివచ్చినప్పుడే యీ ధర్మచింత కల్గడం ఆశ్చర్యం! మేము భారతిలో వేసిన కథలు పుస్తకాలుగా ప్రచురించినప్పుడు వాటికి ఆ ప్రచురణకర్తలు పెడుతూవున్న ధర యీ రూపాయి కన్నా మించివుంటూ వున్నది. ఇచ్చట శ్రీ వెంకటేశ్వరరావుగారు ఊరికే పేజీలు పెంచమనకుండా, ధరకూడా పెంచమన్నారు. అందుకు సంతోషం; ధన్యవాదాలు కూడాను.

ఇంతకీ ఇచ్చట పేజీలు తక్కువవేయడానికి యీ వ్యాపారము, ఈ ధర్మ ప్రధాన కారణాలు కాదు. తగిన రచనలు రాకపోవటం. 'భారతి'ని నిండుగా తీను కొనిరావడం ఎట్లాగన్నది మాకు ప్రతిమాసం సమస్య అవుతున్నది. అప్పటికీ మా బుద్ధికి మంచివని తోచిన వాటిని పాఠకలోకానికి అందజేయడానికి గట్టి కృషి చేస్తూవున్నాము.

శ్రీ వెంకటేశ్వరరావుగారు తమ లేఖలో 'సాహితీ పత్రిక' అని, దానిపరిధి 'సాహితీ ప్రపంచం', 'రసమయ జగత్తు'అని అన్నారు. ఇచ్చట సాహితీ పత్రిక, ప్రపంచం అంటే ఏమిటో, వారి అభిప్రాయం కొంతయైనా బుద్ధికి అందుతోందిగాని, రసమయజగత్తు అంటే మాత్రం బోధపడటంలేదు. రసమయ జగత్తు అనేది ఎట్లా వున్నప్పటికీ, శ్రీ వెంకటేశ్వరరావుగారు చూపిన లెక్క ప్రకారముకూడా భారతిలో సాహిత్యం అని వారు అనుకుంటున్న, నిర్వచించివున్న పరిధిలోకి వచ్చే విషయాలే అధికంగా వున్నట్లు తెలుస్తుంది. పోతే ఇది ఇంకా రసమయము, రసమయ జగత్తు కావాలంటే, ఇంకోకథ, ఇంకో ఏకాంకిక, ఇటువంటివే మరికొన్ని వుంటే చాలల్లే కన్పిస్తుంది. అయితే కథలు కొంచెం ఎక్కువగా వేసినప్పుడు కొందరు — 'భారతి' వట్టి కథలతో సరిపెట్టుకొని వ్యాపారంలో పడిపోతున్నది. విజ్ఞానశాస్త్రం మొదలైన శాస్త్రీయ విషయాలను ఇవ్వడంలేదు — అని వ్రాసిన వారూ వున్నారు. అందుకు ఏమనాలి!

సాహిత్యం అంటే కేవలం కథలు, నాటకాలు, 'సాహితీచర్చలు' అనగా పద్యాలను వానిలో ప్రయోగాలను గూర్చిన విమర్శలు, చర్చలు, నిబద్ధకవిత్వం, అనిబద్ధకవిత్వం అని పెట్టుకుంటే దాని పరిధి తక్కువ అయిపోతుంది. రాజకీయాన్నుంచి, సైన్సు నుంచి, తాత్విక ప్రపంచంనుంచి—అనగా జీవితసమస్తం నుంచి విడివడి సాహిత్యం అంటూ వుండదు. ఇవి అన్నీ కలిసినప్పుడే అది సాహిత్యం అవుతుంది. జీవితము, దాని స్వరూపసమస్తమూ తెలియకుండాచేసే రచన రచనేకాదు. అది సాహిత్య శబ్దవాచ్యం కాదు. కథలు, నాటకాలు, నవలలు వ్రాసేప్పుడు అన్ని శాస్త్రాలు పూర్తిగా తెలియకపోయినా, ఆయా శాస్త్రాల పరిచయం కొంతవరకైనా వుండాలి. సాహిత్యం శాస్త్రం కాదుకాని, శాస్త్రంలేకుండా దానిఅంతట అది పెరుక్కుంటూ రాదు. శాస్త్రం అంటే రాజకీయ శాస్త్రము, ఆర్థిక శాస్త్రము, విజ్ఞాన శాస్త్రము, సమాజ శాస్త్రము, తాత్విక శాస్త్రము ఇట్లాంటివి. చరిత్రఅనేది మరీ అవసరం. ఇవి అన్నీ సర్వమైన జీవితాన్నిగురించి చెబుతూవుంటాయి.మనదేశంలో కూడా నన్నయ తిక్కన మొదలైన మహాకవుల సాహిత్యాన్ని చూచినా, వారు తమ తమ కాలాలలోని సర్వవిధాలైన శాస్త్రాలను అవగతం చేసుకొని, వాటిబలంతోనే తమ తమ ప్రతిభలను పండించుకున్నట్లు తెలుస్తుంది. మరి యిప్పటి యీకాలం అంతకన్నా జటిలమైంది. బహువిధ వివిధసమస్యాక్లిష్టమైంది. అంత కన్నా ఎక్కువ అయిన శాస్త్ర విజ్ఞానాన్ని, తాత్విక విజ్ఞానాన్ని పెంపొందించుకున్నది. రవాణా సౌకర్యాలు, ప్రసార సౌకర్యాలు అధికం కావడం మూలంగా ప్రపంచం అంతా ఏకమైపోతున్నది. ఇతర దేశాలలో ప్రచలితం అవుతున్న భావప్రపంచపు ప్రభావం, సాహిత్య ధర్మాల ప్రభావం, సమాజ సిద్ధాంతాల ప్రభావం మనమీద పడుతూ వున్నది. ఈ విధంగా ఏకభావోన్ముఖం కావడానికి ప్రపంచం వేదనచెందుతోంది. ఇవి విజిజ్ఞాసకు, భావాన్వేషణకు, తత్వగవేషణకు పర్వదినాలు. ఇప్పుడు జ్ఞానతృష్ణ ప్రబలమై వుంటున్నది. ఈ విజిజ్ఞాస, ఈ తృష్ణ, ఈ అన్వేషణ మన తెలుగు దేశంలో కన్పించడంలేదని చెప్పడానికి సాహసిస్తున్నాము. ఇచ్చట రసము, రసమయ జగత్తుల ప్రస్తావన పూర్తిగా మన అవ్యవస్థను కప్పిపుచ్చుకోడానికిచేసే ప్రయత్నం మాత్రమే. ఇది వట్టి Escapism.

కొందరు 'రసం' మొదలైన వాటిని గురించిచెప్పే గ్రంథాలు వున్నాయంటారు. నిజమే, వున్నాయి. అవి ఎప్పటివి? వానిని గురించి పునరాలోచనచేసి వానిలోని సిద్ధాంతాలను మారినకాలాన్ని, పరిస్థితిని, జీవితాన్నిబట్టి పునర్వ్యవస్థీకరించడంఅంటూ జరిగిందా? పాశ్చాత్యదేశాలలో ఇట్లా కాదు. అచ్చట ఈ పద్ధతి, ఆలోచనా వున్నాయి. వివిధ శాస్త్రాలను అందరికి అవగాహన అయ్యేవిధంగా తిరుగవ్రాసి ఆ గ్రంథాలను అందజేస్తూవున్న పద్ధతివుంది.మన తెలుగు దేశంలో ఈ పద్ధతి వున్నదా? వుంటే ఎట్లావుంది? ఎంతవరకు వచ్చింది? విషయ జిజ్ఞాస గల వానికి ఆ రకం గ్రంథాలు ఎంతవరకు ఉపకరిస్తున్నాయి? మన యీ దేశానికి ఇంకో పిచ్చపట్టుకుంది. ఇతర దేశాల

వారు ఎవరన్నా ఏమన్నా ఒక విషయం చెబితే ఇచ్చట కొందరు అది మనవాళ్లు అదివరకే చెప్పారు అంటారు - ఇది పూర్తిగా ఆత్మవంచన. స్వయం ప్రతారణం. ఇంత కన్నా మనిషి తన్నుతాను మోసగించుకొనడం ఇతరులను మోసగించడం ఎచ్చటా వుండదు. ఇది ఏమి రకమైన మానసికమైన వ్యాధో అర్థం కాకుండావుంది. ఎందుచేతనంటే—(1) వారు చెప్పిన ఆ విషయం వారు ఆ చెప్పేదాకా అది ఇక్కడ వున్నదని, అది ఫలానా దానిలో వున్నదని, మనకు తెలియని కారణం ఏమిటి? (2) ఆ యీ చెప్పిందిపూర్వమే యిక్కడ ఎవరిచేతనో చెప్పబడి వున్నదీ అనేవారు అది అట్లా వున్నదని చెప్పడానికి హేతువులు, ఉపపత్తులు ఎందుకు చెప్పరు? (3) అది అట్లా నిజంగా ఇచ్చట చెప్పబడే వుంటే, అది అట్లా చెప్పబడినదని, అట్లాచెప్పవచ్చునని, దాని స్వభావ స్వరూప విశేషాలు ఇట్టివని— ఆ ఇతరులు చెప్పేదాకా మనకు అది అట్లా అని తెలియకపోవడం అంటూ ఎట్లా వుంటుంది? ఇచ్చట మనం ఏవో అర్థాలు చెప్పుకుని "తృప్తాస్మ" అనుకోవడంతప్ప వేరే యేవీ గోచరించదు. మనలో స్తబ్ధతకు ఇది ఇంకో గుర్తు.

పాశ్చాత్యుల ఆలోచనాధారకు అవిచ్ఛిన్నమైన సంప్రదాయం వుంది. రోమక సామ్రాజ్యం అనంతరం అది అనేక కారణాల వలన తునిగి పోయినట్లు కన్పించినా Renaissance తో ఆ సంప్రదాయం పునరుద్ధరింపబడింది. అది మొదలు దానికి విరుపు లేదు. పెరగడమే వున్నది. ఇప్పటివారి సర్వమైన నూతన విజ్ఞానమున్నూ ఆ సంప్రదాయపు పునాదులమీదనే పెరుగుతూవున్నది. అది వారి సాహిత్య ప్రక్రియలలో ప్రతిభాసిస్తూ వారి వ్యుత్పన్నతనేగాక, ప్రతిభనుగూడా పండిస్తున్నది. మనము ఆ వ్రాసిన గ్రంథాలను మూలాలనుగాక, మూడవ రకం తర్జుమాలలోనో, వ్యాఖ్యానాలలోనో చదివి సర్వమైన విజ్ఞాన సంపత్తిని జిర్రున జుర్రినామనుకుంటున్నాము. ప్రొఫెసర్ కోశాంబి మన యీ అవ్యవస్థనుగురించి ఇట్లా వ్రాశారు. "The most noticeable feature of the Indian city bourgeoisie is the stamp of the foreigner. The intellectual apes the latest British fashions not only in clothing but even more in Literature and the arts. The Indian novel, and short story, even in the Indian languages, are modern creations based upon foreign models or foreign inspiration. The Indian drama is more than two thousand years old, but the literate Indian stage to-day, and over-whelmingly the Indian cinima, is patterned after the theatre and movies in other countries. Indian poetry, has however, resisted the change some what better, though foreign influence is demonstrable in choice of themes and freer metres........"[1]

ఇదీ మన పరిస్థితి. దీనికి కారణం మనలో సంప్రదాయ విచ్ఛిత్తి ఏర్పడడం; అనగా పునాదులు లేకుండా గాలిలో మేడలు కట్టుకుంటూవుండటం. ఇప్పుడు మనకు ఆ సంప్రదాయ అవిచ్ఛిన్నత్వం ఏర్పడవలసి వుంది. ఒక Renaissance రావలసి వుంది. Reformation కూడా అవసరమే. ఇది అంతా Critical గా జరగాలి. గ్రుడ్డిగా కాదు. పాశ్చాత్య విజ్ఞానంతో, మనకు ఒక విజ్ఞానం అంటూవుంటే, దానికి, దానికి సమన్వయం కుదర్చాలి. ఇటువంటి ప్రయత్నం అరవిందులు మొదలైనవాళ్లు కొంతవరకు చేశారు. శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారివంటి మహా పండితులు అటువంటివిషయాలను,తమకు తోచినంతలో మనకు బోధపడేట్లు విప్పి చెబుతూవుంటే,ఆనందించలేకపోవడం ఆ ఆనందించలేనివారి దోషంగాని, అది శాస్త్రిగారి దోషంకాని, వానిని అందజేస్తూవున్న 'భారతి' దోషం కాని కాదు. ఆ ఆనందించలేకపోవడం మన మనస్సుల యొక్క లోతును తూకాన్ని మాత్రమే చెబుతుంది.

ఇటువంటి వ్యాసాలే వద్దు; కథలే ఇవ్వండి; పద్యాలు ఇవ్వండి; నాటకాలు ఇవ్వండి—అంటే అర్థం ఏమిటి? అవి అన్నీ రసమయ జగత్తులనా! ఇప్పుడు మన యీ సాహిత్యపు తీరుచూస్తే ఎట్లా వుంది? మన సాహిత్యస్థితి నిద్ర పోతున్నట్లువుంది. మన 'మేధావులు' పాశ్చాత్య రచయితలను చదివినట్లు మన పూర్వ రచనలను చదవడంలేదు. ఇది ఏదో అధ్యాస దేశంలో పెరిగిపోతున్నది. ఇది విజిజ్ఞాస కాదు. విజిజ్ఞాసయొక్క ఆభాస. ఆత్మధర్మంయొక్క అవ్యవస్థ. నిజం ఆలోచిస్తే

---

1. The Culture and Civilisation of Ancient India —Kosambi.

మన రచయితలకు పాశ్చాత్య రచయితలమీద "మోజు" అధికం కావడం దేనికి? మనకన్నా, వారు ఏదో ఎక్కువ చెప్పకల్గుతున్నారనే కదా? మనకన్నా శ్రేష్ఠంగా చెప్పగల్గుతున్నారనేకదా! అందువల్ల యీ మోజును, యీ అభిమానాన్ని తప్పు అనటంలేదు. ఆ మోజు, ఆ అభిమానం ఇచ్చట మన రచయితలలో నిష్ప్రయోజనం అవుతున్నవి. ఎందుచేతనంటే పాశ్చాత్య రచయితలకు వున్న శాస్త్ర పరిజ్ఞానం గాని, వ్యుత్పన్నతగాని, ఆ పునాదులతో జాగరితం అవుతున్న ప్రతిభగాని ఇచ్చట ఉద్భవం చెందడం లేదు. అందుకే మన రచయితల రచనలో రసంగాని, జగత్తుగాని ప్రతిభాసించడంలేదు.

ఇప్పుడు మనదేశంలో నేమి, రాష్ట్రంలో నేమి ప్రజాస్వామ్యాన్ని గురించి, సోషలిజాన్ని గురించి మాట్లాడ్డం అధికం అయిపోయింది. భగవద్గీతల లోను, త్యాగరాజు కృతులలోను కూడా ఇప్పుడు సామ్యవాదాన్ని దర్శిస్తున్నారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు సోషలిష్టులేనంటున్నారు. శంకరుడు చెప్పింది మార్క్సు చెప్పింది ఒక్కటే నంటున్నారు. ఇంత అంటున్నారు గాని తెలుగు భాషలో ప్రజాస్వామ్యాన్ని గురించి విశదంగా తెలియజెప్పే గ్రంథం శాస్త్రపద్ధతిని అనుసరించి మచ్చుకు ఒక్కటువ్నా రచింపబడిందా? లేక సోషలిజంను గురించిన ప్రశస్తమైన గ్రంథం ఏమన్నా వున్నదా? పాశ్చాత్యులు ఎటువంటి గడ్డు శాస్త్రాన్నైనా సామాన్యజనంకూడా అర్థం చేసుకునేందుకు తేలికగా వ్రాసి ప్రకటించడం వుంది. ఆయా గ్రంథాలు తమతమ భాషలలో తమ మనస్సులకు అందేవిధంగా వుంటూ వున్నందు వల్ల పాఠశాలలముఖం అంటూ చూడనివారుకూడా ఆ దేశాలలో ఆ గ్రంథాలను చదివి విజ్ఞాన అమృత స్రోతస్సులను జువ్వన జారలుగా జుర్రగల్గుతున్నారు. విజ్ఞానఖనులు కాగల్గుతున్నారు. మరి మనదేశంలోనో? కాలేజీలలోకూడా "Made easy"లు కావలసి వస్తున్నాయి.

పాశ్చాత్యదేశాలలోని అధునాతన సాహిత్య వీధులను సింహావలోకనంచేస్తే, జగత్తుకు, రచనకు వున్న సన్నిహిత సంబంధం, అందును గురించిన తాత్విక అన్వేషణ స్పష్టంగా గోచరిస్తాయి. మన సాహిత్యంలో ఆ జగత్తు కన్పించడం లేదు; రసము కన్పించడం లేదు; అన్వేషణ అంతకన్నా లేదు. అందుకే మన సాహిత్యంలో స్తబ్ధత, అంతఃప్రేరణ లేకపోవడం, విజాతీయమైన బాహ్యవిషయ ప్రోద్బలంకోసం అటనుటించడం, లేదా వేదాల దగ్గరకుపోయి పురాతత్వ పునరుద్ధరణకోసం వెంపరలాడటం—ఇవే గోచరిస్తాయి. మన రసమయ జగత్తులు ఇటువంటివే. ఇవి అన్నీ స్పష్ట దర్శనంలేక, అదర్శన స్థితిలో గిజగిజా కొట్టుకుంటూ, ఆనందం అంటే ఏమిటో తెలియక ఆనంద భ్రమచేత సంతృప్తిపడుతూ వుండటంవల్ల కల్గుతూ వున్నవి.

అదేకానిపక్షంలో పాశ్చాత్యులలాగా మనము కూడా Profound గా రచనలు ఎందుకు చేయలేక పోతున్నాము? మరి Profoundity లేని రచన రసమయం ఎట్లా అవుతుంది? Profoundity రావాలి అంటే సర్వశాస్త్రాలతో కాకపోయినా అంతో ఇంతో సంఘానికి జీవితానికి సంబంధించిన శాస్త్రాలతో సంబంధము వుండాలి. లోకాన్ని దర్శించాలి; దాన్ని తెలియాలి. మనదేశంలో యీ తాత్విక చింతన, యీ విజిజ్ఞాస లోపించిపోయింది. అనుసరణము, అనుకరణము ఎక్కువైంది. "Our writers and artists seem to be at times producing works under an influence, but without the emotional impact necessary for such productions. Their goods thus become a little fake and they do not reflect either their personality or the thing flowing in their veins..... where imitation comes art perishes. And one sees at the present juncture much imitation and more pseudo-art passing under the name of genuine article"[2]

మనదేశంలో స్వాతంత్ర్య సమరం నడిచింది. స్వాతంత్ర్యం వచ్చింది. తర్వాత సమాజంలో అనేక రకాల మార్పులు వచ్చాయి. ఆర్థికపరిస్థితులు మారాయి. మారుతున్నాయి. మనుష్యుల ఇష్టాలు, ధోరణులు పూర్వంలాగా వుండటం లేదు. అంటే జీవితమే ఒక విచిత్ర విప్లవదశావిశేషంచేత సర్వదా తాడితం అవుతూ వున్నది. ఈ మహాపరివర్తనాన్ని గ్రహించి ప్రతిబింబించిన గ్రంథం, దానియొక్క తాత్విక లక్షణాన్నిపట్టి

2 Projecting the Indian Image— Gulabdas Broker in Quest—1966 Autumn.

వివరించి చెప్పే గ్రంథం తెలుగు భాషలో ఒక్కటి అన్నా వచ్చిందా? వచ్చింది అంటే ఏది? రాలేదు అంటే, ఎందుచేత? చమత్కారవిశేషాన్ని కథలలో నవలలో ప్రదర్శించినంతమాత్రంచేత, లేక కాపీ కొట్టినంతమాత్రంచేత వానిలో రసం నిష్పన్నం కావడంలేదు. సమాజం, ఆ సమాజంలో నిలీనం అయివున్న తాత్త్విక వ్యవస్థ లేక అవ్యవస్థ సాహిత్యాధ్వంలో వెలుగు నీడలతోసహా ఒదిగినప్పుడే రసం నిష్పన్నం అవుతుంది. ఇది తెలియని కారణంచేత వట్టి చమత్కార విశేషాన్ని మాత్రమే "రసమయ జగత్తు" అని భ్రమించేవాళ్లు, అనుకునేవాళ్లు తయారవుతున్నారు. విభావానుభావాదికాలు, స్థాయీ భావము మొదలైన విషయాలు ఇచ్చట కొంతమంది ఎత్తవచ్చు. ఇవి అన్నీ కూడా తాత్త్విక చింతనలో అంశాలేనన్న విషయం ఇప్పటి కొందరికి తెలియకపోయినా ఆ వాదాన్ని ఆదిలో ప్రతిపాదించిన భరతుడికి, అంతకు ముందు—'రసోవై సః'—అన్నవాడికి మాత్రం తెలుసు.

పూర్వంకూడా 'భారతి'లో రాజకీయాలమీద విజ్ఞానశాస్త్రంమీద వ్యాసాలు వుండేవి. అప్పుడు, ఇప్పటికన్నా ఎక్కువమంది వానిని చదివి ఆనందిస్తూ వుండేవాళ్లు. ఇప్పుడు అటువంటి వ్యాసాలు వ్రాసేవాళ్లూ కన్పించడంలేదు. వ్రాసి, వేస్తూవుంటే ఆనందించేవాళ్లూ కూడా తక్కువ అవుతున్నారు. అంటే మనలో విజిజ్ఞాస ఎంతగా చచ్చిపోయిందో, మనలో జ్ఞానతృష్ణ ఎంతగా రూపరిపోయిందో తెలుస్తుంది.

విజ్ఞాన శాస్త్రము, తాత్త్విక విజ్ఞానము, సాహిత్యము జతకలుపుకొని పాశ్చాత్య దేశాలలో అభివృద్ధిచెందుతూ వున్నాయి. ఒకప్పుడు మనదేశంలో కూడా అట్లాగే జరిగేది. రచయితకు ఇట్టి విజ్ఞానం వ్యుత్పన్నత మాత్రమే అవుతుంది. దానిని ప్రతిభలో పడబోసి, సమాజాన్ని, తనచుట్టూవున్న జగత్తును అధ్యయనం చేసి, అన్వేషించి తత్ఫలితాన్ని రచనలో ప్రదర్శించినప్పుడే అది సాహిత్యము, అది రసనిష్పత్తికి ఆకరము అవుతుంది. కానిది కాదు.

ఇప్పుడు ఇట్టి విజ్ఞానాన్ని, రచయితయొక్క ప్రతిభకు పదునుపెట్టి, త్రుప్పును దుల్పి, అతని దృష్టిని మనస్సును విశాలంచేసే సామాగ్రిని ఇస్తూ వుంటే, అది తమకు 'బోర్' కొడుతోందని అనేవాళ్లు వున్నారంటే ఏమనాలి? దేశం ఎంతగా దిగజారి పోయిందో! ఎంతగా నిస్సారపడి పోయిందో! ఎంతగా స్తబ్ధమై, **Fossil** పద్ధతిలో తయారై పోయిందో! ఇదిచూస్తే దుఃఖం వేస్తుంది. శ్రీ ఆల్లూరి వెంకటేశ్వరరావుగారి లేఖలో ఇటువంటి అలిసిపోయిన మనస్తత్వమేగాక ఆనందభ్రమను ప్రదర్శించే క్షణికమాత్రపు రచనలయందు బుద్ధులు లగ్నం కావడం కూడా గోచరిస్తుంది. ఇప్పుడు 'భారతి'లో సరియైన కథలు కన్పించడంలేదంటే ఆ దోషం 'భారతి'ది కాదు. రచయితలది. మన రచయిత్రులోకంలో వృథాతప్తి ఏర్పడిపోయింది. తాము వ్రాసిందేచాలు అనే పద్ధతి గోచరిస్తున్నది. వారిలో అసంతృప్తి లేదు. ఇంకా తెలియాలి, ఇంకా ఆలోచించాలి, జటిలమైన యీ జగత్తుయొక్క రహస్యాలను, తత్వాన్ని జిజ్ఞాసించి ఆవిష్కరించాలి అన్న తపన లేదు; దీక్షలేదు. ఏవో కొన్ని అరగని సిద్ధాంతాలు, తమకే సరిగా అర్థంకాని భావాలు, అభిప్రాయాలు పెట్టుకొని, వానిని అవలంబించి, అవి తెచ్చిన అజీర్ణంతో బాధపడుతూ, ఆ బాధతో ఆవిర్భవించిన అపక్వఉత్సర్జనాన్ని సాహిత్యం అనుకుంటున్నారు. మరికొందరు ఎప్పుడో, అనాదికాలంలో ఒకానొక అంతరించిపోయిన సమాజంకోసం వ్రాసిన విషయాలను తీసుకొని, అవే చిరంతనములు, సనాతనములు, త్రికాలాబాధ్యములు అయిన సిద్ధాంతాలయినట్లు భావిస్తూ ఒకవిధమైన Dogma ను పెంచుకొని, వానిని సాహిత్యంలో ప్రతిఫలింపజేయడానికి నానాఅగచాట్లూ పడుతున్నారు. ఇవి రెండు ధృవాలనుపోలి మనదేశంలో ఏర్పడ్డాయి. వీరుగాక మధ్యేమార్గంవారు వున్నారంటే, వారి సంగతి త్రిశంకుస్వర్గంలాగా వుంది. ఏమి వ్రాస్తారో, వ్రాస్తున్నారో వారికే తెలియదు. తమ జీవితంలో ఏరోజు అనుభవాన్ని ఆరోజు కక్కేస్తున్నట్లు వుంటున్నాయి వీరి రచనలు. ఇది ఇట్లాజరుగుతూవుండడానికి కారణం ఏమంటారు? జీవితాన్నిగురించి సరియైన చింతన లేక ఆత్మ సంవేదనం లేకపోవడం; లోకాన్ని, దానియొక్క సర్వస్వరూపాలలోను, స్వరూపావస్థితిలోను, అనగా తాత్త్వికదశ లేక స్థితిలోను దర్శించలేకపోవడం; అన్నింటికి మించి సాహిత్య విషయాన్ని గురించి మననం చేయలేకపోవడం; వ్యుత్పత్తిలో దారిద్ర్యము, ప్రతిభలో జాడ్యము ఏర్పడటం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందిగాని మన ఆలోచనలకు స్వాతంత్ర్యం రాలేదు. మన మనస్సులకు స్వాతంత్ర్యం రాలేదు. అవి ఖైదులో వున్నట్లు అయిపోయినాయి. వాటికి దారీ తెన్నూ లేకుండావుంది. ఆత్మవంచనము స్వయం ప్రతారణము అధికమై పోయింది. కనుకనే మనం వట్టి ఎడారిలో వుంటున్నాము. కనుకనే మన సాహిత్యంలో పచ్చని చేలు, చక్కని ఉద్యాన వనాలు కన్పించడంలేదు. జగత్తులో వీనికి కొదువ లేదు. ఆ జగత్తు ప్రవాహశీలి. ముందుకు కదిలిపోతూ వుంటుంది. దానిని మనం అనుగమించలేక పోతున్నాము. నిజంగా అనుగమించగల్గివుంటే, నిజంగా దాని అర్థాన్ని గాఢ శీలంతో అన్వేషించగల్గివుంటే, మన సాహిత్యం ఇట్లా గాజువారి నిస్సారంగా తయారయ్యేది కాదు. తెలుగులో రచయితలము అనుకునేవాళ్లకు కొదువ లేదు. ఏ ఒకరిద్దరినో తప్పిస్తే, యీ తెలుగుదేశపు Land scape ను సాహిత్యంలో ఒదిగించినవారు ఎవరన్నా వున్నారా? ఋతువులు, తెలుగు దేశపు పద్ధతిలో కనిపించే పుస్తకాలు ఎన్ని వున్నాయి? కృష్ణ పక్షంలో శుక్లపక్షంలో ఏ తిథిరోజున చంద్రుని ఆకారం ఎలా ఉంటుందో చెప్పగల రచయితలు ఎంత మంది? "స్వస్థాన వేష భాషాభిమతాస్సంతో రసప్రలుబ్ధధియః" అన్నాడు నన్నయ్య. ఆ అర్థం ఇప్పుడు ఇచ్చట ఖూనీ అయిపోతున్నది. తెలుగు సంసారము, తెలుగుమనిషి చూద్దామన్నా ఒక్క రచనలోకూడా కన్పించడం లేదు. ఏ పుస్తకం తీసినా, అది ఏదో కొత్తలోకంలా వుంటుంది వికృతంగా వుంటుంది. ఈ మహావైక్లబ్యానికి కారణం ఏమిటి? ఇది తెలుగు రచయితలు, శ్రీ అల్లూరి వెంకటేశ్వరరావుగారి వంటివారు ఆలోచించవలసిన విషయం.

ఈ లోపం రాజకీయ వ్యాసాలతో, సైన్సు విషయాలతో, వే. శి. శాస్త్రిగారి వ్యాసాలవంటి వ్యాసాలతో పరిష్కారం అవుతుందా అంటారు? అల్లూరి వెంకటేశ్వరరావుగారి లేఖలో అంతర్గర్భితంగా నిజానికి ఆయనకుకూడా తెలియకుండా వున్న ప్రశ్న ఇదే. అటువంటి ప్రశ్నకు సమాధానంగానే 'భారతి'లో ఆ వ్యాసాలు వేయడం జరుగుతున్నది. కాలం సంగతి, చుట్టూ ప్రపంచంలో జరుగుతున్న కృషిసంగతి తెలియకుండా ఎవ్వరు చేసేదిగాని ఏమీ లేదు. ఒకదేశం అభివృద్ధికి ఇతరదేశాల సహాయమూ ఇతర దేశాలు సాధించిన సాంకేతిక విజ్ఞాన అవలంబనము ఎట్లా అవసరమో, అదేవిధంగా సాహిత్యాభివృద్ధికికూడా ఇతరదేశాలలో ఏమి జరుగుతున్నదో తెలుసుకొనడం ఒక్కటేగాక, వానిని కూడా ఆకళింపు చేసుకొనడం అవసరం. అచ్చటి సమాజాలలో సాహిత్యవేత్తలయినవారు ఏమి చేస్తున్నారో తెలియడం అవసరం. వారికి విజ్ఞాన శాస్త్రం ఎంత ప్రయోజనకారి అవుతున్నదో, తాత్విక విజ్ఞానం ఎంతముఖ్యం అవుతున్నదో తెలియడం అవసరం. అట్టి ఆలోచనాపద్ధతి మనకు వద్దంటారా, అది మన మేధోదారిద్ర్యానికి గుర్తు. విజ్ఞానశాస్త్రం ఏమి చేస్తున్నది? జగద్రహస్యాలను త్రవ్వి పోస్తున్నది. ఆ రహస్యాలను తెలియక తన అల్ప బుద్ధితోనే అల్ప రచనలు చేస్తానంటే, విజ్ఞానశాస్త్రాభివృద్ధిచేత మిధ్యాభూతమైన విషయప్రపంచాన్నే పట్టుకు వ్రేళ్లాడుతూ వుంటానంటే, ఆ అహంకారంలోంచి జనించిన అజ్ఞానంతో బ్రతికి వుండికూడా మృత్యువుకు పాల్పడుతూ వుంటానంటే ప్రజాస్వామ్యయుగంలో ఎవరూ కాదనరు. వారు మనసుతీరా అటువంటి మృతిని చెందవచ్చు. కాని సాహిత్యం వారికన్నా, వారి ఇష్టాలకన్నా గొప్పది. అది పుష్టిపొందాలని, నిర్జీవ పదార్థంగా గాక నిత్యచైతన్యంతో పుష్కలమై రసాభాసను కాక నిజమైన రసమయజగత్తులను సృష్టించాలనికోరుకునేవారువుండటం తప్పా? దోషమా? మన సాహిత్యలోకం అచ్చపు చీకటిలోపడి కొట్టుకుంటున్నది. దానికి ఏది చావో, ఏది అభ్యుత్థానమో తెలియడం లేదు. ఇతరదేశాలలో ఏమి జరుగుతున్నదో తెలియనప్పుడు మన న్యూనతను లేక ఔత్కృష్ట్యాన్ని తెలియడం తేలిక కాదు. మనం ఇప్పుడు న్యూనస్థితిలో వున్నామని వేరుగా చెప్పవలసిన పని లేదు. అది మూఢతలో మునిగినవారికి తప్ప ఆత్మఅంటూ జాగరితం అయివున్న వారికి అందరికీ తెలుసు. అందుకే విజ్ఞానాది బహు విషయాలను గురించి ఆ దేశాలలో జరుగుతున్న, జరిగిన పరిశోధనలను అనగా సైన్సును అందజేయడానికి ప్రయత్నం; అందుకే తాత్విక చింతనకు సంబంధించిన Discourse లను తెలుగు పాఠకులకు అందజేయడం;

ఒకప్పుడు విజ్ఞానాన్ని అందరికీ అందజేయకపోవడం జరిగిందని, లోకాన్ని కొందరు ప్రతారించారని నిందించడం జరిగివుంది. ఇప్పుడు ఆ విజ్ఞానాన్ని అందజేస్తూవుంటే, నిందించే జనం సిద్ధం అవుతున్నది. ఇది ఏదో విపరీతంగా వుంది. కాని కాలం విచిత్రమైంది. ఒక కాలంలో విజ్ఞానాభివృద్ధికి విజ్ఞాన ప్రచారానికి ఆంతరాయాలు ఏమైనా వున్నాయేమో గాని ఇప్పుడు లేవు. అందువల్లనే బహువిధ భావ ప్రపంచం విస్ఫురమై విజృంభిస్తున్నది. ఒక రచయిత " Ideas have wings " అని ఒక గ్రంథం వ్రాశాడు. ఈ ideas పరిమితములై వుంటాయా? ఒక్క సాహిత్యం తాలూకు Ideas అని మాత్రమే వుంటాయా? బహువిధ శాస్త్రపరిజ్ఞానం లేకుండా నిజమైన సాహిత్యాన్ని పండించడం సాధ్యమా? అట్లాచేసే సాహిత్య వ్యవసాయం మనదేశం వ్యవసాయంలాగానే వుంటుంది. అది పండదు. గుంటపూలు పూస్తుంది. Second rate గా తయారవుతుంది. దాన్ని రసమయ జగత్తు అని ఆరాధించేవారు వుంటే అది వారి దురదృష్టమేగాని, తెలుగుదేశం అదృష్టంమాత్రం కాదు.

మాకు ఇవే ఇవ్వండి, తక్కినవి వద్దు అని ఒక పత్రికకు చెప్పే అధికారం ఎవ్వరికీ లేదు. ఆ ఉన్నదనుకొనడం ఒక భ్రమ. అదేవిధంగా మీరు ఇవే చదవండి, మేము ఇవే ఇస్తాము అనే పత్రికలు వుంటే అది వాటి కర్మ. 'భారతి' అటువంటి పత్రిక కాదు. లోకం భిన్నమైన భావాలు కలిగింది. అంతా దేశంలో "అల్లూరి వెంకటేశ్వరరావులే" వుండరు. విజ్ఞానాన్ని కోరేవారు, రాజకీయ శాస్త్ర చర్చను ఆశించేవారు, తాత్విక మీమాంసను కావాలనేవారు కూడా వుంటారు. ఇవి అన్నీ కూడ సాహిత్యంలో భాగాలు, సాహిత్యానికి ఉపపోషకాలు గనుక వానిని గూడా 'భారతి' తన ఓపినంతలో సమకూరుస్తుంది. "ఇవి వేసే పత్రికలు చాలా వున్నాయి!" అని శ్రీ అల్లూరివెంకటేశ్వరరావుగారు అన్నారు.ఇదినిజమా? అటువంటి పత్రికలు యీ తెలుగు దేశంలో వుంటే పేరుపెట్టి చెప్పవచ్చు. నట్టి మిథ్యా జ్ఞానంతో, Bluff తో పని జరగదు. మాట అంటే, దాని వెనుక పిండి కూడా వుండాలి. అది లేని మాట దండుగ.

'భారతి' 'ఎన్ కౌంటర్' 'వాతలు' పెట్టుకుంటున్నదని శ్రీ అల్లూరి వెంకటేశ్వరరావుగారు అన్నారు. ఆ మాట కొంత నిజం; కొంత అబద్ధం. నిజం ఏమనగా, "ఎన్ కౌంటర్"లో ప్రచురితములైన విశ్వవిఖ్యాత రచయితల వ్యాసాలను, రచనలను తెలుగువారికోసం అనూదితం చేసి 'భారతి' అందిస్తున్నది. నిజంగా తెలుగు దేశంలో అటువంటి విషయాలను ఎత్తుకొని, అట్లా వ్రాసి, ప్రచురణకు పంపేవారు వుంటే, అంతకన్నా సంతోషించవలసిన విషయం ఏమి వుంటుంది! అదే ఇచ్చట లేదు. ఇచ్చట ఆ లోతులు, ఆ పరిపాకము కన్పించవు. మరి అట్టివి లేనప్పుడు ఏమిచెయ్యాలి? సాధ్యమైనంతవరకు అట్టి రచనలకు ఇచ్చట దారి చూపించేందుకు, గతి కల్పించేందుకు, ఆలోచనాధారను రేకెత్తించేందుకు అటువంటివానిని ప్రకటించవలసివుంటుంది. 'భారతి' ఆ పని చేస్తున్నది. అటువంటివిగాని, తత్తుల్యలైనట్లుగా వుండే రచనలు వచ్చినా ప్రచురిస్తుంది. అటువంటివాని కోసం ఇచ్చట తపస్సు చేయవలసిన స్థితి వుంది.

అబద్ధం ఏమిటంటే, ఇచ్చట వాతలు పెట్టుకొనడం అన్నదే లేదు. వినూత్నభావప్రసృతికిగాను తెలుగుదేశానికి, ముఖ్యంగా మేధావివర్గానికి "వాతలు" పెట్టడంమాత్రం వుంది. Encounter ను గురించి Joseph Alsop అన్న ప్రఖ్యాతవ్యాఖ్యాత ఇట్లావ్రాశారు. "Any one who wishes to fallow the mysterious movement of ideas in the Modern world is forced to read Encounter." అయితే ఆయనకు ఇచ్చట ఆంధ్రప్రదేశ్ అనే భారత దేశంలోని ఒకానొక రాష్ట్రంలో "అల్లూరి వెంకటేశ్వరరావులు" తత్తుల్యులు వున్నారని తెలియదు. తెలిసే వుంటే, ఆ మాటలను ఇంకోవిధంగా వ్రాసి వుండేవారు.

గ్రంథవిమర్శలు అధికంగా వేస్తున్నందుకు మెచ్చుకుంటున్నవారు ఉన్నట్లే విమర్శ చేస్తున్నవారు కూడా వున్నారు. అల్లూరి వెంటేశ్వరరావుగారి లేఖలో కూడా ఇటువంటి ప్రస్తావన వుంది. శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు "తిరుపతి వెంకటకవులు"మీద ఒకరు వ్రాసిన గ్రంథంపై వ్రాసిన సమీక్ష గ్రంథ

విమర్శగా లేదన్నారు. నిజమే. ఆ విషయం వెంకట రావుగారే చెప్పారు. ప్రసిద్ధులయిన కవులనుగురించి సమగ్రంగా వ్రాస్తున్నామని వ్రాయునప్పుడు, తప్పులు వ్రాసినప్పుడు, భాషాసేవకులు ఆ లోపాన్ని స్పష్టంగా చెప్పడం అవసరం. తర్వాత ఆ దోషాలను సరిచేయుడం కూడా అవసరం. అదేవిధంగా ఆ గ్రంథకర్తలు, వానిని చూచి తమ్ము తాము దిద్దుకొనడం కూడా అవసరం. శ్రీ వెంకటరావుగారు ఆ పనే చేశారు. అయితే మన తెలుగుదేశంలో గ్రంథవిమర్శను చూచి భయపడేవాళ్లు, కోపతాపాలు పెంచుకునేవాళ్లు, కుమిలికుమిలి దుఃఖించేవాళ్లు, కొన్ని సందర్భాలలో ఉన్మత్తస్థితిని సహితము భజించేవారుకూడా తయారవుతున్నారు. ఈ వైపరీత్యం రచయితలలోనేగాక, వారి అభిమానులలో కూడా కన్పిస్తున్నది. మాకు ఏ రచయితయందుగాని ప్రత్యేకమైన అభిమానంలేదు. మాకు అందరు సమానమే. గ్రంథ విమర్శకులగాను వచ్చిన గ్రంథములను నిష్పక్షపాతముగా విమర్శ చేయించడము మా పని. ఆ చేయించడములో ఒక ప్రయోజనాన్నిగూడా ఆకాంక్షించాము. తెలుగులో సాహిత్య విమర్శ అల్పము. అపురూపము. నన్నయమీద, తిక్కనమీద, అదే విధముగా పూర్వపు గ్రంథములమీద వ్యాసములు వచ్చినట్లు, అధునాతన సాహిత్యాన్ని గురించి రావు; రావడంలేదు. లక్ష్య లక్షణ సహితంగా అధునాతన సాహిత్య విమర్శకూడా బాగంగా సాగడంలేదు. ఈ గ్రంథ విమర్శలవలన ఆ లోపం కొంతవరకు తీరవచ్చునని ఈ యత్నం జరుగుతూవున్నది. ఇది ఇట్లా అని గ్రహించక పోతే, అది మా లోపంకాదు. అవతలివారు విశద మనస్కులు కాకపోవడం. అసలు కొందరు రచయితలు తమ రచనలు పడటంవల్లనే పత్రికలు బతుకుతున్నాయని భావించడంవుంది. ఈ లక్షణాన్ని ఏమనాలో అర్థం కాకుండావుంది. కొందరు "భారతి"ని నిషేధించాలని, 'భారతి'ని ముట్టుకోరాదని ప్రచారం చేసినవాళ్లు, పెద్దలమనుకునేవాళ్లు, తయారవుతున్నారు. తాము రాయకపోతే 'భారతి'కి అష్ట దిగ్బంధనం అయిపోతుందని మంత్ర శాస్త్ర మర్యాదలతో మాట్లాడినవాళ్ళూ వున్నారు. వీరిని చూచి జాలి పడాలో, దుఃఖపడాలో! తాము వ్రాసిన గ్రంథాలలో దోషాలువుంటే, వానిని గ్రంథ విమర్శకుడు ప్రదర్శిస్తే తప్పా? "భారతి" వానిని ప్రచురించడం దోషమా? తప్పులు అన్నవి ఎప్పుడూ తప్పులే. సరసులైన రచయితలు, ఆ తప్పులను చూపించినప్పుడు, దిద్దుకుంటారు. తదితరులు ఆ తప్పులను ఒప్పులని చూపించడానికి నానా అవస్థ పడుతూవుంటారు. ఇది వారి బుద్ధియొక్క అవ్యవస్థ. వారికి లోకాన్ని ప్రతారణ చేయడందేనికనివుండదు. తమకు ఏదో వెలలేని గొప్పతనం వున్నదని, ఈ దోష నిరూపణంవలన తమ ఆ గొప్పతనం ఏమో అయిపోతున్నదని అనుకొని, అటువంటి మానసిక స్థితిలోనుంచి ఉద్భవించిన అనిర్వచనీయమైన ఒకానొక జాడ్యంలో వారు బాధపడుతూ వుండటమేగాక, లోకాన్ని కూడా బాధపెడుతూ వుంటారు. ఇది అతి శోచనీయమైన స్థితి. మన సాహిత్యంలో ఇంతటి ఆత్మవంచనము, ఇంతటి స్వయం ప్రతారణము ఎందుకు ఆవిర్భావం చెందాయో తెలియడంలేదు. ఈ ఆత్మవంచనము, స్వయంప్రతారణములవలన మన సాహిత్యము, సాహిత్య విమర్శ, ఆఖరికి ఆలోచనాధారకూడా విఘటితమార్గాలలో పడుతూ వున్నాయి. మన ఆలోచనలు ముందుకు జరగడంలేదు. పుట్టినచోటనే ఆగిపోతున్నాయి. పెరగడంలేదు. ఈ స్థితినుంచి మనము బయటపడగలమా? ఈ ప్రశ్న వచ్చే మేము ఇంతటి వేదనను చెందడం జరుగుతున్నది. ఇందులో మేము కొంత ఉద్రేకాన్ని, ఆవేశాన్ని ప్రదర్శించి వుండవచ్చు. కాని మన మేధావి వర్గానికి పట్టిన జాడ్యాన్ని నిదానం చేయడంలో మాత్రం తప్పు చేయలేదనే అనిపిస్తున్నది. ఈ విషయాన్ని గురించి, ఆంధ్రదేశపు మేధావులు కూడా ఆలోచించాలని, యీ వైక్లబ్య నిరాసకమైన విచారధారను తెలుగుదేశంలో పెంపొందించాలని మనవి చేస్తున్నాము.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna
The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad